M·N·S·01J161

రామకథ



అరుణా
పబ్లిషింగ్ హౌస్,
విజయవాడ-2

Blank page

M·N·S·011161

కనకపుష్యరాగం

(నాటకం)

3

రాఘవ

అరుణా పబ్లిషింగ్ హౌస్

నాగేశ్వరరావుపంతులు రోడ్డు,

గాంధీనగరం :: విజయవాడ-3.

ప్రచురణ నెం. 29

ప్రథమ ముద్రణ, 1971.

ప్రతులు : 1000

సర్వ హక్కులు ర. స. న. సమాఖ్య, విజయవాడ

ధర : రు. 2-50

యీ నాటకం ప్రదర్శించు వారు ముందుగా ర. స. న. సమాఖ్యవారి అనుమతిని పొందండి.
అడ్రసు: ర. స. న. సమాఖ్య ట్రావలెర్స్ లాడ్జి, పూర్ణానందంపేట, విజయవాడ-3.

ముద్రణ :
సోమేశ్వర ప్రింటింగ్ ప్రెస్,
విజయవాడ-2.

ముఖచిత్రం :
ర. స. న. సమాఖ్య,
విజయవాడ వారి చిహ్నం.

అంకితం

విశాఖపట్నం

కనకమహాలక్ష్మికి.

కె. వెంకటేశ్వరరావు,

రాఘవ

భక్తితో—

పీఠిక

"నీ జీవితంలో నువ్వు వూహించలేనంత గొప్ప మార్పు జరిగితే ఒక్కసారి తెలీపర్చు. ముఖ్యంగా రచయితగా నువ్వు ఎలా మారావో తెలపాలి అందులో....తెలుసా"—అని ఒకసారి మిత్రుడు శ్రీ గొల్లపూడి మారుతీరావు చిత్తూరు వెడుతూ, విజయవాడ స్టేషన్లో వీడ్కోలు సందర్భంలో అన్నాడు.

నవ్వి వూరుకుంటే బావుండేది—నేను. కానీ అలా జరగలేదు.

"నాకో నాటకం వ్రాయాలనివుంది. అది వ్రాయడం జరిగితే రచయితగా నాకు కలిగేది గొప్ప మార్పే"-అన్నాను.

"శుభం" అని అనలేదుగానీ, అన్నట్టుగా మాత్రం చూసి అభినందించాడు.

వాడి అభినందనబలం, వాడ్ని 'రాగ రాగిణి' నాటక రచయితగా తెలుగునాట నాటక లోకానికి పరిచయం చేసిన శ్రీ కె. వెంకటేశ్వర రావుగారి కోరికకు తురాయిలై నన్ను 'కనకపుష్యరాగం' నాటకానికి రచయితగా చేర్చింది.

"నన్ను ఓ నాటకం వ్రాయమని, అది ర. స. న. సమాఖ్యకు కావాలని" ఓసారి శ్రీ వెంకటేశ్వరరావుగారు కోరారు.

"నేను కథలు, నవలలు వ్రాసుకుని బ్రతుకుతున్నవాణ్ణేగానీ, ఎన్నడూ నాటకాన్ని వ్రాయలేదని, ఏవో రేడియో నాటకాలు మాత్రం వ్రాశానని, ప్రదర్శనకు పనికివచ్చే నాటకాన్ని ఎన్నడూ వ్రాయలేదని నేను యాదృచ్ఛికంగా అన్నాను.

ఆయన నవ్వి-ఉత్సాహపరుస్తూ-"మీ రిచ్చిన మీ నవలలు అవీ చదివాను. మీరు నాటకం వ్రాయగలరనే ధైర్యం నాకుంది. అన్నట్లు మీకో కథ చెబుతాను.....రండి"—అని నన్నూ, మరికొందరి మిత్రుల్ని వెంటేసుకుని, ఆయన దిగిన ఒక హోటల్ గదిలోకి తీసుకువెళ్ళి, చక్కగ కథ చెప్పారు. చెబుతూ కొన్ని మార్పులు వారూ, కొన్ని నేనూ చేస్తూ చెప్పుకోవడం జరిగింది.

తరువాత నేను నాటకం వ్రాయాలనే నిర్ణయానికి వచ్చాను. అయితే రంగస్థల వివరణ, దాని పరిచయం నాకు అంతగా తెలీకపోవడంవల్ల, నాకు సన్నిహితుడుగా వుంటున్న మిత్రుడు శ్రీ ఎం. ఎస్. ఆర్. శాస్త్రిని సహాయంగా యివ్వవలసిందిగా శ్రీ వెంకటేశ్వరరావుగారిని కోరాను. ఆయన సరే నన్నారు.

ఆనాటినుండి నాకు 'కనకపుష్యరాగం' నాటక రచనలో శ్రీ ఎం. ఎస్. ఆర్. శాస్త్రి ఓ చెయ్యిగా వుండిపోయాడు.

అతనికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఆ నాటకాన్ని తర్వాత శ్రీ వెంకటేశ్వరరావుగారు, ఆయన అల్లుడు శ్రీ పాత్రోగారు కలసి చేర్పులూ - మార్పులూ జరిపి రసవత్తరంగా వుండాలనే దృఢనిశ్చయాన్ని వెలారుస్తూ, రూపొందించారు.

అందుకు శ్రీయుతులు వెంకటేశ్వరరావుగారినీ, శ్రీ పాత్రోగారినీ తలుస్తూ అభినందిస్తున్నాను.

ర. స. న. సమాఖ్యవారు ఈ నాటకాన్ని అభివృద్ధిలోకి తీసుకువస్తారని ఆశిస్తూ మీనుండి సెలవు తీసుకుంటున్నాను.

—రా ఘు వ.

నటరాజు శ్రీ కె. వెంకటేశ్వరరావుగారు పశ్చిమ గోదావరిజిల్లా చాగల్లు గ్రామములో 1923 వ సంవత్సరం నవంబరు మాసంలో జన్మించారు. వీరి విద్యాభ్యాసం ఏలూరు, తెనాలి, రాజమహేంద్రవరంలో జరిగింది. నాటకరంగంలో వారి చిరస్మరణీయకృషికి నాందీ ప్రస్తావన వారు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో విద్య నభ్యసించునప్పుడు ఒధెల్లో అను ఆంగ్లనాటకములోని బ్రబాంటియో పాత్రతో జరిగింది. తరువాత వారు తెలుగు నాటకరంగంలో ప్రవేశించి మొదటసారిగా పింగళి వెంకట రామయ్యగారి కరిణీకం, శ్రీ ముద్దుకృష్ణగారి టీ కప్పులో తుఫాను అను నాటికలలో ప్రముఖ పాత్రలు ధరించి ప్రజాపున్నతలను పొందారు. తెలుగు నాటకరంగంలో వారి విజయ పరంపరాలకు ప్రధమ సోపానం నాటకం అనే నాటకంలోని రఘుపతి పాత్రను విజయవాడలో సాంస్కృతిక సమావేశాల సందర్భంగా జరిగిన పోటీలలో ఉత్తమ నటుడుగా ఎన్నిక కావడం అప్పటినుండి వారు అనేక నాటక, నాటికలలో అనేక విధములైన పాత్రలను ధరించి అనేక పరిషత్తులలో ఉత్తమ నటులుగా ఎన్నికయ్యారు. 1959 సంవత్సరంలో ఢిల్లీలో జరిగిన అఖిలభారతీయ భాషల నాటక పోటీలో అభిల భారత ఉత్తమ నటుడుగా ఎన్నికయ్యారు.

శ్రీ కె. వెంకటేశ్వరరావుగారు. 1964 వ సంవత్సరంలో ర. స. న. సమాఖ్యను స్థాపించుటయేగాక దర్శకత్వం బాధ్యత వహించి మా వూరు, మాస్టర్జీ, ఆకాశరామన్న, దొంగవీరడు, రాగరాగిణి, కనకపుష్యరాగం మొదలగు నాటకాలను ప్రదర్శించి ఆంధ్రప్రజల ఆధరాభిమానములను చూరగొన్నారు. వారు కనకపుష్యరాగం నాటకానికి చేసినకృషి అపారమైనది. ఆ నాటకం పొందిన ఘనవిజయాలు, ఆంధ్రప్రజల ఆదరాభిమానాలే అందకు తార్కాణమని 'వేరే' చెప్పనక్కరలేదు.

ఇట్లు,

బి. గంగాధరరావు.

కార్యదర్శి

ర. స. న సమాఖ్య.

నా మాట

కనకపుష్యరాగం ఒక్క ర. స. న. సమాఖ్యకే
కాకుండా యావదాంధ్ర చరిత్రకే గర్వకారణం
మిగిలిన విషయాలు ఆ నాటకాన్ని అభిమా
నించిన ఆంధ్రప్రేక్షక మహాశయులకే
యెక్కువగా తెలుసు.

కె. వెంకటేశ్వరరావు.
స్టేజి డైరెక్టరు.
ఆంధ్ర విశ్వవిద్యాలయం.
వాల్తేరు.

పాత్రలు :	పాత్రధారులు :
రాజశేఖరం	శ్రీ కె. వెంకటేశ్వరరావు
	శ్రీ యన్. వాసుదేవరావు
ఆనందం	శ్రీ సి. హెచ్ కబీరుదాసు
నీలకంఠం	శ్రీ యస్. వెంకటేశ్వర్లు
ప్రసాదరావు	శ్రీ యమ్. సుధాకర్
సుందరం	శ్రీ పసుమర్తి శేషగిరిరావు
	శ్రీ కె. యల్. రావు
	శ్రీ యమ్. వెంకటేశ్వరరావు
	శ్రీ సిహెచ్. ప్రసాద్
కనకం	శ్రీమతి పి. నవీనలక్ష్మి
	కుమారి ఎ. రాజేశ్వరి
లక్ష్మి	కుమారి సిహెచ్. బృంద. శాయికుమారి

దర్శకత్వం: శ్రీ కె. వెంకటేశ్వరరావు సంగీతం : శనగశెట్టి రాధాకృష్ణ

నేపథ్యగానం: కుమారి చంద్రకాంత

ఆర్గనైజర్సు:	ట్రేజి ఆర్గనైజర్సు:
పి. సోమయాజులు	సి. సోమేశ్వరరావు
బి. గంగాధరరావు	వి. వి. నారాయణ
బి. ఉమామహేశ్వరరావు	

పాల్గొన్న పరిషత్తులు—

పొందిన బహుమతులు

జగన్నాధగిరి	ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటి, ఉత్తమ సహాయనటుడు, ఉత్తమ ద్వితీయ రచన, ఉత్తమ సంగీతం.
గొల్లప్రోలు	ఉత్తమ ప్రదర్శన.
L. K. N. రాజమండ్రి	ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ హాస్యనటుడు, ఉత్తమ రచన, ఉత్తమ దర్శకత్వం.
కల్చరల్ ఆర్టు సెంటర్, రాజమండ్రి.	ఉత్తమ ద్వితీయ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ హాస్య నటుడు, ఉత్తమ రచన.
గెద్దనాపల్లి	ఉత్తమ ప్రదర్శన.
తాడేపల్లిగూడెం	ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ హాస్యనటుడు, ఉత్తమ రచన.
ఆంధ్రనాటకకళా పరిషత్తు	ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ హాస్య నటుడు.

యీ నటకొన్ని ఆకాశవాణి విజయవాడ కేంద్రంవారు రెండుసార్లు ప్రసారము చేసారు.

పాటలు, పద్యాలు :

ఆచార్య చింతపల్లి హనుమంతరావు,

B. S. G. పాత్రో.

BLANK PAGE

కనకపుష్యరాగం

(నాటకం)

రాఘవ

పాత్రలు :

రాజశేఖరం
నీలకంఠం
ప్రసాదరావు
ఆనందం
సుందరం
కనకం
లక్ష్మి

రాజశేఖరం : (వంటయింటిలో నుండి వస్తూంటాడు. లోపలనుండి కనకం గొంతు).

కనకం : మావయ్యా! రెక్క మీద వెళ్ళు.

రాజ : ఆ! సరే!

కన : ఏం కదిలావా?

రాజ : (చదరంగం బల్లముందు కూర్చొని ఆడుకోంటూ) ఎంత సేపటికి ఈ ఆట కట్టించలేక పోతున్నా నేమిటి?....ఊ కనకం.... ....కనకం.. కనకం ఇలా రామ్మా ఓ సారి.

కన : (లోపలనుండి) ఎందుకూ?

రాజ : ఎందుకేమిటమ్మా! ఒక్కసారి ఇలారా!.....ఏవమ్మా కనకం! ఏమిటి ఇందాకన్నుంచి పిలుస్తుంటే రావూ! కనకం! కనకం!!

కన : (వస్తూ) ఏమిటి మావయ్య! ఊరికే పిలుస్తావు....ఏ పనీ చేసుకో నివ్వకుండాను.

రాజ : ఊరికే నేనెందుకు పిలుస్తాను. ఇక్కడ కొంపలు అంటుకు పోతుంటే. ఈ ఆట ఇందాకట్నుంచి కట్టడం లేదు.

కన : బాగుంది ఇక్కడ నీతో ఆడుతూ కూర్చుంటె. అవతల పనంతా ఎవరు చేస్తారు చెప్పూ ఒక వైపేమో గడియకోక్షణానికో పెళ్ళి చూపులకని వాళ్ళొస్తారాయె. మరొక వైపేమో లక్ష్మి వస్తుందాయె! కాస్త ఏదన్నా చెయాలా లేదా ఇక్కడ నీతో ఆడుతూ కూర్చుంటె ఎలా?

రాజ : అయితే సరేలేవమ్మా నా తిప్పలేవో నేను పడతాను (మళ్ళీ ఆటలో పడుతాడు)

కన : కోపం వచ్చిందా మావయ్యా? మరీ ఇంత చిన్న పిల్లాడివేం? అయినా ఇప్పుడే ఆటలేమిటి చెప్పు? ఇదసలు ఆడుకొనే సమయమా?

రాజ : ఊ! ఖర్మఉన్న ఒక్క కాపలా ఊడింది. శకటు గోవింద! ఊ ఎవరిక్కావాలి?

కన : వైలొచ్చే వేళయింది! నువ్వు స్టేషన్‌కు వెళ్ళాలి.

రాజ : అవున్లే!....ఒక్క క్షణం. మరో క్షణంలో మనల్ని బేడీవేసి తీసుక పోతారు....ఓరి ఏబ్రాసి వెధవా?

కన : ఓయ్ రాజా! నిన్నే! లేవయ్యా లేస్తావా మీసాలుచ్చుకొని లేపనా?.....ఏమిటోయ్ అలా చూస్తావ్? నెచెప్పేది నీ కర్థం కాలే? ఇదిగో నీ కండువా....ఓయ్ ఓయ్ నీ చేతికట్టరేది? ప్రతిదీ అందించాలి. ఇంకా కూర్చొన్నావేమిటి స్టేషన్‌కు వెళ్ళక అవతల బండి వచ్చే వేళయింది. త్వరగా తెమలు....ఏమిటి మామయ్యా అలా చూస్తావ్?

రాజ : అమ్మ రాక్షసి పిల్లా! నీ మాటలు వింటుంటే ముమ్మూర్తులా మీనాన్న పురుషోత్తం అనిపించిందే.

కన : (నవ్వింది),

రాజ : వాడూ ఇంతే ! నన్నొక పసివాడిలాగ చూస్తూ ప్రతీదీ చెప్పి చేయించేవాడు దగ్గరుండి.

కన : ఇప్పుడా పాతగాధ అంతాదేనికిగాని, నేనేమో ఇల్లు సర్దాలి నువ్వు త్వరగా స్టేషన్‌కు బయలుదేరు మావయ్య.

రాజ : సరే సరే ! (వంటింట్లోకి వెళ్ళుబోవును)

కన : అదిగో మళ్ళీ....అటెక్కడికి.

రాజ : మంచినీళ్ళు తాగొస్తానమ్మా (లోపలికి వెళ్ళును).

కన : (అటు ఇటుచూచి) బా....వా....

ఆనందం : ఓయ్....ఏమిటి పిలచావు ?

కన : ఏం చేస్తున్నావ్ ఒక్కడివి ?

ఆన : గోళ్ళు గిల్లుతున్నాను.

కన : ఎవరివి ?

ఆన : వేళ్ళవి ?

కన : మంచిపనేగాని లక్ష్మి ఇవ్వాళ వస్తుంది గదా అలా స్టేషన్‌కువెళ్ళి దాన్ని తీసుకురారాదు బావా ?

ఆన : సరే తీసుకొస్తాగాని ఏమిటి అలా అధికారం చెలాయిస్తున్నావ్ భార్యానను కుంటున్నావేమిటి ?

కన : భార్యేమిటి ? ఎవరికి ?

ఆన : ఎవరికో నాకు.

కన : నీకు నేను భార్యానా ?

ఆన : కాదేమిటి మరి ?

కన : ఎప్పుడు ?

ఆన : మన పెళ్ళయిన తరువాత.

కన : అబ్బా! చేసుకోలేవేమోనని పాపం! అసలు నిన్నెవరు చేసుకుంటారు? ఎవరు చెప్పారు?

ఆన : ఎవరా (దగ్గరకు లాక్కొంటాడు),

కన : అబ్బ వదులు ఏమిటి పరాచకాలు మావయ్య వస్తాడు.

ఆన : ఓస్! మా నాన్నేగా వస్తేరానీ మరీ మంచిది తొందరగా పెళ్ళన్నా చేస్తాడు.

కన : ఆహా! కులుకుదామని! మావయ్యా! (బిగ్గరగా)

ఆన : (చేయివదలి) ఏమిటా గావు కేక?

కన : ఓస్! అంతేనా నీ ధైర్యం! మావయ్యా అని పిల్చేసరికి బయపడిసవాడివి, నన్ను చేసుకోను.

ఆన : మరెవర్ని చేసుకుంటావైతే?

కన : మాంచి ధైర్యస్తుడ్ని.

ఆన : ముసలాడైనా సరేనా?

కన : ఆహా! మావయ్య కంటె పెద్దవాణ్ణయినా సరే.

రాజ : (లోపలి నుండి వస్తూ) ఏమిటమ్మా మావయ్య అంటున్నావ్?

ఆన : అహా మన ఇద్దరిలో ఎవరు ధైర్యస్థులా అని.

రాజ : ఒరే! ధైర్య విషయం చెప్పాలి పొస్తే నెనేరా! దాంట్లో నాకుచాలా యోగ్యతాపత్రాలున్నాయి. అరవై ఏళ్ళవాడు ఆరేళ్ళవాడు ఒకటే నన్నారు. ఆంటే ఇప్పుడు నాకు అయిదు సంవత్సరాలు అయిదు నెలలు. వాళ్ళకుండే ధైర్యం ఎవరికుంటుందోయ్. అయిదేళ్ళ వాడ్ని పిలచి ఎర్రని నిప్పు బొగ్గు చూపించి ఇది మిఠాయి అంటే కట్టిక్కన నోట్లో వేసుకుంటాడు. నేనూ అంతే మరిప్పుడు ఎవరు ధైర్యస్థులం?

కన : ఖచ్చితంగా నువ్వే మావయ్య! నిన్నే పెళ్ళి చేసుకుంటాను.

ఆన : ఆ....ఆ! చేసుకో ! చేసుకో!

కన : ఏం చేసుకుంటాను. ఎంతమంది ఈ ప్రపంచములో మావయ్యను చేసుకోవడం లేదు. పైగా ఎప్పుడూ నా చెప్పు చేతల్లో ఉంటాడు పసి పిల్లాడిలా నే చెప్పినట్టు వింటాడు.

ఆన : ఆవును బాగుంది. అలా చేసుకుంటే ఇటు భర్త లేని లోటు తీరుతుంది. అటు పిల్లల్లేని లోటూ తీరుతుంది.

రాజ : ఆ ! ఇహ చాలు నోరుముయ్యీ! ఏం మాట్లాడాలో తెలియదు.

కన : పిచ్చి నాయన.

ఆన : చూసారా నాన్న.

రాజ : కాక మరేమిటిరా? నిన్న పూజగాయలు తేరా అంటే నాశిరకంలోని మంచివన్ని ఏరి తెచ్చేవయ్యే పైగా ఖరీదు ఎక్కువ పెట్టి.

కవ : తెలివి తక్కువ సన్యాసి (నవ్వుతూ)

రాజ : ఈ బిరుదు బాగుందమ్మోయ్

ఆన : నేను సన్యాసినా ? మీ రూరుకోండి నాన్న ఇలా నెత్తి నెక్కించుకుంటె.

కన : మావయ్యా మొన్న పండక్కి ఓ చొక్కా కుట్టించాడు ఆహా అది తొడుక్కుంటే అచ్చు కాషాయరంగు బట్టలు వేసుకొన్న సన్యాసే గుర్తు కొస్తాడు.

ఆన : సంతోషించాం ! నువ్వూ కొని కట్టావుగా ఓ ఎర్రచీర ఆరోజు నిన్ను చూస్తే ఓహో కాకమ్మ పెళ్ళికూతురైనట్టుంది.

కన : నీ కళ్ళు మసకొక్కాడానా ? నేను నల్లగా ఉన్నానా?

ఆన : మరయితే నేను సన్యాసినా !

రాజ : అబ్బబ్బ మళ్ళీ వాదనలో పడతారేమ్రా ! ఓరేయ్ ఆనందం వూరుకోరా !

ఆన : ఆమాటముందు కనకానికి చెప్పి దానొ్నరు కట్టించండి ఇందాక ట్నుంచి చూస్తున్నాను. తెగవాగేస్తుంది.

కన : నా నోరు కట్టించమని మావయ్యను వేడుకొనేబదులు నీ నోరు కట్టుకొని నువ్వే ఇక్కణ్ణుంచి స్టేషన్‌కుపోరాదూ సగం గొడవన్నా తగ్గుతుంది.

ఆన : నువ్వెవరివి? నన్ను మా యింట్లోంచి పొమ్మనటానికి నీకెవరిచ్చారీ అధికారం ?

రాజ : ఒరెఒరె ఒకళ్ళిచ్చేదేమిట్రా దానికి ? మన అందరిపట్లా అన్ని అధికారాలూ ఆ పురుషో త్తముడే ఇచ్చి వెళ్ళాడు. నేనే అన్నిటికీ సమాధానపడి వుంటే మధ్య నీ కెందుకురా అంత ఉక్రోషం ?

కన : ఆటకట్టు ! ఇహ మాట్లాడకు పెళ్ళు రైలొచ్చే వేళయింది.

రాజ : మరి నన్ను వెళ్ళ మంటివి గదమ్మా?

కన : నువద్దులే మావయ్యా వెళ్ళ లేవు ఈ రొొట్లమీద! ఆనందం బావని వెళ్ళనీ చూడు నువ్వుమాత్రం ఇక్కడే ఉండి ఒక పని చెయ్యాలి.

రాజ : ఏమిటది ?

ఆన : కాబోయే దంపతులు, చదరంగం ఆడుకొంటూ ఉండండి.

కన : ఏమిటా మాటలు చిన్నా పెద్దా లేకుండా ! ఆయ్ !

రాజ : నిజమేనమ్మా ! వాడన్నదీ ఆడుకోనా ఎంచక్కా.

కన : ఇంకానయం ! ఇప్పుడేం ఆట్టానికి వీల్లేలేదు. నేను వంటపని చేసుకొనేలోపుగా నువ్వు ఇక్కడ పెళ్ళి చూపులువారికి కూర్చునేందుకు ఏర్పాట్లన్ని చేస్తూండాలి మావయ్య (ఆనందంవంక చూచి) ఇంకా ఇక్కడే నుంచున్నావేమిటి ? స్టేషన్‌కు వెళ్ళక.

ఆన : అహా దేనిమీద ఎలావెళ్ల లో ఇంకానువ్వు చెప్పలేదని నుంచున్నాను.

కన : రిక్షామీద వెళ్ళు జాగ్రత్తగా రైల్వేస్టేషనుకువెళ్లు రేడియోస్టేషన్‌కు మాత్రం చేరుకోకు-తెలిసిందా ?

ఆన : ఆహా ! ఇంక తెలియకుండా ఎందుకుంటుంది. (వెళ్ళిపోవును)

కన : ఏమిటి మావయ్యా మళ్ళీ ఆటలో కూర్చొన్నావ్ - నేను చెప్పే దేమిటి నువ్వు చేసేదేమిటి ?

రాజ : ఏదమ్మా! నువ్వు వంటింట్లోకి వెడితేగా ఇక్కడ నేను ఏర్పాట్లు చేయడం ప్రారంభించేది - అందుకని ఈ లోపల ఓ ఆట ఆడుదామని కూర్చొన్నాను. ఆట భలేగా ఉందిలే ! చూడు ! చూడు

కన : నే చూడ్ను ముందు నీ చదరంగం అపేసి లే మావయ్య ఆ నీల కంఠంగారు ఎప్పుడు ఆ పెళ్ళివారిని వెంట బెట్టుకొస్తారో ? ఏమో ? ఎక్కడ పని అక్కడ నిద్రపోతుంది. ఇవన్నీ ముందు సర్దు మావయ్య,

రాజ : సరే నువ్వెళ్ళు నే చూచుకుంటాను,
(కనకం లోనికివెళ్ళును సర్దటము తెలియక తికమకపడును)

రాజ : కనకం ! కనకం !

కన : (వస్తూ) ఏమిటి మామయ్య ?

రాజ : ఎలా సర్దాలో తెలీడం లేదమ్మ ! ఏమీ చేతకావడం లేదు. మరీ గొడవగా వుంది.

కన : పోనీలే మావయ్య ! దాన్ని గురించి నువ్వేం బాధపడకు. నేను సర్దుతాలే.

రాజ : చూడమ్మ కనకం నాకు తెలియక అడుగుతాను ఈ సారైనా లక్ష్మి పెళ్ళి స్థిరవడుతుందంటావా ?

కన : అదేమిటి మావయ్య ! ఎందుకంత అనుమానం ? ఇంకా వాళ్ళు వచ్చి చూడంచే ? ఏ విషయం మాత్రం ఏం ఊహిస్తాం ?

రాజ : నాకేమిటో ! లక్ష్మికి సంబంధం చూచుకుంటానికి ఎవరన్నా వస్తున్నారంటేచాలు, నాకు గుండెదడగా వుంటుందమ్మా.

కన : ఆ ఆ ! ఆకుర్చీతీయకు, మావయ్య ఆ టీపాయి తీసుకురా, ఆక్కడ వేయ్.

రాజ : ఇక్కడ వేయనా ?

కన : ఆ ! అది !

రాజ : ఆ కనక మహాలక్ష్మి దయవల్ల ఈ సంబంధం కుదిరితే.

కన : నాదయకేం లోటుంటుందిలే మామయ్యా! అంతగా ఇదికుదరకపోతే నేనెటూ ఉన్నాను లక్ష్మిని చేసుకోవటానికి. అసలింత గొడవలేక పోను లక్ష్మి మగాడై తెనూ! మావయ్య ఆ చిరిచాప ఆ గోడకు ఆనేటట్టుగా వేయ్.

రాజ : నువ్వెటూ మా పిల్ల వేనమ్మా! నువ్వు పుట్టగానే మా కోడలుగా మీ నాన్న ఆదేశించాడు.

కన : నాతోనూ మానాన్న అన్నాడుగా....తాను లేకపోతే నువ్వు నే లేక పోతే నీ కొడుకూ అనాధలౌతారని, ఆ కుర్చీ ఇటువ్వు....కొంచెం ఈ టేబిల్ పట్టు....

రాజ : ఇన్ని విధాలుగా నన్ను ఆదుకున్నవాడు ఇంకొక్క సహాయం చేసి పోతే ఇంతబాధ నాకు లేకపోను.

కన : ఏమిటా సహాయం ?

రాజ : ఒక కొడుకును కూడా కనుంటే....

కన : పాపం ! మరో కూతురుంటే నీకు పెళ్ళాం లేని లోటు తీరును.

రాజ : అమ్మా రాక్షసి పిల్లా ! ఏడుపులోకూడ నవ్వగల శక్తి నీది, అచ్చు మీ నాన్నవేనే!

కన : (కుర్చీలు సర్దిన తరువాత) అమ్మయ్య ఇప్పుడెలా వుంది ?

రాజ : రూపంలేని నాచేతగాని తనానికి ఓరూపం వచ్చి నట్లయింది (కనకం లోనికి వెళ్ళిన తరువాత కుర్చిలో కూర్చొని ఒక ఉత్తరంతీసి చదు

వును అదిలక్ష్మీ వ్రాసిన ఉత్తరం రూపంలో గేయం వినబడు తుంది)

మూగదానా అసహాయురాల
దిగులు బ్రతుకులో తెగినవీణా ॥మూగ॥
కన్నవారికి బరువుగా చెల్లరాని
చెల్లిపోని తల్లిలేనిలేగనూ కన్నీళ్ళు
నిండిన కడలినీ॥ మూగ॥

కన : ....(పాయసం గ్లాసుతో లోపలనుండి వచ్చి) మావయ్య.....
పాయసం మావయ్య.... నీ మంత్రి గోవిందా.

రాజ : ఆ ! కాకూడదే....ఏమిటమ్మా అది?

కన : పాయసం మావయ్య.

రాజ : వంటంతా అయిపోయినట్టుంది....మా తల్లే ఎప్పుడు చేసావమ్మా? ఏవిటో, ఏమో నాపనులు చేసుకోవడం ఎప్పటికి చేతనవుతుందో ఏమో మీ నాన్న నన్నింత చేత కాని వాణ్ణిగా చేసి పోయాడమ్మా,

కన : పోనీ లే మావయ్య - ఇప్పుడు నీ పనులు నువ్వు చేసుకోవలసిన అవసరం ఏమిటి ? నేనుండగా ?

రాజ : మీ నాన్న అంతే ! ఇలాగే ఓదార్చేవాడు. తన జీవితం చాలించే వరకు తన సుఖం కూడా కాదని, నా జీవితాన్నే సరిదిద్దేవాడు. చివరికి ఆ తాపత్రియంతోనే తన తనువు చాలించాడు (కంఠం రుద్ధం అయింది) "ఓరేయ్ శేఖరం నేను మిమ్మల్ని అందర్ని విడిచి వెడుతున్నందుకు నాకేం బాధలేదు. నా కూతురు ఏమయి పోతుంచని దిగులు నాకు లేదు. కాని నేను లేకుండా నీ జీవితాన్ని ఎలా నెట్టుకు రాగలుగుతావో అన్నదే నన్ను వేదిస్తోంది" అన్నాడు చివరిగా. (కళ్ళనీళ్ళు నింపుకొని) వాడి ఆత్మీయత, నీ అనురాగం చాటున మేం ఈ అవిటి వాళ్ళం, నిశ్చింతగా బ్రతుకు తున్నా మమ్మా.

కన : అవిటి వాళ్ళేమిటి? మరీ ఇదిగా మాట్లాడుతావు?

రాజ : కాక మరేమిటమ్మా? ఒకడు వయస్సు మళ్లినవాడు. మరొకడు మతిలేనివాడు - మూడవది మూగదీనూ.

కన : మరి నాలుగో అవిటి దానిమాట! (నవ్వుతుంది)

రాజ : ఆ కనకమహాలక్ష్మి దయవల్ల ఈ సంబంధం కుదిర్తే—మీ ఇద్ద పెళ్ళిళ్ళూ ఒకేసారి చేద్దామని నా ముచ్చటమ్మా.

కన : నీ ఆనందంకన్న మించిన ఆనందం నాకులేదు మావయ్యా, నే బ్రతికున్నంతవరకూ నువ్వు ఒంటివాడివి కాకూడదు. ఇదే నా జీవిత లక్ష్యం.

రాజ : మాతల్లే!

కన : మరి నే వస్తా మావయ్యా! అవతల యింకా పని అలానేవుంది. మరి నే వెడతా....(అని వెళ్ళిపోబోతుంది.)

రాజ : కనకం....కాసేపు చదరంగం ఆడుకోనా

కన : కాదు—ఇందాక మహాలక్ష్మి ఉత్తరం చదువుతూంటే మధ్యలో అంతరాయంతెచ్చాను—చదువుకో—

రాజ : అవునవును. (కనకం వెళుతుంది)

(రాజశేఖరం కూర్చొని ఉత్తరంలాంటిగేయం చదువుతుంటాడు. నేపద్యంలో పాట వినిపిస్తుంది. పాటలో తను నిమగ్న మయాడు. వీధిలో)

కన్నవారికి తెలియరాని భారమైన బాలను
మారలేని కాసును కన్నీళ్ళు నిండిన గాధను
మూగదానా అసహాయురాల దిగులు బ్రతుకుల
తెగిన వీణా .... తెగిన వీణా ॥మూగ॥

(వీధిలోంచి) ఆనందం! ఆనందం! (అంటూ సుందరం పిలుపు

వినిపిస్తుంది. రాజశేఖరం వినలే దా పిలుపుని, సుందరం ప్రవే శిస్తాడు. లాల్చీ — పైజమా — గొప్ప సంస్కారం అతనిలో ద్యోతకం అవుతూ వుంటుంది.)

సుం : ఆనందం! ఆనందం లేడాఅండి!....?

(అప్పటికీ ఆ పిలుపు వినిపించుకోడు.)

సుం : ఏమండీ! ఆనందం లేడా?

(పాట ఆగింది రా॥శే ఈ ప్రపంచంలోకి వచ్చి)

రాజ : (హఠాత్తుగా సుందరాన్ని గమనించి) ఎవరు? ఆ! పెళ్లివారే! అమ్మా కనకం వచ్చేశారు — వాళ్ళు వచ్చేశారు. (సం॥తో) కూర్చోండిబాబూ! (సుందరం కొద్దిపాటి ఆశ్చర్యంతోనే కూర్చుం టాడు.) నీలకంఠం మీతో రాలేదా, ఏమిటి?

సుం : నీలకంఠమా?

రాజ : అవును, నీలకంఠం....మిగతావారు—

కన : (ప్రవేశించి) ఏమిటి పిల్చావా! (క్రొత్తవ్యక్తిని గమనించి అరె! వచ్చేశారే! నమస్కారమండీ! మా నీలకంఠంగారు తమతో రాలేదా!

సుం : ఏమిటండీ?

రాజ : వాడిమొఖం—ఉభయానికి వేళ అయిందని వెనుకపడిఉంటాడు— మర్యాదా మప్పిదం లేకుండా—క్షమించండిబాబు (కనకం లోపలికి పనిమీద వెడుతుంది.)

సుం : అదికాదు! మీరు దేన్నిగురించి మాట్లాడుతున్నారో!....

రాజ : మరేంలేదు. మిమ్మల్ని ఒంటిరిగా పంపిన ఆ నీలకంఠం అమ ర్యాదకు మేం బాధ్యులం (కనకం కాళ్ళకు నీళ్ళతో వచ్చింది, నీళ్ళు వీధి గుమ్మంలోవుంచి వచ్చేలోగా)

సుం : ఆ నీలకంఠం ఎవరో నాకు తెలియదండి.

కన : (ప్రవేశించి) కాళ్ళు కడుక్కోండి—తతిమ్మావారు వెనకబడ్డారా ?

రాజ : ప్రయాణం సుఖంగా జరిగిందా నాయనా!

సుం : క్షమించాలి, నేను ఎవర్ననుకొంటున్నారో! నేను ఆనందం స్నేహితుణ్ని— మావూరు వెడుతూ — ఓసారి చూచిపోదామని వచ్చాను. వాడికి ఉత్తరంకూడా వ్రాశాను Stationకు రమ్మని.

రాజ : సరి, సరి, నువ్వు పెళ్ళివారితాలూకూ కాదూ !

కన : ఎవరై తేనేంగాని ! ముందు కాళ్ళు కడుక్కోండి. ఈలోగా మీ ఆనందం వస్తాడు (అంటూ లోపలికి వెళ్ళింది కనకం.)

రాజ : అ పద నాయనా ! ఆ పన్నెయ్యి ! మంచి సమయానికి వచ్చావు. మా తరుపున మాట మంతికి ఉందువుగాని.

(సుందరం చెప్పులు విడిచి వీధిలోకి వెడతాడు. రాజశేఖరం కనకానికి ఏదో పని చెప్పటానికి లోనికి వెడతాడు. సుందరం వీధిలోంచి కాళ్ళు కడుక్కొని, వొచ్చి కుర్చీలోకూర్చోబోతుండగా లక్ష్మి ఉత్తరం చూస్తాడు. ఆఖరి చరణాలు సాఫీగా చదువుతాడు. తరువాత దృష్టి చతురంగం బల్లపైపు మళ్ళుతుంది. బల్లముందు కూర్చొని ఆట ఆడుతుంటాడు. పాట సాగుతూ వుంటుంది.)

ఎవరికై యీ పూవు విరిసెనో
ఎవరి గళమున మాల నవుదును
ఎన్నిమారులు వరాన్వేషణ, ఎన్నిమారులు యీ నిరాశా
ఎవరినీ నే నెవరిదాన
ఎవరినీ నే నెవరిదాన ॥మూగ॥

రాజ : ఏఁవోయ్.

సుం : (పాటనుంచీ, ఆటనుంచీ తేరుకొని) రండి కూర్చోండి.

(పాట ఆగింది.)

రాజ : (చతురంగం బల్లవైపు దృష్టి సారించి) ఏమోయ్ నీకూ చదరంగం ఒచ్చాఏమిటి ? అ అరె ! ఆట కట్టిందే. చిత్రం—

సుం : నాకు పెద్ద అలవాటు లేదండి, ఆటలో, ఏదో అప్పుడప్పుడు సరదాగా ఆడుతుంటాను.

రాజ : ఆ ఆ అయితేమాత్రం అమోఘంగా ఆడేశావ్ (కనకం రెండు కప్పుల కాఫీతో ప్రవేశం) ఈ నా ప్రపంచలో నా ఆట కట్టించినవాళ్ళుఇద్దరే ఇద్దరు. ఒకడు పురుషోత్తం (ఫొటోను చూపించి) రెండు ఈ కనకం (కనకం చిన్నగానవ్వింది) మళ్ళీ నువ్వు ఇదిగో మూడోవాడివి. మా భేషయినవాడివోయ్. (కాఫీలు అందుకుంటారు)

కన : (కాఫీతో ప్రవేశించింది.)

సుంద: మీరూ తీసుకోండి.

రాజ: నాకు ఈ ఇంట్లో రొండోసారి కాఫీకి అధికారంలేదు నాయనా! కనకం చూశావా ! మనకు తెమలని ఆటని ఇతడు యిట్టే కట్టేశాడు.

కన : లేకపోతే మనమేనా ఏం ఈ ప్రపంచంలో ఘనులం ?

సుం: (నవ్వుతో అంగీకరించాడు) ఈ పురుషోత్తంగారు.

రాజ: వాడు-నేను అనేక సమస్యలతో రాణాన్నైతే, ఈ పురుషోత్తం వాటిని పరిష్కరించే చదరంగం.

సుం: (నవ్వి) బాగుంది అది సరే మీరు పాటలు వ్రాస్తారాండీ!

రాజ: సరి సరి, దీన్ని నే వ్రాశాననుకున్నావా? నేను ఉత్తరమే వ్రాయలేను.

కన: ఈయనకు చదరంగం తప్ప మరేమీ చేతకాదండి. తిండి తిప్పలు కూడమరొహళ్ళు గుర్తుచెయ్యాలిసిందే.

రాజ: (ఆ మాటకునవ్వి) మా అమ్మాయి వ్యక్తం చేసుకొన్న తన హృదయం నాయనా అది.

సుం: ఏమిటి? మీరు వ్రాసారా? (కనకంతో)

కన: ఏ నేను ఆయన కూతుర్నను కుంటున్నారా!

సుం: ఏం కారా?

కన: ఏ(మామయ్యా నేను నీ కూతుర్నా (అడిగింది నవ్వుతూ రాజశేఖరాన్ని)

రాజ: కాకపోతే ఏం? ఇది నాకు పెద్ద కూతుళలాంటిది. మా కనకం సాక్షాత్తు మా మహాలక్ష్మి. ఇది లేకపోతే మేం అంటే ఈ ముసలి పసివాడు - నా మూగపిల్ల అంటే ఈ గేయం వ్రాసిందే - అది. (సుందరంలో విష్మయం ఆ గేయంపట్ల) మా మతిలేనివాడు అంటే నీ స్నేహితుడు ఆనందం—

సుం: ఈ గేయం ఓ మాటరాని మగువ వ్రాసిందా? (దూరాన్నుంచి పాట వినిపిస్తుంది) దిగులుకూ, నిరాశకూ, నిర్వచనంగా నిలిచేజీవితాలను కూడ ఎంతో విలువగా మార్చగలిగే ఈ మధురమైన పదాలు ఓ మూగవోయిన మనసు వ్యర్థం చేసుకున్నావా? (ఇంతసేపు పాట సాగుతుంది.)

రాజు: (అలా పాట సాగుతుండగనే) అవున్నాయనా! విధి ధష్టమైన మా మహాలక్ష్మి హృదయ నివేదన. భగవంతుడు ఏ అతిలోక స్వప్నాన్ని కంటూనో, దాని రూపురేఖల్ని తీర్చి దిద్దాడు—గొప్ప సాహిత్య సంపత్తిని—వెన్నెలాంటి వెన్నల్లాంటి హృదయాన్ని అమర్చాడు.

సుం: కాని ఏం లాభం చెప్పండి—తన సాహిత్యాన్ని, తన భావసంపదని, లోకానికి ఎలుగెత్తి చాటుకొనే శక్తిని ప్రసాదించటం మరచిన తరవాత—?

రాజ: మ్చ్‌! నాకు నా జీవితంలో మరో సమస్యలేదు నాయనా దాన్ని ఓ ఇంటిదాన్ని చెయ్యడం ఎలా అన్నదే అన్నదే నన్ను వేధిస్తున విషయం-

సుం: ఒహో అదా ఇందాకటి హడావిడి, పెళ్ళి చూపులకు ఎవరైన వస్తున్నారా అండి?

రాజ: మరే నాయనా! ఇది నాలుగోసారి, నాలుగో వూరునుంచి చూపులకు రావడం, ఈ సారి ఏం కానుందో?

సుం: మరి అమ్మాయి ఇంట్లోనే వున్నారా అండి!

రాజ: వస్తుంది. (కనకం దిష్టితీసి సామాగ్రిని ఓ మూల Table మీద ఉంచింది.) ఈ పాటికి రావల్సిందేమరి. తీసుకరావటానికే వెళ్ళాడు ఆనందం—

కన: ఆనందం అంటే గుర్తుకొచ్చింది, ఆనందం బావ ఇంకా రాలేదేం? రైలుగాని లేటా?

సుం: ఆవిడ ఎక్కడనుంచి రావాలి?

కన: మద్రాసునుంచి మెయిల్‌లో రావాలి! అక్కడ Dumd&Deaf School లో చదువుకొంటున్నది. (రాజశేఖరం ఆటలోవున్నాడు)

సుం: మద్రాసు మెయిల్లోనా? దాంటోనేగా నే వచ్చింది.

కన : బాగుంది. ఇతను తప్పక రైల్వేస్టేషనుకు బదులు రేడియోస్టేషనుకే వెళ్ళిఉంటాడు. (రా॥శేతో) విన్నావా మావయ్యా! మద్రాసు మెయిల్ ఇందాకనే వచ్చిందట.

రాజ : మూడో ఎత్తుకు ఆటకట్టు — ఈపాటికి ఆనందం వస్తుంటాడు సందేహంలేదు.

సుం : ఏవిటి చదరంగం జ్యోతిష్యం పలికిందా అండి! (కనకం ఆనందం నవ్వారు)

రాజ : మీకు నవ్వులాటలాగావుంటుంది. తప్పక వస్తాడని పందెం.

కన : ఈ యింటి బావ యింటికి చేరుకోక ఏమవుతాడు !

సుం : (నవ్వాడు) కాదులెండి. వాడు అంతటివాడే, ఇంటికని బయలు దేరినవాడు సరాసరి ఇంటికే చేరుకోవడం విడూరంకదూ.

సుం : అందుకని పందెం ! అవునాండి.

రాజ : అహ అదిగాదు అదిగో నూరేళ్లు వాడికి

మోహనా మురళీధరా
పున్నమి విరిసే, కన్నులు మెరిసే
పొన్నలు పొగడలు పరిమళించెరా ॥రామోహనా॥
యమునా నదిలో పొంగిన అలలా
పరువము నీకై పలువరించెరా

లక్ష్మి—ప్రవేశం.

ఎన్నాళ్ళిగతి వేచెద నీకై
నీరజనాభా నిలువగవేరా
దయగనిరారా నను చేకోరా
ప్రేమగ పిలిచితి నీదాననేరా ॥రామోహనా॥

(బయటనేవున్న లక్ష్మితో గట్టిగా)

అమ్మా లోపలికి రాకు అక్కడే వుండు. (ఆనందంతో) ఒరేయ్ దానికి దిష్టి తీసేవరకు అక్కడే ఆపు. (ఆనందం వెళ్లాడు. నేపథ్యంలో వయొలిన్ తీగమీద అవ్యక్తమైన గేయం గీయం సుందరానికి స్ఫురిస్తుంది. భాష తెలీదు. కాని అంతకు ముందే పరిచయమయిన భావంతో—నాదంలో చరణాలు సాగుతున్నాయి. రాజశేఖరం ఒక కుర్చీని తన్నుకొని మరీ వెళ్ళాడు! కనకం దిష్టితీయటానికి వెళ్లింది. అందరూ వెలుపలే వున్నారు. ఆనందాతిశయంతో సుందరం యీ హడావిడికి అడ్డంలేకుండా, ఓమూల

నించున్నాడు.) (రాజశేఖరం ప్రక్కన లక్ష్మితో లోపలకు వచ్చాడు. సాగుతున్న పాట ఆగింది. కనకం కాళీచెంబు మొద లైన దిష్టి సామాన్లతో వీధిలోంచి లోపలికి వెళ్ళింది. ఆనందం బెడ్డింగు పుచ్చుకొని లోపలికి వెళ్లాడు.)

రాజ : రామ్మా! నీకోసం కళ్ళు కాయలు కాచిపోయాయి. (కూర్చుంది. అందరిని మూగచూపులతో పలకరించింది. సుందరాన్ని మటుకు చూడలేదు. లక్ష్మి రాకవల్ల కలిగిన ఆనందంలో సుందరాన్ని పరిచయం చేయాలనే సాంప్రదాయాన్ని మరిచారు అందరూ) మా చిట్టితల్లే — ఎన్నాళ్లయిందో నిన్నుచూసి. నిన్ను తల్చుకోని రోజులేదు—క్షణంలేదు. కులాసాయేనా తల్లీ! పరీక్షలు బాగా వ్రాశావా?

లక్ష్మి : (అన్నిటికి నవ్వుతూ తల ఊపుతుంది.)

ఆనం : (లోపల్నించి వస్తూ) అబ్బబ్బ! ఈ రైళ్ళను గుర్తుపట్టడం అనేది పెళ్లి పందిట్లో అవతలి బంధువు లెవరో తెలుసుకోవడం కంటే మహా యిబ్బందిగావుంది. అన్ని రైళ్ళు ఒకేమాదిరిగా ఒకే రంగులో వుంటాయి. మద్రాసునుంచి వచ్చే రైలేదో తెలీదు — మద్రాసు వెళ్ళేదేదో తెలీదు. (మూలనున్న సుందరం ముందుకు వస్తూ)

సుం : అంటే మద్రాసునించి వచ్చేరైలు, రైలులాగాను, మద్రాసువెళ్లే రైలు స్టీమరులాగా—వుండాలంటావు!

ఆనం : ఏమిరో యబ్బీ! నువ్వెప్పుడొచ్చావు? (లక్ష్మి లేచి నిలుచుం టుంది సుందరాన్ని చూస్తుంది. అందరూ అతన్ని చూస్తారు.)

సుం : మీ చెల్లెలు దిగిన బండిలో ప్రయాణంచేసి—మీకంటె ఓ గంట ముందు ఇక్కడకు చేరుకున్నాను.

ఆనం : (తప్పు చేసినవాడిలాగా) అహాఁ - అదేలే - అవునవును - గంట క్రితమే వచ్చుంటావు.

కనకం వస్తుంది.

రాజ : మరి నువ్వేం ఇంత త్వరగా తెమిలావు ?

ఆనం : (మరింత కంగారు,) ఆ- అ-ఇపుడే వస్తానుగా. ఈ కోటు తీసి,....
(అంటూ లోపలికి వెళతాడు.)

కన : అదేవిటి ? ముద్దాయిలాగా జారుకున్నాడు. ఏం జరిగిందేమిటి?

లక్ష్మి: (నవ్వుతూ కనకం చేతిమీద వ్రాస్తుంది.)

కన : ఎందుకూ ! రిక్షావాడితో తగాదా !

లక్ష్మి: (లక్ష్మి మళ్ళీ వ్రాస్తుంది.)

కన : (నవ్వుతూ) ఊ—

లక్ష్మి: (మళ్ళా వ్రాస్తుంది.)

కన : (మరింత నవ్వుతూ) ఊ—

లక్ష్మి: (మళ్ళా వ్రాసి—తనూ నవ్వుతుంది.)

కన : అయ్యో రాత ! అనుకున్నంతా పని చేశాడు. (సుందరంతో)
చూశారండి మీ స్నేహితుడి తెలివితేటలు.

సుం : ఏమిటండీ ?

రాజ : ఏం జరిగిందమ్మా !

కన : ఆ రిక్షావాడితో ఏం బేరమాడాడో ఏమో—వాడు తిన్నగా రేడియో స్టేషన్‌కి తీసుకు వెళ్ళాట్ట అక్కడ రిక్షావాడూ- బావా చట్టాపట్టాలు పట్టుకున్నారట.

ఆనం: (వస్తూ) ఏడిశాడు. నేనేమో పోలీస్ స్టేషన్ ప్రక్కవీధిలోకిఅని బేరమాడాను. ఆ వెధవ రేడియో స్టేషన్ ప్రక్కవీధిలోకి తీసుక వెళ్ళాడు. పైగా "నువ్వు" "నువ్వు" అని మీది, మీదికి వస్తాడూ; పాతేద్దును. రాస్కెల్.

రాజ : ఇంకానయం ! వాడు బుద్ధిమంతుడు కనుక అంతటితో ఆగాడు. అసలు నీ మతిమరుపు వదిలేట్టెగా బాదవలసింది.

ఆనం: అదికాదు ! నాన్న

రాజ : ఆ ! ఆ ! ఇక చాలు ! నువ్వు తప్పక రేడియో స్టేషన్ ప్రక్క సందులోకే అని బేరమాడివుంటావు.

సుం : అయినా నీకు, ఆ రేడియోస్టేషన్‌కి ఏంవిట్రా ఆ అవినాభావ సంబంధం ?

ఆనం: ఏడిశావులేవోయ్ ! నోరు మూసుకో ! ఓడు, ఓడు అంటే అందరూ ఓడేనా ?

సుం : అదికాదులే ! ఏదో వుంది, ఇందాకట్నుంచి ఇంటెల్లపాదీ నువ్వు చేయబోయే ప్రమాదాన్ని వూహిస్తూనేవున్నారు. రేడియోలో ఉద్యోగాని కేమైన ప్రయత్నిస్తున్నావేరా ! (కనకం లోపలికివెళ్ళింది నవ్వుతూ)

లక్ష్మి: (నవ్వింది.)

ఆనం : ఇదిగో యీవిడే కారణం.

లక్ష్మి: (నవ్వుతూనే) నేనా (అన్నట్టు చూస్తుంది.)

ఆనం: ఆ నువ్వే ! నీ చెక్కిలి, గేయాలూ, రేడియో వ్యవహారాలు వీట్ని గురించి రెండు రోజులకొకసారైన ఆ రేడియాస్టేషన్ చుట్టూ తిరుగుతున్నానాయె ! అందుకని అలవాటున—

సుం : (హఠాత్తుగా ఒక విషయం జ్ఞప్తికి తెచ్చుకొని) ఆ - అన్నట్టు "విరహిణిగేయం"

'నేపద్యంలో దూరాన సాహిత్యంతోకూడ వినిపిస్తుంటుంది.)

రాసింది మీరేనాండి....

'వినయంగా నవ్వి వూరుకుంటుంది.)

సుం : ఈవిడ్ని మూగగా సృష్టించిన భగవంతుడిపట్ల ఎంత దురభిప్రాయ పడ్డాను. మాటవల్ల పాపాలను మూటగట్టుకునే మాకు, మూగవల్ల మనసుల్ని వ్యాఖ్యానించ గలిగిన ఈ అపర సరస్వతికి సాపత్య మెక్కడ. (లక్ష్మితో) మిమ్మల్ని కలుసుకొనే భాగ్యం కోసమే నేను యీవూరు వచ్చాను.

ఆనం : ఆ ! అన్నట్టు—ఇతను సుందరమని—

సుం : బ్రాహ్మలం, నియోగులం, - ఇంటిపేరు వాడ్రేవువారు — మా పూర్వులు గొప్పవారు. ఇంతేనండి ఇహ నా వ్యక్తిగత సమర్థతలు ఈ (లక్ష్మి) దివిటీముందు ప్రదర్శనయోగ్యం కావు— (ఆనం) ఓరి బడుద్ధాయి, అదికాదు అసలువిషయం—

ఆనం : అదే ఈవిడ మా చెల్లెలే అని ఎందుకు ఉత్తరాల్లో వ్రాయలే దంటావు.

సుం : ఆవిడ్ని అలా కించపరచకు, ఆవిడ నీ చెల్లెలు కాదు—

ఆనం : అదేమిటి ?

సుం : నువ్వే ఆవిడ అన్నవు.

ఆనం: (దెబ్బతిని) సంతోషించాం. కనకం ! వాళ్ళు వొచ్చాస్తారేమో ! లక్ష్మిని పెళ్ళిచూపులకు తయారు చేయకూడదూ ! (కనకం లక్ష్మి లోపలకు వెళతారు) ఓరే సుంమా నీ ఇంజన్ డ్రస్ మార్చరా ! నీ పెట్టే బేడా ఏది ?

రాజ : (వస్తాడు.)

సుం : Waiting Room లో పెట్టాను. నేను అసలు నిన్ను చూట్టానికి రాలేదు. మీ Sister సాహిత్యంవిని Radio వాళ్ళకు వ్రాస్తే వాళ్ళు మహాలక్ష్మిగారి పూర్తిపేరు ఎడ్రసులతోసహా వ్రాసారు. సరే ఈవిడ వున్న వూళ్ళోనే నువ్వు వున్నావుగదా అని—

రాజ : సరి ! సరి ! ఆ మహాలక్ష్మి మాలక్ష్మినని నీకింతవరకు తెలియ దన్నమాట.

సుం : ఎలా తెలుస్తుంది. వీడు ఉత్తరాలకు జవాబులిస్తేనా ?

రాజ : వ్రాసేవుంటాడు నాయనా ! కాని నీకు వ్రాసిన ఉత్తరం మరో అడ్రసుకు వెళ్ళింవుటుంది.

ఆనం: సరేలెండి నాన్న ! మీరు మరీ విడ్డూరంగా మాట్లాడుతారు.

సుం : చాల ఆనందప్రదమైన ఇల్లండీ ఇది. కష్టాలను నవ్వుతో, పరిహసించగల గొప్ప ఋషుల్లాగా కనిపిస్తున్నారు నాకు.

ఆనం: అన్నట్టు మరిచాను. నాన్నగారు, వీడు కవిత్వం చెబుతాడు.

సుం : ఓరేయ్ ! నువ్వు నోర్మ్మయ్.

రాజ : ఆపని చెయ్....

రాజ : నీ వినయం చనువు చూస్తుంటే నువ్వు మాలోనివాడివే ననిపిస్తుంది, ఎన్నాళ్ళనాటి ఆత్మీయుడవో ననిపిస్తుంది. నువ్వన్నట్టు నాకు ఏ చీకు చింతా లేదు అసలు పుట్టినప్పటినుంచి, నా యాభై ఏటివరకూ నన్ను పసివాడులాగ పెంచి పరమపదించాడు మా పురుషోత్తం. పోతూ, పోతూ, నన్ను మా కుటుంబాన్ని తన కూతురు లక్ష్మి - అదే మా కనకం అండన ఒదిలి మరీ పోయాడు.

ఆనం: ఆ కనకమే నా కాబోయే శ్రీమతి—కదు నాన్నా....

రాజ : సరేలే ముందు లక్ష్మిని తయారుకమ్మను.

ఆనం: (లోపలివైపు ఆరుస్తూ) ఏరవర్రోయ్ ! ఎంతసేపు ఆ షోకులు? (అంటూ లోపలకు వెళ్ళబోతాడు. (పెళ్ళిచూపులకనిలక్ష్మి అలంకరింపబడింది. కనకం ఒకవైపు ఆనందం ఒకవైపుడుండి తీసుకువస్తారు.)

ఆనం: నాన్నా ! లక్ష్మి.....ఇటు చూడు. (రాజశేఖరం చూస్తాడు.) (లక్ష్మి సమీపించింది.)

రాజ : ఇది మా లక్ష్మి. ఇంత అందం ఎలా వొచ్చిందమ్మా నీకు.

ఆనం: (ఆనందం, సుందరాలు బయటికి వెళతారు) (లక్ష్మి తండ్రి కాళ్ళకు నమస్కరిస్తుంది)

రాజ: నాక్కాదమ్మా-నా జీవితాన్ని నిలబెట్టి, స్నేహితుడుగా, తండ్రిగా, నా ప్రాణంగా, నాకు అండగా నిలచి పరమపదించిన మా పురుషో త్తానికి చెయ్యెత్తి నమస్కరించవమ్మా (పురుషోత్తం దగ్గరకు వెడుతుంది) పురుషో త్తం ఫోటోనుద్దేశించి పురుషోత్తం నన్ను ఒంటరివాణ్ని చేసివెళ్ళావు. ఏ లోకంలోవున్నా నన్ను నీ చల్లని చూపులతో కాపాడుతానన్నావు. నీ చంకలో, నీ పెంపకంలో పెరి గిన ఈ అవిటి పిల్లను ఒక యింటిదాన్నిచేసి పుణ్యం కట్టుకోరా: ఈ సారి ప్రయత్నం ఒట్టి పోతే నేను ఏ గంగలోనైనా దిగి నిన్ను చేరుకుంటాను గాని నేను బ్రతకలేనుర్రా.

కన: లక్ష్మి నీవు లోపలికి వెళ్ళవూ. బాగుందర్రా మీ వరస శుభం పలక మంటే ఈ శోకాలేమిటి? (లక్ష్మి వెళుతుంది)

రాజ : అమ్మా కనకం! నాకు చాలా గుండె భారంగా వుందమ్మా, ఏం జరుగు తుందోనన్న భయంతో నా గుండెల్ని పిడికిట్లో పెట్టుకున్నాను. అమ్మా కనకమహాలక్ష్మి! ఈ ప్రయత్నం సపలీకృతం అయితే నీకు రజిత పాదరక్షలు చేయించుకుంటాను తల్లీ.

కన: ఏం భయం లేదు మావయ్యా! నువ్వు పిరికి వాడవయ్యింది చాలక మా లక్ష్మినికూడ కంగారుపెడుతున్నావు. ఈసారి మన ప్రయత్నం తప్పక ఫలిస్తుంది. కావాలంటే నీ చదరంగం జ్యోతిష్యం పలికించి చూడు.

రాజ: అమ్మో నేను యిప్పుడు చదరంగం బల్ల దగ్గరకుపోను. నే నసలు యిక్కడ వుండలేను (తనగదిలోకి వెళతాడు)

కన : పాపం (పురుషోత్తంపోటోనుద్దేశించి) ఏం నాన్న! ఎలా భరించావు, యితన్ని అంతకాలం ఈ సంబంధంకాకుండా పోతే నాన్నా, తండ్రి లేని నేను; దిక్కులేనిదాన్ని కూడా అయిపోతాను. (పెనుక లక్ష్మి నిలుచుంది. కనకం చూచింది. క్షణంలో Mood మార్చుకుంది. ముత్యాల్లా లక్ష్మి కనుకొనుకుల్లో నిలచిన కన్నీటిని తుడుస్తూ)

ఓ. ఓ. ఓ. ఏం దేవేరి, కాలు నిలవక తిరుగుతున్నావు. మరీ అంత ఆత్రుత పనికిరాదమ్మా ఎంతైన ఇంతదాన్ని చేసినవాళ్ళం మమ్మల్ని వదలి పోవాలనే ఆత్రుత అన్యాయం (లక్ష్మి నవ్వదు కళ్ళు మళ్ళీ చెమర్చాయి.)

ఇవేం కళ్ళమ్మా మరీను. ఆనందాన్ని ఆకాశానుంచి దిగి వచ్చిన గంగలా గుమ్మరిస్తున్నాయి. దాన్ని ఆపటము నా శవ్యము గాదు. ఆ రాబోయే — నీకాబోయే ఈశ్వరుడు తన బాహులులో ఈ ప్రవాహాన్ని కట్టాల్సిందే. లక్ష్మి కిసుక్కున నవ్వింది.)

ఆ! అదీ! నిన్ను సంతోష పెట్టాలంటే వారి విషయము శెలవు ఇవ్వాలన్నమాట. సరేగాని లక్ష్మి ఇలా కూర్చో - చిన్న రిహార్సలు వేద్దాము. మరొక్షణంలో పెళ్ళివారొస్తారు. అపుడు నువ్వు అశోకవనములో సీతాదేవిలాగవుంటే లాభములేదు. నేను అతను అనుకో—

లక్ష్మి: (కూర్చోని ఎవరో అన్నట్టు చూస్తుంది)

కన: అతను నీ మెడలో తాళిబొట్టు కడతాడూ—

లక్ష్మి: (అంటే ఎవరు అన్నట్టు సంజ్ఞచేస్తుంది)

కన : అమ్మ దొంగపిల్లా. అల్లరికూడ వచ్చేనీకు. అంటే ఎవరా:? నిన్ను (లక్ష్మిని నిలుచుకోబెట్టి) ఇలా దగ్గరకు తీసుకొని ఇలా (అని దగ్గరకు తీసుకోబోతుండగా)

లక్ష్మి: (చేత్తో దూరంగా నెట్టి కనకం అరచేతిమీద ఏదో వ్రాస్తుంది.)

కన : (చదివి) ఏమిటి, నా కెలా తెలుసా?

లక్ష్మి: (అవునన్నట్లు తలపంకించింది) మళ్లా చేతిమీద వ్రాస్తుంది.

కన : (చదివి) నీ అన్న నేర్పాడా! అబ్బో అంతపాటి మీద పోసుకో కుండ అన్నం తినగలిగితే చాలు మీ అన్న.

లక్ష్మి: (పోనీ నువ్వు తినిపిస్తావు అన్నట్టు అభినయంతో వ్యక్తంచేసి నవ్వుతుంది)

కన: (తనూ నవ్వి) అమ్మ గడుసుపిల్లా! ఆ కాపోయే మా అన్నతో చెప్పాలి-మాటరాదని చనువిస్తే తననోరు మూయిస్తుందని-అతను రానీ—అతను రానియ్ చెప్తా, (ఆనందం హడావిడిగా ప్రవేశించి)

ఆనం: ఒచ్చేస్తున్నారు. Taxi లో వస్తున్నారు (లోపలకు) నాన్నా! (కనకంతో) కనకం ఈయనేరి- అదీ మా నాన్న

కన : ఏవిటి హడావిడి. Taxi లో వాళ్ళు వస్తుంటే అంతకంటేముందు నువ్వెలా వొచ్చావు?

ఆనం: అదా! ఆ కారు పాడయిపోయించికాబోలు, అంతా గుమిగూడి ఏదో చేస్తున్నారు. నీలకంఠంగారుకూడా అక్కడేవున్నారు. అందుకనే వాళ్ళు పెళ్ళివాళ్ళని పోల్చుకున్నాను.

ఆనం: నాన్నా! (అంటూ రా॥తే గదిలోకి వెళ్ళబోతుంటే రా॥తే మే ఎదురు వచ్చాడు) వాళ్ళు వస్తున్నారు నాన్న కారు పాడై పోతేను మధ్యలో ఆగారు.

రాజ: అమ్మా కనకం ఆ తాంబూలాలు, ఫలహారాలు, అవీ సిద్ధంజేయించు, వెళ్ళు, వెళ్ళు. (కనకం వెళ్ళింది వెనకనే ఆనందం వెడుతున్నాడు) ఓరేయ్ ఓరేయ్! దాని వెనకాలే నువ్వెక్కడికిరా వెధవ!

ఆనం: అదిగో తిట్టకుండా నేనేం చెయ్యాలో చెప్పండి నాన్నా!

రాజ: సరే! ఓ గుడ్డతీసుకొని ఈ కుర్చీలను, కాస్త తుడువు. కాదు! కాదు! ముందు లక్ష్మిని సిద్ధం కమ్మను. (వెళ్తూంటాడు) ఒరేయ్, దాని పాటలన్నీ ఓ చోట చేర్చు - ఈ వేళ అడుగుతారేమో.

ఆనం: (వెళ్ళిపోయి ఆగి) నాన్నా....సుందుగాడేడి ?

రాజ : ఊ ! ఇక్కడే ఎక్కడో వున్నాడులేరా ముందాపని జూడు! అమ్మా కనకం—

కన : ఓయ్, వచ్చే ! వచ్చే ! (అంటూ ఏవో సామాన్లతో ప్రవేశిస్తుంది)

రాజ : వాళ్ళు వస్తూన్నారటమ్మా, నువ్వేం ఇంకా అలాగే వున్నావు ?

ఆనం: (పాటలు Seriptను చేత్తో పట్టుకోని వస్తూ) అహా—ఆ వొచ్చే వాళ్ళకు చేవిడే ఈ పనులన్నీచేసి అలసి, సొలసిపోయినట్టు కన బడొద్దూ !

కన : (వెక్కిరిస్తున్నట్టు) వ్వొ - చ్చె - వ్వా-వ్వా- ళ్ళకు త్తత్తన్నేన్నే—

రాజ : సరి ! సరి ! ఇపుడా యీ యుద్ధం. అన్నట్టు అమ్మా కనకం మీ అత్తయ్య నెక్‌లీస్ వేసుకోలేదేవమ్మా—

కన : అదా ! దాన్ని లక్ష్మికి వేశాను.

ఆనం : అదేం కుదరదు—

కన : నువ్వేవిటి మధ్య....

ఆనం : మీ ఆయన్నూ (తండ్రితో) కదు నాన్నా !

రాజ : అవునమ్మా. ఆ నగ నీది, తన నగ తన కోడలిని అలంకరించా లని మీ అత్త చివరికోరిక.

కన : అలాగే కానియ్యి—కాని యివ్వాల్టికి—

రాజ : యివ్వాళే మరీ యిది. వాళ్ళకు మాత్రం తెలియొద్దు—

ఆనం: ఆ తెలియొదు—

రాజ : ఈ తెలివితక్కువవాడ్ని సాకడానికి నీలాంటి గొప్ప శక్తిని సంపాదించుకొన్నామని—

ఆనం: ఏవిటినాన్న పదిసార్లు ఆమాటే అంటారు.

రాజ : సరేగాని, లక్ష్మినడిగి ఆ నెక్‌లెస్ పట్రా. (ఆనందం వెడతాడు సుందరం బైటినుంచి చేతుల్లో ఏవో పట్టుకొని వస్తాడు.)

కన : మీరెక్కడికి వెళ్ళారు ?

సుం : అలా బజారు కెళ్లాను.

రాజ : ఏఁటయ్యా—నీ హడావిడి ఇదిగానూ - ఆ పాకెట్లేఁవిటి ?

సుం : ఆఁ ఏఁవి లేదండి, మా ఆనందం చెల్లెలుకు స్వల్ప కానుక (రా॥శే॥నికి ఇస్తాడు.) ఇది పెళ్ళివాళ్ళకు బిస్కట్లు వగైరా (కనకానికిస్తాడు.) (ఆనందం నెక్లెస్‌తో వస్తాడు.)

ఆనం: ఇదిగో నాన్న అమ్మ నెక్‌లెస్. (సుందరాన్నిచూచి ఒరేయ్ ! సుందూ నువ్వెక్కడికి తగలడ్డావురా. వాళ్ళు వచ్చేస్తున్నాడు. నే నొక్కడ్ని ఈ పనులన్నీ.

సుం : వీడేడి?

రాజ : ఇవ్వాళ ఏవూరో పండుతుంది. అది ఇలాతే (నగ పుచ్చుకోపోతాడు.)

ఆనం: ఎందుకులే నాన్న, మిగిలిన పనులు నువ్వు చూసుకో. ఈ పని నే చేస్తాలే. ఇలా కూర్చోవోయ్ కనకం ఈ నెక్‌లెస్ మెడకు తగిలిస్తాను.

సుం : ఐతే ఈరోజు రెండు ప్రదానాలన్నమాట.

(అందరూ నవ్వుతారు.)

కన : (సుందరంతో) పోండి, (ఆనందంతో) ఇలాతే బావ, నే పెట్టుకుంటాను.

ఆనం: అదేం కుదరదు అవతల Time అయిపోతోంది. (రా॥శే)ఏనాన్నా-

రాజ : పోనీ త్వరలో ఏకంగా మంగళసూత్రమే కడుదువుగాని-ఇప్పటికి దాన్ని దాని చేతికియ్యి—

ఆనం: అప్పటికి నాకు ప్రాక్టీస్ కావద్దు—

రాజ : చత్ ! దానిచేతికియ్యి.

ఆనం: సరే ! (అని యిచ్చేస్తాడు.)

కన : (నవ్వుతూ తీసుకొని పెట్టుకుంటూ తలెత్తిచూచి) అదుగో నీల కంఠం బాబాయిగారు—

రాజ: ఆ ! రావోయ్ ! నీలకంఠం రా ! (నీలకంఠం ప్రవేశం ముఖంలో ఉత్సాహంలేదు. ఉస్సురుమంటూ కూర్చుంటాడు.) ఆనందం ఏడీ! ఆ ! ఉన్నావా ! బాబూ సుందరం నువ్వు ఎదురువెళ్ళు నాయనా ! (కనకం, ఒకరి వెనుక ఒకరు లోనికి వెడతారు. ఆనందం సుందరం ఓ పక్కన చేరతారు. రాజశేఖరం తక్కువ స్థాయిలో) పెళ్ళివారెక్కడ ?

నీల : నా నెత్తిమీద, నీ నెత్తిమీద ? పెళ్ళివారికి భూమ్మీద కాళ్లాన్తాయా!

రాజ : ఛ ! ఛ ! అవేంమాటలయ్యా—కార్లోవొస్తే వొచ్చార్లే—ఆనందం చెప్పాడ్లే—టాక్సీ చేసుకొచ్చారా ! ఫరవాలేదు. ఖర్చులో ఖర్చు.

నీల : కారేవిటయ్యా !

ఆనం: ఆ జంక్షను మలుపులో, నీలం చెవర్లెట్ కార్లో ! పెళ్ళివారు, మీరు మాట్లాడుతూ, రోడ్డుమీద నించున్నారు కాదుటండీ !

నీల : ఊహూ - నా తలకాయ - అది మన పక్కింటి అవధాన్లుగారి కూతురులేదూ - అదేనయ్యా ఆ పళ్ళెత్తమ్మాయి లేదయ్యా, ఆవిడకి ప్రధానం పెట్టటానికి డైరెక్టుగా హైదరాబాద్‌నుంచెవరో కార్లో వస్తున్నారు. ఇల్లు తెలియక వాకబు చేస్తుంటే మనింటి ప్రక్కదేనని చూపించాను.

రాజ : అదా !

ఆనం: మనింటివైపు చెయ్యి చూపిస్తుంటేనూ, డ్రైవరుకు దారి చూపు తున్నా రనుకున్నాను.

సుం : ఇంట్లోవాళ్ళందరిని అదరిగొట్టావుకదరా !

నీల : అయితేమాత్రం; వాళ్లంతా కాల్లోను, నేను కారువెనక పరుగెత్తు కుంటూను, ప్రయాణం చేస్తున్నా ననుకున్నా< ఏమిటి ?

ఆనం: అదికాదండీ.

రాజ : అది సరే! నువ్వొళ్లినపని ఏమయింది. అసలువిషయం చెప్ప వయ్యా - నానుస్తాపేమిటి ?

నీల : ఇక యేక నాన్చటమే! ఆ సంబంధం మనకు సరిపడదయ్యా—

ఆనం: (కొద్దిపాటు ఆవేశంతో) మీకు సరిపడ్డం కాదండీ! సరిపెట్టుకో వలసింది మేము జరిగిన విషయాలు మూడు ముక్కల్లో చెప్పటానికి ఇంతగా మా ప్రాణాలు తోడేస్తారేవిటి ? (కనకం గ్లాసుల్తో నీటిని Tray లో పెట్టుకొని వస్తుంది. అక్కడి అందరు ముఖాలు వివర్ణంగా వుండడంచూచి "ఏమిటి సంగతి" అని సుంద రాన్ని తరువాత ఆనందాన్ని, సొంజ్ఞతో పలకరించి సమా ధానాలు రాక అసలు విషయాన్ని గ్రహించి Tray ని Tea poy మీద వుంచి)

కన : ఏమిటి బాబోయ్ ? లక్ష్మిని చేసుకోలేని మరో దురదృష్టవంతుడ్ని కనిపెట్టారేమిటి ?

నీల : ఆహా! దురదృష్టంమాట నే నెరుగనుగాని, అంతటికు సంస్కా రుల్ని మాత్రం నే నెప్పుడు చూడలేదమ్మా—

రాజ : (అణచుకున్న ఆవేశంతో) నీతో వచ్చిన చిక్కే అది. వాళ్ళేమ న్నారా. అది చెప్పు. వాళ్ళ సంస్కారం యెంచటానికి మన నాణ్యం బాగుండాలిగదా. ఆ విషయం తెలిసికూడ వాళ్ళదగ్గర మన పూర్వీకుల పరపతిగూర్చి మాట్లాడి వచ్చుంటావు. (అంత నిశ్శ బ్దంగా వుంటారు.) నేను కాలు బయటపెట్టలేక, (ఆనందాన్ని చూపిస్తూ) ఈ తెలివితక్కువ దద్దమ్మను ఎక్కడికి పంపించలేక నీలాంటి వాడిమీద ఆధారపడవలసివచ్చింది.

సుం : (సముదాయిస్తూ) మీరు అనవసరంగా ఆవేశపడుతున్నారు రాజ శేఖరంగారు—

రాజ: నిజంనాయనా! ఆవేశం, ఆవేదనా, ఈ రెండే నాకు తెలిసిన విద్యలు
(దాదాపు ఏడుపు)

కన: మావయ్యా! యిటుచూడు-మనంమాత్రం యీ సంబంధం ఖాయ
మవుతుందని అనుకున్నామా-అలా ఆంధోళనపడకు కూర్చో.

రాజ: (కంటినిండా నీరు నింపుకొని) ఆ ఛండాలుడు (ఫోటోలో వున్న పురుషోత్తానుద్దేశించి) నన్ను వదలి తనే ముందుపోయాడు. పోయిన వాడు ఈ లోకంలో వదలిపెట్టిన దౌర్భాగ్యుల స్థితిగతుల్ని ఆలో చించాలనే ఇంగిత జ్ఞానంకూడ లేకుండా తన బ్రతుకు తాను బతుకు తున్నాడు.

నీల: ఆ—యీ లోకంలో, నీతో వున్నవాళ్ళం. యింత సహాయం చేస్తున్నాం—ఇహ పరలోకంలో వున్న పురుషోత్తం పంపుతాడో సంబంధాన్ని—

రాజ: మరి వాడికిది న్యాయమే నటయ్యా. నా ఖర్మ (గదిలోనికి వెళ్లను)

సుం: (నీలకంఠతో) వాళ్ళు చూట్టానికికూడ రామన్నారా అండి-

నీల: రానక్కర్లేదన్నారు

ఆనం: ఎందుకు—?

నీల: మూగపిల్ల అని చెప్పింతరువాత, ఇహచూడవలసింది మనుష్యుల్ని కాదు పొమ్మన్నారయ్యా.

నీల : మరీజొత్తిగా సంస్కార హీనులు బాబూ (అప్పుడే సుందరాన్ని చూచినట్టు) అన్నట్టు నువ్వెవరునాయనా?

సుం : నేను ఆనందం స్నేహితుడ్ని.

నీల : ఆహా! మన అమ్మాయి వాళ్ళకు నచ్చలేదు అంటే అందుకు మన మేమీ బాధపడం. కాని లక్ష్మి మూగదని తెలిసికూడ నాముందే దాన్ని ఎద్దేవా చేసారు. కాళ్లు చేతులూ తిప్పుతూ నా ఎదుటే దాన్ని

అనుకరించారు (విషయాన్ని మార్చి) అన్నట్లు మీరు బ్రాహ్మణులు కదూ - అవును బ్రాహ్మణులే. నియోగులు కదూ.

సుం : ముఖాన్ని చూసి నా కులగోత్రాలు చెప్పడం గొప్ప విశేషం.

నీల : అది నాప్రత్యేక వృత్తి నాయనా.

కనకం : (లోపలినుండి పరుగెత్తుకుంటూవచ్చి) బాబాయి! బాబాయ్! మామయ్య బాత్‌రూములోకివెళ్ళి తలుపు వేసుకున్నాడు, ఎంత పిల్చినా పలకడంలేదు ఏదో అఘాయిత్యం చేసుకునేట్లున్నాడు త్వరగా రండి. (అందరూ లోనికి వెళ్ళారు. స్టేజీ కొద్ది క్షణాలు నిర్మానుష్యంగా వుంది. విషాదంగా వాయిద్యనాదం వినపిస్తుంది. తెరలో తలుపులు విరుస్తున్న చప్పుడు, రాజశేఖరాన్ని పిలుస్తున్న గొంతులు వినిపిస్తూంటవి తరువాత రాజశేఖరాన్ని మందలింపుగా నీలకంఠం తోసుకుంటూ స్టేజి మీదకు వస్తాడు వెనక సుందరం ఆనందం వస్తారు. కనకంకూడ వస్తుంది.)

నీల : చాల గొప్పవాడివయ్యా! వంద సంబంధాలు తప్పిపోయి నూట ఒకటో సంబంధం ఖాయం కావటం నా అనుభవంలో (తలమీద వెంట్రుకలు చూపిస్తూ) అన్ని పర్యాయాలు ఎరుగుదును. ఆ తండ్రులంతా నీలాంటి వీరులైతే రోజు ఒక్కంటికి నూరుగురు ఆడపిల్లలు దిక్కులేనివారై పోదురు. ఆహా! ఏం పన్చేశావయ్యా-

సుం : ఏమిటి రాజశేఖరంగారు ఈ పని-మీలాంటి సంసారులు చెయ్యవలసిన పనేనా ఇదిః తల్లిలేని ఆ పిల్లకి తండ్రికూడ లేకుండా చెయ్యటమేనా మీ ప్రజ్ఞ. ఆ మూగపిల్లకి ఈ అఘాయిత్యంవల్ల ఏం సహాయం చేద్దామనుకున్నారు- (కనకం లోనికి వెళ్ళింది)

అనం : ఏమిటినాన్న యిది- ఛ! చ! ఇలా చెయ్యటం నీకు న్యాయమేనా?

రాజ: (మౌనంగా వెర్రిచూపులు చూస్తుంటాడు.)

(లక్ష్మి అలంకారలన్నిటినీ తీసి నిర్మలంగా ప్రవేశించి, తండ్రి దగ్గరకువచ్చి నిలుచుంది. రెండుక్షణాలు అలాగేచూచి, కుమిలి ఏడిచి కూర్చున్న తండ్రి ఒడిలో వాలిపోయింది)

కన : (ఒండినిండా పైటకప్పుకొని, ఓ చేతిలో తాళంచేతులు పట్టుకొని, నిర్లిప్తంగా ప్రవేశించింది. రాజశేఖరం వున్న సోఫా దగ్గరకు వచ్చి లక్ష్మి చేతిని తీసికొని ఆనందం చేతిలోవుంచి రాజశేఖరం. ఒడిలో తాళాలువేసి) ఇవిగో మావయ్య, నీ యింటి తాళంచెవులు. (అప్పటికి తెప్పరిల్లిన ఆనందం, సుందరం)

ఆనం : ఏమిటది?

నీల: ఏమిటమ్మా అది?

కన : (వెళ్ళిపోతున్నది ఆగి) ప్రాణాలు తీసుకొని, ప్రాణాలు తీసేహంత కుల యింట్లో నాకు స్థానంలేదు. నేను వేగలేను.

రాజు : (ఒక్క మారుగాబిగ్గరగా) అమ్మా! కనకం! వెళ్ళిపోతావా! వెళ్ళు. నేనూ నా కుటుంబం నువ్వెళ్ళిన మరుక్షణంలో గంగలోదిక్కపోతే అడుగు.

కన : ఛీ! ఛీ! మాట్లాడకు, మాటకు ముందు, చావు,చావు,చావు! బ్రతకలేక చచ్చే నువ్వు చావక బ్రతికేవాళ్ళను ఎంత హింస పెడుతున్నావో, ఆలోచించావా? నీ పిల్లల పెళ్ళిళ్ళకోసం, వాళ్ళ బ్రతుకులకోసం! ప్రాణాలు తీసుకోపడమే నీకు గత్యంతరమనిపిస్తే బ్రతుకంటే ఏమిటో తెలీకుండా 50 సం॥ల బ్రతికిన నీ చేతకానితనానికి, నీ అమాయికత్వానికి, విసిగెత్తి మానాన్న లెక్కలేనన్నిసార్లు ప్రాణాలు తీసుకొని వుండవలసింది. తల్లడిల్లి పోతున్న మూగ దాన్ని సముదాయించడంపోయి, నీ ప్రాణాలు తీసుకొంటావా పెద్దవాడవు. నువ్వు చెయ్యవలసిన పనేనా ఇది.

రాజ : అనమ్మా అను. నీ యిష్టం వొచ్చిన మాటలను. నాబాధ మీ కర్థం కాదు.

కన: అవును కాదు. అందుకనే నే వెడతా నంటున్నాను. బాధావిమృత్తికి నీకు మరణమే శరణ్యం అనుకుంటే యీ యింట్లో నాకు స్థానం లేదు. కష్టాల్ని పరిహసించగల్గిన వారితో నేను కలిసి వుండగలను. కాని మీ లాంటివారితో ఒక్కక్షణంకూడ వేగలేను. క్షమించు, నా దారిన నేను వెడతాను.

(వెళ్ళబోతుంది. అప్పటికి సుందరం అటువైపుకి చేరుకొని అడ్డు నిలుచున్నాడు)

సుం: కనకంగారు నేను మాట్లాడం ఎంతవరకూ సమంజసమో నాకుతెలీదు. అయినా ఒక్కమాట, రాజశేఖంగారి ఆవేదన్ని సరిగా మీరు అర్థం చేసుకొని వుండరు-అహ-అంటే వారి ఆత్మహత్య ప్రయత్నాన్ని సమర్థిస్తున్నాననికాదు. కాని, మీ మీద అంతగా ఆధారపడి పోయిన యీ కుటుంబాన్ని, నిరాశ్రయుల్నిచేసి వెళ్ళడం మాత్రం మీరు చెయ్యవలసిన పనికాదు.

ఆనం: కనకం. ఏమిటది? అన్ని అధికారాలు పుణికి పుచ్చుకున్న దానివి, మా నాన్నను గదమాయించి కూర్చోబెట్టలేవు, ఏమిటిది. నిజంగానే వెళ్ళిపోయే ప్రయత్నమా - లేక నాటకమా?

కన: లేదు బావా! నే నీ యింటికి ఏమికాను. గదమాయించటానికి, అదమాయించటానికి నేను ఎవరిని. మీ కంటె ఒకరికి ఒకరు తోడుగా, అండగా వుండటానికి మందీమార్బలంవుంది. ఈ యింట్లో ఎప్పటికి ఏ అఘాయిత్యం జరుగుతుందో-పరాయిదాన్ని నేనేంకాను—

రాజ: అమ్మా కనకం నన్ను చంపు - చిత్రవధచెయ్యి- అంతేగాని, నన్ను నా పిల్లల్ని దిక్కులేని వాళ్ళుగా చేసివెళ్ళకు—

సుం: అలా అంటే సరిపోతుందా అండీ! సంబంధాలు కుదరకపోతే ఆత్మహత్యలకు పూనుకుంటే ఆవిడ స్థానంలో ఉంటే ఎవరైనా చెయ్యవలసిన పనేయిది.

నీల : అయినా లోకం గొడ్డుపోయిందా ఏమిటయ్యా? 24 గంటల్లో మరో సంబంధం తెస్తాను.—ఎందుకలా బాధపడ్తావ్, ఎవరెవరికి ఒక ఆకున రాస్తే, వారికే అవుతుందయ్యా! కుమ్మరికుండ 10 మంది చూస్తారు. అందరూ కొనేస్తారా?

సుం : ఇంత తెలివి ఇన్ని అందచందాలు, గుణగణాలు, అన్నీ ఉండగా ఒక్క మాట లేనంత మాత్రాన లక్ష్మీగారికి పెళ్ళికాదు అనుకోవడం సమంజసంకాదు.

నీల : చక్కగా చెప్పావు నాయనా! అమ్మా కనకం! ఏమిటీ, ఇంకా అక్కడే నిల్చున్నావ్ వీధిలోవాళ్ళు చూస్తే నవ్వుతారు. వీళ్ళంతా మూర్ఖులైతే నువ్వూ మతిలేనిపని చేయడమేనా? (లక్ష్మి కనకం దగ్గరకు వెళ్లి, కనకం చెయ్యి తీసుకుంది. చేతిమీద "నన్ను ప్రాణం లేనిదానిగా చేసిపో- నేను మీమధ్య ఉండబట్టికదా మీకు, మీ జీవితాలమీద విసుగుపుడుతోంది." అన్నభావంతో గేయం వ్రాస్తుంది. రాస్తున్న సమయంలోనే ఆ పాట నేపద్యంలో సాకీగా పాట వినిపిస్తుంది. పాట సాగుతుండగనే, లక్ష్మి తీసుక వెడుతుండగా, కనకం వెనుకనే లోపలికి వెడుతుంది. తల పట్టుకు కూర్చున్న రాజశేఖరం తలెత్తి నీలకంఠం.)

అమ్మకనులుమూసి నేను తెరిచాను
నా అమ్మవు, నా ప్రాణానివి నీవు
నా నుండే దూరం పోతావా?

నీల : ఇదిగో చూడు, ఆ లక్ష్మి నీకూతురే కాదయ్యా— మా అందరికీ కావలసిన పిల్ల. లెక్కలేనన్ని సంబంధాలను తరచి, మేలైన సంబంధం స్థిరపరిచే పూచి నాది. నువ్వు లోపలకి పద, విశ్రాంతి తీసుకొందువుగాని, ఇలాంటి అఘాయిత్యం ఇంకెన్నడూ తల పెట్టకు. ఈ విషయం నలుగురికీ తెలిస్తే ఈమాత్రం సంబంధాలు కూడ రావు తెలిసిందా! లే—పద. (రాజశేఖరాన్ని లోపలకు తీసుక వెడతాడు. ఓ మూల నిశ్శబ్దంగా నిలుచున్న ఆనందం దగ్గరకు వెళ్ళి.)

సుం : ఎందుకురా అలా బాధపడతావ్ ?

ఆనం: ఇంతకంటె నేను చెయ్యగలిగిం దేముంది ? అటు వాళ్ళ బాధల్లో పాలుపంచుకోలేను, ఇటు నాకు నేనై ఏమి చెయ్యలేను.

సుం : మరీ ఆలా దిగజారిపోకురా—

ఆనం: ఆ ముసలాయన్ను చూస్తే ఏమీ పాలుపోకుండాపుంది. పోయిన సారి సంబంధానికీ యిలాగే High Blood Presure వొచ్చి నానా హడావిడి అయింది.

సుం : ఆవిడకీ పెళ్ళి ప్రయత్నా లెందుకు- యోగం వున్నపుడే అవుతుంది. హాయిగా చదివించెయ్యక.

ఆనం: చదివి, చదివి ఏంచేస్తుందిగనక: మాట మంచీ చేతనయితే ఏదైనా ఉద్యోగం చేసుకున్ను-దానికా యోగం లేదు. తాను బ్రతికుండగానే అది ఒక ఇంటిది కావాలంటారు. (అప్పటికి రాజశేఖరానికి తాగడాని కేదో తీసుక వెళుతుంది కనకం) ఒరేయ్ సుందూ, మా అవస్థల్ని చూసైనా నీకు అనిపించటంలేదా మమ్మల్ని కాపాడాలని"

సుం : అదేంవిటిరా. తప్పక అలాగే.

ఆనం: ఏమిటి నిజమేనా-? ఇది హాస్యాలకు సమయంకాదు.

సుం : పోకోళంకాదు. భగవంతుడి సాక్షిగా చెబుతున్నాను, ఆ వెధవ లకు అదృష్టం లేకపోయిందిగాని, ఆ అపర సరస్వతిని, భార్యగా చేసుకోవటానికి ఎంత పుణ్యం చేసుకోవాలి —

ఆనం: ఒరేయ్. సుందూ, సుందూ, మేమెంత అదృష్టవంతులంరా ! నీ పాదాలు పట్టుకొని నా కృతజ్ఞతలు తెలియజేసుకొంటాను.

(పాదములమీద పడపోతాడు.)

సుం : ఛ: ఛ: అవేం మాటల్రా - లే - (ఆనందం కళ్ళలో నీరునిండి వుంటుంది.) ఛ—ఛ. ఏడుస్తావేంమిటిరా ?

కన : (ముందుకు వస్తూ) అదొక్కటేనండీ వీళ్ళకు తెలిసిన విద్య. చిత్రంగా వుంది సుందరంగారు - చంకలో పిల్లాణ్ణి పెట్టుకొని

ఊరంతా వెతకినట్లయింది. మీ సహాయం జన్మ జన్మలకు మర్చిపోలేం—

సుం : ఉండండిమరి! భగవంతుడి దయవల్ల నా ప్రయత్నాలు ఫలించాలికదా!

కన : మీరు పూనుకున్న తరువాత ఇక ఫలించటానికేముంది?

సుం : నాపట్ల అంత విశ్వాసం వున్నందుకు సంతోషం — ఇవాల్టినుంచి అన్వేషణ ప్రారంభిస్తాను.

ఆనం: ఏమిటి?

సుం : దేశమంతా గాలించి మరీ తీసుకవస్తాను - ఆ వెధవలు సిగ్గుపడే లాంటి సంబంధాన్ని.

అనం : ఏమిటి! నువ్వు చేసుకోవూ?

సుం : నేనా - నాది రాజా సంబంధం ఏమిట్రా?

ఆనం: మరింకేమిటి నువ్వు చేసే సహాయం?

సుం: నన్ను చేసుకోమనా మీ రంటున్నది?

కన : ఏం? మీకూ అభ్యంతరమా!

సుం : అహా! అభ్యంతరం అని కాదు - మరి—

కన : పోనీ! మీ వారికా?

ఆనం: పోనీ మీవాళ్ళు కోరిన కట్నాలు, కానుకలు, ఇచ్చుకుంటాం—

సుం : బుద్ధిలేకుండా మాట్లాడకు -

ఆనం: (అయితే) మరేమిటిరా నీ అభ్యంతరం. నాకు తెలుసురా- మీరందరూ ఒకే జాతి-మీ అందరిది ఒకే నీతి- దాన్ని, అందాల్ని యోగ్యతల్ని, "ఆహా" "ఓహో" అని పొగడమంటే పొగుడ్తారు. నోటి మాటవరకు, మీ అందరూ కావలసినంత అభిమానాన్ని వలకపోస్తారు.

సుం : ఆనందం ! నే చెప్పేది విను–

ఆనం : ఇంకా ఏం చెబుతావురా - ఆకాశం అంత మనిషిని మన్మధుడ్లాంటి అందగాణ్ని, అపర కాళిదాసుని వెతుకుతానంటావు. కాని నువ్వు మాత్రం మూగదాన్ని భార్యగా చేసుకోటానికి అంగీకరించవు.

సుం : (కనకంతో) ఆనందం.

ఆనం: ఇవేం మాకు కొత్త కాదురా ! ఇప్పటికి కొన్ని వందల పెళ్ళి కొడుకుల నోటినుండి వింటున్నాం - ఎదుటివారి కష్టాలమీద, ప్రవర్తనమీద వ్యాఖ్యానించడం అంత తేలికైన పని మరొకటి లేదు - మీ కథల్లో - కావ్యాల్లో పలికే సున్నితమైన హృదయాలు మీవరకు వొచ్చేటప్పటికి శిలలయి పోతాయి. మీరంతా బురఖా రాయళ్ళు (విసుగ్గా లోపలికి వెడతాడు.)

సుం : ఒరేయ్ ! ఆనందం ! ఆనందం! (కాని ఆనందం వెళ్ళిపోయాడు-) ఏమిటండి వీడుమాట చొరనివ్వండి.

కన : అవునండీ ! బావ బాధపట్టంలో తప్పేమిటి చెప్పండి ? ఏమిటి మీ అభ్యంతరం చెప్పండి.

సుం : సరి, సరి మీరూ ప్రారంభించారూ, ఇహ నే వెడతానండి.

కన : ఎక్కడికి, వుండండి, భోజనంచేసి వెడుదురుగాని.

సుం : అలాకాదు. ఇహ ఒక క్షణం ఆగటానికి వీల్లేదు. ఈ క్షణం నుంచి నేను పెళ్ళికాని ఆడపిల్ల తరుపువాడిని, కాలికి బలపం కట్టుకొని తిరగాలి. ఓ మంచి సంబంధ తీసుకరావాలి. అప్పుడుగాని విశ్రమించను.

కన : అంతేగాని, మీరు చేసుకోరు -

సుం : చేసుకోవాలనుకుంటె జరిగిపోతుందా అండి. నా కెవర్ని రాసి పెట్టుందో, పాపం నా కోసం ఏ మూల కాళ్లు అరిగిపోయేట్లు తిరుగుతున్నాడో, వస్తానండి. లక్ష్మిగారితో చెప్పండి. అదుగో

ఆవిడే వచ్చారు. నమస్కారం, శెలవు తీసుకుంటానండి. నమస్కారం. (లక్ష్మి ఏదో కాగితం అందిస్తుంది) -ఏమిటండీ యిది ?

లక్ష్మి: (చేతిలో ఒకచిన్న చీటీతో ప్రవేశం.)

(చరణం)

పెదవి పలుకదు యిల్లాలి పదవియేల ?
చేటు కవియిత్రికొక మది చోటుయేల ?
ఎరుగుదును మీరు ననొల్లలేరు
పరులకంటగట్టగ జూచు ప్రయత్నమేల ?

"మీరు అసహ్యించుకొన్న వస్తువును ఇతరులకు దానంచెయ్యటానికి ప్రయత్నించకండి" - అన్నభావంతో గేయంవినిపిస్తుంటుంది.)

— తెర —

రెండవ రంగం

(తెర తొలగగనే రాజశేఖరం చదరంగం ఆడుతుంటాడు. లోపలినుంచి కనకం మందు గ్లాసుతో వచ్చింది. వచ్చినుంచొంది. రాజశేఖరం అదే ధ్యాసలో వుండుట వలన కనకాన్ని చూడలేదు)

కన: (సకిలించింది)

రాజ: (తలెత్తి) స్: యిప్పుడేం మాట్లాడకు. రెండాటలు కట్టుకాలేదు. యీ సారికూడా మేన ప్రయత్నం జరిగేలాలేదు.

కన: ఓహో చదరంగం జోతిష్యం చూస్తున్నావన్నమాట.

రాజ: (అవుననన్నట్టు తల వూపుతాడు)

కన: కలిసిరాకపోతే స్వల్పమైన కార్యాలే సానుకూల పడవు. శకునాలు, మంత్రాలు కార్యసాధన కుపకరిస్తాయనుకోవడం....

రాజ: అలాకాదు. నా చదరంగం తప్పు పలకదు.

కన: కావచ్చు. ఆ ప్రయత్నమైన చిత్త స్థైర్యంతోను, విశ్వాసంతోను చెయ్యాలి.

రాజ: అవును ఆ మాట నిజం.

కన: మరి నీ ఆటచూడు. మరి నీ ఎతులుచూడు ఎంత పరాకు చితగిస్తున్నాయో.

రాజ: పరాకా:

కన: ముందు యీ మందు పుచ్చుకో. మూడే ఎత్తులు. ఆటబంద్. (ఒకఎత్తు వేసి) నాఆట ఒకటి. ఇదిగో యిది రెండు యిహమూడు. గోవిందా బంద్. యిప్పుడేమంటావ్.

రాజ: (నిలువెత్తున నవ్వి-అంతులేని ఆనందంతో) బాగుందితల్లీ బాగుంది. అదీ అసలు విషయం. నీ చేయుత కావాలమ్మా ప్రతి ప్రయత్నాని కీను. (బయటనుండి Post అన్నకేక) నీలకఠం యింకా రాలేదేం చెప్మా. (కనకం బయటకువెళ్ళి వుత్తరాలతో తిరిగి వస్తుంది:)

రాజ: అన్ని వుత్తరాలే!

కన: ఆఁ అన్నీ మీ అమ్మాయిగారి Fans వి (క్రమంగా చించి ఒకటితీసి చదువుతూ వుంటుంది) ఆ వుత్తరం చదువుతూ ఉండగ పాట వినిపిస్తుంది.

కన: హృదయపూర్వక వందనాలతో- మీరు వ్రాసిన రుద్రవిపంచి గేయం రేడియోలో వినగల్గిన అదృష్టవంతుడ్ని. ఈ సాహితీ సాత్విక దర్పణమైన భాగ్యానికి ఎంత గర్వించాను....

గేయం :

మీటనా రుద్రవిపంచి
నాలో రగిలే వేదనలే
గీతాలుగా మలిచి పలికించనా

నా గుండేయల వేదికపై
హోమజ్వాల రగిలించితివి
నా ఊహల కన్నీటి జాలుల
అభిషేకించితి రావేర, రావేలరా

నా రుధిరం వాద్యంగా
హృదియే నైవేద్యంగా, నా నాడులు తీవెలుగా
యీ విపంచి శ్రుతిచేసి
రుద్రవీట మీటనా ॥మీటనా॥

జీవనాడి మూగవోయె
నా ఆశలు వీగిపోయె, యీ విపంచి పలుకలేదు
చీకటి నన్నావరించె
యీ ఉగాది దీవెన
యీశ్వరా! మహేశ్వరా!!
యీశ్వరా! మహేశ్వరా!!

రాజ: (ఉత్తరం చదువుచున్నంతసేపు పాట సాగుతూనే ఉంటుంది. రాజ శేఖరంలో ఆ ప్రశంశపట్ల అసహ్యం, జుగుప్స శృతిమించి కలుగు తుంటవి. ఒక్క మారుగా ఉత్తరాన్ని లాగుకుంటాడు. పాట ఆగు తుంది)

ఎందుకీ చిత్రహింస. ఈ పొగడ్తలు నన్నుగాని, దాన్నిగాని ఏ విధంగా ఉద్ధరిస్తాయి. తన కవితా స్రవంతిలో యింతమంది హృదయాలను ముంచెత్తుతున్న ఈ "అపూర్వ సృష్టిని" బజార్లో కుండలకన్నా హీనంగా ఎంపిక చేస్తున్నప్పుడు....యీ సాహితీ సాత్వికదర్పణాలకు విలువ ఏది? (ఆనందం వచ్చాడు)

ఆనం: (యింతకుముందే ప్రవేశించాడు) బాగా అన్నారు. యీ ప్రసంసించిన Fan ని యీ అపర సరస్వతిని చేసుకుంటావా బాబూ అంటే — కవిత్వాలు ఏం చేసుకుంటాం, కోసుకుంటామా, నాలుగు అబద్ధాలు మాట్లాడటానికి నాల్గు తిట్టటానికి లక్షణంగా నోరులేక పోయిన తరువాత అని పుంజాలు తెంపుకొని పరుగెత్తుతాడు.

కన: ఈ దూరంగా పోతున్న హృదయం లేనివారికంటే—లక్ష్మికి మీరు ఏ విధంగా సంతోషం గలిగిస్తున్నారో? అనుక్షణం పెళ్ళి, పెళ్ళి, అనిచెప్పి దాన్ని దూరం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు తప్ప మరో మంచి సహాయం ఏది.

ఆనం: అదేమిటి?

కన: అవును బావా! యీ మూగదాన్ని చేసుకోలేనంత మాత్రాన వాళ్ళంతా సంస్కారహీనులు! దుర్మార్గులు! మీరు....

రాజ: అవునమ్మా నువ్వు చెప్పింది నిజం. మనం దురదృష్ట వంతులం గానీ.

కన: అలా వ్యంగ్యంగా మాట్లాడకు. ఇన్ని కబుర్లు చెపుతున్న బావ ఒక అవిటిదాన్ని భార్యగాగాని, నవ్వు కోడలుగాగాని అంగీకరిస్తారా!

ఆనం: ఆ అవకాశంవస్తే చూపిద్దును నా తడాఖా! అంతటి త్యాగానికి ఆవ కాశం ఏదీ? ఏ త్యాగము చెయ్యనియ్యకుండ నా పెళ్ళి స్వర్గంలోనే ఏర్పాటైపోయింది.

కన: పోనీ నే నిస్తాను ఆ అవకాశాన్ని. ప్రదర్శించు బాబూ నీ త్యాగ నిరతిని. స్వర్గంలో ఏర్పాటైన నీ పెళ్ళిని రద్దుచేసుకో — ఏం మావయ్యా (పెడుతున్న వాడిని అడిగింది)

రాజ: (లోపలికి వెడుతున్నవాడు) ఏమోనమ్మా — నాకు నవ్వే శక్తి లేదు.

ఆనం: (రా।। శే॥ వెడుతున్న వైపుకు చూస్తున్న కనకాన్ని తన వైపుకు తిప్పుకొని) రద్దు చేసుకుంటుందట పెద్ద, చెంప పెళ్ళు మనిపించే వాడులేక.

కన : ఏమిటో బావా ! మావయ్యను చూస్తుంటే బెంగగా వుంటుంది. యీసారి నీలకంఠంగారు చెప్పిన సంబంధం ఖాయమైపోతే బాగుండు.

ఆనం: ఆయనింకా రాలేదే. (లక్ష్మి వచ్చి మళ్లా లోపలకు వెళ్ళబోతుంది.)

కన : ఏయ్ లక్ష్మి ! (పరుగెత్తుకుంటూ వెళ్ళి లక్ష్మిని తీసుకువచ్చింది.) ఇవిగో నీ Fans వ్రాసిన ఉత్తరాలు ఏం పొగడ్తలు, ఏం పొగడ్తలు. యీ తెలివైంది, యీ మతిలేనివాడు ఒక్క తల్లి కడుపున పుట్టినందుకు చెప్పుకోవాలి.

ఆనం: (జడలాగి) నోర్ముయ్ ! ఎప్పుడు వేళాకోళం ఆడాలో తెలియదు. (మూగమనిషితో మాట్లాడుతున్నట్టు) నువ్వు బాధపడకు.

లక్ష్మి: (అన్న చేతిమీద వ్రాస్తుంది.)

ఆనం: (చదివి) నీకు బాధ అని కాదు. మా బాధ సంగతే నేను మాట్లాడుతున్నది.

లక్ష్మి: (కనకం చేతిమీద వ్రాస్తుంది.)

కన : నిజమే చెప్పావు ! మీ అన్న బాధ అదే.

ఆనం: ఏమిటది ?

కన : ఆ నీ బాధ ఈవిడ పెళ్లి ఆలస్యం అయితే నీ పెళ్లి జాప్యం అవుతుందని....అందుకు త్వరగా నీ పెళ్ళి చేసేసుకో మంటుంది.

ఆనం: ఛ ! ఛ ! అవేం మాటలు. ఇదిగో లక్ష్మి మాకేమిటే తొందర ? ఆ మాటకొస్తే నీ పెళ్ళికోసం మా పెళ్లి మానుకోమన్నా సిద్ధం.

కన : (నవ్వి) అబ్బా ! అపర భీష్ముడు—చూస్తాంగా—

ఆనం: నోర్ముయ్. నీ తొందరవలనగాని....

కన : అన్నట్లు మాటల్లోబడి మనువు మరచిపోయాను.

ఆనం: నీ మనువా—

కన : కాదు. నీ చెల్లెలి మనువు ! చూపులకని వాళ్ళు వచ్చేటప్పటికి పాయసంకూడా చెయ్యమన్నాడు మామయ్య. లక్ష్మితో మాట్లాడుతుండు. (అంటూ లోపలికి వెళుతుంది.)

ఆనం: చూడు లక్ష్మి.

లక్ష్మి: (అన్న చేతిమీద వ్రాస్తుంది.)

ఆనం: (చదివి) అంత వొణెందుకే—అలాగైతే — మాట్లాడనులేవే నీ పెళ్లిసంగతి.

లక్ష్మి: (మళ్ళీ వ్రాస్తుంది.)

ఆనం: ఓ అలాగే (బయటకు వెళ్ళబోయి) 2 దస్తాలు చాలా తెల్లకాగితాలు.

లక్ష్మి: (చాలన్నట్లు సంజ్ఞ చేస్తుంది.) (ఆనందం వెళ్తాడు. లక్ష్మి మౌనంగా కూచుని ఆలోచనలో ఉంటుంది. ఆలోచన ప్రేమతో వాత్సల్యంతో, అనురాగంతో ప్రాణానికి ప్రాణంగా పెంచి పెద్ద చేసిన ప్రాణిని దూరం చేసుకోవడంలో త్యాగం ఏమిటో" అని) ఈ ఆలోచన పాటగా వినిపిస్తుంది. బయటనుంచి 'రాజశేఖరం గారూ' అని పిలుపు వినిపిస్తుంది. కొద్ది క్షణాలు తరువాత వీధిలో నుండి ప్రసాద్ వస్తాడు. సన్నగా, పొడుగ్గా, అందం, నిదానం అయిన కంఠస్వరం—ప్రవర్తన, సిల్క్-లాల్చీ గ్లాసోక్-పంచె)

ప్రసా: రాజశేఖరంగా రున్నారాండి: (లక్ష్మికి వినపడదు. పిలిచినా వినిపించక పోయేసరికి ఈమే మూగలక్ష్మి అని తెలుసుకొని మరీ దగ్గరగా వచ్చి నిలుచుంటాడు.)

లక్ష్మి: (ఎవరో వచ్చారన్నట్టు గ్రహించి తలెత్తితే ప్రసాదంకనిపిస్తాడు. చప్పున లేచి నుంచుని నమస్కరించి కూచోమని సంజ్ఞచేసి— త్వరగా రాజశేఖరం గదిలోకి వెడుతుంది. కూచున్న ప్రసాదానికి Teapoy మీద వున్న కాగితంమీదకు దృష్టి వెడుతుంది. ఆ కాగితంలో సాహిత్యం పాటలో పలుకుతుంది. రాజశేఖరం లక్ష్మి బయటకు వస్తారు. లక్ష్మి మరో గదిలోకి వెడుతుంది. రా॥ శే॥ దగ్గరగా వచ్చి పాటలో నిమగ్నమైన ప్రసాదంతో.

పాపలగని తపియింతురు
పాపలగని పెంతురు కంటి పాపవోలె
పాపకు పెండ్లి దొచ్చిన, ఆపెను వదలించుకొన
తపిఇంతురూ .... తపిఇంతురు

రాజ: ఎవరు నాయనా నువ్వు (పాట ఆగింది)

ప్రసా: (లేచి నిలబడి) నమస్కారమండి.

రాజ: నమస్కారం. కూర్చో నాయనా అబ్బాయి ఇంట్లో లేడు.

ప్రసా: నేను మీకోసం వచ్చాను.

రాజ: నాకోసమా! నువ్వు ?

ప్రసా: నాపేరు ప్రసాదరావు. మా స్వగ్రామం కోడూరు.

రాజ: (ఆశ్చర్యంగా) ఏమిటి ?

ప్రసా: అవునండీ. మీరు అవునా కాదా అనుకుంటున్న ప్రసాదరావునే.

రాజ: Commercial Tax Officer గారు.

ప్రసా: Assistant అని ముందుచేర్చి చివరి గారు తీసెయ్యండి. మీ నీలకంఠంగారి Candidate ని (చిరునవ్వు)

రాజ: (ఖంగారుగా లేచి) అయ్యో మీరే ప్రసాదరావుగారు. అమ్మా కనకం, కూర్చోండి బాబూ. మా నీలకంఠం మీతో రాలేదా?—

ప్రసా: వారు సరాసరి ఈ సమయానికి ఇక్కడికి చేరుకుంటా నన్నారు.

రాజ: తగలడ్డాడు కాదు; అమ్మా కనకం !

కన: (ప్రవేశిస్తూ) ఒస్తున్నా....ఏమిటి మా....(కొత్త వ్యక్తిని చూస్తుంది. ఎవరన్నట్టు మామయ్యను చూస్తుంది.)

రాజ: అదే !....మనకు నీలకంఠం చెప్పాడు. ప్రసాదరావుతో ఇది....

ప్రసా: నాకు చెల్లాయి....నీపేరు కనకలక్ష్మి. అవునా....

రాజ: అరె ! మీ కెలా తెల్సింది ?

ప్రసా: మరేమనుకున్నారు. అన్ని విషయాలు తెలుసుకొని పెళ్ళికొడుకు దర్జాతో వచ్చాను మరి.

రాజ: అహా ! నిలబడే ఉన్నారు. కూర్చోండి !

ప్రసా: (నవ్వుకుంటూ కూర్చొంటాడు.) అమ్మా నాకు ముందు కాసిని మంచినీళ్ళు కావాలి.

రాజ: (ఆత్రంగా) అమ్మా కనకం. పాయసం చేశావుకదా. ఆ వెండిగ్లాసు మరోమారు కడిగి....

ప్రసా: ఏం వద్దు. నాకు మంచినీళ్ళే కావాలి (కనకంతో) మంచినీళ్ళే పట్రా అమ్మా! (కనకం వెళ్ళింది. రాజశేఖరంతో) నా క్కావల సిందే ఇవ్వండి.

రాజ: తప్పకుండాను. ఎంతమాటండీ....

ప్రసా: ఓ ఘడియముందు నేను రాగానే మీ అబ్బాయి స్నేహితుడనుకొని ఎంతో ఆప్యాయంగా పిల్చారు. ఇప్పుడేమో ఒక్కమారుగా ఖంగారు పడిపోయి అండీ గిండీ అంటూ నన్ను చాల దూరం చేస్తున్నారు. అది నా కిష్టంలేదు సుమాండి. క్షమించండి.

రాజ: అయ్యో! అదికాదు....మీరు. మా ఆనందం....

ప్రసా: స్నేహితుడ్ననుకొని "ఏమోయ్" అని ఆప్యాయంగా పిలిచారు. ఇప్పుడు అండీ గిండీ అంటే అతనికి శత్రువునా అనుకుంటున్నాను.

రాజ: అబ్బే. అదేం కాదు.

ప్రసా: నన్ను మీ అబ్బాయిగా భావించి పిలవండి. నేను మీనుండి కోరేది ఆదరం, ఆప్యాయత. ఇవి తప్పక లభిస్తాయనే ఆశతోనే వచ్చాను.

రాజ: ఓ తప్పకుండానూ! ఏం కావాలో చెప్పండి.

కన: (గ్లాసుతో వస్తూ) ఆ అండీలు మానెయ్య మంటున్నారు. మామయ్యా (అందరూ నవ్వుతారు.) ఇదిగో మీరు కోరిన మంచినీళ్ళు. ఇది మామయ్య చేయించిన పాయసం.

రాజ: (పెద్దగా నవ్వుతూ) అది! ఆ పాయసం త్రాగేసి తరువాత నీళ్ళు కూడా త్రాగేయండి.

ప్రసా: అదిగో మళ్ళా దూరం చేస్తున్నారు. (గ్లాసు అందుకుంటూ!)

కన : అలాగే మర్యాద చెయ్యనిద్దురూ ! మరీ చనువిస్తే నెత్తినెక్కే-
వంశం వీళ్ళది !
నీకూ తెచ్చాను మావయ్యా పాయసం. (గ్లాసు రా॥శే॥ ముందు
వుంచింది)

ప్రసా: ఇపుడు కిప్పుడే చేసారా పాయసం?

కన: నీలకంఠంగారు చెప్పారు. మీ రివాళ వస్తారని నోరు తీపి చెయ్యాలని
మావయ్య పాయసం వండమన్నారు.

ప్రసా: ఈ నీలకంఠంగారితో పెద్ద చిక్కొనండి ఇలా నా కోసమని
ప్రత్యేకమైన ఎర్పాట్లేవీ చెయ్య వద్దని మళ్ళీ మళ్ళీ చెప్పానాయ
నతో.

రాజ: (లక్ష్మిని తీసుకురమ్మన్నట్టుగా కనకానికి సైగచేస్తాడు. కనకం కదల
బోతుంది)

ప్రసా: ఆగమ్మా-నే నావిడ్ని చూచాను.

కన: ఆహా, చెప్పావుకావేం మరి?

రాజ: అదికాదు....

ప్రసా: ఏదీకాదుగాని - చిన్నమనవి - నేను వయస్సులో, అనుభవంలో
అన్నిట్లో మీ కంటె చిన్నవాడిని, మీరు ఆజ్ఞాపించింది చెయ్యవల
సిందే, అసలా నిర్ణయంతోనే మీ వద్దకు పసివాడిలాగానే వచ్చాను
కాని ఒక్క క్షణంసేపు, మీరు అనుమతిస్తే నా బాధ్యత దృష్ట్యా
నాకు నేనే పెద్దను గనుక. పెద్దవాడిలాగా మాట్లాడుతాను-అన్యధా
భావించకూడదు. (అతని వినయానికి మురిసిపోతూ కనకంవైపు
చూస్తాడు రాజశేఖరం)

కన: ఫరవాలేదు - చెప్పండి—

రాజ: ఒక్క నిమిషం-కనకం మాట-(అని లేచి కుడిపక్కకు పిలుస్తాడు,
చెవిలో చెప్తాడు)

కన: (జవాబుగా) ఏం ఫరవాలేదు.

ప్రసా: (అర్థంకాక) ఏవిఁటండీ! మళ్ళా పాయసమా? (లేస్తాడు.)

రాజ: (చిరునవ్వుతో వస్తూ) ఆఁ ఏం లేదునాయనా, నీలకంఠం ఒచ్చాక మాటలు ప్రారంభిస్తేనో?

ప్రసా: మాటలేఁవిటి? ఏం మాటలున్నాయి! ఈ పాటి మాట్టాడ్డానికి ఎవరో ఉండడం, ఎన్నో హంగులుదేనికి!

కన: అవును. మావయ్యా-నీలకంఠం బాబాయి వచ్చేవరకూ ఆగడం దేనికి మనం మాట్లాడుకుందాం.

ప్రసా: పెద్దగా మాట్లాడవలసిన విషయాలు —

రాజ: అలా కాదు బాబు —

ప్రసా: మీ భయం నాకు తెలుసు-కోరికల్తో, సాంప్రదాయల్తో, మిమ్మల్ని కించపరచి—మీకు మళ్ళీ క్షోభను కలిగిస్తానని....

రాజ: అహ! ఎంతమాట! అదికాదు. తండ్రిగా ఇపుడు కొన్ని విషయాలు చెప్పకపోతే ముందు ముందిక లక్ష్మి ఏమి చెప్పలేదు. నాయనా ఆ అమ్మాయి మూగపిల్ల.

ప్రసా: కనుకనే నా బోటి సామాన్యుడికి ఆమెను చేసుకోబోయే అదృష్టం కలుగుతోంది.

రాజ: మూగదేకాని, నా బిడ్డ మంచి నేను చెప్పుకోవడం నా బుగ్గ నేనే పుణకడంలాంటిది—కాని చెప్పకుండ ఉండలేను. లక్ష్మి సుగుణాల రాశి—ప్రేమమూర్తి—ఇంత చిన్నవయస్సులోనే పెద్దపెద్ద కవుల శ్రేణిలోకి పోగలిగిన మంచి కవయిత్రి. దాన్ని వివాహం చేసుకోవడం—

ప్రసా: చేసుకొన్నవాడి అదృష్టం— (కనకంలోనికి వెళుతుంది)

రాజ: నిజం నాయనా ఇలా అన్నందుకు నన్ను క్షమించు—ఆడబిడ్డ తండ్రి కాకుండా—మా లక్ష్మికి తండ్రినైన దర్పంతో అలసత్వంతో

మాట్లాడుతున్నాను. అలాటి లక్ష్మిని నా మాటలమీద నమ్మకంతో చేసుకోగలిగితే చేసుకొండి—లేకపోతే—

ప్రసా: ఛ! ఛ! అదేమన్నమాట—మీ ఆరాటంకొద్ది చెప్పారు. కాని మీ లక్ష్మినిగురించి తెలియనివారు దేశంలో బహుకొద్దిమంది వుంటారు. అలాంటి అభిమానుల్లో నేను ఒకడ్ని — కాని యిపుడు నాకు రాబోయే అవకాశంమాత్రం అనేకుల్లో నా ఒక్కడిది. సందేహం లేదు. అయినా....

కన: ఏమిటి సందేహిస్తున్నారు?

ప్రసా: మీ నించి తెలుసుకోవాలనుకున్నది, ఒక్కటి, ఎన్ని గుణగణాలు, అందచందాలువున్నా ఇలాంటి స్వల్పమైన అవిటితనం ఉండడం వల్ల ఆడపిల్లల్ని కన్న హృదయాలు ఎంతగా క్షోభిస్తూంటాయో, మీకు అరం అయినటుగా మరొకరికి కాదు.

రాజ: నిజం నాయనా! అనుభవించేవాడికి తెలుస్తుందా బాధ. పిల్లలు లేకపోతే బాధలేదు—ఆ వున్నపిల్లలు సుఖజీవనానికి నోచుకోకపోతే, వారి బ్రతుకులు, ఆ ముసలి హృదయాలుకు, తీరని శాపాలు నాయనా -

ప్రసా: మీ వంటి సహృదయులు నాకు ఆత్మీయులు కాబోవడం నా పూర్వజన్మ సుకృతం - మరి నా దొక్కమనవి -

రాజ: (చాలాసంబరంగా) ఆ—ఏమిటి?

కన: ఏవిటో చెప్పండి-సంకోచించకండి.

ప్రసా: మరేం లేదు. నాకో చెల్లెలుంది సంబంధం నిశ్చయమయిన తరువాత ఒకే పందిటికింద జరగాలి రెండు పెళ్ళిళ్ళూ —

కన: అదేనా? (Table దగ్గరకు వెడుతుంది)

రాజ: హోరి నీ యిల్లు బంగారంగానూ - ఇదేనా - మాకుమాత్రం తొంద రేమిటి పెళ్ళికి?

ప్రసా: అలాకాదు. మరి మా చెల్లికి సంబంధం దొరకాలికదా ?

రాజ: దొరకడమేమిటి ? గగనమా ? మా నీలకంఠంకి చెబితే నిముషంలో అరడజను మందిని క్యూలో నిలబెడతాడు.

ప్రసా: అంత సులభమైతే, నా ఖర్మ నా పెళ్ళి జరిగేంతవరకు ఆపుతానా దాని పెళ్లి ?

కన : అంటే ?

ప్రసా: లక్ష్మికి సంబంధాలకోసం మీరు పడ్డ పాట్లకి రెండింతలు పడ్డాను, నా చెల్లి పెళ్లికోసమని.

రాజ: ఏం - అమ్మాయి....

నీలం: (ప్రవేశిస్తూ) సలక్షణంగా ఉంటుంది. చక్కగా చదువుకుందికూడ- అయితే ఏం లాభం

రాజ: ఇప్పుడా నువ్వు రావడం ?

నీల: ఏం చెయ్యమంటావయ్యా-అమ్మా కనకం నాకు కాసిని మంచినీళ్ళు- (కనకం వెళ్ళింది - అక్కడ కాళీగావున్న పాయసంగ్లాసు చూచి ఏఁవిటయ్యోయ్ ! అపుడే అల్లుడి నోరు తీపిచేసినారల్లేవుందే — (లోపల వున్న కనకంతో) నాకు వో గ్లాసు పాయసం ! (ప్రసాదరావుతో) వుందా — అంతా కాళీ చేశావా ! అయుండదు. కనకం కామధేనువు కదూ - (కనకం వస్తోంది.) అదిగో మాటలోనే వచ్చింది నా తల్లి. (కనకం పాయసం గ్లాసుతో వచ్చింది. నీల కంఠం అందుకొని గడ గడా తాగేడు.) ఆఁ ఏమిటి చెబుతున్నాను. ఆ ! ఏంలేదు రాజశేఖరం - అలా కనకమహాలక్ష్మి దర్శనానికి వెళ్ళాను.

కన : ఎందుకూ.

నీల: ఈ గండం గడిస్తే, అనగా ఈ పెళ్లి కుదిరితే - ఒక్క సాష్టాంగ నమస్కారం చేస్తానని మొక్కుకొచ్చాను తల్లీ.

ప్రసా: అయితే శీఘ్రంగా వెళ్ళి మొక్కుబడి చెల్లించుకరండి. (లేచి వస్తాడు. కనకం వస్తోంది.)

నీల: నిజం ? నేను అనుకున్నానోయ్ ! ప్రసాదం ! గుణంలోగాని, వినయంలోగాని ఏదీ, సంస్కారంలోగాని, నీకూ, ఇతరులకూ పోలికా-ఇహమరి తాంబూలాలూ—

ప్రసా: అదేనండీ ! మరి మా చెల్లెలు విషయం—

నీల : నీ చెల్లిలి విషయమా ? ఏవిటి ?

కన : వారి చెల్లెలుక్కూడా సంబంధం కుదిర్తే రెండు పెళ్ళిళ్లూ ఒకే పందిటికిందే—

నీల : అదా - ఇతని అభ్యంతరం ఇదిగో ప్రసాదరావు నువ్వు అన్యధా అనుకోకు - మీ చెల్లెలికి సంబంధం చూడ్డం సంగతి మాతో మాటాడకు. కులం గోత్రం సక్రమంగావున్న పిల్లలకే సంబంధాలు చొరక్క నానా యాతనకా వుందయ్యా.

ప్రసా: ఇంతవరకూ వొచ్చింది కనక - ఆ కులం, గోత్రం, సంగతికూడ విడమర్చి మాట్లాడండి వారితో—

నీల : వాటి సంగతి మాకు అనవసరమయ్యా.

రాజ: అయినా ఏమిటిది ?

నీల : ఆ-ఏమీ లేదయ్యా-వీరి నాన్నగారు కోడూరు చుట్టుపట్ల గొప్ప గౌరవంగా బ్రతికినటువంటి మనిషి. అతని తమ్ముడు - రామయ్య అని-అన్నగారికి పంచప్రాణాలు. నువ్వు, ఈ పురుషోత్తం బ్రతికినట్టుగా బ్రతికారు యిద్దరూ - అతను ఒక కూతురు కలిగిన తరువాత దివంగతుడైనాడు. ఈ కూతురూ-ఆ రామయ్య భార్య ఈ ప్రసాదరావు తండ్రి ప్రాపకంలో వుంటున్నారు - తరువాత....

ప్రసా: నాన్చకండి. దయచేసి చెప్పండి పూర్తిగా—

నీల : తరువాత - రెండు మూడు సంవత్సరాలకు- ఇతని పిన్నల్లి - అంతే యీ పిల్ల తల్లి ప్రవర్తన బాగోలేదని, ఆనోట, ఈనోట విని, ప్రసాదరావు తండ్రి నిప్పులాంటి మనిషి కావడంవల్ల - ఇంట్లోంచి వెళ్ళగొట్టాడు. తరువాత ఆమెక్కడో ప్రాణం తీసుకుంది.

ప్రసా: అప్పటినుంచి మా తండ్రి ఆ పిల్లను నాకంటె ప్రాణాధికంగా పెంచి - దాని బరువు బాధ్యతలు నాకు వప్పచెప్పి చనిపోయారు. అంతకుముందే నేను తల్లి లేనివాడ్ని, అప్పటినుంచి దానికి నేను—నాకు అది సర్వంగా బ్రతికాము. నా ప్రాణంకంటె ఎక్కువగా ప్రేమిస్తున్న నా చెల్లెలు చిన్నప్పటినుంచి నా ఎంగిలి కుడిచి నా గుండెమీద నిద్రబోయిన నా చెల్లెలు, నామీద ఆశలు పెట్టుకొని నేనే దిక్కైన చెల్లెలు - తన తప్పుగాని తప్పుకి పెళ్ళికి నోచుకోనిదై పోయింది.

కన : కడుపున పుట్టినంత మాత్రాన, తల్లి చేసిన పాపాలను, అంటగట్టడం అన్యాయం.

నీల : అన్యాయమేనమ్మా అయితేమాత్రం మనకెందుకా ఘోష. మనకు కావలసినవాడు ఇతను.

ప్రసా: నేనూ మీకు అక్కర్లేని ప్రాణి అన్నను. ఆ ఆంక్ష నామీదెందుకు లేదు—?

రాజ: మాకు లేదు నాయనా అభ్యంతరం కాకపోతే మేం ఈ విషయంలో ఏవిధంగా జోక్యం కలుగచేసుకోగలమా అని.

ప్రసా: నా కష్టాన్ని మీరేం తీర్చగలరు. ఏనాడు నేను మీకు కావాలను కున్నారో ఆ ఋణంమంచి నాకు తండ్రిలేని లోటు తీరిందను కున్నాను. నేను మీ యింటివాడ్నయినప్పుడు నా సమస్యలు మీవి-మీ సమస్యలు నావి.

రాజ: తప్పక నాయనా! మీ చెల్లికి సంబంధంచూసి పెళ్ళి జరిపించే పూచి నాది.

నీల: ఇదిగో శేఖరం, పని గడవటానికీ సముదాయించటానికీ మాటలు మీరకు - మూగతనం మాత్రమే వున్న నీ కూతురికీ సంబంధం కుదరడం గండం అయిపోయింది. ఒక కులట కూతురుకు—

కన : నీలకంఠంగారు—

ప్రసా: ఆయన్ని మందలించే పనిలేదమ్మా - అందరూ నా వెనుక అంటున్నది ఆయన ఎదురుగా అంటున్నారు. అంటున్నారు అని నాకు బాధగాదు కాని - అవిటివాళ్ళకు - అమాయకులకు పెళ్ళిళ్ళు జరిపించి ఇంతపుణ్యాన్ని మూటగట్టుకోవలసిన పెద్దలనోటకూడ సంశయమే వినిపిస్తున్నపుడు మరి దానికి దిక్కెవరు చెప్పండి ?

నీల : అంటే - నాకు మీ అమ్మాయి గిట్టదా ?

ప్రసా: అదికాదు —

నీల : మరేవిటయ్యా ఆ పెళ్లి జరిపిస్తే నాకో నాలుగు డబ్బులు గిడతాయి. గాని మానదుగదా, అయితేమాత్రం ఎవరికో ఒకరికి ముడివేయించేస్తే-వెధవది. ఒక్కనాటితో పొయ్యేదికాదు.చూడు మా వ్యాపారం-ఆ తరువాత ? ఉన్న ఈ మూడు పెంట్రుకలూ వుండవు - నా తలకాయమీద -

రాజ: అది సరే - ప్రసాదరావు - ఆ విషయం నువ్వు మరీ అంతగా ఆలోచించకు - నేను తప్పక ప్రయత్నిస్తాను. ఇతడిమాట్లకేం ? ఇక మనం తాంబూలాలు.....!

ప్రసా: వేరే ప్రయత్నం అక్కర్లేకుండానే నా కోరికను చెప్పమంటారా?

(అందరూ చెప్పండి అన్నట్టు చూస్తారు)

రాజ: ఏమిటది.....

ప్రసా: మీ అబ్బాయి ఆనందం యింకా పెళ్ళి కాసలసిన వాడు....

నీల: (పిడుగు పడ్డట్టుగా) శుద్ద అసంభవం—ఇది చచ్చినా....

కన: బాబాయ్—ఏమిటది? వారిని పూర్తిగా చెప్పనీ

రాజ: (ప్రసాదరావు నుద్దేశించి) ఆనందాన్ని మీ చెల్లెలికా?

ప్రసా: ఇస్తే సతమతమయిపోతున్న మన ఉభయుల మనస్సులు కుదుట బడతాయి. నేనూ యీ వివాహానికి నిరభ్యంతరంగా అంగీకరించ గలను.

నీల: మరి ఆ విషయం నువ్వు....

కన: (నీలకంఠాన్ని కూర్చోపెట్టి) లేకపోతే అంగీకరించలేరా?

ప్రసా: అంగీకరించమని మీరుమాత్రం అనగలరా? మీ లక్ష్మి విషయం ఆలోచించండి. అతన్ని వెనక్కు-నెట్టి తన అన్నగారు పెళ్ళి కావడం ఊహించండి. మీ యావన్మంది ఎంత కుమిలి పోతారో?

నీల: అందుకని ఇక్కడి విషయాలేవిటో తెలుసుకోకండా-ఓ కులట కూతుర్ని -

ప్రసా: మీరు పదిసార్లు ఆ మాట అనడం బాగాలేదు. అవునూ, కాదు, చెప్పడం బదులు—మీ ఆత్మీయుడు కాబోయే మనిషిని కించ పర చడం న్యాయంకాదు.

కన: అవును బాబాయ్ -

నీల: నేను మాటాడ్ను (లేస్తాడు) కాని ఒక్క-మాట-నీ చెల్లెలు పెళ్ళి నీ పెళ్ళితో ముడిపెడితే మాత్రం నువ్వు ఇలా వుండవలసిందే. దాని బ్రతుకు....

ప్రసా: (ఆవేశం వచ్చింది) అయ్యా నీలకఠంగారు! దాని బ్రతుక్కే-మండి? నా కంఠంలో ప్రాణముండగా నా చెల్లెలు ఏ వంకనా కష్టపడదు. అన్ని బాధ్యతలు నావి. అందుకే నే నల్లుడినైన యింట నా చెల్లెల్ని కూడ ఇవ్వాలని.

నీల: అంటే నిన్ను అల్లుడిగా చేసుకోవాలంటే—

ప్రసా: నా చెల్లెల్ని కోడలుగా చేసుకోవాలి. ఇది సానుకూల పడేవరకు దానికి అన్నగా మాత్రమే ఉండిపోతాను. (ఈ సంభాషణ మీద కనకం పురుషోత్తం పటం ముందుకు వస్తుంది.)

కన: నిక్షేపంగా మీ ఉభయులూ మాకు కొండి అన్నగారు -

రాజ: అమ్మా కనకం—(నీలకంఠం కోపంగాచూసి చుట్టూ తిరుగుతూ)

నీల: ఈ కొంపలో పెద్ద చచ్చి నాళ్ళంటూ వున్నారనా, లేరనా నీ అభిప్రాయం? (అని కనకం కుడివైపుకు వస్తాడు)

ప్రసా: (లేచి నిలబడుతూ) సరే! మీరీ విషయం చాలా తర్కించుకోవలసి వుంటుంది. నాకు తెలుసు. నిముషాలమీద ఒక నిర్ణయానికి రావడం కష్టమే, పైగా నా సమక్షంలో మాట్లాడుకోవడం ఇబ్బందిగా కూడ వుంటుంది. అన్నీ ఆలోచించుకొనే కబురు చేయండి (వెళ్ళబోతాడు.) వెళ్ళేముందు నా మాటగా ఇందాక మీ రన్నట్టు మీ లక్ష్మిని చేసుకోవడం ఎవరికైన ఎంత అదృష్టమో - నా చెల్లెల్ని చేసుకోవడంకూడ పూర్వజన్మ పుణ్యమే అనాలి. ఒక అవిటి పిల్ల తండ్రిగా, మీ బ్రతుకే శాపంగా, అనుభవిస్తున మీ మనసుకి తను చెయ్యని పాపానికి బలైపోతున్న నా చెల్లెలి బ్రతుకు కోసం నే పడే బాధ తెలియనికాదు. ఆ పైన మీరే నిర్ణయించండి.

నీల: (ప్రసాదరావు వెంటబడి) మా నిర్ణయం అంటావేఁవిటయ్యా-నీ చెల్లెలి బ్రతుకు ఉద్ధరించటం మా పని కాదు.

ప్రసా: అదే! ఆ మాటైనా నేను యిప్పుడు వినిపించుకోను. సాయంత్రమే — శెలవు అయ్యా వెళతానండి — వెళతానమ్మా —

కన: వెళ్ళిరండి-అన్నగారు తాంబూలం పుచ్చుకొనే వెళ్దురుగాని—

ప్రసా: నీ నోటిమాట అలాగే కాని అమ్మా-(నిష్క్రమిస్తాడు)

నీల: (కనకం ప్రక్కకు వెడుతుంది.) కానిస్తుంది కానిస్తుంది-ఏఁవిటీ కనకం నీ అభిప్రాయం?

కన: లక్ష్మిని ఒక యింటిదాన్నిచేసి మావయ్య మనస్సుకి శాంతిని చేకూర్చటమే నా నిర్ణయం, ఏం మావయ్యా ఏం చేద్దాం -

రాజ: ఇదేఁటమ్మా-నన్నుడుగుతావేమే? ఘోరం!

కన: అంటే ఇష్టంలేదని కబురు పంపుదామా?

నీల: తప్పుకుండానూ-

కన: అందరి పెళ్ళిళ్ళు జరిపించేసి కొన్నివేలు మూటగట్టుకున్న అదృష్ట వంతులు-మిమ్మల్ని కాదు ఆ ప్రశ్నవేసింది. ఏం మావయ్యా కబురు పంపుదామా-

రాజ: ఆహా! అలా కాదు-కాదు-అలాగే మారోమార్గమేముంది?

నీల: ఏవిటయ్యో! నానుస్తావేఁవిటి? నీ కేమన్నా మతిపోతున్నదా! ఖచ్చితంగా పీల్లేదని ఎందుకు చెప్పలేకపోతున్నావు. ఏవిటి? చిన్నప్పటినుంచి మొగుడు, పెళ్లాలుగా పెరుగుతున్న యీ కనకాన్ని-ఆనందాన్ని విడదీసి ఆ పిల్లం జేసేద్దామనా-నీ కూతురు పెళ్ళెయితే చాలాన్నమాట. పురుషోత్తాన్ని ఒకమారు జ్ఞాపకం చేసుకోవయ్యా (లేచి వెళ్ళడానికి సిద్ధం అవుతున్నాడు.)

రాజ: ఎవరయ్యా యీ సంబంధం చేస్తానన్నది. ఎందుకు చేస్తాను. నాకు తెలీదు. నీకు తెలుసులే. అమ్మా కనకం నాకు కొంచెం మంచి నీళ్ళు పట్రా అమ్మా-చెప్పొచ్చాడు మహా.

కన: (లోపలకు వెడుతూన్నది. వెళ్ళబోయేముందు సిద్ధమౌతున్న నీల కంతావ్ని ఉద్దేశించి) ఆగు బాబాయ్-వెళ్లొద్దు. (లోపలకు వెడుతుంది)

నీల: (మళ్ళీ కూచుంటూ) తెలిసినవాడివై తే, ఆ అనుమానం ఎందుకయ్యా? నాకు తెలుసునయ్యా. నీలాల సత్యానికి కారణం - మూగపిల్ల చెల్లిపోతుంది గదాఅని- నన్నెందుకమ్మా ఉండమన్నావు?

కన: ఎక్కడికెళతావ్ - భోంచేసి పోదువుగాని

నీల: భలేదానివే-ఆసోమిదమ్మకి మాటిచ్చి వచ్చాను.

కన : ఆ కొంపేం మునిగిపోదులే-ఇక్కడ తినెయ్.

ల: ఛ! ఛ! మాటిచ్చిం తరువాత మానేస్తే మర్యాద కాదమ్మా -

కన: మరిక్కడ చేసింది వృధాయేనా? పెళ్ళివారొస్తారు, వండించమని చెప్పావు. అవన్ని ఈ రేషన్ రోజుల్లో తగులబడి పోవలసిందేనా?

నీల: అన్ని దానాల్లో అన్నదానం చాల గొప్పది. ఎవరికో పడేయ్-

కన: మా గొప్పమాట చెప్పావు–నీ కిష్టమని గోంగూర పచ్చడి, మద్రాసు అప్పడాలు ప్రత్యేకంగా చేస్తే–

నీల: (దిగజారతు) ఏమిటో, గోంగూర పచ్చడీ, మద్రాసు అప్పడాలూనా-

కన: పొట్లకాయ పెరుగుపచ్చడి కూడానా

నీల: అదికూడానా....!

కన: ఇంకా కొత్తిమీరవేసి ఆవడాలు-జీడిపప్పుతో పాయసం-

నీల: (గుటకలు మింగుతూ) ఛా ననుకో - మరి సోమిదమ్మ....

కన: నన్ను చేయమన్న దానం ఆవిడే చేస్తుందిలే -

నీల: ఊ. సరే, నీతో యిదో పెద్దచిక్కు. కోతిపిడికిలి! పట్టుపట్టావంటే వడలవు. లేవయ్యా శేఖరం-భోంచేదువుగాని-(చొక్కావిప్పి కుర్చీ వెనక పడేసి, పంచె మరిడుకుల వరకూ ఎత్తి జంజం ముడివేసి-బొడ్డులో దోపుకుంటూ, పంచె కట్టు కొంచెం ఒదులుచేస్తాడు) అమ్మా ఆకులాయి దగ్గర కాళ్ళు కడుక్కుంటాను—

కన: (నీలకంఠం వెడతాడు) వెనకెడుతున్న రా।।శే।।న్ని ఆపి ఏవిటీ మామయ్యా ఆలోచన—

రాజ: నే చచ్చిపోతే బాగుండునమ్మా- (లేసి ముందుకు వెళతాడు)

కన: అదిగో మళ్ళి మొదలు-నే చెప్పేది విను-రాజాలాంటి సంబంధం. ఒదులుకోవటం మంచిదికాదు.

రాజ: కాదమ్మా-నన్ను వాడు క్షమించడు—

కన: ఎవరు? నాన్నా? నా వల్ల యీ సంబంధం కాకుండాపోతే నాన్న నన్ను క్షమించడు.

రాజ: మరి నీ జీవితం ఏం కాను?

కన: (రహస్యం అన్నమాట మరచి) నేనేం నీ కూతురి లాగా అవిటి దాన్ననుకున్నావా? కవిత్వాలు చెయ్యలేనేమోగాని, సంబంధాలు రానంత హీనమైన మనిషినిగాను.

రాజ: అమ్మా?

కన: అవును ఏవిటి చెబుతూ ఉంటేను. నీ పిల్లల పెళ్ళిళ్ళు ఎలాగా అని విచారించక, నా పెళ్ళికి పెంగపెట్టుకుంటావెందుకు? (నీలకంఠం వచ్చాడు) నీలకంఠం బాబాయి తలుచుకుంటే రోజుకో పెళ్ళి చేసికోగలను. కదు బాబాయ్.

నీల: ఆఁ లక్ష: నువ్వు చేసుకుంటేను.

కన: ఏం! ఎందుకు చేసుకోను?

నీల: నోర్మూయ్! ఏ నూతిలోనో గోతిలోనో పడి మా కొంపలు ముంచు తావ్! ఇహ మాట్లాడకండి. రాజశేఖరం ఒప్పుకుంటాడేమోకాని, రోజూ నా కడుపు నింపుతూన్న అన్నపూర్ణవి, నీ బ్రతుకును బుగ్గి చెయ్యడం నా చేతకాదు తల్లి.

కన: నా బ్రతుకేమి? నేను చేసుకుంటానూ!

రాజ: నా మీద ఒట్టేసి చెప్పమ్మా-నువ్వు నిజంగా చేసుకుంటావా?

నీల: ఇదిగో శేఖరం నువ్వు మాట్లాడకు (వచ్చిన ఆవేశంవల్ల కొంచెం ఆగాడు) ఆ పిల్ల నీమీద ప్రేమతో తన బ్రతుకునే త్యాగం చెయ్యడానికి సిద్ధపడుతూఉంది. నువ్వు నీ కోసం, నీ పిల్లకోసం, ముగ్గుర్ని హత్యచేయడానికి బయలుదేరుతున్నావు.

రాజ: నేనా....

నీల: ఆ....నువ్వే! ఇటు కనకాన్ని, అటు ఆనందాన్ని, ఇంకా రాబోయే పిల్లనుగూడ హత్య చేయడమే ఇది - నీ యిల్లు కళ కళ లాడలంటే, నీ పురుషోత్తం మనసు కించపడకూడదు. ఇదీ నే చెప్పవలసిన మాట.

రాజ: నేనేం చెయ్యనయ్యా! అది ఈ సంబంధం జరగాలి మొర్రో అంటే నేనేం చెయ్యను. (ఏడుపుకు దగ్గరగా ఉంది ఆవేశం)

కన: అయ్యో రామ. నేను నిక్షేపంలా పెళ్ళి చేసుకుంటాను.

నీల: (రా. శే.తో) ఆ! చేసుకుంటుంది! ఇది చేసుకుంటుందా? ఒకవేళ చేసుకున్నా మొక్కబడికి చేసుకుని ఈ పెళ్ళిళ్ళు కాగానే ఇల వేల్పుగా మిగిలిపోతుందిగాని. ఇల్లాలుగా మాత్రం కాదయ్యా.

రాజ: భగవాన్....(ఏడుస్తూ) ఇప్పుడు నేనేం చెయ్యాలి? చచ్చిపోయిన ప్రాణమిత్రుడు....బ్రతికున్న దేవతలాంటి పసికూన .... నా కన్న కడుపు కలకక్ కలకక్ కలిగిన ఒకక్కగానొకక్ ఆడబిడ్డ గుండె కొక గుదెబండై కూచుంది. నన్ను రాతికంటె కఠినంగా, మృగాని కంటె క్రూరంగాచేసి పచ్చి స్వార్థపరున్ని చేసింది....ఔను....దాని పెళ్ళి కావాలంటే దీని ప్రాణాలు తీయాలి....మరి దీని ప్రాణాలు కోసమని దానిబ్రతుకు .... (మరొక్కమారు కన్నీటి తెరలో కడుకుక్కపోయి....ఆవేశంలో నిలబడుతూ) పాడుబ్రతుకు .... దాని బ్రతుకు తగలడ....అది పుట్టగానే పురిట్లోనే ఛస్తే ఒక ఏడుపు ఏడ్చి సరిపెట్టుకొనేవాడిని గదయ్యా (అంటూ బయటికి వెళ్ళిపోబోతాడు)

నీల: శేఖరం (ఆగుతాడు) ఇలాకూర్చో ఛ! ఛ! మరీ దిగజారిపోతావేం. ఒక్కమాటడుగుతాను చెప్పు. ఈ సంబంధం తెచ్చినవాడ్ని నేను కదా? కొన్నిగంటలముందు వాళ్ళేవరో నీకు తెలియదుకదా? ఇంత వరకూ జరిగింది జరగలేదనుకో! తెల్లారేటప్పటికి మరో సంబంధం చూస్తాను.

రాజ: మరో సంబందం. మరో సంబంధం, మరో సంబంధం .... ఇలా ఎన్ని సంబంధాలు ఛ ఛ!

కన: (ప్రవేశించి చేతులు తుడుచుకుంటూ నిలబడుతుంది)

నీల: అందుకని దిక్కు-లేని పిల్లగ-దాని, దాని బ్రతుకుని నిర్లక్ష్యం చేయడం ఘోరమయ్యా.....(ఆగాడు) ఇన్నాళ్ళూ వాళ్ళ మనసుని ఒకటిగా చేసినవాడవు నువ్వు. ఇప్పుడిలా నీ చేతుల్తోనే....

కన: బాబాయ్! వద్దనయింది.

నీల: లే లే అసలు వేళదాటింది (వంటింట్లోకి దారితియ్యబోతాడు)

కన: బాబాయ్! ఆ సోమిదమ్మకి నిజంగా మాటిచ్చావా?

నీల: (పంచ సర్దుకుంటూ-ఏదో లాభంగా) ఒట్టు అన్నపూర్ణ సాక్షి.

కన: ఆవిడ మరేమనుకుంటుందో పాపం (తువ్వాలు అందించింది.)

నీల: అనుకోదు మరీ! నువ్వు సామాన్యురాలివా! గొంగూరని, అప్పడాలని, సింగినాదమని....

కన: బాబాయ్! ఇంత చిన్న చాపల్యానికే లొంగిపోయి అటు మనసు ఇటు తిప్పుకున్నావే-కన్న కడుపు తీపితో మామయ్య చలించి పోతుంటే నువ్వా మామయ్య మాట తప్పుతున్నాడని తప్పుబడుతున్నావు?

నీల: (ఏం చెప్పాలో తోచక) ఏమిటీ?

కన: ఏమీలేదుగాని, నా మాట వినండి. నా మనసు మీకు తెలియదు. నే నెప్పుడూ ముందే నిర్ణయాలు చేసుకోను, తప్పని సరిగా బావని చేసుకోవాలని నేను ఏనాడూ అనుకోలేదు. కాని మామయ్యకు మనశ్శాంతి, మావయ్య బ్రతికున్నంత కాలం నా ఒడిలో పసిపిల్లవాడిలా చూచుకోవాలనేది మాత్రము నా తప్పనిసరి నిర్ణయం.

నీల: అవునమ్మా! అందుకని—

కన: ఇహ! వ్యర్థప్రసంగాలతో మామయ్యకు మళ్ళా బ్రతుకుమీద విసుగు పుట్టించకండి. నా కేమీ కానివాళ్ళను నా దగ్గరకుచేర్చి మా నాన్న నాకు వదిలిపోయిన మామయ్యను దూరం చెయ్యకండి. వెళ్ళండి, నీలకంఠంగారు. వెళ్ళి అతన్ని తీసుకురండి.

నీల: నా చేతుల్లో....

కన: మా కుటుంబానికి నిజమైన మిత్రులని మీరు రుజువు పరచు కోవాలసుంటే, వెంటనే వెళ్ళి సంబంధం ఖాయపరచండి.

నీల: మరి నీ మాటమ్మా నీ గతేంకాను.

కన: నా మాటనమ్మండి. నాకో రాజాలాంటి సంబంధం చూసిపెట్టండి. మీ కమీషను వగైరాలు కాకుండా-నిత్యం భోజనం....

నీల: ఊరు కోవమ్మా-ఏడుపులోకూడ నవ్వగల శక్తి నీది ఉండు వెళ్ళి అతన్ని తీసుకొస్తాను.

కన: మరి భోజనం.

నీల: ఆ- భోజనంలాగే ఉంది (వెళ్ళిపోతాడు)

కన: నిజంగానే పొట్లకాయ పెరుగుపచ్చడ చేశాను బాబాయ్: కోపంకొద్ది అతనొక్కడ్ని పంపి నువ్వా సోమిదమ్మగారింట ఆరగించేవు?

నీల: సంతోషించాం....శేఖరం అతన్ని తీసికొస్తాను.

రాజ: (నిస్సహాయంగా ఇద్దరివైపు చూస్తాడు)

నీల: ఉ: ఇహసరే....(వెళ్ళాడు)

(రాజశేఖరం దీనంగా అతనివైపు చూస్తాడు. కనకం నవ్వుతూ అతనివంక చూస్తుంది. దుఃఖం వస్తుంది. నెమ్మదిగా కనకాన్ని దగ్గరకు తీసికుని తలనిమురుతూ ఉంటాడు. ఆనందం తెల్లకాగితాలతో చాలా హుషారుగా ప్రవేశించి, వీళ్ళ యిద్దర్ని చూస్తాడు. ఆనందాన్ని గమనిస్తారు-ఇద్దరూ విడిపోతారు)

ఆనం: (వెనక్కి తప్పుకుంటునట్లు నటించి) ఓయ్: ఓయ్ ఏమిటి నేను చాలా పొరపాటు సమయంలో వచ్చినట్లున్నాను. (రా. శే. యిద్దర్ని కన్నార్పకుండా చూచి దుఃఖాన్ని దిగమింగుతూ నిష్క్రమిస్తాడు.)

కన: (లేనినవ్వు తెచ్చుకుని) ఎక్కడినుండి రాక ఇటకు బావా?

ఆనం: హస్తినాపురినుండి-ఆకలేస్తోందమ్మాయ్ త్వరగా వడ్డించు.

కన: ఉండు నీ పెళ్ళివాళ్ళు ఒస్తున్నారు. కలసి భోంచేద్దువుగాని

ఆనం: సర్లే, నా పెళ్ళి వారేవిటి, సాక్షాత్తు నా పెళ్ళాంగారితోనే కలిసి భోంచేస్తాను. తొరగా పదమ్మాయి. (నిష్క్రమించుతూ ఆగి) ఏవిటి నువ్వింకా భోంచెయ్యలేదా?

కన: (కుర్చీలో కూర్చుంటుంది)

ఆన: ఇదిగో కనకం నాకేం వడ్డించుకోవడం చేతకాదనా?

కన : నీ ఆకలి తగలడిందిగాని కూచో బావ, నీకో శుభవార్త చెబుతాను.

ఆనం: ఆకలికాదు. కడుపు తగలడిపోతోంది. దహించుకుపోతోంది — చెప్పు, చెప్పు త్వరగా. (కూర్చుంటాడు.)

కన : (మౌనం)

ఆనం: చెల్లికి సంబంధం కుదిరిందా!

కన : ఔను. నిశ్చయం తాంబూలాలు పుచ్చుకు భోంచెయ్యటానికి ఇపుడొస్తున్నారాయన.

ఆనం: హైతో! అదా సంగతి! మరి నా పెళ్ళి రంటావేమిటి? బావగారు నా చెల్లెలి మొగుడా! నాకూ మొగుడేనా ఈ కాగితాలు లక్ష్మికిచ్చేస్తా .... (పోబోతూ ఆగి) అది సరే నాన్నేమిటలాగున్నారు.అబ్బబ్బ యీ ముసలాళ్ళతో పెద్దచిక్కు. ఇన్నాళ్ళు పెళ్ళి కాలేదని బాధ ఇపుడు పెళ్ళయి వెళుతుందని....

కన : మరి నీకుమాత్రం బాధ లేదేమిటి?

ఆనం: నాకెందుకూ మా బావగారి చెవి మెలేసి ఇక్కడ ఇల్లరికం వుంచేస్తాను. అది సరేగాని - ఇప్పుడే మన పెళ్ళికూడా!

కన : ఆ— లక్ష్మికి జరిగిన పందిట్లోనే నీకూ పెళ్ళి జరిపించాలని, మామయ్య, నీలకంఠం బాబాయి ఒక నిర్ణయానికి వచ్చారు.

ఆనం: నిజంగానా (అని వత్తిపలికి కొంచెంగా ఎడమకన్ను అదిరినట్లుగా ముద్దు పెట్టుకున్నాడు.)

కన : మగవాళ్ళకు ఎడమకన్ను అదరకూడదు, బావా.

ఆనం: ఓ ! Sorry (అని కుడికన్నుగీటి మళ్లా అలాగే ముట్టుకున్నాడు.)

కన : ఏయ్ ! పెళ్ళికొడుకా నీ అల్లరి నీదేనా ? నా మాట వింటావా లేదా ?

ఆనం: ఆల్‌రైట్ ! నా పెళ్ళికూతురా (అని కూర్చుంటాడు.)

కన Commercial Tax Officer ప్రసాదరావుగారు

ఆనం: ఔనౌను. విన్నాను. కుర్రాడు బుద్ధిమంతుడేనా ? నువు చూశావా ?

కన : అతనికూడా నీకున్నట్లే ఒక చెల్లెలుంది ?

ఆనం: శుభం !

కన : ఆ చెల్లెలికి పెళ్ళి కాలేదు.

ఆనం: శుభం!

కన : సంబంధాలకోసం ఎంత ప్రయత్నించినా - ఒక చిన్న కారణంవల్ల దొరకలేదూ - మీ చెల్లికి లాగానె....

ఆనం: ఆలాగా....శుభం.

కన : ఏమిటి శుభం ? ఆవిడకు పెళ్ళి కాకపోవడం శుభమా ?

ఆనం: శుభంగాదు - అదే శుభం - నువ్వు చెబుతున్నావుగా కనకం అది సరేగాని మన Honey Moon అమరావతికి వేసుకుందామా ?

కన : (సీరియస్‌గా) నువ్వు నామాటలు వినడంలేదు.

ఆనం: అబ్బబ్బ ! సహస్ర అవధానం చేస్తాను. కనకం .... చెప్పు, పెళ్ళి కొడుకు చెల్లెలికి సంబంధాలు దొరకడంలేదు ?

కన : కనక ఆ అమ్మాయిని కోడలుగా చేసుకున్నఇంటినే తనూ అల్లుడౌతాడట.

ఆనం: (నిర్ఘాంతపోయి) ఏమిటీ ?

కన : అందుకని చాలా వాదోప వాదాల తరువాత అంతా తీసుకున్న నిర్ణయం ఏమిటంటే - అతని చెల్లెల్ని నువ్వు చేసుకోవడం.

ఆనం: ఊ (ప్రమాదాన్ని ఊహించాడు) లేస్తాడు.

కన : నీ చెల్లెల్ని అతను చేసుకోవటం ?

ఆనం: కనకం !....మతిపోయిందా ?

కన : ఎవరికి ?

ఆనం: నీకు ? ఏవిటే నువ్వు వాగుతున్నది ? .... అబ్బబ్బ త్వరగా వడ్డించు.

కన : ఉండు నీ పెళ్ళివారు రాని,

ఆనం: నోర్ముయ్.

కన : కూర్చో ! నీ నోరు నాకందదే !

ఆనం: (దీనంగా కనకంవైపు తిరిగి) హాస్యమేకదూ కనకం.

కన : కాదు బావా !

ఆనం: నిజంగానా ! నిజంగా ఇలా జరిగిందా ? నువ్వొప్పుకున్నావా?

కన : నేనే ఒప్పుకున్నాను. ఇంకెవ్వరు ఒప్పుకోలేదు కూడాను.

ఆనం: నువ్వే ?

కన: ఆ! నేనే

ఆనం: నా మీద ఒట్టు?

కన: నీ తోడు.

ఆనం: మీ నాన్నమీద ఒట్టు?

కన: (పురుషోత్తం పటంవైపు చూసి) నా అంతట నేనే అందర్నీ ఒప్పించి ఇది సిద్ధపరచాను.

ఆనం: కనకం (చెంప చెళ్ళుమనేట్టు కనకాన్ని కొట్టబోయి ఆగాడు)

కన: ఆగా వెందుకు? కొట్టు నీ కామాత్రం అధికారంలేదా?

ఆనం: ఏమిటి నీ అభిప్రాయం? కనకం....కనకం....(కనకం మొహాన్ని తన చేతుల్లో పట్టుకొని) లేదు, లేదు, నువ్వాబద్దం చెబుతున్నావు. నువ్వు హాస్యం ఆడుతున్నావు. నీ మొహమే చెబుతోంది. ఇది నిజమైతే నువ్వింత నిర్విచారంగా ఉండలేవు....కదూ కనకం? అబద్దమని అనేయ్ కనకం. నాకు మతిపోతోంది....నిన్ను చంపినా చంపుతాను. (లక్ష్మి లోపలినుండి ఆదరా బాదరాగా వస్తుంది మధ్య నిలబడుతుంది. ఆనందాన్ని తనవైపుకి తిప్పుకుని మొగంలోనికి చూచి దీనంగా కన్నీరు కారుస్తుంది.)

ఆనం: (లక్ష్మివైపు క్షణం తదేకంగా చూస్తాడు. తరువాత కదిలి కొడుతూ) లక్ష్మి....నువ్వేమైనా నాకేంకాదు. నిన్ను చంపడానికైనా సిద్ధం, ప్రపంచమంతా భగ్గుమన్నా నాకు ఫరవాలేదు. నాకు కనకం కావాలి అంతే.

కన: నువ్వు నాకు సుతరామూ అక్కర్లేదు బావా....

ఆనం: (కొట్లకుక్కలాగా కనకాన్నిచూసి) ఏమిటీ?

కన: ఔను సిగ్గులేదూ, నాయంతట నేనే నీ కోసం సంబంధం చూచాను అంటేనువ్వు నా వెనక పాకులాడ్డానికి.

ఆనం: ఆత్మవంచన! పోజ్! మంచి దానివి కావడానికి తపన హత్యలుచేసి, ఘోరాలు జరిపి గొప్పదానివి కావాలని, లేదు కనకం! ఇలా జరిగిందంటే నిన్ను చంపి తీర్తాను. నీ మనసును తునిమి తునిమి నూరుకు తాగుతాను. చిత్రహింస చేస్తాను....నే నంటే నీ కిష్టంలేదూ?

కనం: లేదు?

ఆనం: అబద్దం! అయితే ఇన్నాళ్లూ నీ ప్రేమ నటన!?

కన: ప్రేమా! ఏం ప్రేమ.

ఆసం: కనకం! ఇది గొప్ప ఘోరం సుమా. నువ్వు నన్ను ప్రేమించనే లేదా?

కన: ఎందుకు ప్రేమించలేదు? నిన్నూ ప్రేమించాను, లక్ష్మిని ప్రేమించాను మన పంజరంలోని చిలుకని ప్రేమించాను.

ఆనం: నన్ను పెళ్ళిచేసుకుందామనుకోలేదూ?

కన: లేదు-

ఆనం: ఏం? ఎందుకని?

కన: నా యిష్టం....ఇదేం ప్రశ్న?

ఆనం: (అణచుకున్న ఆవేశంతో) లక్ష్మీ .... నువ్వు లోపలికి వెళ్ళు. (లక్ష్మి వెళ్ళనని తలూపుతూ కనకాన్ని చుట్టుకుంటుంది)

ఆనం: మీ కనకాన్ని నేనేం చంపేయన్లేవే....వెళ్ళు....వెళ్ళు (అని లాగి లక్ష్మిని తోస్తాడు. లక్ష్మి తూలుతూ, ఏడుచుకుంటూ లోపలికి పరుగెత్తుతుంది)

ఆనం: (ఆవేశం కళ్ళలో మాత్రమే కంఠంలో యుండదు.) కూర్చో కనకం ....సరి, నేనూ బాధపడడం మానుకుంటాను. నిర్భయంగాకూర్చో.

కన: (స్వేచ్ఛగా కూర్చుంటూ) అక్కడికి నేనేదో భయపడి పోతున్నట్లు

ఆనం: ఊన్లే-ప్రాణాలు తీసేదానివి. నీకు ప్రాణంమీద భయముండదు (తను మరో కుర్చీలో కూర్చుంటాడు) ఇప్పుడు చెప్పు నిజంగా, కనక మహాలక్ష్మి సాక్షిగా, నిజం చెప్పు. ఇప్పటికి జరిగిన దాంట్లో వీస మెత్తు అబద్ధంలేదు?

కన: నువ్వు, నీ చెల్లెలిపెళ్ళికోసం ఆజన్మాంతం అవివాహితుడుగానైన యుండగలను, అన్న నీ మాట తప్పించి

ఆనం: (దెబ్బతిన్నవాడ్లాగా చూచి) నేనీ పెళ్ళిచేసుకుంటే నువ్వేం చేస్తావు.

కన: ఎంచక్కా నేను పెళ్ళిచేసుకొని నీ కంటె ముందే ఓ కొడుకుని కని నీకు పుట్టిన కూతురికిస్తాను....వరుసలు కొంత మార్చుకోవాలి.... అంతే

ఆనం: ఆహా! (లేచినించున్నాడు క్షణం ఆలోచించి చరచరా తండ్రి గది లోకి వెళ్ళాడు)

కన: (తనూ నిల్చుని, ఆనందం పోయినవైపు రెప్పార్పకుండా చాలా బరువుగా చూసి, పురుషోత్తంవైపు తలెత్తి) నాన్నా! నీ ఆజ్ఞను అక్షరాలా నిర్వహించే మనోబలాన్ని నాకు ప్రసాదించు నాన్నా, (లక్ష్మీ చెయ్యి తనమీద పడింది గిరుక్కున తిరిగింది. అప్రయత్నంగాదు? జాతి శయంతో దగ్గరకు తీసుకుంది. మూగలక్ష్మి మనసులో మెదిలే భావాలు గీతికగా కనకానికి వినవస్తున్నాయి. నువ్వు ఇతరులకు వెలుగునిచ్చి, నిన్ను నువ్వు కాల్చుకునే కొవ్వత్తివి.)

తన తనువును బలిపెడుతూ
కాగే నూనెలో వెలిగే వత్తె
తాను నుసి యౌతూ
లోకాలకు వెలుగిచ్చును.

కన: ఛ! ఛ! నీ తోడు నాకేమైనా బాధలేదు. నువ్వు కంట కనపడితేనే నేను వ్యధపడతాను. వూరుకో.

(లక్ష్మి చెయ్యెత్తి నమస్కరించి—రివ్వున లోనికి వెళుతుంది)

(అటునుంచి రాజశేఖరం, ఆనందం ప్రవేశిస్తారు. ఆనందం ఆగకుండా తన గదిలోకి పోతాడు. రాజశేఖరం కనకం దగ్గర కొచ్చి ఆగుతాడు.)

రాజ: ఈ సంబంధం చేసుకుంటానని వాడంతట వాడే వచ్చి చెప్పాడు. నువ్వేమైనా చెప్పావా? తల్లీ

కన: ఆ—చెప్పాను. అసలు మా యిద్దర్లో ఎవరికి ఫరవాలేదు మావయ్యా నువ్వు, నీలకంఠం బాబాయ్ వూరికే సతమతమయి పోయారు.

రాజ: హు....ముందుకేం జరుగనున్నదో....ఆ నీలకంఠం యింకా రాలేదు.

నీల: (మాటమీద ప్రవేశిస్తూ) ఇదుగో వస్తూంటేనూ. రావయ్యా అల్లుడూ! కూర్చో (కనకం లోపలికివెళ్ళింది)

రాజ: రండి. రండి, దయచేయండి! (నవ్వే ప్రయత్నం చేస్తాడు)

ప్రసా: (నవ్వుకుంటూ వచ్చి కుర్చీలో కూర్చుంటాడు) నీలకంఠంగారు మీ పరిచయభాగ్యం నాకు కల్పించారు. నీలకంఠంగారే ఈ సంబంధం తప్పిపోడానికి కారణమౌతున్నారను కుంటుండగా, తిరిగి నీలకంఠంగారే ఖాయపరుస్తున్నారు. వీరికి నేను కృతజ్ఞుడ్ని.

నీల: (ఏమీ మాట్లాడడు)

రాజ: చివరికి మేము మీ నిబంధనలకు అంగీకరించి.

ప్రసా: నిబంధన అనకండి. నా కోరిక. బాధ్యతాయుతమైన కోరిక అంతే.

నీల: పెట్టావు జటిలమైన కండిషన్లు! దానికి పెద్ద పెద్ద పేర్లు ఎందుకయ్యా (చలోక్తిగా అక్కసు వెళ్ళగ్రక్కుతాడు)

ప్రసా: అలాగాదు. బలవంతాన, అవసరాలకు లొంగిపోయి సంబంధం అంగీకరించడం ఇరుపక్షాలకూ శ్రేయస్కరంకాదు.

రాజ: అబ్బబ్బె అదేంకాదు. కుండమార్పులు అనాచారమేమో అనుకున్నాం తప్పించి మరో అభ్యంతరం మాకు ఎంతమాత్రంలేదు.

ప్రసా: మీ అబ్బాయిగారు లోపలున్నారా?

నీల: అబ్బాయిగారేమిటి? బావగారను.

రాజ: ఉన్నాడు. ఇంతకుముందే వచ్చాడు. వాడితో అంతా చెప్పాను. నా మాట కెదురు తిరిగే వాడు కాదు. (కేకవేస్తాడు)

ప్రసా: మరి మా బావగారు చెల్లెల్ని చూడాలి గదా?

నీల: అలాంటి పట్టింపులేం లేవండి మాకు. మాకు కావలసింది సాంప్రదాయం.

ప్రసా: అయినా అంతలో ఏం పోయింది. ఇప్పుడో, సాయంత్రమో బావ గార్నొకమారు తీసుకువెళ్ళి పరిచయం చేస్తాను. ఆ తరువాతనే తాంబూలాలు....

ఆనం: (పంచె, లాల్చి పెళ్ళిచూపులకు సిద్ధమైన వాడిలాగా తయారై వొచ్చాడు. మనిషి ప్రవర్తనలో ఇకనుంచి కొంచెం ప్రతిమించి నట్టుగా, ఆవేదన్ని కప్పిపుచ్చుకుని లేని సంతోషాన్ని వ్యక్తం చేసు కొనే బోళాతనం కనిపిస్తుంది.)

నీల: ఒకమారు అమ్మాయిని చూసుకుంటావేమిటోయ్?

ఆనం: ఏమిటి? నేనా! ఎందుకు? అక్కర్లేదు బావగారు. మీరు మాకు అల్లుడు కావాలి. అది మా అదృష్టంగా భావిస్తున్నాం. ఇహ ఏ పరిస్థితులలోనూ ఈ అదృష్టాన్ని వొదులుకోలేము.

ప్రసా: ఆ అదృష్టం మీదికాదు, నాది అయినా అమ్మాయి మంచిచెడ్డలు....

ఆనం: ఓహో అవా! వాటిని మీ నోటినుండి వింటే చాలు. ఏం అమ్మాయి చదువుకుందా? Dance చేస్తుందా. వంటలొచ్చా? పేరు వయస్సెంత? — . .... ఆఁ అన్నట్టు ప్రేమిస్తుందా?

(అంతా నవ్వుతారు.)

రాజ: ఒరే బడుద్ధాయి! నీ తెలివితేటలకి నీకో పెళ్లాం దొరకడమే అదృష్టంరా!

కన: (కాఫీలతో ప్రవేశిస్తూ) అవునన్నగారు! ఎంత త్వరగా యీ పెళ్ళయి ఆ వొచ్చిన పిల్ల కొరడా చేతపట్టి మా బావని ఒక కొలిక్కి తీసుకు వస్తుందా అని మా అందరికి తొందరగానే ఉంది.

ఆనం: ఆ! అదిమాత్రం నిజం. ఆ సంగతి ఈ కనకానికి తెలిసినట్టు ఈ మొత్తం చతుర్దశ భువన భాండాల్లో మరెవ్వరికి తెలీదు. (సూటిగా కనకం ముఖంలోకి చూసి) నువ్వెందుకు వాగుతావ్ పోయి

నీ పనులు చూసుకో. (అది అక్కసు అన్న సంగతి ఒక్క కనకానికి మాత్రమే తెలుసు.)

కన : అంత ఉడుక్కుంటావేమి బావా ? (అంటూ లోపలికి వెడుతుంది.)

ప్రసా: నేను మొదట్లో ఒక టనుకున్నాను.

ఆనం: మరొక కండీషనా ?

రాజ: ఏమిట్రా అది (మందలింపుగా)

నీల : ఏమిటి నాయనా అది.

ప్రసా: ఏమై తేనేంలెండి. నే ననుకున్న అభ్యంతరం ఉండిఉంటే నా అభ్యర్థనను మన్నించి ఉండేవారేకాదు.

(లక్ష్మితో ప్రవేశస్తుంది కనకం. లక్ష్మిని ఎదురుగా కుర్చీలో కూర్చోబెడుతుంది. కనకం లోపలికి వెడుతుంది. లక్ష్మి ప్రసాదరావుకు నమస్కరిస్తుంది. ప్రసాదరావు ప్రతి నమస్కారం చేస్తాడు.)

ఆనం: ఇందాకా ఏదో అనుమానం సెలవిస్తున్నారు బావగారూ.

ప్రసా: అదా ! ఇంత అన్యోన్యంగా ఉన్నవారు మీరూ, కనకం....

(అందరూ ఏం చెప్పాలో తోచక నిశ్చేష్టులయ్యారు. ఇంతలో కనకం పైన గుడ్డ కప్పిన పళ్లెంతో ప్రవేశిస్తుంది.)

ఆనం: విన్నావా కనకం ! బావగారి సందేహం ? (ఏమిటన్నట్టు చూసింది) మనం ఇద్దరం ఎందుకు భార్యా భర్తలం కాలేదని ?

కన : అదేమిటన్నగారు వరసలకు అలా అయినా మా ఆనందం బావని పెంచిన ఒడిలోనే మామయ్య నన్నూ పెంచారు. చిన్నతనంనుంచి ఒకచోట పెరిగినవాళ్ళం. ఒకే ఆత్మగా భార్యా భర్తలం ఎలా కాగలం. ఏం బావా ?

ఆనం: (నోటి మాటలేదు.)

ప్రసా: నేను దగ్గరవాళ్ళుకదా అనుకున్నాను.

ఆనం: (Burst అయి) దగ్గరా ! ఎంత దగ్గర - వాళ్ళ నాన్నకు మాకూ ఎంత డగ్గరో ఈ పిల్లకీ మాకూ అంతే దగ్గర, అతగాడు పోయి పాపం, మరో లోకంలో ఉన్నాడులెండి. దగ్గర్లో లేడు.

రాజ: వాడి తలకాయ. బాబూ వీళ్ళిద్దరికీ క్షణం పడదు. కొట్లు కుక్కలు. మా కనకంమాకు ప్రాణానికి ప్రాణం. మమ్మల్నందర్నీ ప్రేమతో సాకి....

ఆనం: అవునవును ప్రేమంటే మా కనకానికీ తెలిసినట్టుగా మరెవ్వరికి తెలీదు. కనకమే ప్రేమ. ప్రేమే కనకం. తల్లీ కనకం. నువ్వు చెప్పవ్మా ప్రేమంటే ఏమిటో ?

కన : ఏమిటి బావా అది ?

ఆనం: ప్రేమంటే ఏమిటి ?

కన : ఏమో నాకు తెలీదు.

ఆనం: పోనీ ఏది ప్రేమకాదో తెలుసా ?

కన : మనల్ని నమ్ముకున్నవారు ఏమైనా సరే ! మన ప్రేములు, మన ఆనందాలూ, మన ఆశయాలూ పట్టుకుని ఊరేగా లనుకోవడం మాత్రం ప్రేమకాదు, బాబాయ్. ఇక మిగతా కార్యక్రమం సాగించడం మంచిది. ఉండండి (లోపలికి వెడుతుంది.)

నీల : అలాగే ! తాంబూలాలు పుచ్చేసుకుందాం.

ప్రసా: అలాగే ! మీరు అడగవలసినవి ఇంకేమైనా ఉన్నాయా ?

రాజ: మరింకేమిటి ? మీపిల్ల మాకు కానుక.

ప్రసా: సరే మీపిల్ల మాకు కానుక.

ఆనం: కానీ నా దొక్క Condition లాంటి కోరిక.

ప్రసా: ఏమిటి ?

ఆనం: అదే నా చెల్లెల్ని చేసుకోవాలనుకునే పెళ్లికొడుకు నా యింట్లో ఇల్లరికముండాలి. ఇది నాకు చిరకాలవాంచ. (కొబ్బరికాయలతో కనకం వచ్చింది.)్ ఈ పిల్ల దూరంకావడం అసలు మా కనకం సహించలేదు.

ప్రసా: ఇది కా స్త ఆలోచించి చెప్పాలి.

ఆనం: Take your own time అప్పుడే తాంబూలాలు పుచ్చుకుందాం! కనకం! లక్ష్మిని లోపలకు తీసుకువెళ్ళు (అందరూ ఆనందం ప్రవ ర్తనకు విస్తుపోతున్నారు. కనకంకూడా! కొద్ది క్షణాల నిశ్శబ్దం తరువాత)

కన : (ఆనందం ప్రవ ర్తనని కప్పిపుచ్చుతూ) ఏమిటయ్యా నీ వేళా కోళం! నువ్వూనూ ?

ఆనం: అబ్బే! వేళాకోళంకాదు బావగారు. ఇంతమంది పెద్దలుండికూడా తప్పనిసరై నేనే పెద్దవాడిలాగా మాట్లాడుతున్నాను క్షమించండి. నా చెల్లెలు సౌభాగ్యం, సుఖంకోరి మీరు ఇల్లరికం ఉండాలని నేను వాంఛిస్తున్నాను. మీ భాషలో బావగారు ఇది కండిషన్ కూడా!

ప్రసా: నా మాటలధోరణి షరతుల్లాగా ధ్వనిస్తే నన్ను....

ఆనం: అబ్బెబ్బే. అదేంకాదు.

రాజ: సరే! ఇక నోర్మయ్ (ప్రసాదరావుతో) బాబూ! ఇల్లరికం మనుకోకుండా మీ రిక్కడే ఉంటేమాత్రం ఏం? ఈ ఊర్లోనే ఉద్యోగంకదా! మీ రెక్కడో ఉండటానికి బదులు వయసు మళ్ళినవాడిని నాకూ చేదోడు వాదోడుగా ఉంటావు. మరి మా ఆనందం ముచ్చటా తీరుతుంది మీరు....

ఆనం: అబ్బే నా ముచ్చటేమీకాదు. మా కనకానికి ముచ్చట. భార్యా భ ర్తల అచ్చట్లు ముచ్చట్లు తీర్చటానికి ఆవిడకు మరింత అవకాశం కలుగుతుంది. మాకు మరొక జత తోడై్త తే!

కన : అవును. అది నాకూ ఇష్టమే. (అక్కడవున్న గ్లాసులూ వగైరాలు తీసుకుని లోపలకు వెళ్లుతుంది.)

నీల : ఇందులో ఇంత ఆలోచించడాని కేముంది ప్రసాదరావు ఇక్కడే ఉంటే నీకు పెద్దదిక్కులేని లోటు తీరుతుంది. ఊ! అనవయ్యా.

ప్రసా: సరే అలాగే కానీయండి.

ఆనం: అబ్బ ఎంత భారంగా అన్నారు బావగారు!

రాజ: వాడి మాట్లకేం బాబూ.

నీల : పెళ్ళిసందడిలో ఒళ్ళు తెలియకుండా వాగేస్తున్నాడు. ఇక మనం నిశ్చయ తాంబూలం పుచ్చుకుందాం,

ప్రసా: అలాగేనండి ముందు మీ అమ్మాయిని భాయపరచుకుంటాను (జేబులోంచి ఒక పెట్టి తీస్తుంటాడు.)

రాజ: ఏమిటి నాయనా ! ఏదో హడావిడి చేస్తున్నావు ?

ప్రసా: ఏమీలేదండి. మా అమ్మ మమ్మల్ని విడిచిపెడుతున్నప్పుడు మా ఇంటిని అలంకరించబోయే ఆడపడుచుకి ఇది అలంకరించాలని కోరింది. ఇహ మానాన్న నన్నువిడిచిపెడుతూ...(కంఠం గాద్గదికం అయింది. తరువాతమాట పూర్తి చెయ్యలేకపోతాడు.) మామ గారూ మా అమ్మని ఆ కవిత కోకిలకంఠాన్ని అలంకరించండి. మీ అమ్మాయి తలిదండ్రులులేని మాకు అమ్మ కావాలని కోరు కుంటున్నాను. (అంటూ ఆ నగని రాజశేఖరం చేతిలో ఉంచు తాడు. అప్పుటికే రాజశేఖరం కళ్ళనీరు నిండింది.)

ఆనం: నాన్నా! మరి మనంకూడా నగ పెట్టొద్దూ—

రాజ: తప్పకుండాను. కాని, అనుకోకుండా ఇప్పటికిప్పుడు.

ప్రసా: మీరేమీ తాపత్రయ పడకండి. నే నైనా ఈ నగ పెట్టగలిగేవాడ్నా. మా అమ్మ ధర్మమా అని యీ పని చెయ్యగలిగాను (ఇప్పటికి కనకం నగ పెట్టడం అయింది)

ఆనం: మేంమాత్రం ? మా అమ్మ ధర్మమా అని — యీ యింటి కోడలికి సాధికారంగా చెందాలని యిచ్చిన నగనే ఇచ్చుకుంటాం ఏంనాన్నా (కనకం ఇటు తిరిగింది రా॥శే॥ నిశ్చేష్టుడయ్యాడు నీలకంఠంకూడా)

కన : అవును మామయ్యా. పెళ్ళిలో పెడదామనుకున్నాము. ఇదిగో (తన మెడలోది తీస్తూ) ఇప్పుడే తన చేతికిచ్చేస్తే తీరిపోతుంది.

ప్రసా: అబ్బెబ్బే యిది బాగోలేదు. మా చెల్లెలికే స్వయంగా ఇద్దురుగాని.

ఆనం: మీకు తెలీదండి బావగారూ! మాకుకాని కనకం మాదగ్గర ఉండడం మంచిదికాదు.

(రాజశేఖరం అమిత వ్యధపడుతున్నాడు కనకంతో) ఏమమ్మా రానంటోందా. నేను సాయంపట్టనా? (నెక్లెస్ వచ్చేసింది. ఆనందం చెయ్యి చాచాక ఆనందానికి ఇవ్వలేదు. నడచివెళ్ళి మామయ్యకి ఇచ్చింది. రా॥ శే॥ ఇతరులకు అర్థంకాని వేదనతో తీసుకుని ప్రసాదం చేతిలో పెడుతూ.)

రాజ: నాయనా ! వాళ్ళ తల్లి ఈ నగనుమించిన గుణంకలది. మాకోడలు మా పిల్లలకు అంతకు మించిన అమ్మ కావాలని భగవంతుడ్ని వేడుకుంటున్నాను. (ప్రసాదరావుకిచ్చాడు.)

ప్రసా: (తీసుకుంటూ) అంత భారమే ?

ఆనం: ఇహ భోజనాలకు లేద్దామా ! నా గుండెలు I mean నా కడుపు మండి పోతోంది. ఆకలితో ....ముందు భోజనం. పదండీ. కనకం! పాపం. నీకు కడుపు నిండినట్టుంది....మమ్మల్ని మాడ్చకు త్వరగా వడ్డించు.

నీల : అవునమ్మా అసలువేళ దాటింది (ప్రసాదరావుతో) లేవయ్యా లక్ష్మి వడ్డన నీ చేతిమీదుగా కానీయమ్మా ఈ రోజు (లక్ష్మి వెళ్ళింది. అంతా లేస్తారు. ముందు రా॥ శే॥, ప్రసాదరావు ఆ వెనుక నీల కంఠం వెడతారు.)

11)

ఆనం: (వెళ్ళబోతూ ఆగి) ఏమిటిలా చూస్తావు. ఇప్పుడు నిన్నేంచెయ్యను. ఇంకా ముందుకుంది.

కన : ఇంట్లో అడుగు పెట్టగానే ; ఆకలి, ఆకలి, వడ్డించుకుంటానన్న పెద్దమనిషివి వెనక్కి- యుండిపోయావేమాని చూస్తున్నాను. రా ; వడ్డిస్తాను. (వెళ్లింది. పైనించి సుందరం వచ్చాడు.)

సుం : (వెళ్ళుతున్న ఆనందంతో) ఒరేయ్ ; బావగారు ;

ఆనం: ఎవరు (అంటూ వెనక్కి- తిరిగాడు. సుందరం కనిపించాడు. చేతులో ఏదో కట్టఉంది.)

యేరోయ్ సుంది ; Very Good మిత్రుడు రావలసిన సమయంలోనే వచ్చావు. కూర్చో. యేవిటిరా ఉత్తరం పత్తరం లేకుండానే.

సుం : Surprise visit (అంటూ కూర్చుంటాడు.)

ఆనం: (తనూ కూర్చుంటూ) ఏమిటిరా చేతిలోది ?

సుం : శుభలేఖలు.

ఆనం: ఏం ? నీకూ పెళ్ళేనా,

సుం : అదేమిటీ ? నీకూ పెళ్ళేనా ఏమిటి ?

ఆనం: అవి నిజంగానే శుభలేఖలేనా ? ఏవిట్రా ?

సుం : ఔను, నిజంగానే ? ఏం ?

ఆనం: చచ్చాం. పో, అయితే నా విషాదగాధ ఇప్పుడు వాయిదా వేస్తున్నాను.

సుం : నీకు విషాదమా.

ఆనం: ఆ నాకే విషాదం. ఔనురా ; నాకే విషాదం. ఏరా నేను అందరి లాగా ఏడి ఆడవారిని నమ్మి మోసపోయిన జాతికి చెందిన మనిషిని కాదనా నీ అభిప్రాయం.

సుం : ఏమయిందిరా నీకు.

ఆనం: అలా నమ్మిన మన జాతికి ఒకటే శాపంరా బ్రదర్. వంచన, అన్యాయం.

సుం : చెప్పరా నాయనా చెప్పు! ఈమధ్య నేనొక నవల వ్రాస్తున్నాను ఇలాంటి ఘట్టాలు వచ్చేసరికి చేయి కదలటంలేదు. హు. చెప్పు.

ఆనం: ఈ యింటిలో కనకం అనే ఒక ఆడది ఉంది చూశావుగా. చిన్న పటినుంచి మేము భార్యా భర్తలమని అందరూ అనుకున్నారు. కనుక నేనూ అనుకున్నాను. ఇలా అనుకుంటున్న పావుశతాబ్దంలో ఎప్పుడూ అభ్యంతరం చెప్పని ఆ ఆడది నాకు మరో సంబంధం చూచిపెట్టింది.

సుం : అదేం?

ఆనం: త్యాగంట! సరేలే ఆ పెళ్ళిపత్రిక చూపించరా (అంటూ కట్ట తీసుకొని విప్పబోతాడు.)

సుం : ఆగాగు. ఏమిటా తొందర. (అని తిరిగి లాక్కొంటాడు.)

ఆనం: ఏం? పెళ్లికూతురెవరు.

సుం : నీ చెల్లెలు.

ఆనం: ఔను, మరి. నీకంటె పెద్దవాణ్ని నాకు నీ భార్య చెల్లెలు కాక పోతే అక్క అవుతుందేమిటి. చూపించరా బడాయి.

సుం : మీ నాన్నగారెక్కడ

ఆనం: భోంచేస్తున్నారు. నీవు భోంచేశావా?

సుం : ఆయన్నికూడా రాని! వచ్చాక అందరికీ ఒక్కటేమాటే!—

కన : (వస్తూ) బావా! నీకోసం కాచుకు కూర్చున్నారు. అంతా! ఒహో! సుందరంగారా? ఎప్పుడొచ్చారు?

సుం : మీరు మావాడికేదో ద్రోహం చేశారుట. (చిన్న నవ్వు)

ఆనం: వొరే సుంది! నీవు నాతరపునేమీ! వకాలతా పుచ్చుకోనక్కరలేదు.

(నిశ్శబ్దం)

ఆనం: నీవు భోంచేశావా లేదా? నే వెళుతున్నాను.

కన : మీ దగ్గర వాపోతున్నాడా బావా! (ఆనందం వెళుతున్నవాడు ఆగాడు) నిజమేనండి నాకు యిష్టంలేనిపని నే నెలా చేయగలను.

సుం : అదేమిటండీ ! చిన్నప్పటినుండి మీ రొకరికొకరు కావాలనికదా! అందరూ అనుకొంటోంది. ఇంతలోనే అంత అనురాగాన్ని తెంచేసుకోవటం బాధగాఉంటుంది.

ఆనం: (గిరుక్కున తిరిగాడు) ఒరేయ్ ! ఎవరికిరా అనురాగం ! ఎవరికిరా బాధ ! నేను నీతో అన్నానా ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నానని. కాక ఆమె నీతో అందా నన్ను ప్రేమిస్తున్నానని. మే మొకరి కొకరం కాంట్రాక్టు రాసుకున్నామా భార్యాభర్త లవుతామని, ఒకవేళ మనస్సులో అనుకుంటేమాత్రం పత్రాలేవి, అనుకున్నదేది?

సుం : ఒరేయ్ ఆవేశ పడకు కొంచెం నిదానించు. నన్ను మాట్లాడని. కనకంగారు. మీ రలా కూర్చోండి. (కూర్చుంటుంది) ఏం జరిగిందండి. మీరు నిజంగా అనందాన్ని ప్రేమించలేదా ?

కన : అయితేమాత్రం. ఒక్క విషయం వినండి. మా లక్ష్మికి ఎన్ని సంబంధాలు కాకుండా పోయాయో మీకు తెలియంది కాదు. అలాంటిది భగవంతుడు దయవల్ల ఒక సహృదయుడు బంగారం లాంటి తన చెల్లెల్ని ఈ యింటి కోడలిగా చేసుకునే షరతు మీద, మా లక్ష్మిని చేసుకుంటానని వస్తే ఇతనేమో తన ప్రేమే వర్ధిల్లాలని, ఇతర జీవితాలు తనకేమీ కావని మొండికెత్తుతాడుట. మందలించినవారు రాక్షసులూ పాషాణాలు.

సుం : ఏవిటి మీ లక్ష్మికి సంబందం ఖాయమైపోయిందా ?

ఆనం: ఆ ఈవిడే పనిగట్టుకొని ఖాయం చేసింది.

సుం : ఏవండి ఎందుకలా చేశారు ?

ఆనం: ఆ ప్రశ్నే నేను వేస్తే ?

కన : నా కిష్టంలే దన్నాను.

ఆనం: (సుందరంతో) విన్నావా ? (కనకంతో) నీ కిష్టంలేకపోతే నన్ను చేసుకోను పొమ్మను. అంతే. మధ్య నా పెళ్ళి సంబంధం మరొక రితో నిశ్చయంచేసే చొరవ నీ కెవరిచ్చారు. నీకు నచ్చకపోతే పో. వెళ్ళి బంగాళాఖాతంలో గెంతెయ్యి. కాని నా తరపున

మాటాడే అధికారం నీ కెవ్వడిచ్చాడు, ఆ ధైర్యమేమిటి ?
(సుందరంతో) ఏరా ?

కన : నీకు నీ సుఖమే కావల్సింది. నాకలాకాదు. నాకు కొన్ని బాధ్యతలున్నాయి. ఈ సంబంధం కాకపోతే నీ తండ్రి ఏమౌతాడో నీకు తెలియదా ?

ఆనం: నువ్వెవర్తివే ? ఈ ఇంటి వ్యవహారాల్లో నీకు జోక్యమేమిటి, మా పంచన జేరిన దిక్కులేని ఒక పక్షివి. — మా కుటుంబ విషయాల్లో జోక్యం చేసుకుంటావా ?

సుం: నువ్వాగు ఆనందం. ఇంతకూ ఈ సంబంధాలు నిశ్చయమైపోయినట్టేనా ?

ఆనం: నిక్షేపంగా ! పెళ్లికుమారుడు లోపల భోంచేస్తున్నాడు. ఉండు చూదువుగాని.

(నెమ్మదిగా, అప్రయత్నంగా, టేబిలుమీద శుభలేఖలుతీసి జేబులో పెట్టుకోబోతాడు.)

ఆనం: అదేమిటి ? దాచేసుకుంటున్నావు ? చూపించరా ?

సుం: ఏంలేదు ఏంలేదు. (తత్తరపడుతూ)

ఆనం: ఇలాగియ్యరా ! (విసురుగా లాక్కుంటాడు.)

సుం: చూడకు — Please !

ఆనం: సిగ్గుమాలినవాళ్ళదగ్గర ఎందుకురా అంతసిగ్గు (అప్పటికి విప్పాడు) (చదివాడు మొఖం వివర్ణమైంది. మళ్ళీ చదివాడు) ఏఁవిటిది ?

సుం: పొరపాటయ్యింది. ఇక్కడ లక్ష్మికి సంబంధం ఇంత త్వరలో స్థిరపడి పోతుందనుకోలేదు.

ఆనం: కనకం. శుభలేఖ.... (చూపిస్తాడు. ఆమె చదువుతుంది.) కొన్ని గంటలు ఓపికపట్టిఉంటే నువ్వు నా భార్యవి. లక్ష్మి మా సుందరానికి భార్య. కాని మీ ఇద్దరికీ ఆ అదృష్టంలేదు.

కన : ఇదేమటండీ. ఇక్కడ మా మామయ్యతో సంప్రదించకుండానే.

సుం: పొరపాటేనండి. రాజశేఖరంగారి తాపత్రయం విని మా నాన్నగారు ఇక్కడివారిని ఆనందంతో ఆశ్చర్యపరచడానికి ఏకంగా శుభలేఖలు వేయించుకు వెళ్ళమన్నారు. అందుకని....

ఆనం: ఏం. కనకం? కొంచెం నువ్వు లెంపలు వేసుకో. అంతా సర్దుకుంటుంది. ఈ శుభలేఖలు చూపించి, ప్రసావరావుని అతని త్రోవన అతన్ని పొమ్మందాం....

కన : అంత నీతిలేని మాటలు మాట్లాడకు. తాంబూలాలు పుచ్చుకుని మాట తప్పటమా?

ఆనం: తాంబూలాలు పుచ్చుకోకముందై తేమాత్రం? నువ్వు నా పాదాలునెత్తిన పెట్టుకుని ప్రార్థించినా నిన్ను చేసుకుంటానా Iam very sorry

సుం: సరే దానికేం? ఎలాగో అంతా సవ్యంగా జరిగిపోతేచాలు. కాని కనకంగారు, మీరు చాలా సహృదయంతో చేసిన త్యాగం ఎలా పరిణమిస్తుందో నా కనుమానమే!

కన : (మౌనం)

ఆనం: (విసురుగా లోపలకు వెళ్ళిపోతాడు.)

సుం: (లేస్తూ) వారి భోజనా లయ్యేలోగా నేను వెళ్ళిపోవడం మంచిది. వారిని కలుసుకుంటే బోలెడంత అబద్ధాలతో ప్రసంగాలు జరుప వలసి వస్తుంది. పెళ్ళికొడుకు సమక్షంలో (లోపలనుంచి "అమ్మా కనకం" అన్నకేక వినిపిస్తుంది.)

కన : (లేచి) ఔను మీరిప్పుడు వెళ్ళిపోవడమే మంచిది. మరోలా అనుకోకండి.

సుం: ఫరవాలేదులెండి.

కన : అన్నిటికన్నా మీతో సంబంధం తప్పిపోయినందుకు కించపడుతున్నాను.

సుం: పెళ్ళి జరిగితేనే సంబంధం అయినట్టా? నా విచారమల్లా మీ గురించి ("అమ్మా కనకం" అని కేక లోనుండి మళ్ళీ వినిపిస్తుంది.)

అరె ! వాళ్ళు వస్తున్నట్టున్నారు. మరి నేను వెడతానండి.
(గుమ్మంవరకూ వెళ్ళి)

సుం: మరి వస్తానండి. (కనకం ఏం చేస్తున్నావమ్మా ! రావమ్మా అని మరో పిలుపు.) సుందరం ఆ ఖంగారులో శుభలేఖలు వదిలి వెళ్ళి పోతాడు.)

కన : వస్తున్నా. (వెళ్ళబోయి శుభలేఖల్ని గమనించింది. వెళ్ళిపోయిన సుందరాన్ని పిలవడానికి వెళ్ళబోయింది. మళ్లా ఎందు కనుకుంది. శుభలేఖలతోనే లోపలకు వెళ్లింది.)

—: తెర :—

మూడవ రంగం

(కనకం సోఫాలో దిగులుగా కూర్చుంది. మూగలక్ష్మి ఏడుస్తూ వచ్చి కనకం వడిలో వాలిపోయింది)

కన : (ముఖం జేవురించింది) కొట్టాడా అన్నయ్య ?

లక్ష్మి: (జవాబుగా ఏడ్చింది) (ఎడమచెంపపై కి వచ్చేలా పడింది.)

కన : (కంటినీరుతో) మూగ మనసును కొట్టాడా ? మా నాన్న గారాబాల పట్టిని కొట్టాడా ! మనిషా ? పశువా ? (ముఖం వికృతం అయింది) (ఏదో నిశ్చయంతో లేచి వెళ్ళబోయింది.)

లక్ష్మి: (కనకం చెయ్యి తీసుకుని ఏదో వ్రాస్తుంది.) (లక్ష్మిని కూచోబెట్టి లేచింది.)

కన : (చదివి) అడిగితే.

లక్ష్మి: (మళ్ళీ వ్రాసింది.)

కన : (వ్రాస్తుండగా చదివింది.) "నోటితో చెబితే నీకు తెలియదు" మీ అన్న పార్వతిని హాస్పటల్‌లో ఇలా ఆదరించాడు అని చెంప ఛెళ్ళుమనిపించాడా. (ముఖంలో అసహ్యం జుగుప్స ఆవరించింది.) సరే నువెళ్ళమ్మా. దీనికంతకి కారణం నేను (లక్ష్మి బేలగా చూస్తుంది) ఛ! నేనేం చేసుకోనమ్మా! చివరికి మీ నాన్నలాగ ఏడవడంకూడా చేతకాదే ! నువ్వు లోపలకు వెళ్ళు. ఒంటరిగా కూర్చుని ఏడుస్తాను అంతే.

(లోపలికి దిగబెట్టింది.)

(ఆనందం బయటనుంచి లోపలకు వచ్చాడు.)

కన : బావా !

ఆనం: ఇప్పుడు భోజనం చెయ్యను (1, 2 అడుగులు వెయ్యగానే.)

కన : ఇక్కడ తినడం మానేసి చాలా రోజులయిందిలే ; ఆ విషయం కాదు, మీ బావ లక్ష్మిని కొట్టాడు. (సోఫావెనక ఆగింది.)

ఆనం: సంతోషం. (మళ్లా ఒక అడుగు వేశాడు.)

కన : నామీద పగతీర్చుకొనేందుకేనా యీ కొట్టుకోడాలు?

ఆనం: తల్లీ తండ్రీలేక, దిక్కుమాలినదానివి; తిండికి మా పంచన చేరినదానివి, నీమీద నాకంత గౌరవంలేదు.

కన: ఈ ఇంట్లో నే నెవర్తినో నాకు తెలుసులే. చదువుకున్నవాడివి, నీకు నేను చెప్పవలసినదాన్ని కాదు. నీ నిర్లక్ష్యంతో పార్వతి Hospital పాలైంది. అది చాలక దానిమీద చెయ్యి చేసుకుంటావే? నీకేమైనా మతిపోయిందా?

ఆనం: కనకం! (అరచి) నోర్ముయ్! నీ అర్హతలు దాటి మాట్లాడకు చెబుతున్నాను. నాకు మతిపోవడమేకాదు. నాలో పశుత్వంకూడా ఆవహించిందని హెచ్చరిస్తున్నాను.

కన : బావా!

ఆనం: అవును. ఈ పిరికిదేశంలో ప్రాణాలు తియ్యడం ఒక నేరం అయింది. కాని రక్తంరాని రంపపు కోతలకు శిక్షలేదు.

కన : ఎందుకులేదు బావా! నన్ను కొట్టు, చంపు, చిత్రహింస చెయ్యి. కాని ఆ అమాయకురాలు—

ఆనం: నిన్నా! కొట్టడమా? ఎవర్తివి నువ్వు? నాకేం కావలని నిన్ను శిక్షించాలి? నిన్ను శిక్షించినా దాన్ని చేసుకోనా? నన్ను ప్రేమించని దానివి, దిక్కులేక మా పంచన చేరినదానివి, పరాయిదానివి - నిన్ను శిక్షిస్తే ఊరుకుంటావా? అది—ఇప్పుడు కొట్టానే అది నా భార్య - చావగొట్టినా నోరు మూసుకు పడుండేది. అది అనవలసిన

మాటలు నీ నోట రాకూడదు. ఆ అర్హతలు నువ్వు పుచ్చుకుంటే అది మానసిక వ్యభిచారమే అవుతుంది. జాగ్రత్త.

(వెళ్ళబోతాడు)

కన : ఆగు। నే చెప్పేది విను. ఈ మాటలు నీ మనసు పలుకుతున్నవి కావు. నాకు తెలుసు. నామీద కక్షతో యిలా ప్రవర్తిస్తున్నావు. కాని యీ శిక్ష నాకేకాదు. యీ ఇంటి నంతటినీ దహించివేస్తుంది. ఇది నీకు న్యాయంకాదు. (ముందుకొచ్చి చేతులు రెండు పట్టుకొని ఏడ్చింది. కాళ్ళమీద వాలింది.)

ఆనం: (చాలా నిశ్చలంగా) లే

కన : (లేచింది.)

ఆనం: ఏడుపు మానెయ్యి.

కన : (ఇంకా ఏడుస్తుంది.)

ఆనం: (గదమాయించాడు.) హూా!

కన : (మానింది.)

ఆనం: అలా కూర్చో.

కన : (కూర్చుంది.)

ఆనం: నే చెప్పేది విను. వ్యర్థప్రసంగాలు చేయకు.

కన : (మౌనం)

ఆనం: మన బ్రతుకులు మరోవిధంగా జరిగాయనుకో. అంటే నువ్వుచేసిన యీ ఘనమైన త్యాగం నేను చేశాననుకో. అర్థంకాలే? ఒక జీవి తాన్ని ఉద్ధరించడానికి నీ మనోభీష్టాన్ని ఇనపముళ్ళ రంపంతో రక్తాలు చిమ్మినట్లు చెరపి — నిన్ను ఒకరి చేతుల్లోపెట్టి పెళ్ళి జరిపించి త్యాగం పేరిట ఒక ప్రాణాన్ని ఉద్ధరించాననుకో ఇప్పుడు నువ్వు చేసినట్లు— Rear లో అడుగు పెట్టబోయి తిరిగి—

కన : (మాట్లాడబోయింది.)

ఆనం: మాట్లాడకు. నా ఆవేశానికి, ఉధృతమైన ఆవేదనకు అడ్డురాకు. ఇందాక చెప్పాను. నేను పశువుని మనిషినికాదు.

(రాజశేఖరం ఒకవైపు, లక్ష్మి ఒకవైపు వచ్చారు. ఆనందం కనకం చూడలేదు.)

అలా జీవితాన్ని దగ్ధం చేసుకున్నాననుకో నువ్వుచేసుకున్నట్టు అలా మాడి మ్రోడైన నన్ను కళ్ళముందు పెట్టుకుని నీవు నీ భర్తతో నువ్వు కులగ్గలవే? ఎంత హీనంగా ప్రేమించినా—అంటే ఒక ప్పుడు నువ్వన్నావే—పంజరంలో చిలకలాగా, కాలిసున్న చెప్పు లాగా ప్రేమించినా—యీ నా జీవితం చిగురించాలని అనుకోవూ. అలాగ అనుకోకపోతే నువ్వు హృదయంగల మనిషి వనిపించు కుంటావా? నీలాంటి హృదయంగల ఏ మనిషి నీ లాంటి మోడుని కళ్ళ ముందుంచుకుని తన జీవితాన్ని సంతోషంగా సాగించగలడు?

కన : అయితే!

ఆనం: నేను చెప్పవలసింది పూర్తికాలేదు. నీకు పెళ్ళక్కర్లేదూ నాకు సంసారాలు కావాలి. నిన్ను నువ్వు దహించుకుంటావు. నిన్ను కాలుస్తున్న ఆ సెగలమాటున మే మంతా చలి కాచుకుంటామూ, నువ్వు చరిత్రలో చరితార్థంగా నిలచిపోతావూ, మేమంతా కసాయి వాళ్లల్లాగా, పశుప్రాయులుగా నిందల పాలయిపోతాము. అంతే నేను చెప్పవలసింది.

కన : అయితే ఈ పాపానికంతటికి నేనే కారణమంటావ్.

ఆనం: చెప్పు — నేను వినవలసిందేమీలేదు. నీలో మార్పు రాకపోతే నాలోనూ మార్పు రాదు. నన్ను నేను దహించుకుంటాను. అడ్డం వచ్చినవారి నందర్నీ దహిస్తాను.

కన : ఛీ! (ఏడుస్తూ వెళ్ళిపోయింది.)

(ఆనందం నిజానికి ఈ మాటలు అనాలని అనలేదు. కష్ట కొద్దీ ఈ మాటలన్నీ విసిరాడు. ఇంకో విధంగా మాట్లాడలేక పోయాడు. ఇప్పుడు ఒక్కడైనాడు బావురుమని ఏడ్చి కుర్చీలో కూర్చున్నాడు. (లక్ష్మి అన్నను సమీపించింది, చేతుల్తో ముఖం కప్పుకున్న అన్నను తాకింది. తలెత్తాడు. ఒక చెంప ఎర్రబారిన చెల్లెలు కనిపించింది.)

ఆనం: ఆ కొట్టింది అతనుకాదమ్మా! నేను. నీపట్ల, నాన్నపట్ల, అందరి పట్ల ఎందుకిలా ఐపోతున్నానో అర్థంకాదు. నేను కిరాతకుడ్ని, నాకు చావురాదు. (కళ్ళు మూసుకున్నాడు.)

లక్ష్మి: (ఏదో వ్రాసి అందించింది.)

ఆనం: (చదివి) నిజమే. ఆ అమాయకురాల్ని నా ఆవేదనకు బలి చెయ్యడం తప్పే. కాని—కాని—కాని ఎలా! మనం ప్రతి క్షణం ఆ కుటుంబానికి ఋణపడి ఉన్నాం. చిన్నతనంనుంచి నాలో పెంచుకున్న అభిమానాన్ని నిర్లక్ష్యంచేసి ఆనందాన్ని దూరం చేసుకున్న కనకంముందు మరో స్త్రీని ఆదరించడం నా వశంకాదు, అది ఒక ఇంటిది కావాలి. దానిసుఖం ఈ కళ్ళతో చూడాలి. అప్పుడు కాని నేను మనిషిని కాలేను. (లేచి లోపలకు వెళ్ళబోతున్నాడు.)

లక్ష్మి: (లేవబోతున్న అన్న చేతిమీద ఏదో వ్రాసింది. ఆనందం ఏదో చెప్పబోతాడు. అంతలో కనకం వచ్చింది. చటుక్కున భావం మార్చుకుని)

ఆనం: హు! కనకంమీద ఒట్టు వేస్తే ప్రాణాలుకూడా తీసుకోవడానికి సిద్ధపడే ఆ ఆనందం చచ్చిపోయాడమ్మా! నువ్వు తినమంటే తింటాను.

(లేచి ఇద్దరూ లోపలకు వెళ్లారు.)

(కనకం పురుషోత్తం పఠంముందు నిల్చుంది. రాజశేఖరం వచ్చాడు.)

కన : పెళ్ళి, పెళ్ళి, పెళ్ళి. ఎవరినోటవిన్నా పెళ్ళే. ఈ ముసలాయన్ను ఈనరకంలో వదలి ఎలా వెళ్లమంటావు నాన్నా. ఇన్ని చిక్కులు నా నెత్తిన పడుతుంటే ఏం పట్టనట్టు చూస్తూ ఊరుకుంటావు ?

రాజ: అతగాడు ఏం తొందరలో ఉన్నాడో ఏమో నీ సంగతే పట్టించుకోలేదు. నే నొక్కమాట పైకెళ్ళి నీ మాట గుర్తుచేస్తానమ్మా.

కన: మామయ్య!

రాజ: ఔనమ్మా! నా బ్రతుకే నీకు ఆటంకమైతే, నేనే నీ పెళ్ళికి అభ్యంతరమైతే ఈ క్షణాన్న తొలగిపోతానమ్మా. క్షణంలోనో, సగంలోనో రాలిపోవాల్సిన పండుని, నిజంగా నేనే నీకు అడ్డమైతే.... నిజంగా నేనే.....

కన: నువ్వేమో నా విషయమే ఆలోచించకుండా చస్తాన్, చస్తానంటావ్ నేనేమో ఈ సుడిగుండంలో చిక్కుకున్న నీ కోసం కేవలం నీ కోసమే బ్రతికున్నానిన్నాళ్ళు.

రాజ: లోకమంతా వ్యాపించిన వెలుగునిచూసి ఆనందిస్తాం. ఆ వెలుగులో లోకాన్నంతటినీ చూడగలుగుతాం. కాని కిరణాలు వాడిగా కన్నుల్లో గుచ్చుకుంటున్నప్పుడు తప్పని సరిగా కళ్ళు మూసుకుంటాం. అలాగే ఉధృతమైన నీ త్యాగ విద్యుత్తుకి తట్టుకోలేక కన్ను మూస్తానంటున్నాను.

కన: పోనీ ఈ దీపాన్ని ఆరిపేసుకో మామయ్యా!

రాజ: అమ్మా కనకం! అంతమాటనకమ్మా

కన: అవును! నే నంత దుర్భరమనిపిస్తే మరో గత్యంతరం ఏముంది?

(ఆనందం వంటింటినుంచి తన గదిలోకి వెడుతున్నాడు.)

రాజ: అమృతాన్ని కురిపించే పలుకులూ ముక్కలు ముక్కలుగా తెగ్గోసే ములుకులూ వస్తాయి నీ నోటినుంచి. నీతోమాట్లాడ్డం నా తరం కాదు వెళ్ళమ్మా.

ఆనం: (ఆగి) వెళ్ళమ్మా వెళ్ళు (వెక్కిరించినట్లు) - మాటల్తో బెదర గొట్టి నిన్ను దూరం చేమకుంటే మా యింట్లో చాకిరీచేసే గొడ్డుం డొద్దూ!

రాజ: ఆనందం. (అరిచేడు)

ఆనం: ఏం! ఆగారేం? అరవండి. కేకలెయ్యండి! మేం దూరమైతే మీకు నష్టమేమిటి? కాని ఆ చాకిరీచేసేది, దూరమైతే మీకు దక్షిత కరువై పోతుందే!

కన: ఇదిగో బావా! నువ్వు నోరుమూసుకుని దయచేసి Hospital కు వెళ్ళవయ్యా బాబూ!

ఆనం: (కనకంతో) ఛ నువ్వు నాతో మాట్లాడకు.

కన: మాట్లాడకపోతే ఎట్లా? ఇవాళ నా కింట్లో బోలెడుపనుంది. నీ పెళ్ళా నికి కేరియరు ఎవరు తీసుకు వెడతారు?

ఆనం: పెళ్ళాం పెళ్ళాం అని పదిమార్లంటే పరుగుచ్చుకు వెడతానను కుంటున్నావా!

రాజ: ఏం పెళ్ళాన్ని పెళ్ళాం అనర్రా!

ఆనం: పెళ్ళిళ్లూ, పెళ్ళాల మాటసలు మీరు మాట్లాడకండి నాన్నా, ఇతరులు దాశ్యంమీద జీవితాన్ని గడుపుకునే మీకు ఆ అర్హతలేదు! క్షమిం చండి!

(లక్ష్మి వెడుతుంటుంది.)

ఆనం: (ఆపి) నిన్ను! రేపియోవాళ్లు ఒకమాట తీసుకురమ్మనమన్నారే నాకు తీరికలేదు.

లక్ష్మి: (మౌనంతో ఆగి లోపలకు వెళ్ళిపోయింది.)

కన: దాని మెగుడు దాన్ని ఎక్కడకు వెళ్ళద్దన్నాడు.

ఆనం: ఆహా! నాకు పాఠం నేర్పాలని కాబోలు.

రాజ: ఆ ఊరికి ఈ ఊరెంతదూరమో ఈ ఊరికావూరూ అంతేదూరం ప్రసాదానికి ఎక్కడ కీ యిస్తే యంత్రం సరిగ్గా నడుస్తుందో తెలుసు.

ఆనం: ఆహా! అయితే ఆ కీ ఏదో మీకేవ్వవలసింది. ఈ భీభత్సానికంతకూ మీరుకదూ కారణం.

కన: మధ్యలో మామయ్యమీద పడతావెందుకూ! నీ భార్యను సరిగ్గా చూసు కోవడం చేతకాదుగాని—

ఆనం: నా విలాసాలు తీరితే చాలను కోవడానికి నేనేం నాన్నను కాదు!

కన: బావా!

ఆనం: పురుషోత్తాన్ని ముప్పొద్దులూ పూజిస్తారు కాని, పురుషోత్తం కూతురుకి బ్రతుకక్కరలేదు. యీయన పిల్లల బ్రతుకులు పుచ్చ పువ్వులుకావాలి.

రాజ: (ఉద్రేకంతో నిండిన ఏడుపుతో) చంపరా! నన్ను చంపు! ఎందు కురాఅంతలేసి మాటలంటావు.

ఆనం: నే నెందుకు చంపడం రక్తంరాని రంపపు కోతల్తో ప్రాణాలుతీసే రంపరాకాసి మనింట్లో ఉండగా దానికి తాళంవేసే మీరు!

రాజ: అదికాదునాయనా! చెప్పి చెప్పి నా నోరు పడిపోయింది. కాని అది నా మాటవినకుండా ఉంది నేనేం చెయ్యను?

ఆనం: మాట్లాడకుండా ఊరుకుంటారు అందుకని. మీ కూతురే పెళ్ళొద్దని మొరాయింస్తుదనుకోండి. ఏం జేస్తారు? దండించరూ? బలవంతాన ముడి వేయించరూ!

రాజ: (Silence)

ఆనం: ఆ బాధ్యత కనకంపట్లకూడా నిర్వర్తించాలనుకొంటే ప్రతి ఉదయం మీ స్నేహితుడి మూర్తిముందు శ్రద్ధాంజలి నిర్భయంగా ఘటించా

అనుకొంటే ఆ Guilty concious తో దగ్ధం కాకూడదను కుంటే మీ ఏర్పాట్లు మీరు కానివ్వండి. నేను దాన్ని పెళ్ళి పందిట్లోకి తీసుకొస్తాను.

కన: (తలెత్తి చూసింది)

ఆనం: రానంటే యీడ్చుకొస్తాను.

రాజ: ఆనందం!

ఆనం: జుట్టుపట్టి ఈడ్చుకొస్తాను.

రాజ: (మౌనం)

ఆనం: ఏమంటారు (Gap) ఆ! ఎలా చేస్తారు. ఈ భాధ్యతలకంటే ముఖ్యమైన అవసర మొకటుంది. ఇంత వయస్సు వచ్చినా మీకు నీళ్ళు పోసి, తలదువ్వి, బువ్వపెట్టి నిద్రపుచ్చే ఓపికలు మా కుండవుగా!

కన: సంతోషించాంగాని. ఇహ ఊరుకో! నా ఏర్పాట్లు నే చేసుకోగలను. లక్ష్మి నీ ధర్మమా అని తన మొగుడు చెయ్యి చేసుకున్నందుకు కుమిలిపోతుంది. ఇహ నీ వాగ్ధాటిగూడ తోడైతే మీ ఆవిడ పక్కకే చేర్చాలి దాన్నికూడా!

ఆనం: నీ శ్లేషలు నాకు తెలుసు కనకం. పార్వతి పక్కన దాన్ని చేరుస్తారా? అతగాడు పిల్లని అంటగట్టే అవసరంకోసం బ్రతిమాలి చేసుకున్న మన లక్ష్మిని గతిమాలి కొంపచేరినదాన్ని ఒకప్రక్కన ఎలా చేరుస్తారు?

(ప్రసాదం వచ్చాడు. అంతా నిశ్శబ్దం అయ్యింది. ప్రసాదరావు మౌనంగానే ఉన్నాడు. కాని వాదాన్ని ఇతరులనుంచి ఎదురు చూస్తున్నాడు. ఎవరు మాట్లాడతారు-ఇక కనకం పట్టలేక)

కన: Hospital నుంచా అన్నయ్యా? ఇదిగో నేను బయల్దేరదామనుకుంటున్నాను కేరియర్‌తో!

ప్రసా: ఆహా! ఆ విషయాలేమిటి మాట్లాడుకుంటున్నారు, గంభీరంగా (రాజశేఖరంతో) ఏమండీ!

రాజ: ఆ: ఆ! అవున్నాయనా! (మాటమార్చి) ఆ! చూడు ఆనందం! నువ్వెళ్ళి ఆ పని చూడు.

ప్రసా: ఏ పని! తన భార్యను ఈడ్చికొట్టడమా?

కన: నువ్వులే అన్నయ్యా! వడ్డించేస్తాను.

ప్రసా: ఒడ్డించే అమ్మా! గొప్ప ఆకలేస్తోంది. (వంటింట్లోకి వెళ్ళ బోయాడు)

ఆనం: మీరు మాత్రం తూరుకున్నారా! మీ ఆవిడ్ని మాత్రం చచ్చేటట్టు కోట్టలేమా!

ప్రసా: ఏమిటీ! కొడితేనే చచ్చిపోతుందా! మీ చెల్లెలు. అంతమాత్రాన చస్తుందా! Hospital ward లో పడేసిన మా చెల్లేలే కొడితే చచ్చిపోలేదే. ఇంట్లో Dunlop spring cot మీద శయనిస్తున్న మీ చెల్లెలు అంతమాత్రన ఛస్తుందా!

కన: నువ్వు పదన్నయ్యా! అతనేదో హాస్యాని కన్నాడులే.

ప్రసా: (నవ్వుతూ) నేను నిజంగానే అంటున్నానమ్మా. అంతమాత్రానికే చస్తుందా! నువ్వు పదమ్మా (కనకం బయల్దేరింది. వెనకే ఒక అడుగువేసి ఆగి) ఆ! బావగారూ! ఇందాక ఏదో మతి గితి అంటు న్నారు. (కనకం ఆగింది ప్రసాదాన్ని అక్కడ్నుంచి తొలిగించడం కోసం)

కన: ఇకనువ్వురావా ఏమిటన్నయ్యా? నీకు మతిపోతోందా ఏమిటి?

ప్రసా: (కనకంతో) ఆ గదిలో తువ్వాలుంది తీసికురా అమ్మా!

(కనకం ప్రక్కగదిలోకి వెళ్తుంది)

ప్రసా: నిప్పులాంటి అశాంతిని గుట్టుగా గుప్పెట్లో దాచే ప్రయత్నం చెయ్యకండి. నిర్భయంగా ప్రవర్తించండి. నా చెల్లెలు మీకిష్టం లేదు. అదేదో చెప్పండి. ఉన్నపాళాన పుస్తె ముక్కలుచేసి బొట్టు

కడిగేసి చచ్చాడు, పదిరోజు లేడవమని తరువాత దాని బ్రతుకు నేను నడిపిస్తాను. (భయంతో లక్ష్మి దగ్గరయ్యింది. లక్ష్మితో అభినయంతో) కనకాన్ని తువ్వాలు తెమ్మను. (కదలడాని కిష్టం లేకపోయినా కదిలి వెళ్ళింది.) నా చెల్లెల్ని ధర్మానికి కట్టుకున్నట్లు ప్రవర్తించకండి. ఇన్నాళ్ళూ నే ననలేదు. ఇప్పుడు చెబుతున్నాను. అవిటిపిల్లని ఆదర్శంగా కట్టుకున్నది నేను. అవసరానికి చేసుకుని చిత్రహింస చేస్తున్నది మీరు. (తువ్వాలుతో కనకం వెనక లక్ష్మి ప్రవేశిస్తారు.) కొత్త అణకువగా మెలగండి. (ఆడవాళ్ళతో) దాన్ని నీళ్ళ తొట్టెదగ్గరుంచమ్మా వస్తున్నాను. (కనకం లక్ష్మిని వెళ్ళమని సైగ చేస్తుంది. కాని కదలదు. కనకం సైగతో గదమాయించి లక్ష్మిని పంపుతుంది.) (లక్ష్మి Towelతో లోపలకు వెళుతుంది బయటనుంచి నీలకంఠం వచ్చాడు.) మర్యాదగా నా చెల్లెలి కోడరికాన్ని గౌరవించడం నేర్చుకోండి. లేకపోతే ఎలాంటి దుష్పలితాలకైనా మీరు సిద్ధం కావాలి. నేను ఇల్లరికపు టల్లుడ్ని కాను. (విసురుగా నిష్క్రమించాడు.) విషయం అర్థం కాక నీలకంఠం ప్రశ్న చూపుల్ని చూస్తున్నాడు. రాజశేఖరం దుఃఖాన్ని గరళకంఠుడిలాగా గొంతులో ఇరికించుకూర్చున్నాడు, ఆనందం ఆలోచనల్తో బాగా Down Stageలో ఉన్నాడు. కనకం కూడా అక్కడే ఉంది. మొత్తంమీద వాతావరణం తిమిరావృతమైన గుహాంతర్భాగంలో నిశ్శబ్దవ్రస్తత భయంకరంగా ఉంది.)

నీల : ఏమిటయ్యా! శేఖరం ఆ మాట్లాడేది ప్రసాదరావేనా!

రాజ: ఇస్! ఇప్పుడేం మాట్లాడకు (దుఃఖం ఆగటంలేదు.) అతను వస్తాడు. (అంతా నిశ్శబ్దం) (ఈ మారు అందరిచూపులు అతని రాకను నిరీక్షిస్తున్నాయి.) (ప్రసాదరావు వచ్చాడు. అంతకు పూర్వం ఏమీ జరగనట్లున్నాడు. అతని వెనకే లక్ష్మికూడా ఉంది. సరాసరి తన గదిలోనికి వెళ్ళాడు. లక్ష్మి కనకంతో ప్రసాదరావు భోజనం చెయ్యలేదని సౌంజ్ఞ చేసింది. కోటు వేసుకొని తన గదిలోనుంచి బయటకు వచ్చాడు.)

ప్రసా: కనకం! కేరియర్ సిద్ధం అయ్యింది కాబోలు, ఇలాఇవ్వు Hospitalలో ఇచ్చి అటు ఆఫీసుకు వెడతాను.

కన : ఎందుకు నే వెడుతున్నాలే. నువ్వు భోజనం చెయ్యలేదేం అన్నయ్యా ?

ప్రసా: Time లేదమ్మా పది నిమిషాల్లో Officeలో వాలాలి.

కన : ఎన్నాళ్ళయిందన్నయ్యా నువ్విక్కడ భోజనంచేసి ?

ప్రసా: ఏదమ్మా వారం రోజులాయె కాంపులో ఉన్నానా ?

కన : అన్నయ్యా ! మూట ! (కళ్ళనీరు తిరుగుతోంది.) ఇక్కడ నేను దిక్కులేనిదాన్ని. నువ్వు అల్లుడివి కావడం ఇక్కడివాళ్ళకు ఏమీ కాకపోవచ్చు. కాని నాకుమాత్రం నువ్వు వరప్రసాదానివి. కాని - కాని (మాటలు రావడంలేదు.) నీలోకూడ మంచితనాన్ని భగవంతుడు తొలగించదలచుకుంటే అది నాదురదృష్టం అన్నయ్యా.)

ప్రసా: ఏడుస్తున్నావా ! (తన జేబు రుమాలుతో తుడిచాడు.) చూడమ్మా ! ఒకప్పుడు సంస్కారం, సభ్యతలతో, సుఖశాంతులతో వెన్నెల్లా విరిసిపోయిన మనసుల్తో కళకళలాడిన ఈ ఇల్లు యిప్పుడు కటిక చీకటితో నిండిపోయింది. కారణం ఏమిటో నాకు తెలియదు. ఈ కూపంలో నాలాంటి పరాయివాడికి కాస్త దారితెన్ను దొరకాలంటే అదినువ్వు ప్రసరిస్తున్న వెలుగేనమ్మా. యీ ఇంట్లో నువ్వే లేకుంటే నేనూ మానవత్వాన్ని విసర్జించి వీళ్ళలో ఒకడ్నై పోయేవాడ్ని. వస్తానమ్మా. (వెళ్ళాడు.)

(లక్ష్మి తన గదిలోకి వెళ్ళింది. కనకం కళ్ళనీళ్ళు తుడుచుకొని వంటింట్లోకి వెళ్ళింది.)

ఆనం: ఏమిటతని ఉద్దేశ్యం ?

కన : అతను మాట్లాడింది తెలుగే (వెళ్ళబోయింది.)

ఆనం: ఆహా ! ఆ విషయం తెలుసు. కాని అతనికి గోచరించని విషయాలు ధృవతారవు నువ్వు తెలియజేయవల్సింది.

కన : ఏమిటి ?

ఆనం: మమ్మల్ని మించిన పశువులు మీరిద్దరూ అని.

నీల : ఏమిటా మాటలు, ఆనందం ?

ఆనం: లేకపోతే. ఎవరండీ ఇక్కడ మానవత్వాన్ని విసర్జించిన వారు ? పెంచుకున్న మనసుల్ని కుమ్మి చిందర వందరచేసిన ఆవిడ్నే మనాలి ? తన్ను ఎరగా పెట్టుకుని ఇక్కడ అనురాగాన్ని మటు మాయంచేసిన తన్నే మనాలి ? ఎవరి బ్రతుకులు వాళ్ళని బ్రతక నివ్వకుండా పెళ్ళిపెటాకులు లేకుండా పెనుభూతంలా అడ్డం నిలచిన ఈ ఆడదాన్నేమనాలి ? వీరంతా మనుషులా ! మనిషైతే ఒకమాట చాలండీ.

నీల : ఏమిటా మాటలు ఆనందం ?

ఆనం: నేను మాట్లాడిందీ తెనుగేనండీ ! (విసురుగా బయటకు వెళ్లాడు. ఒక్క క్షణం ఆగి కనకం లోనికి వెళ్ళింది. రాజశేఖరం ఏడుపు పర్యంతం వ్యధ ననుభవిస్తున్నాడు. నీలకంఠం దూరంగా ఉన్న కుర్చీలోంచి రాజశేఖరానికి చగ్గరగా ఉన్న కుర్చీలోకి మారాడు.)

నీల : ఏమొచ్చిందయ్యా వీళ్ళందరికీ ! ఇలా అయిపోయారేం.

రాజ: నా ఖర్మ. పురుషోత్తం ఉసురు పోసుకున్న పాపానికే యీ ఇల్లంతా దహించుకు పోతున్నదయ్యా !

నీల : సరేలే ! ఇప్పు డనుకొని ఏం లాభం ? ఆనాడు నామాట చెవిని పెట్టావూ !

రాజ: కనకాని కేదైనా సంబంధంచూడు నీలకంఠం !

నీల : ఏం ! ఏమిటి ! అల్లుడేమైనా అనుమానం !

రాజ: ఛ ! ఛ ! అదేంకాదయ్యా! ఇది ఒక ఇంటిదై తేనేగాని ఆనందం కుదురుగా సంసారం సాగించేటట్టులేదు. పైగా అందరిమీద చెయ్యి చేసుకుంటున్నాడు.

నీల : అదేమిటీ !

రాజ: ఆ — Hospitalకి వెళ్లి వాడి పెళ్లాన్ని కొట్టాడట. అది తెలిసి ప్రసావం....

నీల : లక్ష్మినిగాని కొట్టాడా ! అయ్యో అయ్యో !

రాజ: నేనెందుకు బ్రతికున్నానా అనిపిస్తుంది !

నీల : అఘోరించినట్లే ఉంది నీ ఆలోచన - నీకు పుణ్యం ఉంటుంది. గాని మరో అఘాయిత్యానికి పూనుకోకుబాబూ !

(కనకం కేరియర్‌తో బయటకు వచ్చింది.)

కన : (దుస్తులు సవరించుకుంటూ) మామయ్య మళ్ళీ చచ్చిపోతున్నా నంటున్నాడేమిటి బాబాయ్ !

నీల : ఆ ఇప్పుడు బ్రతికున్నాడు కనకనా మరోమారు చచ్చిపోడానికి !

కన : సరే ! నేను పెడుతున్నాను. మీకోసం భోజనం సిద్ధంచేశా. ఈసారి నా పంక్తిని కూర్చుని భోజనం చెయ్యకపోతే మీ జట్టుండను.

నీల : ఇడిగో కనకం. మాట మార్చకు. నీగురించే ఇంటిల్లిపాదీ ఎంత సతమత మైపోతున్నామో నీకు తెలియడంలేదు.

కన : సరే వెదకండి సంబంధాన్ని చేసుకుంటాను. — అయితే.

రాజ: (గట్టిగా అరుస్తూ) ఆ వచ్చిన దౌర్భాగ్యుడు నన్నుకూడా కట్టుకోవాలి. లేకపోతే ఇది యిలా నా కళ్ళముందు నా గుండెల్లో మంటలాగా నన్ను కాలుస్తూ తను కాల్చుకుని మాడి మసై పోతుంది. (ఏడుపే)

నీల : ఇడిగో శేఖరం !

రాజ: మరేమిటయ్యా! ఆనాడు అదన్నమాటేమిటి? — ఇప్పుడు — ఇప్పుడు చేస్తున్నదేమిటి! ఈ పనులు నన్నుద్ధరించడానికేనా! ఛ! ఛా! వాడు ఎంతలేసి మాటలన్నాడో తెలుసా! అన్నం తినిపించుకోవడానికి, తలదువ్వించుకోవడానికి! సేవలు చేయించుకోవడానికీ దీని జీవితం బలిచేస్తున్నానన్నాడు. ఆ మాటలు వినికూడా అభిమానం చంపుకుని బ్రతికే ఉన్నాను. (బాగా పసివానిలా ఏడుపు)

కన: (చేతిలోని కేరియర్ క్రింద ఉంచింది. శేఖరాన్ని పసివాడిలాగా దగ్గరకు తీసుకుంది. తన పమిటచెంగుతో కన్నీళ్ళు తుడిచింది) ఛ! ఏడుస్తున్నావా! నిన్ను ఏడి పించడానికా నే బ్రతికి ఉన్నాను! ఊరుకో ఊరుకోమరి ఇదుగో నామాట విను! నీ మీద ఒట్టు. మీ స్నేహితుడిమీద ఒట్టు. నేను ఏమైనాసరే పెళ్ళిచేసుకుంటాను. ఏదిఏమైనా నిన్ను ఒంటరిగా ఒదిలేస్తాను. నిన్ను ఎవరు చంపినా, చిత్రహింస చేసినా నేనేమీ పట్టించుకోను. సరా! ఊరుకో! (తను బావురుమని ఏడ్చింది. చకచకా కేరియర్ తీసుకుని వెళ్ళిపోయింది. ప్రేక్షకులు భరించలేనంతసేపు Violin విషాదాన్ని పలుకుతూంటుంది.)

నీల: (తేరుకొని) ఇదిగో శేఖరం. ఈ అవకాశాన్ని పోనివ్వకూడదు తప్పక కనకాన్ని ఒక ఇంటిదాన్నిచేసే బాధ్యత నాది.

(ప్రసాదరావు వచ్చాడు. అందరి ముఖాలు వివర్ణంగా ఉండడం గమనించినా ఏం పట్టించుకోలేదు. అలవాటైపోయిందతనికి.)

ప్రసా: (వస్తూనే నీలకంఠంతో యధాలాపంగా) ఓహో ఇంకా ఇక్కడే ఉన్నారే! (అంటూ తన గదిలోకి వెళ్ళబోతుంటే లక్ష్మి ఎదురొచ్చింది.) చూడు లక్ష్మి నేను camp కి వెడుతూ నీచేతికి నీలం రంగుగుడ్డలో కట్టిన office కాగితాలు ఇచ్చాను. (అర్థం అయినట్లు తలూపింది) అది పట్రా (సరేనని లోపలికి వెళ్ళింది. తను మిగి

లిన ఇద్దరి సరసన కూర్చుని) కనకం కారియర్ తీసుకుని వెళ్ళిందా మామయ్యా!

రాజ: ఆ! ఆఁ.

ప్రసా: (నీలకంఠంతో) శూన్యమాసం కదూ- యీ నెలంతా మీకు సెలవు లాంటిదే అనుకుంటాను. (నవ్వుతూ)

నీల : (నవ్వి) అలాగే మరి! అమ్మాయి కెలాఉంది?

ప్రసా: ఫరవాలేదు! (లక్ష్మి వచ్చింది. కనబడలేదని వ్యక్తం చేసింది.) అదేమిటి లక్ష్మి నీ చేతికిచ్చింది కనబడకుండా ఎలా ఉంటుంది! (అంటూ తనూ లక్ష్మిని తీసుకొని లోపలకు వెళ్లాడు.)

నీల : (రా॥శే॥తో) మీరూమీరూ చేసికొన్న అవకతవకలకి ఆ పిల్లను ఉసురుపెట్టడం ఏమీ బాగోలేదయ్యా ఈ ఆనందానికి —— —— (లోపల్నుంచి కేకలు) ఏం కొట్టానా! చంపానా! ఎందుకు కేకలు ఊరికే ఏడుస్తావు? మాట్లాడితే ఇదొక ఆయుధం నీకు - ఏడుపు. ఆఫీసు కాగితాలు జాగ్రత్త చేయమనిస్తే భద్రం సంగ తటుంచి అసలెక్కడ పెట్టావో జ్ఞాపకం లేకపోయింది.

నీల : (ప్రసాదరావు గదివరకూ వెళ్లి, తిరిగివస్తూ రహస్యం అన్నట్టు) కాగితాలేవో కనబడనట్లున్నాయి. (వెనకనే ప్రసాదరావు లక్ష్మి కూడా వచ్చారు.)

రాజ: ఏమిటి న్యాయనా! ఆఫీసు కాగితాలా!

ప్రసా: అవునండీ కేంపుకి వెడుతూ జాగ్రత్త చెయ్యమనిచ్చాను.

నీల : అయినా ఆఫీసు కాగితాలు ఇంట్లో దేనికి మరీను.

ప్రసా: ఇంట్లో ప్రతివాళ్ళకూ మతులుపోయి తిరుగుతున్నారని నాకు తెలీదుకదండీ!

లక్ష్మి: (వాటిని మంచంక్రింద జాగ్రత్తగానే ఉంచాను అని అభినయంతో చెబుతుంది.)

నీల : ఏమిటమ్మా (తెలీక అడిగాడు.)

ప్రసా: ఏమిటో మూగసొద. ఇదొక తలనొప్పి.

రాజ: (కొంచెం బాధపడి) ఉండు నాయనా ! దాన్ని ఖంగారుపెట్టకు నే నడుగుతాను. నువ్వలా కూచో (లక్ష్మితో బాగా జ్ఞాపకం చేసుకో తల్లీ. అలాంటి కాగితాలు జాగ్రత్తగా ఉంచుకోకపోతే ఎట్లా ?

నీల: ఇంకే గదిలోనైనా పెట్టావేమో చూడమ్మా!

రాజ: మరో గంటలోనే వెదికి ఉంచుతాను. నువ్వు స్థిమితంగా వెళ్ళు నాయనా!

ప్రసా: వెళ్ళి ఏం చేయను. ఆ Office అనే మాటలు సేవిస్తూ కూచో వాలి.

రాజ: ఆ! అన్నట్టు - అమ్మా లక్ష్మీ! ఆ D. D. T. వాళ్లొచ్చినప్పుడు సామాన్లు మార్చారుకదా - ఆ తొక్కిడిలో నా గదిలో కేమైనా చేరుకుందేమో.

నీల: వెళ్ళిచూడమ్మా.

రాజ: నువ్వుకూడా వెళ్ళుప్రసాద్.

ప్రసా: ఎందుకు లక్ష్మి వెదికి తెస్తుందిలెండి.

నీల: మూగ సొదకదూ! నువ్వుకూడా వెళ్ళి చూడవయ్యా!

రాజ: నీలకంఠం

రాజ: నీకు పుణ్యం ఉంటుంది కాస్త జాగ్రత్తగా మాట్లడవయ్యా బాబూ!

నీల: లేకపోతే ఏమిటయ్యా! మూగసొద అని మొదట తెలీదూ?

రాజ: సరేలే! మరో విషయం ఏదో మాట్లాడు నాకు గుండె దడగాఉంది.

నీల: ఆ అన్నట్టు జేబులోంచి పేర్ల List తీసి పేర్లువారీ గొణుగుతూ చదువుతూ ఠపీమని ఆగి) ఆ! ఇతను చూడు ఇతగాడికి పెళ్ళయ్యిందా!

రాజ: (ప్రసాదరావు పనేమయ్యిందోనని వెనక గదిలోకి ధ్యాసఉంచుకొని మామూలుగా) ఎవరికి?

నీల: కులగోత్రాలు నోటుచేసుకున్నానుగాని పేరు వ్రాసుకోవడం మరచి పోయినాను. ఇందాక నాక్కనిపించాడయ్యా. అతగాడే పలకరించాడు. పేరు ఏదో చెప్పాడు. పేరు పేరు (జ్ఞాపకంరాక) మనింటి విషయాలన్నీ అడిగాడు. పేరు ఆనందం—కాదు ఆనందం మనవాడుకదూ—ఊ—బర్మా కిరసనాయిలు కంపెనీలో **interview** క్కూడా వచ్చాడట-మనకు బాగా పరిచయమయ్యా! (పేరు జ్ఞాపకంరాక కోపంకూడావచ్చింది.) ఏమిటయ్యా! అతడు మనవాడి స్నేహితుడు. ఏద్నార్ధంక్రితం వచ్చాడు. (ప్రసాదం చేతిలో ఒకచిన్న Packet తో విప్పిన శుభలేఖలు వ్రాళ్ళతోకూడ అతని చేతిలో ఉన్నాయి. - నీలంగుడ్డచుట్టి ఆఫీసు కాయితాలు లక్ష్మిచేతిలో ఉన్నాయి. ఇద్దరు వచ్చారు లక్ష్మి ఆనందంగానే ఉంది)

రాజ: అతనా సుందరమా! (నీలకంఠంతో)

ప్రసా: ఎవరా సుందరం?

రాజ: ఆఁ ఆఁ ఎవరూ లేదునాయనా - (లక్ష్మిచేతిలో కట్టను గమనించి) దొరికాయా! బ్రతికించావు.

నీల: ఎంత హడావిడై పోయింది (అని నవ్వాడు)

(కాని ప్రసాదరావు ఇంకా గంభీరంగా ఉండడాన్ని గమనించాడు. ఇదీకారణం అనుకొని) అయినా లక్ష్మి ఆతను అన్నాడని కాదు. గాని ఇలాంటి అర్జంటు కాయితాల విషయంలో చాలా జాగ్రత్తగా కంటికి రెప్పలా చూచుకోవాలి. మరుపుకూడదు. (లక్ష్మి నవ్వి స్వేచ్ఛగా **files** ప్రసాదం చేతికిచ్చింది. ప్రసాదం అందుకుని ముందున్న సోఫామీదకు కోపంగా విసిరాడు. అందరూ విస్తుబోయారు.)

ప్రసా: అసలీ సుందర మెవరు? (గద్దించాడు మొగంకూడా తెలియని సుందరంపట్ల ప్రసాదం ఆసక్తికి ఆశ్చర్యపోయి రాజశేఖరం, 14)

నీలకంఠం ఒకరి మొఖాలు ఒకరు చూచుకున్నారు. లక్ష్మి తను అక్కడ ఉండడం బాగుండదని నిష్క్రమణకు కదిలింది. చెయ్యి పుచ్చుకుని ఆపి) నువ్వూ ఉండు. (రా॥శే॥ నీలకంఠంతో) ఏమండీ.

నీల: ఏంటీ.

ప్రసా: ఏమిటేమిటి? ఎవరా సుందరం అని అడుగుతున్నాను. దాటేయిస్తారే ఆ విషయం.

రాజ: (ఆయోమయంగా) ఇందులో దాటెయ్య వలసిందేముంది నాయనా? సుందరం అంటే మన సుందరం మన ఆనంద్‌కి స్నేహితుడు.

ప్రసా: అంతేనా?

రాజ: (ఏమిటో అర్థంకానట్టు నీలకంఠాన్ని చూస్తాడు)

నీల: అంతేగాక మరేమిటయ్యా!

ప్రసా: మరేమీకాదు (Silence)లక్ష్మికి కావలసిన మగడుకదూ!

రాజ,నీల: ఏమిటి?

ప్రసా: ఇదేమిటి? (నీలకంఠంచేతికి శుభలేఖలిస్తాడు నీలకంఠం చదువుతూ ఉంటాడు. రాజశేఖరంకూడా చదువుతూంటాడు వెనకనించి లక్ష్మి కూడా చదువుతుంది. భయంకరమైన భయం ఆమెను ఆవహిస్తుంది.)

నీల: ఈ శుభలేఖ లెక్కడ్నుంచి ఊడిపడ్డాయి?

ప్రసా: అంటే వీటిని ఇప్పటికిప్పుడు నేను సృష్టించానంటారా?

నీల: అహా! అదికాదు.

ప్రసా: ఇహ ఈ నాటకం చాలించండి (లక్ష్మితో) నీకూ తెలీదా!

లక్ష్మి: (ఒట్టు నాకేం తెలీదు అని అభినయంతో ప్రమాణం చేస్తుంది)

ప్రసా: ఛస్! నోర్ముయ్.

రాజ: ప్రసాదరావు! నా మాటవిను. భగవంతుడి సాక్షిగా చెబుతున్నాను.

ప్రసా: మీకేమీ తెలియదంటారు. అంతేనా! ఇంకేదైన చెబుతారా!

రాజ: నిజం! నిజం! నాయనా!

ప్రసా: అచ్చయిన శుభలేఖలు యింట్లో దాచుకుని ఎప్పుడు ఎలా అచ్చయ్యాయో తెలీదా! యెందుకండీ యీ బుకాయింపు?

నీల: బుకాయింపా! బుకాయించవలసిన అవుసరం ఏమిటయ్యా?

ప్రసా: ఏమో నాకేం తెలుసు? ఏ తప్పును కప్పుకోడానికి అవసరమై బుకాయిస్తున్నారో తప్పుచేసిన వాళ్ళకు తెలియాలి.

రాజ: అయ్యో ఖర్మమా! దీన్ని చూడ్డం నా కిదే మొదటిసారి నాయనా మాకు అల్లుడివై మా కళ్ళల్లో దీపం వెలిగించావు. నీ దగ్గిర తప్పు కప్పుకోవలసిన అవసరం యేమిటి.

ప్రసా: ఆ శుభలేఖల్లో ఉన్న రాజశేఖరంగారు మీరు కారా? ఆ లక్ష్మి యీ లక్ష్మి కాదా? ఒక కట్టడు శుభలేఖలు మీ గదిలో నాకు దొరికితే (విసిరికొట్టాడు) మీకు తెలీదా! మీకూ తెలీదా!

నీల: అదే విడ్డూరంగా ఉంది! శుభలేఖలేమిటి? నాకు తెలియక పోవడం ఏమిటీ అని.

ప్రసా: శుద్ధ అబద్ధం మీరు సంసారాలతో చెలగాటాలాడుతున్నారు. మంచి పనికాదని చెబుతున్నాను. నవంబరు నెలలో వాతో పెళ్ళికి ప్రదానం అయ్యిందీ డిశంబరు 3వ తేదీన మరొక వరుడితో పెళ్ళంటూ శుభలేఖలు అచ్చువేయడం జరిగిందా! ఆ శుభలేఖలు ఒకకట్ట మీ గదిలో నాకుదొరికితే మీకుమాత్రంతెలీదూ!ఎవరై నానమ్మాలా?(ఎవరూఏమీ మాట్లాడలేక పోయారు) (లక్ష్మితో) నీకూ తెలీదూ (కాదని తలూపింది) మరెందుకేడుస్తావు.... నీలకంఠంగారూ ఈ శుభలేఖల సంగతి ఉన్నదున్నట్టు నాకు సాధ్యమైనంత వేగంగా తెలియాలి.

మా వివాహాలు అయిన మరుక్షణంనుంచి ఏదో జరకూ్కడనిది జరిగిపోయినట్టు ప్రతిఒక్కరూ బాధపడుతూండడం నేను గమనిస్తున్నాను. లక్ష్మిని పెళ్ళాడటమే ఆ జరగకూడని దనిపిస్తూఉంది అది నిజమనికాని అబదమనికాని ఋజువుకావాలి. లేకపోతే....

రాజ: (లేకపోతే ఏమిటన్నట్టు దిగులుగా చూస్తాడు)

ప్రసా: లేకపోతే లక్ష్మిని నేను విడిచి పెట్టవలసి వస్తుంది.

నీల: విషయం ఏమిటో తేలకుండా ఆ అమాయకురాలిని అనుమానించడం అన్యాయమయ్యా.

ప్రసా: లక్ష్మి అమాయకత్వాన్ని ఆసరా తీసుకోకండి. అన్ని తెలిసిన పెద్దలు-మీకు తెలిసిన విషయాలు బయటపెట్టి నిజానిజాలు తేల్చండి. అంతవరకు ఇప్పట్నించి మీతో నాకే విధమైన సంబంధమూలేదు. (office కాయితాలు తీసికుని చట్టున వెళ్ళబోయాడు)

నీల: ఇది చాలా అన్యాయమయ్యా:

ప్రసా: (ఆగి) ఏమిటండీ అన్యాయం: రత్నంలాంటి నా చెల్లెల్ని మీ ఇంటి కోడలుగా చేసుకోమన్నాను. అందుకు ప్రత్యుపకారంగా ఈ మూగ దాన్ని నా భార్యగా చేసుకున్నాను. అప్పట్నించి ప్రతి యెక్కరూ వ్యధల్తో క్రుంగిపోతున్నారు. సంగతేమిటంటే చెప్పరు. ఏదో పరాయి వాడిలాగా నా దగ్గర ప్రతి విషయం దాస్తారు. ఇంత ఘోరమైన విషయం వీటి సంగతేమిటంటే చెప్పరు. మీదా: నాదా: అన్యాయం: (విసురుగా నిష్క్రమించాడు)

రాజ: (వెనకనే) ప్రసాదం—నాయనా ప్రసాదం—(నీలకంఠం లేచి నిశ్చేష్టుడై నిల్చున్నాడు. లక్ష్మి మతి తప్పి తూలుతుంది)

రాజ : నీలకంఠం : (నీలకంఠంతో ఏదో చెప్పడానికి ఇటు తిరిగేసరికి క్రిందకు జరుగుతున్న లక్ష్మి కనిపించింది. ఒక్క ఉదుటన వెళ్ళి పట్టుకున్నాడు.)

నీల : అమ్మా ! లక్ష్మీ !

రాజ : (లక్ష్మిని తన చేతులలోనికి తీసుకున్నాడు.) లక్ష్మీ లక్ష్మీ !

నీల : ముందు దీన్ని లోపలికి తీసుకుపద.

(ముగ్గురూ లోపలికి వెళ్లారు. కొద్దిక్షణాలు నిశ్శబ్దం విషాదం)

(నీలకంఠం, రాజశేఖరం ప్రవేశిస్తూ)

రాజ : నీలకంఠం ! నువ్వు త్వరగావెళ్ళి కనకాన్ని తీసుకురా ! నేను లక్ష్మిని చూస్తూ ఉంటాను.

నీల : సరే ! సరే. (రా॥ శే॥ వంటయింట్లోకి వెళ్లాడు. నీలకంఠం బయలుదేరబోయి ఆగి చటుక్కున ఏదో జ్ఞాపకంవచ్చి తనూ వంటింట్లోకి వెళ్ళాడు. రా॥శే॥ గ్లాసు నీళ్ళతో, నీలకంఠం ప్రవేశిస్తారు.)

రాజ : (ఏడుపు మిళితమైన కోపంతో) నేను ఛావన్లేవయ్యా నువ్వెళ్ళు ముందు—

నీల : ఆ అదీ సంగతి. మరేం ఫరవాలేదు. అంతా చక్కబడుతుంది.

రాజ : సరేలే ! నువ్వు బయలుదేరు, (అంటూ లక్ష్మి గదిలోకి నిష్క్రమించాడు.)

నీల : (బయల్దేరబోయి వెనక్కు వెళ్లి మళ్ళీ శుభలేఖల్నిపరిశీలిస్తున్నాడు. రా॥శే॥ వెనకనే ప్రవేశించి తన గదిలోకి వెడుతూ నీలకంఠాన్ని గమనించి.)

రాజ : ఇంకా నువ్వికక్కడే ఉన్నావా ? త్వరగాపోయి కనకాన్ని తీసుకు రావయ్యా బాబూ (అంటూ తన గదిలోకి పోతాడు.)

నీల : ఇదిగో ఇదిగో ఈ శుభలేఖలూ (అందులో విషయాలను అర్థం కానట్టు చదువుతూ ఉంటాడు.)

రాజ : (పై కండువా వేసుకుంటూ) ఇదిగో చూడు.

నీల : ఇదిగో బయల్దేరుతున్నాను.

రాజ : నువ్వికక్కడే ఉండు. లక్ష్మీ ఒంటరిగా ఉంటుంది.

నీల : నువ్వెక్కడికి ?

రాజ : నేనా ! ప్రసాదాన్ని తీసుకురావడానికి. లక్ష్మీ అతన్ని చూడా లంటోంది.

నీల : ఆమాత్రందానికి నువ్వెందుకు ? నే నెలాగు వెడుతున్నానుగా నేను తీసుకొస్తాను.

రాజ : (ఏడుపు ఆపుకుంటూ) కాదు నీలకంఠం ! అతడు నాకు అల్లుడు అతని కాళ్ళు పుచ్చుకునే గౌరవం నా కొక్కడికే ఉంది.

నీల : సరే లేవయ్యా ! ఈ పదవిని నే నిప్పటికి ఆరుసార్లు పుచ్చు కున్నాను.

రాజ : నీలకంఠం ! నే చేసిన పాపానికి నా పిల్లలెవరూ సుఖపడలేక పోతున్నారు ! ఆ వుసురే నన్ను కన్ను కొడుతోంది. (ఇహ మాట్లాడలేకపోయాడు. వెడుతున్నాడు.)

నీల : ఇదిగో ఆఁ ఆరోడ్లమీద జాగ్రత్తగా చూసుకుని మరీ నడు.

రాజ : అయ్యో ! అంత అదృష్టమా (అంటూ నిష్క్రమిస్తాడు.) (నీల కంఠం క్రిందకుపడ్డ శుభలేఖల్ని సర్ది Tea poy మీద పెట్టాడు. లక్ష్మీ గదిలోకి వెళ్ళాడు. కనకం ఈసురోమంటు వచ్చింది.) (అల సటతో సోఫాలో కూర్చుంది. ముఖాన చెమట తుడుచుకుంది. శుభలేఖలు కనబడ్డాయి.)

నీల : వచ్చేవా ! రక్షించావు తల్లీ నీకోసమే చూస్తున్నాను.

కన : ఈ శుభలేఖలు బయట కెలా వచ్చాయి ?

నీల : అవి శుభలేఖలా ! శతఘ్నుల్లాగా పేలాయి! ప్రసాదరావుకి దొరికాయి.

నీల: శుభలేఖల సంగతి ఏమిటో తేలకపోతే (ఏం చెప్పాలో తోచక) ఇహ అంతే నన్నాడు.

కన: అంటే?

నీల: అంటే ఏమిటి! విడిచిపెట్టేస్తానన్నాడు.

కన: అయ్యో!

నీల: అసలివి ఎలా వచ్చాయట? ఏదయ్యాపైనా!

కన: దయ్యమూలేదు. దేవతాలేదు. వీటిని తెచ్చినవాడూ మనిషేనండీ!

నీల: (దూరంగా ఉన్నవాడు దగ్గరగా కూర్చొని) ఏమిటేమిటీ నీకు తెలుసన్నమాట!

కన: ఆఁ ఆ సుందరంగారు లేరూ? ఆయన వేయించుకొచ్చాడు.

నీల: అదేం పోయేకాలం! వాడికి, మతిగాని పోయిందా!

కన: అలాగే మరి.

కన: (లక్ష్మితో) ఆ సుందరంగారు లేరూ! యిక్కడ మనం సంబంధాల కోసం పడుతున్న అవస్థచూసి వెళ్ళి వారి తండ్రిగారితో సంప్రదించిన మీదట 'అభ్యంతరం' లేదన్నారట. అందుకని మనందర్నీ ఆనందంతో ఆశ్చర్యంలో ముంచెయ్యడానికి....

నీల: ఏకంగా శుభలేఖలు అచ్చు వేయించుకొచ్చాడు - వోరి వీడ్ని అంటించా.

నీల: ఇహ చిక్కులేదు! అతడు ఇప్పుడిక్కడికి వస్తా నన్నాడు. వస్తే అతన్ని సాక్ష్యంపెట్టి ప్రసాదరావు ఎదురుగా అన్ని విషయాలు తేలుద్దాం.

కన : అంత సులభంకాదు బాబాయ్. ఇదంతా మనమే కల్పించి చేయించాం అనుకుంటే ప్రమాదం.

(లక్ష్మి సైగచేసి మరేం చేద్దాం? అని కనకాన్ని అడుగుతుంది)

కన: నువ్వేం బాధపడకమ్మా మేం ఏదో ఆలోచించి చేస్తాంగా నువ్వు లోపలకి వెళ్ళి విశ్రాంతి తీసుకో—

నీల : మరేమిటి గతి ?

కన : ఒకపని చెయ్యండి. అతను వస్తాడో రాడో, మీరే వెళ్ళి అతన్ని తీసుకురండి అతన్తో ఆలోచించి ఏదో చేద్దాం.

నీల : సరే (లేచి వెళ్ళబోతాడు. వీధిలోంచి సుందరం ఎదురొస్తాడు) ఆడబోయిన తీర్థం ఎదురయ్యింది. శుభలేఖల Hero వస్తున్నాడు

సుం : నమస్కారమండీ !

నీల : కళ్యాణమస్తు !

కన : (తను లోపలిక్ వెళ్లింది. సుందరం కూర్చుంటాడు. నీలకంఠంతో మాట్లాడబోతుంటే శుభలేఖలు కంటబడ్డాయి.)

సుం: వీటిని ఇంకా ఉంచారు దేనికి ?

నీల : మీరు ఎవర్నీ సంప్రదించకుండా అచ్చు వేయించారు దేనికి !

సుం: అదేదో పొరపాటై పోయిందండి.

నీల : ఎంత ముచ్చటగా అన్నావయ్యా పొరపాటయ్యిందని.

సుం : అసలిప్పుడేం జరిగిందండి !

కన : పెళ్ళయిన ఏడాదికి తన భార్య పెళ్ళికూతురుగా - మరొక వరుడుగా అచ్చయిన శుభలేఖలు భర్తగారికి కనబడితే ఏం జరగాలో అదే జరిగింది.

సుం : అంటే అల్లుడుగారు వీటిల్ని చూశారా !

నీల: చూశారా ఏమిటయ్యా ఇంటిల్లపాదినీ ఒక్క- దులుపు దులిపి లాయర్ను సంప్రదించడానికి తయారుగా ఉన్నాడు.

సుం : లాయర్నా ఎందుకు ?—

నీల : ఎందుకా ! విడాకులకి !

సుం : అయ్యో (కాఫీ తీసుకుంటున్నవాడల్లా కప్పు క్రిందపెట్టి వెళ్ళిపోతున్నాడు.)

నీల : ఏమిటది ? ఎక్కడికి ?

సుం : అల్లుడుగారికి అన్నివిషయాలు తెలియజేయడానికి.

నీల : మరి ఆ విషయం మాకు చెప్పి ఏడవ్వేం ? నాకు నోరు తిన్నగా రాదు. ఇలారా ముందు. (గదమాయించాడు సుందరం వచ్చి కూర్చున్నాడు.) ఇదుగో ఈ క్షణంనుంచి నువ్వు చెయ్యబోయేది చెప్పి మరీ పుణ్యం కట్టుకో ! నువ్వు ఎవరినీ సంప్రదించకుండా చేసిన నిర్వాకంవల్ల కొన్ని ప్రాణాలకు ప్రాణాలు కొట్టుకు పోవడానికి సిద్ధంగా ఉన్నాయి.

కన : మీ రేది చెప్పినా నమ్మేస్థితిలో లేడు అన్నయ్య !

నీల : అసలే ఇక్కడివాళ్ళ పిచ్చిచేష్టలకు ఉడికిపోతున్నాడు. సరిగ్గా ఈ సమయానికి శుభలేఖలు కూడాను.

సుం : ఇక్కడివాళ్ళ చిలిపిచేష్టలూ అంటే.

నీల : అదే నీ కిందాక చెప్పాను కదయ్యా ! మన ఆనందం !

సుం : మీ మాటకు అడ్డొచ్చాను. కనకంగారూ ! మీకూ ఆనందంచేష్టలు పిచ్చిగా, అకారణంగా కనిపిస్తున్నాయాండీ !

నీల : కాక !

సుం : దయచేసి మీరు నిశ్శబ్దంగా ఉండండీ ! ఏమండీ కనకంగారూ !

కన : ఎప్పుడూ నిప్పులు కురిపిస్తుంటాడండీ. మా అందరిపట్ల అతని ప్రవర్త నెలాగున్నా పరవాలేదు. అల్లుడైన వాడెలా సహించగలడు.

సుం : ఆనందం నిప్పులు కురవడ మొక్కటే మీకు కనిపిస్తుంది. కాని నిప్పులమీద వేగిపోతూ ఎంతటి ఆవేదనను అణుచుకొని అలమ

టించి పోతున్నాడో మీ రెరుగరు. నీలకంఠంగారు ఆనందం ప్రవర్తనను గురించి ఉదయం నాతో ప్రస్తావించినమీదట అతన్ని మందలిద్దామని అతన్ని కలుసుకున్నాను. అతను మీ జీవితాన్ని గురించి ఎంత కుమిలిపోతున్నాడో మీరు వింటే మీరు ఒక మనసుగల మనిషైతే .... ఇంత అన్యాయం చేసివుండరు. ఒక సంగతి మీకు తెలుసా! ఇప్పుడు ఎప్పుడూకూడా ఆనందానికి బహిర్ప్రాణం మీరు. వాడు సుఖపడటంకాదు వాడిక్కావల్సింది మీరు సుఖపడటం, అందుకు మీరెన్నో అడ్డంకులు చెబుతున్నారట. వాడ్ని సుఖంగా ఉండమంటారుట. పెళ్లాన్నేలుకోమని వేధిస్తారట. ఎలా సాధ్యం అండీ!

(ఆనందం వచ్చాడు నిశ్శబ్దంగా నిల్చున్నాడు.)

నీల : అవును ఆదీ ఆలోచించవలసిన విషయమే.

సుం : నేను ఆనాడే అన్నాను. మీకు గుర్తుందో లేదో! మీ త్యాగంవల్ల మీరు అనుకున్న ఫలితాన్ని సాధించలేరని.

కన : అదేం న్యాయం అండీ! నావల్ల ఎవరికైనా ద్రోహం జరిగితే నన్ను శిక్షించాలి. అంతేగాని.

సుం : అంటే మీవల్ల మోసగించబడ్డవాడు తన ప్రతీకారం తీర్చుకునే పద్ధతికూడ మీ ఉద్దేశానుసారం ఉండాలంటారు.

నీల : అదేంమాట! మనం ఒకర్ని మాటల్తో నొప్పిస్తే అవతలి వాడూ అదే చెయ్యాలనెక్కడుందీ! వాడు పళ్లూడగొట్టుచ్చు.

కన : అలాంటి నిర్ణయాలు ఏమయినా ఉంటే అన్నీ ఒదులుకుంటున్నాను. కాని....కాని....ఈ అమాయకుణ్ని ఒంటరిగా వదలి వెళ్ళిన మరు క్షణంలో (కంఠం రుద్ధమయ్యింది. మాటాడలేక ఊరుకుంది.)

ఆనం: ఇహ ఆ విషయానికి నువ్వు బాధపడ నవసరములేదు. ఇప్పుడు నువ్వన్న మాటలమీద నిలబడాలేగాని మా నాన్ననికూడా నీ సంరక్షణలో ఉంచగలిగే సంబంధాన్ని తీసుకొచ్చాను.

నీల : అదేమిటోయ్ ! నాకు Compitation వస్తున్నావు నేనూ ఓ సంబంధం అనుకుంటున్నాన్లే.

ఆనం: మీ Candidateకీ నా Candidate కీ పోలిక లుండవు. మీరు మీ Commission దృష్ట్యా !

నీల : ఆమాటనకు చెబుతున్నాను. కనకం విషయంలో Commission ఏమిటయ్యా ! పైగా మావాడుకాని కట్నం పుచ్చుకోడు.

ఆనం: మావాడు కట్నం పుచ్చుకోకపోవడమే కాదండీ ! పెళ్ళి ఖర్చులు కూడా లేకుండా పెళ్లాన్ని తీసుకుపోతాడు.

నీల : మావాడు సాక్షాత్తూ మన క్కావలసినవాడయ్యా !

ఆనం: మావాడు సాక్షాత్తూ మనవాడే !

సుం : మరింకేమిటి అభ్యంతరం ! ఏమండీ కనకంగారూ ! మీరు ఊ అనండి ఇంటిల్లిపాదీ సుఖపడతారు.

కన : మీ రనుకున్నంత సులభంగా నాలాంటిదాన్ని భార్యగా స్వీకరించడానికి సామాన్యంగా ఒప్పుకోరు. నన్ను చేసుకోవాలనుకుంటే. ఒక కొమ్ముకునికని వైధవ్యం ప్రాప్తించిన స్త్రీని చేసుకున్నంత సహృదయతతో చేసుకోవాలికదా !

ఆనం: వెదవ్వేషాలు వెయ్యకు, అలాంటివాడే వస్తే చేసుకుంటావా !

కన : అప్పుడు నాకు అభ్యంతరం లేదు.

నీల : మళ్ళీ ఏవో సాకులు చెప్పకూడదు.

కన : చెప్పను. ఎవరో చెప్పండి.

ఆనం: అత నెవరైనా అభ్యంతరం చెప్పకూడదు.

సుం : ఏడ్చావు - ఎవరో చెప్పారా ! ఆమెకు నచ్చచెప్పే బాధ్యత నాది.

ఆనం: నువ్వు పూనుకుంటే అంతకంటేనా ! విను కనకం ! మాసుందరం.

సుం : నేనా ! (పిడుగుపడ్డట్టు) అసంభవం !

నీల : అన్యాయం.

ఆనం: ఏమిటండి ! అన్యాయం.

నీల : ఇతనే నా Candidate అయ్యా !

సుం : ఆనందం - ఆపు. చాలా ఘోరమైన విషయం. నావల్లకాదు.

ఆనం: అది మరి అసంభవం ! మాట తప్పకు ! ఇంతకు ముందే ఆమెను ఒప్పించే పూచీ నాదన్నావు ?

సుం : అదికాదానందం. నా కళ్ళ ఎదుట మీ రుభయులు....

ఆనం: ఆ అభ్యంతరం నీ కుంటుందని తెలుసు. కాని అంతగా కావాలని కోరుకున్న ! ఆవిడ ఇప్పుడు నాకు కాగలదా ! అస లలాంటి ఊహనుకూడా ప్రోత్సహించడం మంచిదంటావా ! (సుందరం మౌనం) మాటాడవేరా ! ఒకనాడు నీ జాప్యంవల్ల ఈ సంసారం తీన్నార్తారు అయింది. ఆనాడే నీ కోరికను వెల్లడించిఉంటే యిన్ని ఇబ్బందులు వచ్చేవికావు. ఒకప్పుడు నా ప్రాణానికి ప్రాణం. మా కుటుంబంకోసం తన జీవితాన్ని మోడు చేసుకున్న ఈ కనకం ఈనాడు నా తోబుట్టువు. దానికి జీవితాన్ని ప్రసాదించు మా కుటుంబాన్ని ఉద్ధరించు. (పాదాలమీదపడి వేడుకున్నాడు.)

నీల : అవును నాయనా !

సుం : (కాళ్ళమీదున్న ఆనందం తలను గుండెలకు చేర్చుకొని ఆమోదంగా కన్నీరు కార్చాడు.) అది సరే ! ఆమె సమ్మతికూడా కావాలికదా !

ఆనం: అందుకు నువ్వు పూచీ పడ్డావుకదరా !

నీల : ఇహ అతన్ని అడగడం, బాగుండదులే అది నా పూచీ అమ్మా కనకం. (ఆవిడ లేదు. అంతకుముందే వెళ్ళిపోయింది.) అయ్యో

లోపలికి వెళ్ళిపోయిందే! (లోపలకు వెళ్ళబోయి శుభలేఖలు కంట పడగానే ఆగి శుభలేఖలు చూపిస్తూ) అన్నట్టు ఈ శుభ లేఖల గందరగోళం మాటేమిటీ?

ఆనం: అవును శుభలేఖలు (ఆలోచించి) ఉండండి వస్తాను.

(వీధిలోకి వెళ్ళబోయాడు.)

నీల : (ముందుకు అడుగువేసి) ఎక్కడికి?

ఆనం (ఆగి) బావగారి దగ్గరకు.

నీల : ఎందుకు?

ఆనం: ఈ శుభలేఖల సంగతి—

నీల : ప్రసాదరావుతో చెప్పడానికా?

ఆనం: ఆఁ

నీల : మరి ఆ విషయం మాకు చెప్పి ఏడవ్వేం? నాకు నోరు తిన్నగా రాదు. రా ఇలారా - కూర్చో (ఆనందంవచ్చి కూర్చుంటాడు.)

ఆనం: (కూర్చుని) ఏవండీ?

నీల : చెబితే ఇదంతా మనం ఆడుతున్న నాటకమంటే? ఏంవయ్యా సుందరం?

సుం : (తెప్పరిల్లి) అవునండి. ఆ ప్రమాదం కూడా ఉంది.

ఆనం: ఆహా (ఆలోచన్లో పడ్డాడు, యాదాలాపంగా శుభలేఖల్ని పేకముక్కల్లాగ కలుపుతూ - చటాన ఆలోచన తట్టింది. ఏవండి నీలకంఠం గారూ మాట. (నీలకంఠం ముందుకొచ్చాడు ఆనందంతోపాటు. సుందరం వింటున్నాడు.) నాటకం అంటే ఆలోచన తట్టిందీ - ఏదో నాటకం ఆడి, ఈ శుభలేఖలు కనకం సుందరాలవని బావ గారి చెవిని వేస్తే?

నీల: బాగానే ఉంటుంది. కాని నాటకాలు, బూటకాలు నమ్మడానికి నీ అంత.

ఆనం: అదే చూద్దురుగాని (తన గదిలోకి నిష్క్రమించాడు)

నీల: అదిగో మళ్ళా—

ఆనం: చెప్పేడుస్తాను మీ రుండండీ (వెళ్ళాడు)

నీల: ఆ! అది (కూచున్నాడు. సుందరంతో) ఇదిగో అబ్బాయి! నీ పేరే మిటి ఆ సుందరం చూడు నువ్వాలాఉంటే లాభంలేదు నాయనా.

సుంద: (లేచి ముందుకు నడుస్తూ) అబ్బే! అదేం లేదండీ. వాళ్ళను గమనిస్తుంటే, ఆశ్చర్యం వేస్తుంది. ఇతరుల సుఖంకోసం సర్వం త్యాగం చేయడానికి సిద్ధపడే సహృదయాలు.

నీల: నువ్వు మాత్రం! నీ సహాయం సామాన్యమైందా?

సుంద: సరే! నా విషయమే చెప్పేరు! కాని నీలకంఠంగారు! ఈ మా వివాహంవల్ల కొత్త చిక్కులు కొనితెచ్చుకుంటున్నావేమా.

నీల: ఎంతమాత్రంకాదు. నాయనా ఈ నీ సహాయంవల్ల ఇంటిల్లపాది ముఖ్యంగా ఆనందం మనసు కుదుట.బడుతుంది. ఆనందం ఆవేదనంతా కనకం సుఖాన్ని కాంక్షించి తన కుటుంబ కారణంగా జీవితాన్నే బలి చేసుకున్న కనకం, ఒక యింటిది కావాలని (అప్పటి కనకం, లక్ష్మికోసమని వెళుతూంటుంది) కదమ్మా కనకం!

కన: అది సరే—అసలు ప్రమాదాన్ని గురించి పట్టించుకొవడంలేదు మీ రెవ్వరూ (అంటూ మళ్ళా కదిలింది. ఆనందం గదిలోంచి ఒక చేతిలో అరటావు కాగితం ఏదో వ్రాసాడు, మరొక చేతిలో తెరచిన కలంతో ప్రవేశిస్తాడు)

ఆనం: ఇదిగో ఇదిగో ఆ ప్రమాదంగూర్చే (వాసింది మళ్లా తనలో చదువుకుంటుంటాడు)

నీల: ఏమిటిది? (లక్ష్మి గదిలోకి వెళ్ళబోయిన కనకం ఆగింది)

ఆనం: (రాసింది సరిచూచుకుంటూ మధ్యలో) సుందరమొక Pool.

నీల: (ఆనందం వెనగ్గాచేరి ఆనందం వ్రాసుకొచ్చిన కాగితాన్ని చదువు తూంటాడు. క్రమేపి అతని ఉత్సాహం ఇనుమడిస్తూ ఉంటుంది)

ఆనం: (మరికొంత సరిచూచుకుని) తండ్రిపేరు....

నీల: (తనూ తనలో చదువుతూ) కనకలక్ష్మి సాక్షాత్తు మహాలక్ష్మి

ఆనం: .....స్వతంత్రంగా సుందరం.....

నీల: (మరికొంత చదివి)".....పెద్దకూతురు లాంటిది" (ఆనందం తెలివి తేటలకు ముచ్చట పడిపోతూ నెత్తిమీద మెట్టుతాడు)

ఆనం: (మరికొంత సవరించి)....వాకబు....

నీల: ....నీలకంఠం మధ్యవర్తిత్వం (సంతోషం పట్టలేక అరుస్తాడు) హార్నీ....ఈ తెలివితేటలు నీ సొంతానివే?

ఆనం: సుందరం త్రిల్లు....

(ఈ హంగామా అంతటినీ కనకం, సుందరం అర్థంకాని ఆశక్తితో గమనిస్తూ ఉంటారు.)

నీల: (ఆనందంచేతిలో కాగితాన్ని లాక్కుని సుందరం దగ్గరవాలి) ఆమోఘమైన నాటకం - చదువుకో.

(సుందరం చదువుతూ ఉంటాడు. అర్థంకాక తెల్లబోయి నిలుచున్న కనకాన్ని సమీపించి నీలకంఠం)

నీల: నీకే అంతుబట్టలేదుకదూ. ఇలారా చెప్తాను (చెవిలో చెబుతూ ఉంటాడు)

సుం: (చదివి) బాగుంది. ఇంతకీ ఈనేరం నా మీదకు నెడతారన్నమాట.

ఆనం: మెత్తగా ఉన్నవాళ్ళను చూస్తే మొత్తబుద్ధి వెయ్యదుమరి.

కన: (నీలకంఠతో) అంత సులభంగా నమ్ముతాడంటారా (అంటూ సుందరం చేతిలోని కాగితంకోసం చెయ్యిచాపుతుంది) యాదాలాపంగా కాగితాన్ని కనకం చేతికందిస్తాడు సుందరం.)

ఆనం: నమ్మించే పూచీ మీ ఇద్దరిలోనూ ఉంది. మీ మొహాలిలాగే ఉంటే నమ్మడు.

సుంద: మరి....తండ్రి పేరు?

ఆనం: నువ్వు ఈ అంతర్నాటకంలో ఒక Pool పైతే అదొక సమస్య టరా? అది నీ Half Knowledge వల్ల....ఏరా నటించలేనని భయపడు తున్నావా?

నీల: ఆ ఆ....నీతో ఐదేళ్ళు ఏకశెయ్యా శయనం, ఏకపాత్రా భోజనం కదా! ఆ పాటిబుద్ధి మాంధ్యాన్ని నటించే శక్తినే సంపాదించ లేక పోతే నీ సహవాస బలమేమిటోయ్!

కన : (అప్పటికి చదవడం పూర్తిచేసి) బావా!

ఆనం: (కనకాన్ని సమీపిస్తాడు, నీలకంఠం, సుందరంలు పఠకాన్ని గురించి మాటలు అభినయిస్తూ ఉంటారు.)

కనం: దీన్ని ఇలా మారుస్తే బాగుంటుందేమో.

ఆనం: ఏమిటి ఇదే అక్షరాల జరగాలని లేదు కనకం! ఇవి సూచనలు మాత్రమే! ఆ తరువాత ఆ శుకవిత్వమే.

నీల: మరి మన మొకమారు చూసుకోవద్దూ.

ఆనం: ఇలాంటి నాటకాలకి రిహార్సిల్సు పెడితే, అశ్వంకాక, గుఱ్ఱంగాక గుశ్యమైపోయే ప్రమాదంఉంది.

సుం: అవును. సమయస్ఫూర్తితో అప్పటికప్పుడు సంభాషణల్లు సృష్టించు కోవాలి మరి.

ఆనం: ఆహా! వీడికీ అందుకుంది. నీలకంఠం బాబాయ్. ఏం కనకం ఇంకా ఏమయినా అనుమానాలు?

నీల: మరే అనుమానాల్లేవుగాని....కార్యోన్ముఖులం కావలసిందే. ఏవయ్యా డైరెక్టరూ. నేం చెయ్యవలసిన పనేవిటి?

ఆనం: ద్వారపాలకవృత్తి! బావగారొస్తున్న జాడ తెలియగానే గుప్ చిప్‌గా వొచ్చి చెప్పండి ప్రారంభిద్దాం.

నీల: సరే (కండువా దులిపి, భుజాన వేసుకుని ద్వారం వైపు వెడుతూ ఆగి) అన్నట్టు ప్రసాదరావుకంటే ముందు రాజశేఖరమే విజయం చేస్తేనో?

కన: అప్పుడాయనకూడా ఇందులో ఒక పాత్ర ధరిస్తారు.

సుం: ఆహా ఈవిడకీ అందుకుందిప్పుడు (అంతా నవ్వుకున్నారు కనకంకూడ నవ్వుకుంటూ వెళ్ళిపోయింది. లక్ష్మి గదిలోకి నీలకంఠం బైటకు వెళతారు)

(ఆనందం సుందరాలు మాట్లాడుకుంటూ ఉంటారు)

నీల: (పరుగున ప్రవేశించి) ఒస్తున్నాడొస్తున్నాడు. అమ్మా కనకం (కనకం లోపలనుంచి వచ్చింది)

ఆనం: (నీలకంఠంవైపువస్తూ) ఎవరు నాన్నా?

నీల: ఆ నాన్నే....అహ కాదుకాదు. నా మతిమండ రాజశేఖరం కాదు. ప్రసాదమే వొస్తున్నాడు. ఛ....చ....అదికాదు. ఉభయులూ వస్తున్నారు.

ఆనం: ఏఁవిటండి (వీధిలోకి ఒక అడుగువేసి....లోపలకొచ్చి) అవును ఇద్దరూ వస్తున్నారు.

నీల: (కండువా చేత్తో పుచ్చుకొని. బాగా రంగస్థలం ముందుకొచ్చి నిల్చున్నాడు, ఆనందం సుందరాన్ని రంగస్థలానికి మధ్యగా లాగాడు, తనూ ఎడమ క్రిందగా నిల్చున్నాడు. కనకం సోఫానానుకుని నిలబడింది, అందరూ దాదాపు ప్రేక్షక ముఖంగానే నిల్చున్నారు.)

నీల: ఏమయ్యా డైరెక్టరూ! నేను Sitting గా Standing గా

ఆనం: standing (అనగానే నీలకంఠం తన వెనకనే ఉన్న Stool మీద కూర్చుంటాడు)

నీల: (సౌంజ్ఞలతో) ప్రారంభించవయ్యా బాబు! నాకేం తోచడంలేదు.

ఆనం: (నీలకంఠంతో) బావగారు లోపలకు రాగానే సైగ చెయ్యండి ప్రారంభిద్దాం.

నీల: సరే అలాగే (రా॥శే॥ ప్రసాదరావులు లోపల అడుగు పెట్టడం గమనించి) రడీ స్టార్టూ!

ఆనం: వెధవ స్వతంత్రాలు మీరూనూ. ఎవడి జీవితంమీద వాడికే అధికారంలేదు ఈ కొంపలో.

సుం: ఇప్పుడు నా వల్ల పొరపాటేమిటి?

(ప్రసాదరావు ప్రవేశించాడు క్షణం ఆగి తిరిగి తన గదివైపు కదిలాడు, రాజశేఖరం కూడ వచ్చాడు)

నీల: నీకు నువ్వయి శుభలేఖలు వేయించేంత స్వతంత్ర మెలా తీసుకున్నావని.

(ప్రసాదరావు శుభలేఖల ప్రస్తావన రాగానే ఆగాడు. నిలుచుని వింటున్నాడు. రాజశేఖరంకూడా వింటున్నాడు)

ఆనం: (కనకంతో) ఇక్కడెవ్వరి మాటా లేకుండా ఈ సంబంధానికి సమ్మతించే అధికారం నీ కెవ్వరిచ్చారు.

కన: నా మాట నమ్మవేం? నేను సమ్మతించలేదు మొర్రో అంటే.

ఆనం: ఆ! సమ్మతించలేదు! ఏమీ జరక్కుండానే ఇంతవరకూ వచ్చింది ఈ వ్యవహారం.

నీల: నిజమేనమ్మా! ఇప్పుడెంత ప్రళయం జరిగిందో గమనించావా?

ఆనం: దీనికంతకూ కారణం మీరు.

నీల: (నాటకంలో బాగమో కాదో తెలియక) నేనా?

ఆనం: ఆ....అతను సంబంధాల ప్రస్తావన తెచ్చేసరికి మామాట లేకుండా మా తరుపున మీరు మాట్లాడ్డం ఏమిటి?

నీల: ఏఁమయ్యా (సుందరంతో) నేనా?

ఆనం: అవును మీరే! వీరంచరి సమ్మతి తీసుకొని మరీ వొచ్చానని చెప్పారు కదండీ. గొప్ప మర్యాదస్తులు, (గాద్గిదికంగా) నాకైతే దిక్కులేక, మా తండ్రి వ్యద్దులు కావడంవల్ల మీ మధ్య వర్తిత్వానికి అంగీకరించవలసి వచ్చింది.

నీల: ఇదేఁవిటయ్యా?

ఆనం: ఇహచాలు commission కక్కుర్తికి ఇలాంటి పనులా? పైగా చిరకాలంనుంచి మా ఇంటతిని మాలో ఒకరుగా మసలిన మీరు ఆయనతో చెప్పిందేమిటి?

నీల: ఏం చెప్పాను?

ఆనం: దీనిపేరు మహలక్ష్మి?

నీల: ఏఁవయ్యా? నే నలా చెప్పానా? అసలు నేను చెప్పింది నీకు గుర్తుందా?

సుం: ప్రతి అక్షరం గుర్తుందండి పైగా ఎంత వర్ణన! మమ్మల్ని మాట్లాడనిచ్చారూ? ఆ మహలక్ష్మి సాక్షాత్తూ కనకమహాలక్ష్మినని.... గుణంలో.

నీల: ఆగాగు. మహలక్ష్మి .... కనకమహలక్ష్మినా? నీ మతి మండినట్టే ఉంది. నే నన్నది ఈ కనకలక్ష్మి సాక్షాత్తు మహలక్ష్మిని!

సుం: మీ రలాగే అన్నట్టు గుర్తండి!

నీల: (కనకం ఆనందంవైపు తిరిగి) అదిగో దిగాడు! వొచ్చాడు గుర్తు దగ్గరకు!

సుం: ఏఁవిటోనండి కొంచెం పేర్లు తకరాలయాయి క్షమించండి.

కన: మరి తండ్రిపేరుకూడ ఎలా మారిపోయిందండీ ?

నీల: ఈ బుద్ధిమంతుడు ఏదిమార్చిన మార్చేయగలడు.

సుం: మరీ అన్యాయంగా మాట్లాడకండీ!

ఆనం: లేకపోతే తండ్రిపేరు రాజశేఖరం ఎమిట్రా?

సీల: అవునదేమిటయ్యా?

సుం: అదేమిటయ్యాని నన్నడుగుతారేమిటి? ఆ శుభలేఖలో ఉండే ప్రతి ముక్కా మీరు చెప్పిందేనండి. ఒక పెద్దమనిషిని ఇలా నిలదీసి అవమానించడం బాగాలేదు. రాజశేఖరంగారి పెద్దకూతురు ఈ ఇంటినంతటిని ఎంతో తెలివితేటల్తో చక్కదిద్దుతుంది. ఇంకా ఇంకా.

నీల: అదా నే నన్నది? బాగుంది. బహు బాగుంది. ఇదిగో బాబూ దీని మాటకేమిగాని మాట (సుందరం దగ్గరకొచ్చాడు) ఈమధ్య కొంత కాలం విశాఖపట్నంలోగాని మకాం వేయవలసి వచ్చిందేమిటి మనం.

సుం: (చిరుకోపంతో) ఏమిటండీ?

నీల: రాజశేఖరానికి ప్రాణానికి ప్రాణం - పెద్దకూతురు లాంటిది అని నే నంటే అలాంటిది కాస్త పీకిపారేసి "పుత్రికారత్నం" అంటూ శుభలేఖలు వెలగబెట్టావు?

కన: అది సరేనండీ మీరూ మీరూ ప్రాణస్నేహితులు కదామరి. మీరు చేసుకోవాలనుకున్న అమ్మాయి (అనందాన్ని చూపించి) ఇతనికి చెల్లెలు అవునో కాదోకూడా తెలియదా?

సుం: సరి! సరి! ఈ (నీలకంఠంతో) మీ పేరేమిటి?

నీల: పేరు నీలకంఠశాస్త్రి ఏమీ?

సుం: ఆ! ఈ శాస్త్రిగారి మధ్య వర్తిత్వంలో సాగుతున్న ఈ సంబంధం మా ఆనందానికి కావలసిన వాళ్ళని నాకు తెలియనే తెలియదు.

ఆనం: మంచి తెలియక పోవడమే! ఛ! ఛ! ఏంవిట్రా యీ పనులు. శుభ లేఖలు సీయంతట నువ్వే అచ్చువేయించడమేమిటి? ఆ పిల్ల దిక్కులేందను కున్నావా?

సుం: ఆవిడకు దిక్కులేక పోవడమేం! నేనే దిక్కులేనివాడ్ని, మా తండ్రిగారు వృద్ధులు, అనారోగ్యులు కావడంవల్ల, నా వివాహం త్వరలోనే జరగాలని పట్టుబట్టారు వీరు (నీలకంఠం) మా తండ్రి గారి మాటల సందర్భంలో "మా అభ్యంతరం లేకపోతే మీ అభ్యంతరంకూడా ఉండదోవని, నిరభ్యంతరంగా శుభలేఖలు కూడా.

నీల: కూడా అచ్చువేయించుకోవచ్చని, మాటవరసకన్నాను. కనుక విషయాలు తేల్చుకోకుండా నిర్ణయాలు జరకుండా ఈ తప్పుల తడక. ఈ శుభలేఖలు అచ్చువేయించు కొస్తావన్నమాట!

సుం: మేం సమ్మతించిన తరువాత పిల్లతండ్రికూడా

నీల: తండ్రి అంటే ఈ రాజశేఖరం.

సుం: ఆ రాజశేఖరం.

నీల: (ఆనందంతో) చూసావయ్యా ఇతని తెలివితేటలు. ఇందాకిందాక చెప్పానా! మళ్ళీ రాజశేఖరం తండ్రట బాబూ-ఏవిటి బొబ్బిల్లోగాని పుట్టావేమిటి?

ఆనం: అది సరే ఏదో జరిగింది. మరీ శుభలేఖలు మా ఇంట్లో కెలా వచ్చాయి. ఎవరికిచ్చావు నువ్వు?

సుం: (మాట్లాడడు)

ఆనం: ఏరా?

సుం: (కనకాన్ని చూస్తాడు)

ఆనం: (కనకంతో) ఆహ అయితే ఈ నాటకంలో నీకూ భాగమున్న దన్నమాట.

కన : (సుందరంతో) ఏం జరిగిందో దయచేసి చెప్పండి.

సుం: నాకు జరిగిన అవమానంకూడా నేనే చెప్పుకోవాలంటే ?

నీల : అవమానమేమిటి ?

కన : ఈయన ఒకనాడు నీలకంఠంగారు అంటూ వచ్చాడు.

ఆనం: నీలకంఠంగారికోసం ఇక్కడి కెందుకు?

నీల : ఇదేకదయ్యా నా Postal address.

ఆనం: సరె సరె. ఆ! వచ్చి.

కన : ఈ శుభలేఖలుకట్ట నాకిచ్చి డిశెంబరు 31వ తారీఖున ముహూర్తం అని చెప్పండి అన్నారు. మరి కాసేపట్లో నీలకంఠంగారు వస్తారు కూర్చోమన్నాను. కాఫీతెచ్చి ఇచ్చాను. అదేపనిగా నన్ను చూస్తున్నారు.

నీల : ఊ!

కన : అబ్బ! నాకు చెప్పడం చేతకాదు. (సిగ్గు అభినయిస్తూ)

ఆనం: ఊహూ! అవకతవక పనులు చేయడం చేతనొచ్చు!

నీల : నువ్వు ఉండు ఆనందం. పోనీ నువ్వు చెప్పవయ్య సుందరం.

సుం: మీరేనా. మహలక్ష్మిగారిని అడిగాను: ఏమిటి సంగతన్నారావిడ.

ఆనం: అంతవరకూ ఆవిడ్ని చూడ్డంకూడా జరగలేదన్నమాట. మా గొప్పగా ఉందయ్యా!

సుం: నా పరిస్థితి అలాంటిది. అసలు పెళ్ళే ఇష్టంలేని నాకు ఎలాగైనా పెళ్ళయి కోడల్ని చూడాలని ఆ వృద్ధుడి ఆర్తుత. అనుకోని ప్రమాదం సంభవించకుండా ఆయన కోరిక నెరవేర్చాలని నాతపన. ఈ కారణంవల్ల సర్వం వీరయిన వీరి పేరేమిటి?

నీల : పేరు నీలకంఠంశాస్త్రి ఏమి?

సుం: ఆ యీ శాస్త్రిగారిమీద వేశాం.

ఆనం: సరే! కానియ్యవోయ్ త్వరగా! సొద.

నీల : తర్వాత ఏముంది? మీరే పెళ్ళికూతురని సెలవిచ్చివుంటారు. ముసి ముసి నవ్వులమధ్య అవునా అమ్మా! అవును ఎవర్ని సంప్రదించి చేశారని గద్దించాను. వేళాకోళం అనుకొని ఏదో హాశ్యంచేస్తూ జవాబిచ్చాడు. దాన్తో నాకు వళ్ళుమండి నానా దుర్భాషలాడి వెళ్ళమన్నాను.

నీల : ఓరి నీ యిల్లు బంగారంగాను. (రాజశేఖరం లక్ష్మి గదిలోకి వెళ్ళాడు. ప్రసాదరావు అక్కడే ఉన్నాడు.)

సుం : మీ ప్రమేయం బొత్తిగా లేనట్లు మాట్లాడకండి.

ఆనం: ఆగండి ! తర్వాత !

సుం : మాట్లాడకుండా నేను వెళ్ళిపోయాను.

ఆనం: మరి శుభలేఖల్ని మరిక్కడెందుకు తగలెట్టావ్ ? నీతోనే తీసుకు పోలేక పొయ్యావూ ?

సుం : ఆవిడే వద్దన్నారు. పైగా రెండోవాడికి తెలీకూడదన్నారు.

ఆనం: బాగుంది. నీమానాన నువ్వు వెళ్లావు. ఇక్కడ మహా ప్రళయం జరిగింది. ఇంతకీ నీకు నీపెళ్ళయి పోయిందా ?

(రాజశేఖరంవచ్చి ప్రసాదరావును లోపలకు తీసుకొని వెళ్లాడు.)

సుం: నా పెళ్లికోసం, నా సుఖంకోసం ఏ ముసలి హృదయం తపించి పోయేదో ఆ నా తండ్రి యిహ బాధపడడు.

ఆనం: ఏమి ?

సుం: ఆయన శాశ్వతంగా దూరమైపోయారు. (కళ్ళనీళ్ళు రాజశేఖరం ప్రసాదరావు లేరన్న సంగతి గమనించిన నీలకంఠం హడావిడిగా వచ్చి)

నీల : స్టాపు ! ప్రేక్షకులు లేరు. లోపలకు వెళ్లారు.

ఆనం: వోరి బడుద్దాయ్! బావగారిని నమ్మించడానికి నాలుగబద్దాలు మాట్లాడరా అంటే అనవసరమైన అబద్ధాలు దేనికిరా రాస్కెల్.

సుం: కాదానందం అదిమాత్రం నిజం. నాకు తండ్రిలేడు, ప్రపంచం లేదు.

నీల : (వస్తూ) Ready వొస్తున్నారు.

(కాని ఎవ్వరూ మాట్లాడలేకపోయారు. రాజశేఖరం ప్రసాదరావు ప్రవేశం. ప్రసాదరావు చేతిలో ఒక తెల్లకాగితం ఉంది. వస్తూ మడతపెట్టి జేబులో పెట్టుకుంటున్నాడు. (లక్ష్మికూడ వెంట వచ్చింది.)

ప్రసా: (గొప్ప ఆనందంగా ఉన్నాడు) అయితే సుందరంగారూ :
(అందరూ ఉలిక్కిపడి ప్రసాదరావు ఉండడాన్ని గమనించ
నట్లు నటించారు.) నా పేరు ప్రసాదరావు. ఈమె....

సుం: శ్రీమతి లక్ష్మి గ్రహించాను.

లక్ష్మి: (నాకు తెలుసే అని అభినయించింది. మీకు వ్రాసి ఇచ్చిన కాగితంలో సుందరంగారు యీయనే అనికూడ చెప్పింది సొంజల్లో కాని ఎవ్వరికీ అర్థంకాలేదు, ప్రసాదరావుకు తప్ప.)

ప్రసా: అది సరే - (శుభలేఖ తీసికొని) ఈ శుభలేఖలో యీపేరు నీది కాదుట.

లక్ష్మి: (అదేమిటని కనకాన్ని చూసింది.)

ప్రసా: (సుందరాన్ని చూపిస్తూ) ఈయన (నీలకంఠంని చూపిస్తూ) ఈ యన్ను మధ్యవర్తిగా ఉంచి....

నీల : నా ఖర్మకాలి....

ప్రసా: (కనకాన్ని చూపిస్తూ) ఈమెను పెళ్లికూతురుగా నిర్ణయించుకుని మతిమరుపువల్ల కనకలక్ష్మికి బదులు మహాలక్ష్మి పేరుతో (రాజ శేఖరాన్ని చూపిస్తూ) యీయన్ను తండ్రిగా శుభలేఖలు అచ్చు వేయించుకొచ్చారుట.

లక్ష్మి: (కనకం దగ్గరకు వెళ్ళి అవునా అన్నట్లు చూస్తుంది.)

కన : (జవాబుగా నీలకంఠాన్ని చూస్తుంది.)

లక్ష్మి: (నీలకంఠం దగ్గరికి వెళ్ళి అవునా అని పలకరించింది.)
(కనకం, నీలకంఠం, ఆనందం ముగ్గురూ నిజమేనని తల
లూపారు.)

లక్ష్మి: (లక్ష్మి ప్రసాదరావు వద్దకు వచ్చి వెల వెల బోయింది. అయ్యో అంటూ నోరు నొక్కుకుంది. నమస్కరిస్తూ సగం నవ్వుతో బ్రతిమాలుకుంటూంది. ఏదో అవాంతరం జరిగిందని అందరి ముఖాలు వెలవెల బోతున్నాయి.)

ప్రసా: (లక్ష్మితో) ఏం! అలా వెలవెలా బోతున్నావు? నువ్విచ్చిన కాగితం వాళ్ళకు చూపించొద్దూ. చూపించకపోతే ఎలా?

ఆనం: ఏమిటి ? ఆ ఏమీలేదు బావగారూ ! మీ రిహార్సిల్స్‌లో లక్ష్మిని చేర్చుకోడం మరిచిపోయారా ?

అందరు: (అనుకోకుండా) అయ్యో !

ప్రసా: అమ్మా కనకం ! ఇక్కడ మీ ప్రయత్నం తెలియక లక్ష్మి అసలు శుభలేఖల విషయాల్ని తెలియజేస్తూ ఇప్పుడే నా కిచ్చిన యీ కాగితం చదువమ్మా.

(అందరూ నిర్ఘాంతపోయారు.)

కన : (చదివి) (ఇహ నిల్చోలేక పరుగున వెళ్ళింది వంటింట్లోకి)

ఆనం: (ఆనందం క్రిందపడ్డ కాగితాన్ని తీసి చదివి సిగ్గుపడి కాగితాన్ని నీలకంఠం చేతిలో ఒదిలి పరుగులాంటి నడకతో బయటకు వెళ్ళిపోతున్నాడు.)

ప్రసా: ఎక్కడకు బావగారు? మాట.

ఆనం: (ఆగకుండా) Hospitalకి మా ఆవిడకు వొంట్లో బాగాలేదు: (వెళ్ళాడు.)

ప్రసా: (నవ్వి) ఆహా మీ రోగం కుదిరిందన్నమాట. (నవ్వి చదువుకున్న నీలకంఠంతో) ఏఁవండీ ?

నీల : (కాగితాన్ని రాజశేఖరం చేతులో ఒదిలి లక్ష్మికి ఎదురుగా నిల్చుని) దీన్నా ! దీన్ని చంపినా పాపంలేదు. వాళ్ళువాళ్ళు వొహటయ్యా ! (వెళ్ళిపోతున్నాడు.)

ప్రసా: (బాగా నవ్వి) ఎక్కడకండీ ? మీతో పనుంది.

నీల : ఆ పనిమీదే వెళుతున్నాను. ముహూర్తం పెట్టించుకొస్తాను. (వెళతాడు)

రాజ: (ఉత్తరం చదువుతున్నాడు.)

ప్రసా: ఏం మామగారు ఈ ఇంట్లో ఒక ఔత్సాహిక నాటక సమాజం వుందే ?

రాజ: ఏఁవోయ్ సుందరం? ఇలా అయిపోయిందే వ్యవహారం (సుందరం మాట్లాడడు)

ఆనం: (సుందరంతో) ఏం బావగారు, తమరు రచయితలుట! ఈ విషాదాంతానికి మీరే కర్తలా?

సుం: ఇది నా ఉద్దేశం కాదండీ!

ప్రసా: ఎవరిదైనా ఇంత ప్రయత్నం దేనికంటారు?

సుం: (మాట్లాడడు)

ప్రసా: అసలు విషయం చెపితే నేను నమ్మనేమో నని భయం అవునా.

సుం: అవును.

ప్రసా: నన్నుమించిన మంచివారు మీ అందరూ అని (Silance) మీరు మంచివారు అని మీరే అనుకున్నంత వరకూ ఫరవాలేదు. అది మీ హక్కు-కాని ఎదుటివారు సత్యానికి, ధర్మానికి విలువ నివ్వలేని దుర్మార్గులూ అనుకునే హక్కు-మాత్రం మీకులేదు.

సుం: చూశారా చూశారా అందరూ జారుకుని నన్ను ఒంటివాడ్ని చేశారు నన్ను క్షమించండి.

ప్రసా: అలా ఒదిలి పెడితే ఎలా మీకు తగిన శిక్ష కావలసించే అలా కూర్చోండి. కళ్ళుమూసుకుని కూర్చోండి మాట్లాడకుండా కూర్చోండి. మేం చెబుతాం అప్పుడు తెరవండి (బలవంతాన కూర్చోబెట్టాడు. కళ్ళుమూసుకునే వరకూ వూరుకోలేదు. పాపం అలానే కూర్చున్నాడు. సైగతో రాజశేఖరాన్ని లోపలకు వెళ్ళమన్నాడు. కనకాన్ని తీసికుని తీసికొచ్చి కళ్ళుమూసుకున్న సుందరం ఎదురుగా నిలబెట్టి వాళ్ళు జారుకున్నారు. విసిగెత్తి కళ్ళు తెరచిచూచే సరికి ఎదురుగా కనకాన్ని చూస్తాడు. మంద హాసంతో పలకరించాడు.)

కన: మీ తండ్రిగారు పోయినందుకు చాలా విచారిస్తున్నాను.

సుం: అందుకే భగవంతుడు మనల్నిద్దర్ని ఒకచోట చేర్చాడు (నిశ్శబ్దంగా పురుషోత్తం పటంముందు నిల్చున్నాడు. వెనుకనుంచి రాజశేఖరం లక్ష్మి ప్రసాదంలు ఆనందం, నీలకంఠంలు ఆనందంతో యీ దృశ్యం చూస్తుండగా మంగళ వాయిద్యాల మధ్య

—తెర—

Blank page

132

కనకపుష్యరాగం
రా ఘు వ

రు. 2-50

రాజశేఖరంగా వాసుదేవరావు ఆ పాత్రలోని అంతఃసంఘర్షణను చక్కగా ఒప్పించగా ఆనందం పాత్రను శ్రీ కబీరుదాసు హుందాగా నిర్వహించారు. కనకంగా శ్రీమతి పి. నవీనలక్ష్మి తన పాత్రకు జీవం పోసింది. మూగపిల్లగా నటించిన అమ్మాయి ఆ పాత్రకు ముమ్మూర్తులా ఒప్పింది. సుందరంగా శ్రీ కె. లక్ష్మణరావు నటన ఆకర్షణీయంగా వుంటే నీలకంఠంగా హాస్యనటుడు సండూరి వెంకటేశ్వరరావు నటన నవ్వులు కురిపించింది. చక్కని నాటకాన్ని రాసిన శ్రీ రాఘవ దాన్ని నీట్‌గా ప్రదర్శించిన ర. స. న. సమాఖ్యవారు అభినందనీయులు.

ఆంధ్రజ్యోతి దిన పత్రిక 22-11-67

శ్రీ రాఘవ వ్రాసిన 'కనకపుష్యరాగం' నాటకాన్ని ర. స. న. సమాఖ్యవారు ప్రదర్శించినపుడు ఆబాలగోపాలంగా గల ఆడియన్స్‌ను రచన - నటీనటుల నటన రెండూ కూడా రంజింప జేశాయి. నాటకంలో యితివృత్తం కన్నా ముఖ్యమైనది సన్నివేశాన్ని పెంచి పరిపోషించటం - రచయిత రాఘవ సన్నివేశ కల్పన చక్కని డ్రామాను రూపొందించ గలిగింది.

ఆంధ్రపత్రిక దిన పత్రిక 12-11-67

అరుణా పబ్లిషింగ్ హౌస్
నాగేశ్వరరావుపంతులు రోడ్డు,
గాంధీనగరం :: విజయవాడ-3.

రామాయణం

రాఘవ

ములు
ర్షింగ్ హౌస్,
ాయవాడ. 2

Blank page

కనకపుష్యరాగం

(నాటకం)

రాఘవ

అరుణా పబ్లిషింగ్ హౌస్

నాగేశ్వరరావుపంతులు రోడ్డు,

గాంధీనగరం :: విజయవాడ-3.

ప్రచురణ నెం. 29

ప్రథమ ముద్రణ, 1971.

ప్రతులు : 1000

సర్వ హక్కులు ర. స. న. సమాఖ్య, విజయవాడ

ధర : రు. 2-50

యీ నాటకం ప్రదర్శించు వారు ముందుగా ర. స. న. సమాఖ్యవారి అనుమతిని పొందండి.

అడ్రసు: :
ర. స. న. సమాఖ్య
ట్రావలెర్స్ లాడ్జి,
పూర్ణానందంపేట,
విజయవాడ-2.

ముద్రణ :
సోమేశ్వర ప్రింటింగ్ ప్రెస్,
విజయవాడ-2.

ముఖచిత్రం :
ర. స. న. సమాఖ్య,
విజయవాడ వారి చిహ్నం.

అంకితం

విశాఖపట్నం

నకమహాలక్ష్మికి.

కె. వెంకటేశ్వరరావు,

రాఘవ

భక్తితో —

పీఠిక

"నీ జీవితంలో నువ్వు వూహించలేనంత గొప్ప మార్పు జరిగితే ఒక్కసారి తెలీపర్చు. ముఖ్యంగా రచయితగా నువ్వు ఎలా మారావో తెలపాలి అందులో....తెలుసా"—అని ఒకసారి మిత్రుడు శ్రీ గొల్లపూడి మారుతీరావు చిత్తూరు వెడుతూ, విజయవాడ స్టేషన్లో వీడ్కోలు సందర్భంలో అన్నాడు.

నవ్వి వూరుకుంటే బావుండేది—నేను. కానీ అలా జరగలేదు.

"నాకో నాటకం వ్రాయాలనివుంది. అది వ్రాయటం జరిగితే రచయితగా నాకు కలిగేది గొప్ప మార్పే" అన్నాను.

"శుభం" అని అనలేదుగానీ, అన్నట్టుగా మాత్రం చూసి అభినందించాడు.

వాడి అభినందనబలం, వాడ్ని 'రాగ రాగిణి' నాటక రచయితగా తెలుగునాట నాటక లోకానికి పరిచయం చేసిన శ్రీ కె. వెంకటేశ్వర రావుగారి కోరికకు తురాయిలై నన్ను 'కనకపుష్యరాగం' నాటకానికి రచయితగా చేర్చింది.

"నన్ను ఓ నాటకం వ్రాయమని, అది ర. స. న. సమాఖ్యకు కావాలని" ఓసారి శ్రీ వెంకటేశ్వరరావుగారు కోరారు.

"నేను కథలు, నవలలు వ్రాసుకుని బ్రతుకుతున్నవాణ్ణేగానీ, ఎన్నడూ నాటకాన్ని వ్రాయలేదని, ఏవో రేడియో నాటకాలు మాత్రం వ్రాశానని, ప్రదర్శనకు పనికివచ్చే నాటకాన్ని ఎన్నడూ వ్రాయలేదని నేను యాదృచ్ఛికంగా అన్నాను.

ఆయన నవ్వి-ఉత్సాహపరుస్తూ-"మీ రిచ్చిన మీ నవలలు అవీ చదివాను. మీరు నాటకం వ్రాయగలరనే ధైర్యం నాకుంది. అన్నట్లు మీకో కథ చెబుతాను.....రండి"—అని నన్నూ, మరికొందరి మిత్రుల్ని వెంటేసుకుని, ఆయన దిగిన ఒక హోటల్ గదిలోకి తీసుకువెళ్ళి, చక్కగా కథ చెప్పారు. చెబుతూ కొన్ని మార్పులు వారూ, కొన్ని నేనూ చేస్తూ చెప్పుకోవడం జరిగింది.

తరువాత నేను నాటకం వ్రాయాలనే నిర్ణయానికి వచ్చాను. అయితే రంగస్థల వివరణ, దాని పరిచయం నాకు అంతగా తెలీకపోవడంవల్ల, నాకు సన్నిహితుడుగా వుంటున్న మిత్రుడు శ్రీ ఎం. ఎస్. ఆర్. శాస్త్రిని సహాయంగా యివ్వవలసిందిగా శ్రీ వెంకటేశ్వరరావుగారిని కోరాను. ఆయన సరే నన్నారు.

ఆనాటినుండి నాకు 'కనకపుష్యరాగం' నాటక రచనలో శ్రీ ఎం. ఎస్. ఆర్. శాస్త్రి ఓ చెయ్యిగా వుండిపోయాడు.

అతనికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఆ నాటకాన్ని తర్వాత శ్రీ వెంకటేశ్వరరావుగారు, ఆయన అల్లుడు శ్రీ పాత్రోగారు కలసి చేర్పులూ - మార్పులూ జరిపి రసవత్తరంగా వుండాలనే దృఢనిశ్చయాన్ని వెలారుస్తూ, రూపొందించారు.

అందుకు శ్రీయుతులు వెంకటేశ్వరరావుగారినీ, శ్రీ పాత్రోగారినీ తలుస్తూ అభినందిస్తున్నాను.

ర. స. న. సమాఖ్యవారు ఈ నాటకాన్ని అభివృద్ధిలోకి తీసుకువస్తారని ఆశిస్తూ మీనుండి సెలవు తీసుకుంటున్నాను.

—రా ఘ వ.

నటరాజు శ్రీ కె. వెంకటేశ్వరరావుగారు పశ్చిమ గోదావరిజిల్లా చాగల్లు గ్రామములో 1923 వ సంవత్సరం నవంబరు మాసంలో జన్మించారు. వీరి విద్యాభ్యాసం ఏలూరు, తెనాలి, రాజమహేంద్రవరంలో జరిగింది. నాటకరంగంలో వారి చిరస్మరణీయకృషికి నాందీ ప్రస్తావన వారు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో విద్య నభ్యసించునప్పుడు ఒథెల్లో అను ఆంగ్లనాటకములోని బ్రబాంటియో పాత్రతో జరిగింది. తరువాత వారు తెలుగు నాటకరంగంలో ప్రవేశించి మొదటసారిగా పింగళి వెంకట రామయ్యగారి కరిణీకం, శ్రీ ముద్దుకృష్ణగారి టీ కప్పులో తుఫాను అను నాటికలలో ప్రముఖ పాత్రలు ధరించి ప్రఖ్యాతిని పొందారు. తెలుగు నాటకరంగంలో వారి విజయ పరంపరాలకు ప్రథమ సోపానం నాటకం అనే నాటకంలోని రఘుపతి పాత్రను విజయవాడలో సాంస్కృతిక సమావేశాల సందర్భంగా జరిగిన పోటీలలో ఉత్తమ నటుడుగా ఎన్నిక కావడం అప్పటినుండి వారు అనేక నాటక, నాటికలలో అనేక విధములైన పాత్రలను ధరించి అనేక పరిషత్తులలో ఉత్తమ నటులుగా ఎన్నికయ్యారు. 1959 సంవత్సరంలో ఢిల్లీలో జరిగిన అఖిలభారతీయ భాషల నాటక పోటీలో అభిల భారత ఉత్తమ నటుడుగా ఎన్నికయ్యారు.

శ్రీ కె. వెంకటేశ్వరరావుగారు. 1954 వ సంవత్సరంలో ర. స. న. సమాఖ్యను స్థాపించుటయేగాక దర్శకత్వం బాధ్యత వహించి మా వూరు, మాస్టర్జీ, ఆకాశరామన్న, దొంగవీరడు, రాగరాగిణి, కనకపుష్యరాగం మొదలగు నాటకాలను ప్రదర్శించి ఆంధ్రప్రజల ఆధరాభిమానములను చూరగొన్నారు. వారు కనకపుష్యరాగం నాటకానికి చేసినకృషి అపారమైనది. ఆ నాటకం పొందిన ఘనవిజయాలు, ఆంధ్రప్రజల ఆదరాభిమానాలే అందకు తార్కాణమని 'వేరే' చెప్పనక్కరలేదు.

ఇట్లు,

బి. గంగాధరరావు.

కార్యదర్శి

ర. స. న సమాఖ్య.

నా మాటి

కనకపుష్యరాగం ఒక్క ర. స. న. సమాఖ్యకే
కాకుండా యావదాంధ్ర చరిత్రకే గర్వకారణం
మిగిలిన విషయాలు ఆ నాటకాన్ని అభిమా
నించిన ఆంధ్రప్రేక్షక మహాశయులకే
యెక్కువగా తెలుసు.

కె. వెంకటేశ్వరరావు.
స్టేజి డైరెక్టరు.
ఆంధ్ర విశ్వవిద్యాలయం.
వాల్తేరు.

పాత్రలు :	పాత్రధారులు :
రాజశేఖరం	శ్రీ కె. వెంకటేశ్వరరావు
	శ్రీ యన్. వాసుదేవరావు
ఆనందం	శ్రీ సి. హెచ్ కబీరుదాసు
నీలకంఠం	శ్రీ యస్. వెంకటేశ్వర్లు
ప్రసాదరావు	శ్రీ యమ్. సుధాకర్
సుందరం	శ్రీ పసుమర్తి శేషగిరిరావు
	శ్రీ కె. యల్. రావు
	శ్రీ యమ్. వెంకటేశ్వరరావు
	శ్రీ సిహెచ్. ప్రసాద్
కనకం	శ్రీమతి పి. నవీనలక్ష్మి
	కుమారి ఎ. రాజేశ్వరి
లక్ష్మి	కుమారి సిహెచ్. బృంద. శాయికుమారి

దర్శకత్వం: శ్రీ కె. వెంకటేశ్వరరావు సంగీతం : శనగశెట్టి రాధాకృష్ణ

నేపధ్యగానం: కుమారి చంద్రకాంత

ఆర్గనైజర్సు:	ట్రేజి ఆర్గనైజర్సు:
పి. సోమయాజులు	సి. సోమేశ్వరరావు
బి. గంగాధరరావు	వి. వి. నారాయణ
బి. ఉమామహేశ్వరరావు	

పాల్గొన్న పరిషత్తులు—

పొందిన బహుమతులు

జగన్నాధగిరి	ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటి, ఉత్తమ సహాయనటుడు, ఉత్తమ ద్వితీయ రచన, ఉత్తమ సంగీతం.
గొల్లప్రోలు	ఉత్తమ ప్రదర్శన.
L. K. N. రాజమండ్రి	ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ హాస్యనటుడు, ఉత్తమ రచన, ఉత్తమ దర్శకత్వం.
కల్చరల్ ఆర్టు సెంటర్, రాజమండ్రి.	ఉత్తమ ద్వితీయ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ హాస్య నటుడు, ఉత్తమ రచన.
గెద్దనాపల్లి	ఉత్తమ ప్రదర్శన.
తాడేపల్లిగూడెం	ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ హాస్యనటుడు, ఉత్తమ రచన.
ఆంధ్రనాటకకళా పరిషత్తు	ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ హాస్య నటుడు.

యీ నాటకాన్ని ఆకాశవాణి విజయవాడ కేంద్రంవారు రెండుసార్లు ప్రసారము చేసారు.

పాటలు, పద్యాలు :

ఆచార్య చింతపల్లి హనుమంతరావు,

B. S. G. పాత్రో.

కనకపుష్యరాగం

(నాటకం)

రాఘవ

పాత్రలు :

రాజశేఖరం
నీలకంఠం
ప్రసాదరావు
ఆనందం
సుందరం
కనకం
లక్ష్మి

రాజశేఖరం : (వంటయింటిలో నుండి వస్తూంటాడు. లోపలనుండి కనకం గొంతు).

కనకం : మావయ్యా! రెక్క మీద వెళ్ళు.

రాజ : ఆ! సరే!

కన : ఏం కదిలావా?

రాజ : (చదరంగం బల్లముందు కూర్చొని ఆడుకోంటూ) ఎంత సేపటికి ఈ ఆట కట్టించలేక పోతున్నా నేమిటి?....ఊ కనకం.... ....కనకం... కనకం ఇలా రామ్మా ఓ సారి.

కన : (లోపలనుండి) ఎందుకూ?

రాజ : ఎందుకేమిటమ్మా! ఒక్క-సారి ఇలారా!.....ఏవమ్మా కనకం! ఏమిటి ఇందాకన్నుంచి పిలుస్తుంటే రావూ! కనకం! కనకం!!

కన : (వస్తూ) ఏమిటి మావయ్య! ఊరికే పిలుస్తావు....ఏ పనీ చేసుకో నివ్వకుండాను.

రాజ : ఊరికే నేనెందుకు పిలుస్తాను. ఇక్కడ కొంపలు అంటుకు పోతుంటే. ఈ ఆట ఇందాకట్నించి కట్టడం లేదు.

కన : బాగుంది ఇక్కడ నీతో ఆడుతూ కూర్చుంటె. అవతల పనంతా ఎవరు చేస్తారు చెప్పూ ఒక వైపేమో గడియకోక్షణానికో పెళ్ళి చూపులకని వాళ్ళొస్తారాయె. మరొక వైపేమో లక్ష్మీ వస్తుందాయె! కొత్త ఏదన్నా చెయ్యాలా లేదా ఇక్కడ నీతో ఆడుతూ కూర్చుంటె ఎలా?

రాజ : అయితే సరేలేవమ్మా నా తిప్పలేవో నేను పడతాను (మళ్ళీ ఆటలో పడుతాడు)

కన : కోపం వచ్చిందా మావయ్యా? మరీ ఇంత చిన్న పిల్లాడివేం? అయినా ఇప్పుడే ఆటలమటి చెప్పు? ఇదసలు ఆడుకొనే సమయమా?

రాజ : ఊ! ఖర్మఉన్న ఒక్క కొపలా ఊడింది. శకటు గోవింద! ఊ ఎవరిక్కావాలి?

కన : వైలొచ్చే వేళయింది! నువ్వు స్టేషన్‌కు వెళ్ళాలి.

రాజ : అవున్లే!....ఒక్క క్షణం. మరో క్షణంలో మనల్ని బేడీవేసి తీసుక పోతారు....ఓరి ఏబ్రాసి వెధవా?

కన : ఓయ్ రాజా! నిన్నే! లేవయ్యా లేస్తావా మీసాలుచ్చుకొని లేపనా?.....ఏమిటోయ్ అలా చూస్తావ్? నెచెప్పేది నీ కర్థం కాలే? ఇదిగో నీ కండువా....ఓయ్ ఓయ్ నీ చేతికట్టరేది? ప్రతిదీ అందించాలి. ఇంకా కూర్చొన్నావేమిటి స్టేషన్‌కు వెళ్ళక అవతల బండి వచ్చే వేళయింది. త్వరగా తెమలు....ఏమిటి మామయ్యా అలా చూస్తావ్?

రాజ : అమ్మ రాక్షసి పిల్లా! నీ మాటలు వింటుంటే ముమ్మూర్తులా మీనాన్న పురుషోత్తం అనిపించిందే.

కన : (నవ్వింది),

రాజ : వాడూ ఇంతే ! నన్నొక పసివాడిలాగ చూస్తూ ప్రతీదీ చెప్పి చేయించేవాడు దగ్గరుండి.

కన : ఇప్పుడా పాతగాధ అంతాదేనికిగాని, నేనేమో ఇల్లు సర్దాలి నువ్వు త్వరగా స్టేషన్‌కు బయలుదేరు మావయ్య.

రాజ : సరే సరే ! (వంటింట్లోకి వెళ్ళబోవును)

కన : అదిగో మళ్ళీ....అటెక్కడికి.

రాజ : మంచినీళ్ళు తాగొస్తానమ్మా (లోపలికి వెళ్ళును).

కన : (అటు ఇటుచూచి) బా....వా....

ఆనందం : ఓయ్....ఏమిటి పిలచావు ?

కన : ఏం చేస్తున్నావ్ ఒక్కడివి ?

ఆన : గోళ్ళు గిల్లుతున్నాను.

కన : ఎవరివి ?

ఆన : వేళ్ళవి ?

కన : మంచిపనేగాని లక్ష్మి ఇవ్వాళ వస్తుంది గదా అలా స్టేషన్‌కువెళ్ళి దాన్ని తీసుకురారాదు బావా ?

ఆన : సరే తీసుకొస్తాగాని ఏమిటి అలా అధికారం చెలాయిస్తున్నావ్ భార్యానను కుంటున్నావేమిటి ?

కన : భార్యేమిటి ? ఎవరికి ?

ఆన : ఎవరికో నాకు.

కన : నీకు నేను భార్యానా ?

ఆన : కాదేమిటి మరి ?

కన : ఎప్పుడు ?

ఆన : మన పెళ్ళయిన తరువాత.

కన : అబ్బా! చేసుకోలేవేమోనని పాపం! అసలు నిన్నెవరు చేసుకుంటారు? ఎవరు చెప్పారు?

ఆన : ఎవరా (దగ్గరకు లాక్కొంటాడు),

కన : అబ్బ వదులు ఏమిటి పరాచకాలు మావయ్య వస్తాడు.

ఆన : ఓస్! మా నాన్నేగా వస్తేరానీ మరీ మంచిది తొందరగా పెళ్ళన్నా చేస్తాడు.

కన : ఆహా! కులుకుదామని! మావయ్యా! (బిగ్గరగా)

ఆన : (చేయివదలి) ఏమిటా గావు కేక?

కన : ఓస్! అంతేనా నీ ధైర్యం! మావయ్యా అని పిల్చేసరికి బయపడిసవాడివి, నిన్ను చేసుకోను.

ఆన : మరెవర్ని చేసుకుంటావైతే?

కన : మాంచి ధైర్యస్తుడ్ని.

ఆన : ముసలాడైనా సరేనా?

కన : ఆహా! మావయ్య కంటె పెద్దవాణ్ణయినా సరే.

రాజ : (లోపలి నుండి వస్తూ) ఏమిటమ్మా మావయ్య అంటున్నావ్?

ఆన : అహా మన ఇద్దరిలో ఎవరు ధైర్యస్థులా అని.

రాజ : ఒరే! ధైర్య విషయం చెప్పాలి పొస్తే నెనేరా! దాంట్లో నాకుచాలా యోగ్యతాపత్రాలున్నాయి. అరవై ఏళ్ళవాడు ఆరేళ్ళవాడు ఒకటే నన్నారు. అంటే ఇప్పుడు నాకు అయిదు సంవత్సరాలు అయిదు నెలలు. వాళ్ళకుండే ధైర్యం ఎవరికుంటుందోయ్. అయిదేళ్ళ వాడ్ని పిలచి ఎర్రని నిప్పు బొగ్గు చూపించి ఇది మిఠాయి అంటే కట్టిక్కున నోట్లో వేసుకుంటాడు. నేనూ అంతే మరిప్పుడు ఎవరు ధైర్యస్థులం?

కన : ఖచ్చితంగా నువ్వే మావయ్య! నిన్నే పెళ్ళి చేసుకుంటాను.

ఆన : ఆ....ఆ! చేసుకో ! చేసుకో!

కన : ఏం చేసుకుంటాను. ఎంతమంది ఈ ప్రపంచములో మావయ్యను చేసుకోవడం లేదు. పైగా ఎప్పుడూ నా చెప్పు చేతల్లో ఉంటాడు పసి పిల్లాడిలా నే చెప్పినట్టు వింటాడు.

ఆన : ఆవును బాగుంది. అలా చేసుకుంటే ఇటు భర్త లేని లోటు తీరుతుంది. అటు పిల్లల్లేని లోటూ తీరుతుంది.

రాజ : ఆ ! ఇహ చాలు నోరుమయ్యా! ఏం మాట్లాడాలో తెలియదు.

కన : పిచ్చి నాయన.

ఆన : చూసారా నాన్న.

రాజ : కాక పుతేమిపిరా, నిన్న కురగాయలు తేరా అంటే నాశిరకంలోని మంచివన్ని ఏరి తెచ్చేవయ్యే పైగా ఖరీదు ఎక్కువ పెట్టి.

కవ : తెలివి తక్కువ సన్యాసి (నవ్వుతూ)

రాజ : ఈ బిరుదు బాగుందమ్మోయ్

ఆన : నేను సన్యాసినా ? మీ రూరుకోండి నాన్న ఇలా నెత్తి నెక్కించుకుంటె.

కన : మావయ్యా మొన్న పండక్కి ఓ చొక్కా కుట్టించాడు ఆహా అది తొడుక్కుంటే అచ్చు కాషాయరంగు బట్టలు వేసుకొన్న సన్యాసే గుర్తు కొస్తాడు.

ఆన : సంతోషించాం ! నువ్వూ కొని కట్టావుగా ఓ ఎర్రచీర ఆరోజు నిన్ను చూస్తే ఓహో కాకమ్మ పెళ్ళికూతురైనట్టుంది.

కన : నీ కళ్ళు మసకబ్బడానా ? నేను నల్లగా ఉన్నానా?

ఆన : మరయితే నేను సన్యాసినా !

రాజ : అబ్బబ్బ మళ్ళీ వాదనలో పడతారేమ్రా ! ఓరేయ్ ఆనందం వూరుకోరా !

ఆన : ఆమాటముందు కనకానికి చెప్పి దానోన్నొరు కట్టించండి ఇండాక ట్నుంచి చూస్తున్నాను. తెగవాగేస్తుంది.

కన : నా నోరు కట్టించమని మావయ్యను వేడుకొనేబదులు నీ నోరు కట్టుకొని నువ్వే ఇక్కణ్ణుంచి స్టేషన్‌కుపోరాదూ సగం గొడవన్నా తగ్గుతుంది.

ఆన : నువ్వెవరివి? నన్ను మా యింట్లోంచి పొమ్మనటానికి నీకెవరిచ్చారీ అధికారం ?

రాజ : ఒరెఒరె ఒకళ్ళిచ్చేదేమిట్రా దానికి? మన అందరిపట్లా అన్ని అధికారాలూ ఆ పురుషో త్తముడే ఇచ్చి వెళ్ళాడు. నేనే అన్నిటికీ సమాధానపడి వుంటే మధ్య నీ కెందుకురా అంత ఉక్రోషం ?

కన : ఆటకట్టు ! ఇహ మాట్లాడకు వెళ్ళు రైలొచ్చే వేళయింది.

రాజ : మరి నన్ను వెళ్ళ మంటివి గదమ్మా?

కన : నువద్దులే మావయ్యా వెళ్ళ లేవు ఈ రొడ్లమీద! ఆనందం బావని వెళ్ళనీ చూడు నువ్వుమాత్రం ఇక్కడే ఉండి ఒక పని చెయ్యాలి.

రాజ : ఏమిటది ?

ఆన : కాబోయే దంపతులు, చదరంగం ఆడుకొంటూ ఉండండి.

కన : ఏమిటా మాటలు చిన్నా పెద్దా లేకుండా ! ఆయ్ !

రాజ : నిజమేనమ్మా ! వాడన్నదీ ఆడుకోనా ఎంచక్కా.

కన : ఇంకానయం ! ఇప్పుడేం ఆట్టానికి వీల్లేలేదు. నేను వంటపని చేసు కొనేలోపుగా నువ్వు ఇక్కడ పెళ్ళి చూపులువారికి కూర్చునేందుకు ఏర్పాట్లన్నీ చేస్తూండాలి మావయ్య (ఆనందంవంక చూచి) ఇంకా ఇక్కడే నుంచున్నావేమిటి ? స్టేషన్‌కు వెళ్ళక.

ఆన : అహ దేనిమీద ఎలావెళ్ళ లో ఇంకానువ్వు చెప్పలేదని నుంచున్నాను.

కన : రిక్షామీద వెళ్ళు జాగ్రత్తగా రైల్వేస్టేషనుకువెళ్లు రేడియో స్టేషన్‌కు మాత్రం చేరుకోకు-తెలిసిందా ?

ఆన : ఆహా ! ఇంక తెలియకుండా ఎందుకుంటుంది. (వెళ్ళిపోవును)

కన : ఏమిటి మావయ్యా మళ్ళీ ఆటలో కూర్చొన్నావ్ - నేను చెప్పే దేమిటి నువ్వు చేసేదేమిటి ?

రాజ : ఏదమ్మా! నువ్వు వంటింట్లోకి వెడితేగా ఇక్కడ నేను ఏర్పాట్లు చేయడం ప్రారంభించేది - అందుకని ఈ లోపల ఓ ఆట ఆడుదా మని కూర్చొన్నాను. ఆట భలేగా ఉందిలే ! చూడు ! చూడు

కన : నే చూడ్ను ముందు నీ చదరంగం అపేసి లే మావయ్య ఆ నీల కంఠంగారు ఎప్పుడు ఆ పెళ్ళివారిని వెంట బెట్టుకొస్తారో ? ఏమో ? ఎక్కడ పని అక్కడ నిద్రపోతుంది. ఇవన్నీ ముందు సర్దు మావయ్య,

రాజ : సరే నువ్వెళ్ళు నే చూచుకుంటాను,
(కనకం లోనికివెళ్ళును సర్దటము తెలియక తికమకపడును)

రాజ : కనకం ! కనకం !

కన : (వస్తూ) ఏమిటి మామయ్య ?

రాజ : ఎలా సర్దాలో తెలీడం లేదమ్మ ! ఏమీ చేతకావడం లేదు. మరీ గొడవగా వుంది.

కన : పోనీలే మావయ్య ! దాన్ని గురించి నువ్వేం బాధపడకు. నేను సర్దుతాలే.

రాజ : చూడమ్మ కనకం నాకు తెలియక అడుగుతాను ఈ సారైనా లక్ష్మి పెళ్ళి స్థిరవడుతుందంటావా ?

కన : అదేమిటి మావయ్య ! ఎందుకంత అనుమానం ? ఇంకా వాళ్ళు వచ్చి చూడంటే ? ఏ విషయం మాత్రం ఏఁ ఊహిస్తాం ?

రాజ : నాకేమిటో ! లక్ష్మికి సంబంధం చూచుకుంటానికి ఎవరన్నా వస్తున్నారంటేచాలు, నాకు గుండెదడగా వుంటుందమ్మా.

కన : ఆ ఆ ! ఆకుర్చీతీయకు, మావయ్య ఆ టీపాయి తీసుకురా, ఆక్కడ వేయ్.

రాజ : ఇక్కడ వేయనా ?

కన : ఆ ! అది !

రాజ : ఆ కనక మహాలక్ష్మి దయవల్ల ఈ సంబంధం కుదిరితే.

కన : నాదయకేం లోటుంటుందిలే మామయ్యా! అంతగా ఇదికుదరకపోతే నేనెటూ ఉన్నాను లక్ష్మిని చేసుకోవటానికి. అసలింత గొడవలేక పోను లక్ష్మి మగాడై తెనూ! మావయ్య ఆ చిరిచాప ఆ గోడకు ఆనేటట్టుగా వేయ్.

రాజ : నువ్వెటూ మా పిల్ల వేనమ్మా! నువ్వు పుట్టగానే మా కోడలుగా మీ నాన్న ఆదేశించాడు.

కన : నాతోనూ మానాన్న అన్నాడుగా....తాను లేకపోతే నువ్వు నే లేక పోతే నీ కొడుకూ అనాధలౌతారని, ఆ కుర్చీ ఇటువ్వు....కొంచెం ఈ టేబిల్ పట్టు....

రాజ : ఇన్ని విధాలుగా నన్ను ఆదుకున్నవాడు ఇంకొక్క సహాయం చేసి పోతే ఇంతబాధ నాకు లేకపోను.

కన : ఏమిటా సహాయం ?

రాజ : ఒక కొడుకును కూడా కనుంటే....

కన : పాపం ! మరో కూతురుంటే నీకు పెళ్ళాం లేని లోటు తీరును.

రాజ : అమ్మా రాక్షసి పిల్లా ! ఏడుపులోకూడ నవ్వగల శక్తి నీది, అచ్చు మీ నాన్నవేనే!

కన : (కుర్చీలు సర్దిన తరువాత) అమ్మయ్య ఇప్పుడెలా వుంది ?

రాజ : రూపంలేని నాచేతగాని తనానికి ఓరూపం వచ్చి నట్లయింది (కనకం లోనికి వెళ్ళిన తరువాత కుర్చిలో కూర్చొని ఒక ఉత్తరంతీసి చదు

వును అదిలప్పీ వ్రాసిన ఉత్తరం రూపంలో గేయం వినబడు తుంది)

మూగదానా అసహాయురాల
దిగులు బ్రతుకులో తెగినవీణా ॥మూగ॥
కన్నవారికి బరువుగా చెల్లరాని
చెల్లిపోని తల్లిలేనిలేగనూ కన్నీళ్ళు
నిండిన కడలినీ॥ మూగ॥

కన : ....(పాయసం గ్లాసుతో లోపలనుండి వచ్చి) మావయ్య.....
పాయసం మావయ్య.... నీ మంత్రి గోవిందా.

రాజ : ఆ! కాకూడదే....ఏమిటమ్మా అది?

కన : పాయసం మావయ్య.

రాజ : వంటంతా అయిపోయినట్టుంది....మా తల్లే ఎప్పుడు చేసావమ్మా? ఏవిటో, ఏమో నాపనులు చేసుకోవడం ఎప్పటికి చేతనవుతుందో ఏమో మీ నాన్న నన్నింత చేత కాని వాణ్ణిగా చేసి పోయాడమ్మా,

కన : పోనీ లే మావయ్య - ఇప్పుడు నీ పనులు నువ్వు చేసుకోవలసిన అవసరం ఏమిటి? నేనుండగా?

రాజ : మీ నాన్న అంతే! ఇలాగే ఓదార్చేవాడు. తన జీవితం చాలించే వరకు తన సుఖం కూడా కాదని, నా జీవితాన్నే సరిదిద్దేవాడు. చివరికి ఆ తాపత్రియంతోనే తన తనువు చాలించాడు (కంఠం రుద్ధం అయింది) "ఓరేయ్ శేఖరం నేను మిమ్మల్ని అందర్ని విడిచి వెడుతున్నందుకు నాకేం బాధలేదు. నా కూతురు ఏమయి పోతుందని దిగులు నాకు లేదు. కాని నేను లేకుండా నీ జీవితాన్ని ఎలా నెట్టుకు రాగలుగుతావో అన్నదే నన్ను వేదిస్తోంది" అన్నాడు చివరిగా. (కళ్ళనీళ్ళు నింపుకొని) వాడి ఆత్మీయత, నీ అనురాగం చాటున మేం ఈ అవిటి వాళ్ళం, నిశ్చింతగా బ్రతుకు తున్నామమ్మా.

కన : అవిటి వాళ్ళేమిటి? మరీ ఇదిగా మాట్లాడుతావు?

రాజ : కాక మరేమిటమ్మా? ఒకడు వయస్సు మల్లినవాడు. మరొకడు మతిలేనివాడు - మూడవది మూగదీనూ.

కన : మరి నాలుగో అవిటి దానిమాట! (నవ్వుతుంది)

రాజ : ఆ కనకమహాలక్ష్మి దయవల్ల ఈ సంబంధం కుదిర్తే—మీ ఇద్ద పెళ్ళిళ్ళూ ఒకేసారి చేద్దామని నా ముచ్చటమ్మా.

కన : నీ ఆనందంకన్న మించిన ఆనందం నాకులేదు మావయ్యా, నే బ్రతికున్నంతవరకూ నువ్వు ఒంటివాడివి కాకూడదు. ఇదే నా జీవిత లక్ష్యం.

రాజ : మాతల్లే!

కన : మరి నే వస్తా మావయ్యా! అవతల యింకా పని అలానేవుంది. మరి నే వెడతా....(అని వెళ్ళిపోబోతుంది.)

రాజ : కనకం....కాసేపు చదరంగం ఆడుకోనా

కన : కాదు—ఇందాక మహాలక్ష్మి ఉత్తరం చదువుతూంటే మధ్యలో అంతరాయంతెచ్చాను—చదువుకో—

రాజ : అవునవును. (కనకం వెళుతుంది)

(రాజశేఖరం కూర్చొని ఉత్తరంలాంటిగేయం చదువుతుంటాడు. నేపద్యంలో పాట వినిపిస్తుంది. పాటలో తను నిమగ్న మయాడు. వీధిలో)

కన్నవారికి తెలియరాని భారమైన బాలను
మారలేని కాసును కన్నీళ్ళు నిండిన గాధను
మూగదానా అసహాయురాల దిగులు బ్రతుకుల
తెగిన వీణా .... తెగిన వీణా ॥మూగ॥

(వీధిలోంచి) ఆనందం! ఆనందం! (అంటూ సుందరం పిలుపు

వినిపిస్తుంది. రాజశేఖరం వినలే దా పిలుపుని, సుందరం ప్రవేశిస్తాడు. లాల్చీ — పైజమా — గొప్ప సంస్కారం అతనిలో ద్యోతకం అవుతూ వుంటుంది.)

సుం : ఆనందం! ఆనందం లేడాఅండి!....?

(అప్పటికీ ఆ పిలుపు వినిపించుకోడు.)

సుం : ఏమండీ! ఆనందం లేడా?

(పాట ఆగింది రా॥శే ఈ ప్రపంచంలోకి వచ్చి)

రాజ : (హఠాత్తుగా సుందరాన్ని గమనించి) ఎవరు? ఆ! పెళ్లివారే! అమ్మా కనకం వచ్చేశారు — వాళ్ళు వచ్చేశారు. (సం॥తో) కూర్చోండిబాబూ! (సుందరం కొద్దిపాటి ఆశ్చర్యంతోనే కూర్చుంటాడు.) నీలకంఠం మీతో రాలేదా(ఏమిటి?

సుం : నీలకంఠమా?

రాజ : అవును, నీలకంఠం....మిగతావారు—

కన : (ప్రవేశించి) ఏమిటి పిల్చావా! (క్రొత్తవ్యక్తిని గమనించి అరె! వచ్చేశారే! నమస్కారమండీ! మా నీలకంఠంగారు తమతో రాలేదా!

సుం : ఏమిటండీ?

రాజ : వాడిమొఖం—ఉభయానికి వేళ అయిందని వెనుకపడిఉంటాడు— మర్యాదా మప్పిదం లేకుండా—క్షమించండిబాబు (కనకం లోపలికి పనిమీద వెడుతుంది.)

సుం : అదికాదు! మీరు దేన్నిగురించి మాట్లాడుతున్నారో!....

రాజ : మరేంలేదు. మిమ్మల్ని ఒంటిరిగా పంపిన ఆ నీలకంఠం అమర్యాదకు మేం బాధ్యులం (కనకం కాళ్ళకు నీళ్ళతో వచ్చింది, నీళ్ళు వీధి గుమ్మంలోవుంచి వచ్చేలోగా)

సుం : ఆ నీలకంఠం ఎవరో నాకు తెలియదండి.

కన : (ప్రవేశించి) కాళ్ళు కడుక్కోండి—తతిమ్మావారు వెనకబడ్డారా ?

రాజ : ప్రయాణం సుఖంగా జరిగిందా నాయనా!

సుం : క్షమించాలి, నేను ఎపర్నానుకొంటున్నారో! నేను ఆనందం స్నేహితుణ్ని — మావూరు వెడుతూ — ఓసారి చూచిపోదామని వచ్చాను. వాడికి ఉత్తరంకూడా వ్రాశాను Stationకు రమ్మని.

రాజ : సరి, సరి, నువ్వు పెళ్ళివారితాలూకూ కాదూ !

కన : ఎవరై తేనేంగాని ! ముందు కాళ్ళు కడుక్కోండి. ఈలోగా మీ ఆనందం వస్తాడు (అంటూ లోపలికి వెళ్ళింది కనకం.)

రాజ : అ పద నాయనా ! ఆ పన్నెయ్యి ! మంచి సమయానికి వచ్చావు. మా తరుపున మాట మంతికి ఉందువుగాని.

(సుందరం చెప్పులు విడిచి వీధిలోకి వెడతాడు. రాజశేఖరం కనకానికి ఏదో పని చెప్పటానికి లోనికి వెడతాడు. సుందరం వీధిలోంచి కాళ్ళు కడుక్కొని, వొచ్చి కుర్చీలోకూర్చోబోతుండగా లక్ష్మి ఉత్తరం చూస్తాడు. ఆఖరి చరణాలు సాఫీగా చదువుతాడు. తరువాత దృష్టి చతురంగం బల్లపైపు మళ్ళుతుంది. బల్లముందు కూర్చొని ఆట ఆడుతుంటాడు. పాట సాగుతూ వుంటుంది.)

ఎవరికై యీ పూవు విరిసెనో
ఎవరి గళమున మాల నవుదును
ఎన్నిమారులు వరాన్వేషణ, ఎన్నిమారులు యీ నిరాశా
ఎవరినీ నే నెవరిదాన
ఎవరినీ నే నెవరిదాన ॥మూగ॥

రాజు : ఏఁవోయ్.

సుం : (పాటనుంచీ, ఆటనుంచీ తేరుకొని) రండి కూర్చోండి.

(పాట ఆగింది.)

రాజ : (చతురంగం బల్లపైపు దృష్టి సారించి) ఏమోయ్ నీకూ చదరంగం ఒచ్చాఏమిటి ? అ అరె ! ఆట కట్టిందే. చిత్రం—

సుం : నాకు పెద్ద అలవాటు లేదండి, ఆటలో, ఏదో అప్పుడప్పుడు సరదాగా ఆడుతుంటాను.

రాజ : ఆ ఆ అయితేమాత్రం అమోఘంగా ఆడేశావ్ (కనకం రెండు కప్పుల కాఫీతో ప్రవేశం) ఈ నా ప్రపంచలో నా ఆట కట్టించినవాళ్ళుఇద్దరే ఇద్దరు. ఒకడు పురుషోత్తం (ఫొటోను చూపించి) రెండు ఈ కనకం (కనకం చిన్నగానవ్వింది) మళ్ళీ నువ్వు ఇదిగో మూడోవాడివి. మా భేషయినవాడివోయ్. (కాఫీలు అందుకుంటారు)

కన : (కాఫీతో ప్రవేశించింది.)

సుంద: మీరూ తీసుకోండి.

రాజ: నాకు ఈ ఇంట్లో రొండోసారి కాఫీకి అధికారంలేదు నాయనా! కనకం చూశావా ! మనకు తెమలని ఆటని ఇతడు యిట్టే కట్టేశాడు.

కన : లేకపోతే మనమేనా ఏం ఈ ప్రపంచంలో ఘనులం ?

సుం: (నవ్వుతో అంగీకరించాడు) ఈ పురుషోత్తంగారు.

రాజ: వాడు-నేను అనేక సమస్యలతో రాజీనైతే, ఈ పురుషోత్తం వాటిని పరిష్కరించే చదరంగం.

సుం: (నవ్వి) బాగుంది అది సరే మీరు పాటలు వ్రాస్తారాండీ!

రాజ: సరి సరి, దీన్ని నే వ్రాశాననుకున్నావా? నేను ఉత్తరమే వ్రాయలేను.

కన: ఈయనకు చదరంగం తప్ప మరేమీ చేతకాదండి. తిండి తిప్పలు కూడమరొహళ్ళు గుర్తుచెయ్యాలిసిందే.

రాజ: (ఆ మాటకునవ్వి) మా అమ్మాయి వ్యక్తం చేసుకొన్న తన హృదయం నాయనా అది.

సుం: ఏమిటి? మీరు వ్రాసారా? (కనకంతో)

కన: ఏ నేను ఆయన కూతుర్నను కుంటున్నారా!

సుం: ఏం కారా?

కన: ఏ(మామయ్యా నేను నీ కూతుర్నా (అడిగింది నవ్వుతూ రాజశేఖరాన్ని)

రాజ: కాకపోతే ఏం? ఇది నాకు పెద్ద కూతురులాంటిది. మా కనకం సాహిత్తు మా మహాలక్ష్మి. ఇది లేకపోతే మేం అంటే ఈ ముసలి పసివాడు - నా మూగపిల్ల అంటే ఈ గేయం వ్రాసిందే - అది. (సుందరంలో విష్మయం ఆ గేయంపట్ల) మా మతిలేనివాడు అంటే నీ స్నేహితుడు ఆనందం—

సుం: ఈ గేయం ఓ మాటరాని మగువ వ్రాసిందా? (దూరాన్నుంచి పాట వినిపిస్తుంది) దిగులుకూ, నిరాశకూ, నిర్వచనంగా నిలిచేజీవితాలను కూడ ఎంతో విలువగా మార్చగలిగే ఈ మధురమైన పదాలు ఓ మూగవోయిన మనసు వ్యర్థం చేసుకున్నావా? (ఇంతసేపు పాట సాగుతుంది.)

రాజు: (అలా పాట సాగుతుండగనే) అవున్నాయనా! విధి ధష్టమైన మా మహాలక్ష్మి హృదయ నివేదన. భగవంతుడు ఏ అతిలోక స్వప్నాన్ని కంటూనో, దాని రూపురేఖల్ని తీర్చి దిద్దాడు—గొప్ప సాహిత్య సంపత్తిని—వెన్నెలాంటి వెన్నల్లాంటి హృదయాన్ని అమర్చాడు.

సుం: కాని ఏం లాభం చెప్పండి—తన సాహిత్యాన్ని, తన భావసంపదని, లోకానికి ఎలుగెత్తి చాటుకొనే శక్తిని ప్రసాదించటం మరచిన తరవాత—?

రాజ: మ్చ్! నాకు నా జీవితంలో మరో సమస్యలేదు నాయనా దాన్ని ఓ ఇంటిదాన్ని చెయ్యడం ఎలా అన్నదే అన్నదే నన్ను వేధిస్తున విషయం-

సుం: ఒహో అదా ఇందాకటి హడావిడి, పెళ్ళి చూపులకు ఎవరైన వస్తున్నారా అండి?

రాజ: మరే నాయనా! ఇది నాలుగోసారి, నాలుగో వూరునుంచి చూపులకు రావడం, ఈ సారి ఏం కానుందో?

సుం: మరి అమ్మాయి ఇంట్లోనే వున్నారా అండి!

రాజ: వస్తుంది. (కనకం దిష్టితీసి సామాగ్రిని ఓ మూల Table మీద ఉంచింది.) ఈ పాటికి రావల్సిందేమరి. తీసుకరావటానికే వెళ్ళాడు ఆనందం—

కన: ఆనందం అంటే గుర్తుకొచ్చింది, ఆనందం బావ ఇంకా రాలేదేం? రైలుగాని లేటా?

సుం: ఆవిడ ఎక్కడనుంచి రావాలి?

కన: మద్రాసునుంచి మెయిల్‌లో రావాలి! అక్కడ Dumd&Deaf School లో చదువుకొంటున్నది. (రాజశేఖరం ఆటలోవున్నాడు)

సుం: మద్రాసు మెయిల్లోనా? దాంబోనేగా నే వచ్చింది.

కన : బాగుంది. ఇతను తప్పక రైల్వేస్టేషనుకు బదులు రేడియోస్టేషనుకే వెళ్ళిఉంటాడు. (రా॥శేతో) విన్నావా మావయ్యా! మద్రాసు మెయిల్ ఇందాకనే వచ్చిందట.

రాజ : మూడో ఎత్తుకు ఆటకట్టు — ఈపాటికి ఆనందం వస్తుంటాడు సందేహంలేదు.

సుం : ఏవిటి చదరంగం జ్యోతిష్యం పలికిందా అండి! (కనకం ఆనందం నవ్వారు)

రాజ : మీకు నవ్వులాటలాగావుంటుంది. తప్పక వస్తాడని పందెం.

కన : ఈ యింటి బావ యింటికి చేరుకోక ఏమవుతాడు !

సుం : (నవ్వాడు) కాదులెండి. వాడు అంతటివాడే, ఇంటికని బయలు దేరినవాడు సరాసరి ఇంటికే చేరుకోవడం విడూరంకదూ.

సుం : అందుకని పందెం ! అవునాండి.

రాజ : అహ అదిగాదు అదిగో నూరేళ్లు వాడికి

మోహనా మురళీధరా
పున్నమి విరిసే, కన్నులు మెరిసే
పొన్నలు పొగడలు పరిమళించెరా ॥రామోహనా॥
యమునా నదిలో పొంగిన అలలా
పరువము నీకై పలువరించెరా

లక్ష్మి—ప్రవేశం.

ఎన్నాళ్ళిగతి వేచెద నీకై
నీరజనాధా నిలువగవేరా
దయగనిరారా నను చేకోరా
ప్రేమగ పిలిచితి నీదాననేరా ॥రామోహనా॥

(బయటనేవున్న లక్ష్మితో గట్టిగా)

అమ్మా లోపలికి రాకు అక్కడే వుండు. (ఆనందంతో) ఒరేయ్ దానికి దిష్టి తీసేవరకు అక్కడే ఆపు. (ఆనందం వెళ్లాడు. నేపధ్యంలో వయొలిన్ తీగమీద అవ్యక్తమైన గేయం గీయం సుందరానికి స్ఫురిస్తుంది. భాష తెలీదు. కాని అంతకు ముందే పరిచయమయిన భావంతో—నాదంలో చరణాలు సాగుతున్నాయి. రాజశేఖరం ఒక కుర్చీని తన్నుకొని మరీ వెళ్ళాడు; కనకం దిష్టితీయటానికి వెళ్లింది. అందరూ వెలుపలే వున్నారు. ఆనందాతిశయంతో సుందరం యీ హడావిడికి అడ్డంలేకుండా; ఓమూల

నించున్నాడు.) (రాజశేఖరం ప్రక్కన లక్ష్మితో లోపలకు వచ్చాడు. సాగుతున్న పాట ఆగింది. కనకం కాళీచెంబు మొదలైన దిష్టి సామాన్లతో వీధిలోంచి లోపలికి వెళ్ళింది. ఆనందం బెడ్డింగు పుచ్చుకొని లోపలికి వెళ్ళాడు.)

రాజ : రామ్మా! నీకోసం కళ్ళు కాయలు కాచిపోయాయి. (కూర్చుంది. అందరిని మూగచూపులతో పలకరించింది. సుందరాన్ని మటుకు చూడలేదు. లక్ష్మి రాకవల్ల కలిగిన ఆనందంలో సుందరాన్ని పరిచయం చేయాలనే సాంప్రదాయాన్ని మరిచారు అందరూ) మా చిట్టితల్లే — ఎన్నాళ్ళయిందో నిన్నుచూసి. నిన్ను తల్చుకోని రోజులేదు—క్షణంలేదు. కులాసాయేనా తల్లీ! పరీక్షలు బాగా వ్రాశావా?

లక్ష్మి : (అన్నిటికి నవ్వుతూ తల ఊపుతుంది.)

ఆనం : (లోపల్నించి వస్తూ) అబ్బబ్బ! ఈ రైళ్ళను గుర్తుపట్టడం అనేది పెళ్ళి పందిట్లో అవతలి బంధువు లెవరో తెలుసుకోవడం కంటే మహా యిబ్బందిగావుంది. అన్ని రైళ్ళు ఒకేమాదిరిగా ఒకే రంగులో వుంటాయి. మద్రాసునుంచి వచ్చే రైలేదో తెలీదు — మద్రాసు పెళ్ళేదేదో తెలీదు. (మూలనున్న సుందరం ముందుకు వస్తూ)

సుం : అంటే మద్రాసునించి వచ్చేరైలు, రైలులాగాను, మద్రాసువెళ్ళే రైలు స్టీమరులాగా—వుండాలంటావు!

ఆనం : ఏమిరో యబ్బీ! నువ్వెప్పుడొచ్చావు? (లక్ష్మి లేచి నిలుచుంటుంది సుందరాన్ని చూస్తుంది. అందరూ అతన్ని చూస్తారు.)

సుం : మీ చెల్లెలు దిగిన బండిలో ప్రయాణంచేసి—మీకంటె ఓ గంట ముందు ఇక్కడకు చేరుకున్నాను.

ఆనం : (తప్పు చేసినవాడిలాగా) అహాఁ - అదేలే - అవునవును - గంట క్రితమే వచ్చుంటావు.

కనకం వస్తుంది.

రాజ : మరి నువ్వేం ఇంత త్వరగా తెమిలావు ?

ఆనం : (మరింత కంగారు,) ఆ- అ-ఇపుడే వస్తానుగా. ఈ కోటితీసి,....
(అంటూ లోపలికి వెళతాడు.)

కన : అదేవిటి ? ముద్దాయిలాగా వారుకున్నాడు. ఏం జరిగిందేమిటి?

లక్ష్మి: (నవ్వుతూ కనకం చేతిమీద వ్రాస్తుంది.)

కన : ఎందుకూ ! రిక్షావాడితో తగాదా !

లక్ష్మి: (లక్ష్మి మళ్ళీ వ్రాస్తుంది.)

కన : (నవ్వుతూ) ఊ—

లక్ష్మి: (మళ్ళా వ్రాస్తుంది.)

కన : (మరింత నవ్వుతూ) ఊ—

లక్ష్మి: (మళ్ళా వ్రాసి—తనూ నవ్వుతుంది.)

కన : అయ్యో రాత ! అనుకున్నంతా పని చేశాడు. (సుందరంతో)
చూశారండి మీ స్నేహితుడి తెలివితేటలు.

సుం : ఏమిటండీ ?

రాజ : ఏం జరిగిందమ్మా ?

కన : ఆ రిక్షావాడితో ఏం బేరమాడాడో ఏమో—వాడు తిన్నగా రేడియో
స్టేషన్‌కి తీసుకు వెళ్ళాట్ట అక్కడ రిక్షావాడూ- బావా చట్టాపట్టాలు
పట్టుకున్నారట.

ఆనం: (వస్తూ) ఏడిశాడు. నేనేమో పోలీస్ స్టేషన్ ప్రక్కవీధిలోకిఅని
బేరమాడాను. ఆ వెధవ రేడియో స్టేషన్ ప్రక్కవీధిలోకి తీసుక
వెళ్ళాడు. పైగా "నువ్వు" "నువ్వు" అని మీది, మీదికి వస్తాడూ,
పాతేద్దును. రాస్కెల్.

రాజ : ఇంకానయం ! వాడు బుద్ధిమంతుడు కనుక అంతటితో ఆగాడు.
అసలు నీ మతిమరుపు వదిలేట్టెగా బాదవలసింది.

ఆనం: అదికాదు ! నాన్న

రాజ : ఆ ! ఆ ! ఇక చాలు ! నువ్వు తప్పక : రేడియో స్టేషన్ ప్రక్క సందులోకే అని బేరమాడివుంటావు.

సుం : అయినా నీకు, ఆ రేడియోస్టేషన్‌కి ఏవిట్రా ఆ అవినాభావ సంబంధం ?

ఆనం: ఏడిశావులేవోయ్ ! నోరు మూసుకో ! ఓడు, ఓడు అంటే అందరూ ఓడేనా ?

సుం : అదికాదులే ! ఏదో వుంది, ఇందాకట్నుంచి ఇంటేల్లపాదీ నువ్వు చేయబోయే ప్రమాదాన్ని వూహిస్తూనేవున్నారు. రేడియోలో ఉద్యోగాని కేమైన ప్రయత్నిస్తున్నావేరా ! (కనకం లోపలికివెళ్ళింది నవ్వుతూ)

లక్ష్మి: (నవ్వింది.)

ఆనం : ఇదిగో యీవిడే కారణం.

లక్ష్మి: (నవ్వుతూనే) నేనా (అన్నట్టు చూస్తుంది.)

ఆనం: ఆ నువ్వే ! నీ చెక్కిలు, గేయాలూ, రేడియో వ్యవహారాలు వీట్ని గురించి రెండు రోజులకొకసారైన ఆ రేడియాస్టేషన్ చుట్టూ తిరుగుతున్నానాయె ! అందుకని అలవాటున—

సుం : (హఠాత్తుగా ఒక విషయం జ్ఞప్తికి తెచ్చుకొని) ఆ - అన్నట్టు "విరహిణిగేయం"

(నేపద్యంలో దూరాన సాహిత్యంతోకూడ వినిపిస్తుంటుంది.)
రాసింది మీరేనాండి....

లక్ష్మి: (వినయంగా నవ్వి వూరుకుంటుంది.)

సుం : ఈవిడ్ని మూగగా సృష్టించిన భగవంతుడిపట్ల ఎంత దురభిప్రాయ పడ్డాను. మాటవల్ల పాపాలను మూటగట్టుకునే మాకు, మూగవల్ల మనసుల్ని వ్యాఖ్యానించ గలిగిన ఈ అపర సరస్వతికి సాపత్య మెక్కడ. (లక్ష్మితో) మిమ్మల్ని కలుసుకొనే భాగ్యం కోసమే నేను యీవూరు వచ్చాను.

ఆనం : ఆ ! అన్నట్టు—ఇతను సుందరమని—

సుం : బ్రాహ్మలం, నియోగులం, - ఇంటిపేరు వాడ్రేవువారు — మా పూర్వులు గొప్పవారు. ఇంతేనండి ఇహ నా వ్యక్తిగత సమర్థతలు ఈ (లక్ష్మి) చివిటీముందు ప్రదర్శనయోగ్యం కావు— (ఆనం) ఓరి బడుద్ధాయి, అదికాదు అసలువిషయం—

ఆనం : అదే ఈవిడ మా చెల్లెలే అని ఎందుకు ఉత్తరాల్లో వ్రాయలేదంటావు.

సుం : ఆవిడ్ని అలా కించపరచకు, ఆవిడ నీ చెల్లెలు కాదు—

ఆనం : అదేమిటి ?

సుం : నువ్వే ఆవిడ అన్నవు.

ఆనం: (దెబ్బతిని) సంతోషించాం. కనకం ! వాళ్ళు వొచ్చాస్తారేమో ! లక్ష్మిని పెళ్ళిచూపులకు తయారు చేయకూడదూ ! (కనకం లక్ష్మి లోపలకు వెళతారు) ఓరే సుంమా నీ ఇంజన్ డ్రస్ మార్చరా ! నీ పెట్టే బేడా ఏది ?

రాజ : (వస్తాడు.)

సుం : Waiting Room లో పెట్టాను. నేను అసలు నిన్ను చూట్టానికి రాలేదు. మీ Sister సాహిత్యంవిని Radio వాళ్ళకు వ్రాస్తే వాళ్ళు మహాలక్ష్మిగారి పూర్తిపేరు ఎడ్రసులతోసహా వ్రాసారు. సరే ఈవిడ వున్న వూళ్ళోనే నువ్వు వున్నావుగదా అని—

రాజ : సరి ! సరి ! ఆ మహాలక్ష్మి మాలక్ష్మినని నీకింతవరకు తెలియదన్నమాట.

సుం : ఎలా తెలుస్తుంది. వీడు ఉత్తరాలకు జవాబులిస్తేనా ?

రాజ : వ్రాసేవుంటాడు నాయనా ! కాని నీకు వ్రాసిన ఉత్తరం మరో అడ్రసుకు వెళ్ళింవుటుంది.

ఆనం: సరేలెండి నాన్న ! మీరు మరీ విడ్డూరంగా మాట్లాడుతారు.

సుం : చాల ఆనందప్రదమైన ఇల్లండీ ఇది. కష్టాలను నవ్వుతో, పరిహసించగల గొప్ప ఋషుల్లాగా కనిపిస్తున్నారు నాకు.

ఆనం: అన్నట్టు మరిచాను. నాన్నగారు, వీడు కవిత్వం చెబుతాడు.

సుం : ఓరేయ్ ! నువ్వు నోర్మ్మయ్.

రాజ : ఆపని చెయ్....

రాజ : నీ వినయం చనువు చూస్తుంటే నువ్వు మాలోనివాడివే ననిపిస్తుంది. ఎన్నాళ్ళనాటి ఆత్మీయుడవో ననిపిస్తుంది. నువ్వన్నట్టు నాకు ఏ చీకు చింతా లేదు అసలు పుట్టినప్పటినుంచి, నా యాభై ఏటివరకూ నన్ను పసివాడులాగ పెంచి పరమపదించాడు మా పురుషోత్తం. పోతూ, పోతూ, నన్ను మా కుటుంబాన్ని తన కూతురు లక్ష్మి - అదే మా కనకం అండన ఒదిలి మరీ పోయాడు.

ఆనం: ఆ కనకమే నా కాబోయే శ్రీమతి—కదు నాన్నా....

రాజ : సరేలే ముందు లక్ష్మిని తయారుకమ్మను.

ఆనం: (లోపలివైపు అరుస్తూ) ఏవర్రోయ్ ! ఎంతసేపు ఆ షోకులు? (అంటూ లోపలకు వెళ్ళబోతాడు. (పెళ్ళిచూపులకనిలక్ష్మి అలంకరింపబడింది. కనకం ఒకవైపు ఆనందం ఒకవైపుడుండి తీసుకువస్తారు.)

ఆనం: నాన్నా ! లక్ష్మి.....ఇటు చూడు. (రాజశేఖరం చూస్తాడు.) (లక్ష్మి సమీపించింది.)

రాజ : ఇది మా లక్ష్మి. ఇంత అందం ఎలా వొచ్చిందమ్మా నీకు.

ఆనం: (ఆనందం, సుందరాలు బయటికి వెళతారు) (లక్ష్మి తండ్రి కాళ్ళకు నమస్కరిస్తుంది)

రాజ: నాక్కాదమ్మా-నా జీవితాన్ని నిలబెట్టి, స్నేహితుడుగా, తండ్రిగా, నా ప్రాణంగా, నాకు అండగా నిలచి పరమపదించిన మా పురుషోత్తానికి చెయ్యెత్తి నమస్కరించవమ్మా (పురుషోత్తం దగ్గరకు వెడుతుంది) పురుషోత్తం ఫోటోనుద్దేశించి పురుషోత్తం నన్ను ఒంటరివాణ్ని చేసివెళ్ళావు. ఏ లోకంలోవున్నా నన్ను నీ చల్లని చూపులతో కాపాడుతానన్నావు. నీ చంకలో, నీ పెంపకంలో పెరిగిన ఈ అవిటి పిల్లను ఒక యింటిదాన్నిచేసి పుణ్యం కట్టుకోరా! ఈ సారి ప్రయత్నం ఒట్టి పోతే నేను ఏ గంగలోనైనా దిగి నిన్ను చేరుకుంటాను గాని నేను బ్రతకలేనుర్రా.

కన: లక్ష్మి నీవు లోపలికి వెళ్ళవూ. బాగుందర్రా మీ వరస శుభం పలకమంటే ఈ శోకాలేమిటి? (లక్ష్మి వెళుతుంది)

రాజ : అమ్మా కనకం! నాకు చాలా గుండె భారంగా వుందమ్మా, ఏం జరుగుతుందోనన్న భయంతో నా గుండెల్ని పిడికిట్లో పెట్టుకున్నాను. అమ్మా కనకమహాలక్ష్మి! ఈ ప్రయత్నం సపలీకృతం అయితే నీకు రజిత పాదరక్షలు చేయించుకుంటాను తల్లీ.

కన: ఏం భయం లేదు మావయ్యా! నువ్వు పిరికి వాడవయ్యింది చాలక మా లక్ష్మినికూడ కంగారుపెడుతున్నావు. ఈసారి మన ప్రయత్నం తప్పక ఫలిస్తుంది. కావాలంటే నీ చదరంగం జ్యోతిష్యం పలికించి చూడు.

రాజ: అమ్మో నేను యిప్పుడు చదరంగం బల్ల దగ్గరకుపోను. నే నసలు యిక్కడ వుండలేను (తనగదిలోకి వెళతాడు)

కన : పాపం (పురుషోత్తంపోటోనుద్దేశించి) ఏం నాన్న! ఎలా భరించావు, యితన్ని అంతకాలం ఈ సంబంధంకాకుండా పోతే నాన్నా, తండ్రి లేని నేను; దిక్కు-లేనిదాన్ని కూడా అయిపోతాను. (పెనుక లక్ష్మి నిలుచుంది. కనకం చూచింది. క్షణంలో Mood మార్చుకుంది. ముత్యాల్లా లక్ష్మి కనుకొనుకుల్లో నిలచిన కన్నీటిని తుడుస్తూ)

ఓ. ఓ. ఓ. ఏం దేవేరి, కాలు నిలవక తిరుగుతున్నావు. మరీ అంత ఆత్రుత పనికీరాదమ్మా ఎంతైన ఇంతదాన్ని చేసినవాళ్ళం మమ్మల్ని వదలి పోవాలనే ఆత్రుత అన్యాయం (లక్ష్మి నవ్వదు కళ్ళు మళ్ళీ చెమర్చాయి.)

ఇవేం కళ్ళమ్మా మరీను. ఆనందాన్ని ఆకాశానుంచి దిగి వచ్చిన గంగలా గుమ్మరిస్తున్నాయి. దాన్ని ఆపటము నా శవ్యము గాదు. ఆ రాబోయే — నీకాబోయే ఈశ్వరుడు తన బాహులులో ఈ ప్రవాహాన్ని కట్టాల్సిందే. లక్ష్మి కిసుక్కున నవ్వింది.)

ఆ! అదీ! నిన్ను సంతోష పెట్టాలంటే వారి విషయము కెలవు ఇవ్వాలన్నమాట. సరేగాని లక్ష్మి ఇలా కూర్చో - చిన్న రిహార్సలు వేద్దాము. మరోక్షణంలో పెళ్ళివారొస్తారు. అప్పుడు నువ్వు అశోకవనములో సీతాదేవిలాగవుంటే లాభములేదు. నేను అతను అనుకో—

లక్ష్మి: (కూర్చోని ఎవరో అన్నట్టు చూస్తుంది)

కన: అతను నీ మెడలో తాళిబొట్టు కడతాడూ—

లక్ష్మి: (అంటే ఎవరు అన్నట్టు సంజ్ఞచేస్తుంది)

కన : అమ్మ దొంగపిల్లా. అల్లరికూడ వచ్చేనీకు. అంటే ఎవరా:? నిన్ను (లక్ష్మిని నిలుచుకోబెట్టి) ఇలా దగ్గరకు తీసుకొని ఇలా (అని దగ్గరకు తీసుకోబోతుండగా)

లక్ష్మి: (చేత్తో దూరంగా నెట్టి కనకం అరచేతిమీద ఏదో వ్రాస్తుంది.)

కన : (చదివి) ఏమిటి, నా కెలా తెలుసా?

లక్ష్మి: (అవునన్నట్లు తలపంకించింది) మళ్లా చేతిమీద వ్రాస్తుంది.

కన : (చదివి) నీ అన్న నేర్పాడా! అబ్బో అంతపాటి మీద పోసుకో కుండ అన్నం తినగలిగితే చాలు మీ అన్న.

లక్ష్మి: (పోనీ నువ్వు తినిపిస్తావు అన్నట్టు అభినయంతో వ్యక్తంచేసి నవ్వుతుంది)

కన: (తనూ నవ్వి) అమ్మ గదుసుపిల్లా! ఆ కాబోయే మా అన్నతో చెప్పాలి-మాటరాదని చనువిస్తే తననోరు మూయిస్తుందని-అతను రానీ—అతను రానియ్ చెప్తా, (ఆనందం హడావిడిగా ప్రవేశించి)

ఆనం: ఒచ్చేస్తున్నారు. Taxi లో వస్తున్నారు (లోపలకు) నాన్నా! (కన కంతో) కనకం ఈయనేరి- అదీ మా నాన్న

కన : ఏవిటి హడావిడి. Taxi లో వాళ్ళు వస్తుంటే అంతకంటేముందు నువ్వెలా వొచ్చావు?

ఆనం: అదా! ఆ కారు పాడయిపోయిందికాబోలు, అంతా గుమిగూడి ఏదో చేస్తున్నారు. నీలకంఠంగారుకూడా అక్కడేవున్నారు. అందుకనే వాళ్ళు పెళ్ళివాళ్ళని పోల్చుకున్నాను.

ఆనం: నాన్నా! (అంటూ రా॥శే గదిలోకి వెళ్ళబోతుంటే రా॥శే మే ఎదురు పచ్చాడు) వాళ్ళు వస్తున్నారు నాన్న కారు పాడై పోతేను మధ్యలో ఆగారు.

రాజ: అమ్మా కనకం ఆ తాంబూలాలు, ఫలహారాలు, అవీ సిద్ధంజేయించు, వెళ్ళు, వెళ్ళు. (కనకం వెళ్ళింది వెనకనే ఆనందం వెడుతున్నాడు) ఓరేయ్ ఓరేయ్! దాని వెనకాలే నువ్వెక్కడికిరా వెధవ!

ఆనం: అదిగో తిట్టకుండా నేనేం చెయ్యాలో చెప్పండి నాన్నా!

రాజ: సరే! ఓ గుడ్డతీసుకొని ఈ కుర్చీలను, కాస్త తుడువు. కాదు! కాదు! ముందు లక్ష్మిని సిద్ధం కమ్మను. (వెళ్తూంటాడు) ఒరేయ్, దాని పాటలన్నీ ఓ చోట చేర్చు - ఈ వేళ అడుగుతారేమో.

ఆనం: (వెళ్ళిపోయి ఆగి) నాన్నా....సుందుగాడేడి ?

రాజ : ఊ ! ఇక్కడే ఎక్కడో వున్నాడులేరా ముందాపని జూడు! అమ్మా కనకం—

కన : ఓయ్, వచ్చే ! వచ్చే ! (అంటూ ఏవో సామాన్లతో ప్రవేశిస్తుంది)

రాజ : వాళ్ళు వస్తూన్నారటమ్మా, నువ్వేం ఇంకా అలాగే వున్నావు ?

ఆనం: (పాటలు Seriptను చేత్తో పట్టుకోని వస్తూ) అహ—ఆ వొచ్చే వాళ్ళకు ఈవిడే ఈ పనులన్నీచేసి అలసి, సొలసిపోయినట్టు కన బడొద్దూ !

కన : (వెక్కిరిస్తున్నట్టు) వ్వొ - చ్చె - వ్వా-వ్వా- ళ్ళకు త్తత్తన్నేన్నే—

రాజ : సరి ! సరి ! ఇప్పుడా యీ యుద్ధం. అన్నట్టు అమ్మా కనకం మీ అత్తయ్య నెక్‌లేస్ వేసుకోలేదేవమ్మా—

కన : అదా ! దాన్ని లక్ష్మీకి వేశాను.

ఆనం : అదేం కుదరదు—

కన : నువ్వేఁవిటి మధ్య....

ఆనం : మీ ఆయన్నూ (తండ్రితో) కదు నాన్నా !

రాజ : అవునమ్మా. ఆ నగ నీది, తన నగ తన కోడలిని అలంకరించా లని మీ అత్త చివరికోరిక.

కన : అలాగే కానియ్యి—కాని యివ్వాల్టికి—

రాజ : యివ్వాళే మరీ యిది. వాళ్ళకు మాత్రం తెలియొద్దు—

ఆనం: ఆ తెలియొద్దు—

రాజ : ఈ తెలివితక్కువవాడ్ని సాకడానికి నీలాంటి గొప్ప శక్తిని సంపాదించుకొన్నామని—

ఆనం: ఏఁవిటినాన్న పదిసార్లు అమాటే అంటారు.

రాజ : సరేగాని, లక్ష్మీనడిగి ఆ నెక్‌లెస్ పట్రా. (ఆనందం వెడతాడు సుందరం బైటినుంచి చేతుల్లో ఏవో పట్టుకొని వస్తాడు.)

కన : మీరెక్కడికి వెళ్ళారు ?

సుం : అలా బజారు కెళ్లాను.

రాజ : ఏఁటయ్యా—నీ హడావిడి ఇదిగానూ - ఆ పాకెట్లేఁవిటి ?

సుం : ఆఁ ఏఁవి లేదండి, మా ఆనందం చెల్లెలుకు స్వల్ప కానుక (రా॥శే॥నికి ఇస్తాడు.) ఇది పెళ్ళివాళ్ళకు బిస్కట్లు వగైరా (కనకానికిస్తాడు.) (ఆనందం నెక్లెస్‌తో వస్తాడు.)

ఆనం: ఇదిగో నాన్న అమ్మ నెక్‌లెస్. (సుందరాన్నిచూచి ఒరేయ్ ! సుందూ నువ్వెక్కడికి తగలడ్డావురా. వాళ్ళు వచ్చేస్తున్నారు. నే నొక్కడ్ని ఈ పనులన్నీ.

సుం : వీడేడి?

రాజ : ఇవ్వాళ ఏవూరో పండుతుంది. అది ఇలాతే (నగ పుచ్చుకోపోతాడు.)

ఆనం: ఎందుకులే నాన్న, మిగిలిన పనులు నువ్వు చూసుకో. ఈ పని నే చేస్తాలే. ఇలా కూర్చోవోయ్ కనకం ఈ నెక్‌లెస్ మెడకు తగిలిస్తాను.

సుం : ఐతే ఈరోజు రెండు ప్రదానాలన్నమాట. (అందరూ నవ్వుతారు.)

కన : (సుందరంతో) పోండి, (ఆనందంతో) ఇలాతే బావ, నే పెట్టుకుంటాను.

ఆనం: అదేం కుదరదు అవతల Time అయిపోతోంది. (రా॥శే)ఏనాన్నా-

రాజ : పోనీ త్వరలో ఏకంగా మంగళసూత్రమే కడుదువుగాని-ఇప్పటికి దాన్ని దాని చేతికియ్యి—

ఆనం: అప్పటికి నాకు ప్రాక్టీస్ కావద్దు—

రాజ : చత్ ! దానిచేతికియ్యి.

ఆనం: సరే ! (అని యిచ్చేస్తాడు.)

కన : (నవ్వుతూ తీసుకొని పెట్టుకుంటూ తలెత్తిచూచి) అదుగో నీల కంఠం బాబాయిగారు—

రాజ: ఆ! రావోయ్! నీలకంఠం రా! (నీలకంఠం ప్రవేశం ముఖంలో ఉత్సాహంలేదు. ఉస్సురుమంటూ కూర్చుంటాడు.) ఆనందం ఏడీ! ఆ! ఉన్నావా! బాబూ సుందరం నువ్వు ఎదురువెళ్ళు నాయనా! (కనకం, ఒకరి వెనుక ఒకరు లోనికి వెడతారు. ఆనందం సుందరం ఓ పక్కన చేరతారు. రాజశేఖరం తక్కువ స్థాయిలో) పెళ్ళివారెక్కడ?

నీల : నా నెత్తిమీద, నీ నెత్తిమీద? పెళ్ళివారికి భూమ్మీద కాళ్లాన్తాయా!

రాజ : ఛ! ఛ! అవేంమాటలయ్యా—కార్లోవొస్తే వొచ్చార్లే—ఆనందం చెప్పాడ్లే—టాక్సీ చేసుకొచ్చారా! ఫరవాలేదు. ఖర్చులో ఖర్చు.

నీల : కారేవిటయ్యా!

ఆనం: ఆ జంక్షను మలుపులో, నీలం చెవర్లెట్ కార్లో! పెళ్ళివారు, మీరు మాట్లాడుతూ, రోడ్డుమీద నించున్నారు కాదుటండీ!

నీల : ఊహూ - నా తలకాయ - అది మన పక్కింటి అవధాన్లుగారి కూతురులేదూ - అదేనయ్యా ఆ పళ్ళెత్తమ్మాయి లేదయ్యా, ఆవిడకి ప్రధానం పెట్టటానికి డైరెక్టుగా హైదరాబాద్‌నుంచెవరో కార్లో వస్తున్నారు. ఇల్లు తెలియక వాకబు చేస్తుంటే మనింటి ప్రక్కదేనని చూపించాను.

రాజ : అదా!

ఆనం: మనింటివైపు చెయ్యి చూపిస్తుంటేనూ, డ్రైవరుకు దారి చూపుతున్నా రనుకున్నాను.

సుం : ఇంట్లోవాళ్ళందరిని అదరిగొట్టావుకదరా!

నీల : అయితేమాత్రం; వాళ్లంతా కాల్లాను, నేను కారువెనక పరుగెత్తుకుంటూను, ప్రయాణం చేస్తున్నా ననుకున్నాఁ ఏమిటి?

ఆనం: అదికాదండీ.

రాజ : అది సరే! నువ్వెళ్లినపని ఏమయింది. అసలువిషయం చెప్ప వయ్యా - నానుస్తావేమిటి?

నీల : ఇక యేక నాన్చటమే! ఆ సంబంధం మనకు సరిపడదయ్యా—

ఆనం: (కొద్దిపాటు ఆవేశంతో) మీకు సరిపడ్డం కాదండీ! సరిపెట్టుకో వలసింది మేము జరిగిన విషయాలు మూడు ముక్కల్లో చెప్పటానికి ఇంతగా మా ప్రాణాలు తోడేస్తారేవిటి? (కనకం గ్లాసుల్తో నీటిని Tray లో పెట్టుకొని వస్తుంది. అక్కడి అందరు ముఖాలు వివర్ణంగా వుండడంచూచి "ఏమిటి సంగతి" అని సుంద రాన్ని తరువాత ఆనందాన్ని, సౌంజ్ఞతో పలకరించి సమా ధానాలు రాక అసలు విషయాన్ని గ్రహించి Tray ని Tea poy మీద వుంచి)

కన : ఏమిటి బాబోయ్? లక్ష్మిని చేసుకోలేని మరో దురదృష్టవంతుడ్ని కనిపెట్టారేమిటి?

నీల : ఆహా! దురదృష్టంమాట నే నెరుగనుగాని, అంతటికు సంస్కా రుల్ని మాత్రం నే నెప్పుడు చూడలేదమ్మా—

రాజ : (అణచుకున్న ఆవేశంతో) నీతో వచ్చిన చిక్కే అది. వాళ్ళమ న్నారా. అది చెప్పు. వాళ్ళ సంస్కారం యెంచటానికి మన నాణ్యం బాగుండాలిగదా. ఆ విషయం తెలిసికూడ వాళ్ళదగ్గర మన పూర్వీకుల పరపతిగూర్చి మాట్లాడి వచ్చుంటావు. (అంత నిశ్శ బ్దంగా వుంటారు.) నేను కాలు బయటపెట్టలేక, (ఆనందాన్ని చూపిస్తూ) ఈ తెలివితక్కువ దద్దమ్మను ఎక్కడికి పంపించలేక నీలాంటి వాడిమీద ఆధారపడవలసివచ్చింది.

సుం : (సముదాయిస్తూ) మీరు అనవసరంగా ఆవేశపడుతున్నారు రాజ శేఖరంగారు—

రాజ: నిజంనాయనా! ఆవేశం, ఆవేదనా, ఈ రెండే నాకు తెలిసిన విద్యలు
(దాదాపు ఏడుపు)

కన: మావయ్యా! యిటుచూడు-మనంమాత్రం యీ సంబంధం ఖాయ
మవుతుందని అనుకున్నామా-అలా ఆంధ్రోళనపడకు కూర్చో.

రాజ: (కంటినిండా నీరు నింపుకొని) ఆ ఛండాలుడు (ఫోటోలో వున్న పురుషోత్తాన్నుద్దేశించి) నన్ను వదలి తనే ముందుపోయాడు. పోయిన వాడు ఈ లోకంలో వదలిపెట్టిన దౌర్భాగ్యుల స్థితిగతుల్ని ఆలో చించాలనే ఇంగిత జ్ఞానంకూడ లేకుండా తన బ్రతుకు తాను బతుకు తున్నాడు.

నీల: ఆ—యీ లోకంలో, నీతో వున్నవాళ్ళం. యింత సహాయం చేస్తున్నాం—ఇహ పరలోకంలో వున్న పురుషోత్తం పంపుతాడో సంబంధాన్ని—

రాజ: మరి వాడికిది న్యాయమే నటయ్యా. నా ఖర్మ (గదిలోనికి వెళ్లను)

సుం: (నీలకంఠతో) వాళ్ళు చూట్టానికికూడ రామన్నారా అండి-

నీల: రానక్కర్లేదన్నారు

ఆనం: ఎందుకు—?

నీల: మూగపిల్ల అని చెప్పింతరువాత, ఇహచూడవలసింది మనుష్యుల్ని కాదు పొమ్మన్నారయ్యా.

నీల : మకీబొత్తిగా సంస్కార హీనులు బాబూ (అప్పుడే సుందరాన్ని చూచినట్టు) అన్నట్టు నువ్వెవరునాయనా?

సుం : నేను ఆనందం స్నేహితుడ్ని.

నీల : ఆహా! మన అమ్మాయి వాళ్ళకు నచ్చలేదు అంటే అందుకు మన మేమీ బాధపడం. కాని లక్ష్మి మూగదని తెలిసికూడ నాముందే దాన్ని ఎద్దేవా చేసారు. కాళ్లు చేతులూ తిప్పుతూ నా ఎదుటే దాన్ని

అనుకరించారు (విషయాన్ని మార్చి) అన్నట్లు మీరు బ్రాహ్మణులు కదూ - అవును బ్రాహ్మణులే. నియోగులు కదూ.

సుం : ముఖాన్ని చూసి నా కులగోత్రాలు చెప్పడం గొప్ప విశేషం.

నీల : అది నాప్రత్యేక వృత్తి నాయనా.

కనకం : (లోపలినుండి పరుగెత్తుకుంటూవచ్చి) బాబాయి! బాబాయ్! మామయ్య బాత్‌రూములోకివెళ్ళి తలుపు వేసుకున్నాడు, ఎంత పిల్చినా పలకడంలేదు ఏదో అఘాయిత్యం చేసుకునేట్లున్నాడు త్వరగా రండి. (అందరూ లోనికి వెళ్లారు. స్టేజీ కొద్ది క్షణాలు నిర్మానుష్యంగా వుంది. విషాదంగా వాయిద్యనాదం వినపిస్తుంది. తెరలో తలుపులు విరుస్తున్న చప్పుడు, రాజశేఖరాన్ని పిలుస్తున్న గొంతులు వినిపిస్తూంటవి తరువాత రాజశేఖరాన్ని మందలింపుగా నీలకంఠం తోసుకుంటూ స్టేజి మీదకు వస్తాడు వెనక సుందరం ఆనందం వస్తారు. కనకంకూడ వస్తుంది.)

నీల : చాల గొప్పవాడివయ్యా! వంద సంబంధాలు తప్పిపోయి నూట ఒకటో సంబంధం ఖాయం కావటం నా అనుభవంలో (తలమీద వెంట్రుకలు చూపిస్తూ) అన్ని పర్యాయాలు ఎరుగుదును. ఆ తండ్రులంతా నీలాంటి వీరులైతే రోజు ఒక్కింటికి నూరుగురు ఆడపిల్లలు దిక్కులేనివారై పోదురు. ఆహా! ఏం పన్చేశావయ్యా-

సుం : ఏమిటి రాజశేఖరంగారు ఈ పని-మీలాంటి సంసారులు చెయ్య వలసిన పనేనా ఇది! తల్లిలేని ఆ పిల్లకి తండ్రికూడ లేకుండా చెయ్యటమేనా మీ ప్రజ్ఞ. ఆ మూగపిల్లకి ఈ అఘాయిత్యంవల్ల ఏం సహాయం చేద్దామనుకున్నారు- (కనకం లోనికి వెళ్ళింది)

అనం : ఏమిటినాన్న యిది- ఛ! చ! ఇలా చెయ్యటం నీకు న్యాయమేనా?

రాజ: (మౌనంగా వెర్రిమూపులు చూస్తుంటాడు.)

(లక్ష్మి అలంకారలన్నిటినీ తీసి నిర్మలంగా ప్రవేశించి, తండ్రి దగ్గరకువచ్చి నిలుచుంది. రెండుక్షణాలు అలాగేచూచి, కుమిలి ఏడిచి కూర్చున్న తండ్రి ఒడిలో వాలిపోయింది)

కన : (ఒండినిండా పైటకప్పుకొని, ఓ చేతిలో తాళంచేతులు పట్టుకొని, నిర్లిప్తంగా ప్రవేశించింది. రాజశేఖరం వున్న సోఫా దగ్గరకు వచ్చి లక్ష్మి చేతిని తీసికొని ఆనందం చేతిలోవుంచి రాజశేఖరం. ఒడిలో తాళాలువేసి) ఇవిగో మావయ్యా, నీ యింటి తాళంచెవులు. (అప్పటికి తెప్పరిల్లిన ఆనందం, సుందరం)

ఆనం : ఏమిటది?

నీల: ఏమిటమ్మా అది?

కన : (వెళ్ళిపోతున్నది ఆగి) ప్రాణాలు తీసుకొని, ప్రాణాలు తీసేహంత కుల యింటో నాకు సానంలేదు. నేను వేగలేను.

రాజు : (ఒక్క మారుగాబిగ్గరగా) అమ్మా! కనకం! వెళ్ళిపోతావా! వెళ్ళు. నేనూ నా కుటుంబం నువ్వెళ్ళిన మరుక్షణంలో గంగలోదిక్కపోతే అడుగు.

కన : ఛీ! ఛీ! మాట్లాడకు, మాటకు ముందు, చావు,చావు,చావు! బ్రతకలేక చచ్చే నువ్వు చావక బ్రతికేవాళ్ళను ఎంత హింస పెడుతున్నావో, ఆలోచించావా? నీ పిల్లల పెళ్ళిళ్ళకోసం, వాళ్ళ బ్రతుకులకోసం! ప్రాణాలు తీసుకోపడమే నీకు గత్యంతరమనిపిస్తే బ్రతుకంటే ఏమిటో తెలీకుండా 50 సం॥ల బ్రతికిన నీ చేతకానితనానికి, నీ అమాయికత్వానికి, విసిగెత్తి మానాన్న లెక్కలేనన్నిసార్లు ప్రాణాలు తీసుకొని వుండవలసింది. తల్లడిల్లి పోతున్న మూగ దాన్ని సముదాయించడంపోయి, నీ ప్రాణాలు తీసుకొంటావా పెద్దవాడవు. నువ్వు చెయ్యవలసిన పనేనా ఇది.

రాజ : అనమ్మా అను. నీ యిష్టం వొచ్చిన మాటలను. నాబాధ మీ కర్థం కాదు.

కన: అవును కాదు. అందుకనే నే వెడతా నంటున్నాను. బాధావిమృత్తికి నీకు మరణమే శరణ్యం అనుకుంటే యీ యింట్లో నాకు స్థానం లేదు. కష్టాల్ని పరిహసించగల్గిన వారితో నేను కలిసి వుండగలను. కాని మీ లాంటివారితో ఒక్కక్షణంకూడ వేగలేను. క్షమించు, నా దారిన నేను వెడతాను.

(వెళ్ళబోతుంది. అప్పటికి సుందరం అటువైపుకి చేరుకొని అడ్డు నిలుచున్నాడు)

సుం: కనకంగారు నేను మాట్లాడం ఎంతవరకూ సమంజసమో నాకుతెలీదు. అయినా ఒక్కమాట, రాజశేఖంగారి ఆవేదన్ని సరిగా మీరు అర్థం చేసుకొని వుండరు-అహ-అంటే వారి ఆత్మహత్య ప్రయత్నాన్ని సమర్థిస్తున్నాననికాదు. కాని, మీ మీద అంతగా ఆధారపడి పోయిన యీ కుటుంబాన్ని, నిరాశ్రయుల్నిచేసి వెళ్ళడం మాత్రం మీరు చెయ్యవలసిన పనికాదు.

ఆనం: కనకం. ఏమిటది? అన్ని అధికారాలు పుణికి పుచ్చుకున్న దానివి, మా నాన్నను గదమాయించి కూర్చోబెట్టలేవు, ఏమిటిది. నిజంగానే వెళ్ళిపోయే ప్రయత్నమా - లేక నాటకమా?

కన: లేదు బావా! నే నీ యింటికి ఏమికాను. గదమాయించటానికి, అదమాయించటానికి నేను ఎవరిని. మీ కంటె ఒకరికి ఒకరు తోడుగా, అండగా వుండటానికి మందీమార్బలంవుంది. ఈ యింట్లో ఎప్పటికి ఏ అఘాయిత్యం జరుగుతుందో-పరాయిదాన్ని నేనేంకాను—

రాజ: అమ్మా కనకం నన్ను చంపు - చిత్రవధచెయ్యి- అంతేగాని, నన్ను నా పిల్లల్ని దిక్కులేని వాళ్ళుగా చేసివెళ్ళకు—

సుం: అలా అంటే సరిపోతుందా అండీ! సంబంధాలు కుదరకపోతే ఆత్మహత్యలకు పూనుకుంటే ఆవిడ స్థానంలో ఉంటే ఎవరైనా చెయ్యవలసిన పనేయిది.

నీల : అయినా లోకం గొడ్డుపోయిందా ఏమిటయ్యా? 24 గంటల్లో మరో సంబంధం తెస్తాను.—ఎందుకలా బాధపడ్తావ్, ఎవరెవరికి ఒక ఆకున రాస్తే, వారికే అవుతుందయ్యా! కుమ్మరికుండ 10 మంది చూస్తారు. అందరూ కొనేస్తారా?

సుం : ఇంత తెలివి ఇన్ని అందచందాలు, గుణగణాలు, అన్నీ ఉండగా ఒక్క మాట లేనంత మాత్రాన లక్ష్మీగారికి పెళ్ళికాదు అనుకోవడం సమంజసంకాదు.

నీల : చక్కగా చెప్పావు నాయనా! అమ్మా కనకం! ఏమిటీ, ఇంకా అక్కడే నిల్చున్నావ్ వీధిలోవాళ్ళు చూస్తే నవ్వుతారు. వీళ్ళంతా మూర్ఖులైతే నువ్వూ మతిలేనిపని చేయడమేనా? (లక్ష్మి కనకం దగ్గరకు వెళ్ళి, కనకం చెయ్యి తీసుకుంది. చేతిమీద "నన్ను ప్రాణం లేనిదానిగా చేసిపో- నేను మీమధ్య ఉండబట్టికదా మీకు, మీ జీవితాలమీద విసుగుపుడుతోంది." అన్నభావంతో గేయం వ్రాస్తుంది. రాస్తున్న సమయంలోనే ఆ పాట నేపద్యంలో సాకీగా పాట వినిపిస్తుంది. పాట సాగుతుండగనే, లక్ష్మి తీసుక వెడుతుండగా, కనకం వెనుకనే లోపలికి వెడుతుంది. తల పట్టుకు కూర్చున్న రాజశేఖరం తలెత్తి నీలకంఠం.)

అమ్మకనులుమూసి నేను తెరిచాను
నా అమ్మవు, నా ప్రాణానివి నీవు
నా నుండే దూరం పోతావా?

నీల : ఇదిగో చూడు, ఆ లక్ష్మి నీకూతురే కాదయ్యా— మా అందరికి కావలసిన పిల్ల. లెక్క-లేనన్ని సంబంధాలను తరచి, మేలైన సంబంధం స్థిరపరిచే పూచి నాది. నువ్వు లోపలకి పద, విశ్రాంతి తీసుకొందువుగాని, ఇలాంటి అఘాయిత్యం ఇంకెన్నడూ తల పెట్టకు. ఈ విషయం నలుగురికీ తెలిస్తే ఈమాత్రం సంబంధాలు కూడ రావు తెలిసిందా! లే—పద. (రాజశేఖరాన్ని లోపలకు తీసుక వెడతాడు. ఓ మూల నిశ్శబ్దంగా నిలుచున్న ఆనందం దగ్గరకు వెళ్ళి.)

సుం : ఎందుకురా అలా బాధపడతావ్ ?

ఆనం: ఇంతకంటె నేను చెయ్యగలగిం దేముంది ? అటు వాళ్ళ బాధల్లో పాలుపంచుకోలేను, ఇటు నాకు నేనై ఏమి చెయ్యలేను.

సుం : మరీ ఆలా దిగజారిపోకురా —

ఆనం: ఆ ముసలాయన్ను చూస్తే ఏమీ పాలుపోకుండావుంది. పోయిన సారి సంబంధానికీ యిలాగే High Blood Presure వొచ్చి నానా హడావిడి అయింది.

సుం : ఆవిడకీ పెళ్ళి ప్రయత్నా లెందుకు- యోగం వున్నపుడే అవుతుంది. హాయిగా చదివించెయ్యక.

ఆనం: చదివి, చదివి ఏంచేస్తుందిగనక: మాట మంచి చేతనయితే ఏదైనా ఉద్యోగం చేసుకున్ను-దానికా యోగం లేదు. తాను బ్రతికుండగానే అది ఒక ఇంటిది కావాలంటారు. (అప్పటికి రాజశేఖరానికి తాగడాని కేదో తీసుక వెళుతుంది కనకం) ఒరేయ్ సుందూ, మా అవస్థల్ని చూసైనా నీకు అనిపించటంలేదా మమ్మల్ని కాపాడాలని"

సుం : అదేంవిటిరా. తప్పక అలాగే.

ఆనం: ఏమిటి నిజమేనా-? ఇది హాస్యాలకు సమయంకాదు.

సుం : వేళాకోళంకాదు. భగవంతుడి సాక్షిగా చెబుతున్నాను, ఆ వెధవ లకు అదృష్టం లేకపోయిందిగాని, ఆ అపర సరస్వతిని, భార్యగా చేసుకోవటానికి ఎంత పుణ్యం చేసుకోవాలి —

ఆనం: ఒరేయ్. సుందూ, సుందూ, మేమెంత అదృష్టవంతులంరా ! నీ పాదాలు పట్టుకొని నా కృతజ్ఞతలు తెలియజేసుకొంటాను.

(పాదములమీద పడపోతాడు.)

సుం : ఛ ! ఛ ! అవేం మాటల్రా - లే - (ఆనందం కళ్ళలో నీరునిండి వుంటుంది.) ఛ—ఛ. ఏడుస్తావేంమిటిరా ?

కన : (ముందుకు వస్తూ) అదొక్కటేనండీ వీళ్ళకు తెలిసిన విద్య. చిత్రంగా వుంది సుందరంగారు - చంకలో పిల్లాణ్ణి పెట్టుకొని

ఊరంతా చెతకినట్లయింది. మీ సహాయం జన్మ జన్మలకు మర్చిపోలేం—

సుం : ఉండండిమరి ! భగవంతుడి దయవల్ల నా ప్రయత్నాలు ఫలించాలికదా !

కన : మీరు పూనుకున్న తరువాత ఇక ఫలించటానికేముంది ?

సుం : నాపట్ల అంత విశ్వాసం వున్నందుకు సంతోషం — ఇవాల్టినుంచి అన్వేషణ ప్రారంభిస్తాను.

ఆనం: ఏమిటి ?

సుం : దేశమంతా గాలించి మరీ తీసుకవస్తాను - ఆ చెధవలు సిగ్గుపడే లాంటి సంబంధాన్ని.

అనం : ఏమిటి ! నువ్వు చేసుకోవూ ?

సుం : నేనా - నాది రాజా సంబంధం ఏమిట్రా ?

ఆనం: మరింకేమిటి నువ్వు చేసే సహాయం ?

సుం: నన్ను చేసుకోమనా మీ రంటున్నది ?

కన : ఏం ? మీకూ అభ్యంతరమా !

సుం : అహా ! అభ్యంతరం అని కాదు - మరి—

కన : పోనీ ! మీ వారికా ?

ఆనం: పోనీ మీవాళ్ళు కోరిన కట్నాలు, కానుకలు, ఇచ్చుకుంటాం—

సుం : బుద్ధిలేకుండా మాట్లాడకు -

ఆనం: (అయితే) మరేమిటిరా నీ అభ్యంతరం. నాకు తెలుసురా- మీరందరూ ఒకే జాతి-మీ అందరిది ఒకే నీతి- దాన్ని, అందాల్ని యోగ్యతల్ని, "ఆహా" "ఓహో" అని పొగడమంటే పొగుడ్తారు. నోటి మాటవరకు, మీ అందరూ కావలసినంత అభిమానాన్ని వలకపోస్తారు.

సుం : ఆనందం ! నే చెప్పేది విను—

ఆనం : ఇంకా ఏం చెబుతావురా - ఆకాశం అంత మనిషిని మన్మధుడ్లాంటి అందగాణ్ని, అపర కాళిదాసుని వెతుకుతానంటావు. కాని నువ్వు మాత్రం మూగదాన్ని భార్యగా చేసుకోటానికి అంగీకరించవు.

సుం : (కనకంతో) ఆనందం.

ఆనం: ఇవేం మాకు కొత్త కాదురా ! ఇప్పటికి కొన్ని వందల పెళ్ళి కొడుకుల నోటినుండి వింటున్నాం - ఎదుటివారి కష్టాలమీద, ప్రవర్తనమీద వ్యాఖ్యానించడం అంత తేలికైన పని మరొకటి లేదు - మీ కథల్లో - కావ్యాల్లో పలికే సున్నితమైన హృదయాలు మీవరకు వొచ్చేటప్పటికి శిలలయి పోతాయి. మీరంతా బురఖా రాయళ్ళు (విసుగ్గా లోపలికి వెడతాడు.)

సుం : ఒరేయ్ ! ఆనందం ! ఆనందం! (కాని ఆనందం వెళ్ళిపోయాడు-) ఏమిటండి వీడుమాట చొరనివ్వండి.

కన : అవునండీ ! బావ బాధపట్టంలో తప్పేమిటి చెప్పండి ? ఏమిటి మీ అభ్యంతరం చెప్పండి.

సుం : సరి, సరి మీరూ ప్రారంభించారూ, ఇహ నే వెడతానండి.

కన : ఎక్కడికి, వుండండి, భోజనంచేసి వెడుదురుగాని.

సుం : అలాకాదు. ఇహ ఒక క్షణం ఆగటానికి వీల్లేదు. ఈ క్షణం నుంచి నేను పెళ్ళికాని ఆడపిల్ల తరుపువాడిని, కాలికి బలపం కట్టుకొని తిరగాలి. ఓ మంచి సంబంధ తీసుకరావాలి. అప్పుడుగాని విశ్రమించను.

కన : అంతేగాని, మీరు చేసుకోరు -

సుం : చేసుకోవాలనుకుంటె జరిగిపోతుందా అండి. నా కెవర్ని రాసి పెట్టుందో, పాపం నా కోసం ఏ మూల కాళ్లు అరిగిపోయేట్లు తిరుగుతున్నాడో, వస్తానండి. లక్ష్మిగారితో చెప్పండి. అదుగో

ఆవిడే వచ్చారు. నమస్కారం, శెలవు తీసుకుంటానండి. నమస్కారం. (లక్ష్మి ఏదో కాగితం అందిస్తుంది) -ఏమిటండీ యిది ?

లక్ష్మి: (చేతిలో ఒకచిన్న చీటీతో ప్రవేశం.)

(చరణం)

- పెదవి పలుకదు యిల్లాలి పదవియేల ?
  చేటు కవియిత్రికొక మది చోటుయేల ?
  ఎరుగుదును మీరు నన్నొల్లలేరు
  పరులకంటగట్టగ జూచు ప్రయత్నమేల ?

"మీరు అసహ్యించుకొన్న వస్తువును ఇతరులకు దానంచెయ్యటానికి ప్రయత్నించకండి" - అన్నభావంతో గేయంవినిపిస్తుంటుంది.)

— తెర —

రెండవ రంగం

(తెర తొలగగనే రాజశేఖరం చదరంగం ఆడుతుంటాడు. లోపలినుంచి కనకం మందు గ్లాసుతో వచ్చింది. వచ్చినుంచొంది. రాజశేఖరం అదే ధ్యాసలో వుండుట వలన కనకాన్ని చూడలేదు)

కన: (సకిలించింది)

రాజ: (తలెత్తి) స్! యిప్పుడేం మాట్లాడకు. రెండాటలు కట్టుకాలేదు. యీ సారికూడా మేన ప్రయత్నం జరిగేలాలేదు.

కన: ఓహో చదరంగం జోతిష్యం చూస్తున్నావన్నమాట.

రాజ: (అవుననన్నట్టు తల వూపుతాడు)

కన: కలిసిరాకపోతే స్వల్పమైన కార్యాలే సానుకూల పడవు. శకునాలు, మంత్రాలు కార్యసాధన కుపకరిస్తాయనుకోవడం....

రాజ: అలాకాదు. నా చదరంగం తప్పు పలకదు.

కన: కావచ్చు. ఆ ప్రయత్నమైన చిత్త స్థైర్యంతోను, విశ్వాసంతోను చెయ్యాలి.

రాజ: అవును ఆ మాట నిజం.

కన: మరి నీ ఆటచూడు. మరి నీ ఎత్తులుచూడు ఎంత పరాకు చిత్తగిస్తున్నాయో.

రాజ: పరాకా!

కన: ముందు యీ మందు పుచ్చుకో. మూడే ఎత్తులు. ఆటబంద్. (ఒకఎత్తు వేసి) నాఆట ఒకటి. ఇదిగో యిది రెండు యిహమూడు. గోవిందా బంద్. యిప్పుడేమంటావ్.

రాజ: (నిలువెత్తున నవ్వి-అంతులేని ఆనందంతో) బాగుందితల్లీ బాగుంది. అదీ అసలు విషయం. నీ చేయుత కావాలమ్మా ప్రతి ప్రయత్నాని కీను. (బయటనుండి Post అన్నకేక) నీలకఠం యింకా రాలేదేం చెప్మా. (కనకం బయటకువెళ్ళి వుత్తరాలతో తిరిగి వస్తుంది:)

రాజ: అన్ని వుత్తరాలే!

కన: ఆఁ అన్నీ మీ అమ్మాయిగారి Fans వి (క్రమంగా చించి ఒకటితీసి చదుపుతూ వుంటుంది) ఆ వుత్తరం చదువుతూ ఉండగ పాట వినిపిస్తుంది.

కన: హృదయపూర్వక వందనాలతో- మీరు వ్రాసిన రుద్రవిపంచి గేయం రేడియోలో వినగల్గిన అదృష్టవంతుడ్ని. ఈ సాహితీ సాత్విక దర్పణమైన భాగ్యానికి ఎంత గర్వించాను....

గేయం :

మీటనా రుద్రవిపంచి
నాలో రగిలే వేదనలే
గీతాలుగా మలిచి పలికించనా

నా గుండెయల వేదికపై
హోమజ్వాల రగిలించితివి
నా ఊహల కన్నీటి జాలుల
అభిషేకించితి రావేర, రావేలరా

నా రుధిరం వాద్యంగా
హృదియే నైవేద్యంగా, నా నాడులు తీవెలుగా
యీ విపంచి శ్రుతిచేసి
రుద్రవీట మీటనా ॥మీటనా॥

జీవనాడి మూగవోయె
నా ఆశలు వీగిపోయె, యీ విపంచి పలుకలేదు
చీకటి నన్నావరించె
యీ ఉగాది దీవెన
యీశ్వరా! మహేశ్వరా!!
యీశ్వరా! మహేశ్వరా!!

రాజ: (ఉత్తరం చదువుచున్నంతసేపు పాట సాగుతూనే ఉంటుంది. రాజ శేఖరంలో ఆ ప్రశంశపట్ల అసహ్యం, జుగుప్స శృతిమించి కలుగు తుంటవి. ఒక్క మారుగా ఉత్తరాన్ని లాగుకుంటాడు. పాట ఆగు తుంది)

ఎందుకీ చిత్రహింస. ఈ పొగడ్తలు నన్నుగాని, దాన్నిగాని ఏ విధంగా ఉద్ధరిస్తాయి. తన కవితా స్రవంతిలో యింతమంది హృదయాలను ముంచెత్తుతున్న ఈ "అపూర్వ సృష్టిని" బజార్లో కుండలకన్నా హీనంగా ఎంపిక చేస్తున్నప్పుడు....యీ సాహితీ సాత్వికదర్పణాలకు విలువ ఏది? (ఆనందం వచ్చాడు)

ఆనం: (యింతకుముందే ప్రవేశించాడు) బాగా అన్నారు. యీ ప్రసంసించిన Fan ని యీ అపర సరస్వతిని చేసుకుంటావా బాబూ అంటే — కవిత్వాలు ఏం చేసుకుంటాం, కోసుకుంటామా, నాలుగు అబద్ధాలు మాట్లాడటానికీ నాల్గు తిట్టటానికి లక్షణంగా నోరులేక పోయిన తరువాత అని పుంజాలు తెంపుకొని పరుగెత్తుతాడు.

కన: ఈ దూరంగా పోతున్న హృదయం లేనివారికంటే—లక్ష్మికి మీరు ఏ విధంగా సంతోషం గలిగిస్తున్నారో? అనుక్షణం పెళ్ళి, పెళ్ళి, అనిచెప్పి దాన్ని దూరం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు తప్ప మరో మంచి సహాయం ఏది.

ఆనం: అదేమిటి?

కన: అవును బావా! యీ మూగదాన్ని చేసుకోలేనంత మాత్రాన వాళ్ళంతా సంస్కారహీనులు! దుర్మార్గులు! మీరు....

రాజ: అవునమ్మా నువ్వు చెప్పింది నిజం. మనం దురదృష్ట వంతులం గానీ.

కన: అలా వ్యంగ్యంగా మాట్లాడకు. ఇన్ని కబుర్లు చెపుతున్న బావ ఒక అవిటిదాన్ని భార్యగాగాని, నవ్వు కోడలుగాగాని అంగీకరిస్తారా!

ఆనం: ఆ అవకాశంవస్తే చూపిద్దును నా తడాఖా! అంతటి త్యాగానికి అవ కాశం ఏదీ? ఏ త్యాగము చెయ్యనియ్యకుండ నా పెళ్ళి స్వర్గంలోనే ఏర్పాటైపోయింది.

కన: పోనీ నే నిస్తాను ఆ అవకాశాన్ని. ప్రదర్శించు బాబూ నీ త్యాగ నిరతిని. స్వర్గంలో ఏర్పాటైన నీ పెళ్ళిని రద్దుచేసుకో — ఏం మావయ్యా (వెడుతున్న వాడిని అడిగింది)

రాజ: (లోపలికి వెడుతున్నవాడు) ఏమోనమ్మా — నాకు నవ్వే శక్తి లేదు.

ఆనం: (రా।। శే॥ వెడుతున్న వైపుకు చూస్తున్న కనకాన్ని తన వైపుకు తిప్పుకొని) రద్దు చేసుకుంటుందట పెద్ద, చెంప పెళ్ళు మనిపించే వాడులేక.

కన : ఏమిటో బావా ! మావయ్యను చూస్తుంటే బెంగగా వుంటుంది. యీసారి నీలకంఠంగారు చెప్పిన సంబంధం భాయమైపోతే బాగుండు.

ఆనం: ఆయనింకా రాలేదే. (లక్ష్మి వచ్చి మళ్లా లోపలకు వెళ్ళబోతుంది.)

కన : ఏయ్ లక్ష్మి ! (పరుగెత్తుకుంటూ వెళ్ళి లక్ష్మిని తీసుకువచ్చింది.) ఇవిగో నీ Fans వ్రాసిన ఉత్తరాలు ఏం పొగడ్తలు, ఏం పొగడ్తలు. యీ తెలివైంది, యీ మతిలేనివాడు ఒక్క తల్లి కడుపున పుట్టినందుకు చెప్పుకోవాలి.

ఆనం: (జడలాగి) నోర్ముయ్! ఎప్పుడు వేళాకోళం ఆడాలో తెలియదు. (మూగమనిషితో మాట్లాడుతున్నట్టు) నువ్వు బాధపడకు.

లక్ష్మి: (అన్న చేతిమీద వ్రాస్తుంది.)

ఆనం: (చదివి) నీకు బాధ అని కాదు. మా బాధ సంగతే నేను మాట్లాడుతున్నది.

లక్ష్మి: (కనకం చేతిమీద వ్రాస్తుంది.)

కన : నిజమే చెప్పావు! మీ అన్న బాధ అదే.

ఆనం: ఏమిటది?

కన : ఆ నీ బాధ ఈవిడ పెళ్లి ఆలస్యం అయితే నీ పెళ్లి జాప్యం అవుతుందని....అందుకు త్వరగా నీ పెళ్ళి చేసేసుకో మంటుంది.

ఆనం: ఛ! ఛ! అవేం మాటలు. ఇదిగో లక్ష్మి మాకేమిటే తొందర? ఆ మాటకొస్తే నీ పెళ్ళికోసం మా పెళ్లి మానుకోమన్నా సిద్ధం.

కన : (నవ్వి) అబ్బా! అపర భీష్ముడు—చూస్తాంగా—

ఆనం: నోర్ముయ్. నీ తొందరవలనగాని....

కన : అన్నట్లు మాటల్లోబడి మనువు మరచిపోయాను.

ఆనం: నీ మనువా—

కన : కాదు. నీ చెల్లెలి మనువు! చూపులకని వాళ్ళు వచ్చేటప్పటికి పాయసంకూడా చెయ్యమన్నాడు మామయ్య. లక్ష్మితో మాట్లాడుతుండు. (అంటూ లోపలికి వెళుతుంది.)

ఆనం: చూడు లక్ష్మి.

లక్ష్మి: (అన్న చేతిమీద వ్రాస్తుంది.)

ఆనం: (చదివి) అంత వొట్టెందుకే—అలాగైతే — మాట్లాడనులేవే నీ పెళ్లిసంగతి.

లక్ష్మి: (మళ్ళీ వ్రాస్తుంది.)

ఆనం: ఓ అలాగే (బయటకు వెళ్ళబోయి) 2 దస్తాలు చాలా తెల్లకాగితాలు.

లక్ష్మి: (చాలన్నట్లు సంజ్ఞ చేస్తుంది.) (ఆనందం వెళ్తాడు. లక్ష్మి మౌనంగా కూచుని ఆలోచనలో ఉంటుంది. ఆలోచన ప్రేమతో వాత్సల్యంతో, అనురాగంతో ప్రాణానికి ప్రాణంగా పెంచి పెద్ద చేసిన ప్రాణిని దూరం చేసుకోవడంలో త్యాగం ఏమిటో" అని) ఈ ఆలోచన పాటగా వినిపిస్తుంది. బయటనుంచి 'రాజశేఖరం గారూ' అని పిలుపు వినిపిస్తుంది. కొద్ది క్షణాలు తరువాత వీధిలో నుండి ప్రసాద్ వస్తాడు. సన్నగా, పొడుగ్గా, అందం, నిదానం అయిన కంఠస్వరం—ప్రవర్తన, సిల్క్-లాల్చీ గ్లాస్కో-పంచె)

ప్రసా: రాజశేఖరంగా రున్నారాండి! (లక్ష్మికి వినపడదు. పిలిచినా వినిపించక పోయేసరికి ఈమే మూగలక్ష్మి అని తెలుసుకొని మరీ దగ్గరగా వచ్చి నిలుచుంటాడు.)

లక్ష్మి: (ఎవరో వచ్చారన్నట్టు గ్రహించి తలెత్తితే ప్రసాదంకనిపిస్తాడు. చప్పున లేచి నుంచుని నమస్కరించి కూచోమని సంజ్ఞచేసి— త్వరగా రాజశేఖరం గదిలోకి వెడుతుంది. కూచున్న ప్రసాదానికి Teapoy మీద వున్న కాగితంమీదకు దృష్టి వెడుతుంది. ఆ కాగితంలో సాహిత్యం పాటలో పలుకుతుంది. రాజశేఖరం లక్ష్మి బయటకు వస్తారు. లక్ష్మి మరో గదిలోకి వెడుతుంది. రా॥ శే॥ దగ్గరగా వచ్చి పాటలో నిమగ్నమైన ప్రసాదంతో.

పాపలగని తపియింతురు
పాపలగని పెంతురు కంటి పాపవోలె
పాపకు పెండ్లీ దొచ్చిన, ఆపెను వదలించుకొన
తపిఇంతురూ .... తపిఇంతురు

రాజ: ఎవరు నాయనా నువ్వు (పాట ఆగింది)

ప్రసా: (లేచి నిలబడి) నమస్కారమండి.

రాజ: నమస్కారం. కూర్చో నాయనా అబ్బాయి ఇంట్లో లేడు.

ప్రసా: నేను మీకోసం వచ్చాను.

రాజ: నాకోసమా! నువ్వు ?

ప్రసా: నాపేరు ప్రసాదరావు. మా స్వగ్రామం కోడూరు.

రాజ: (ఆశ్చర్యంగా) ఏమిటి ?

ప్రసా: అవునండీ. మీరు అవునా కాదా అనుకుంటున్న ప్రసాదరావునే.

రాజ: Commercial Tax Officer గారు.

ప్రసా: Assistant అని ముందుచేర్చి చివరి గారు తీసెయ్యండి. మీ నీలకంఠంగారి Candidate ని (చిరునవ్వు)

రాజ: (ఖంగారుగా లేచి) అయ్యో మీరే ప్రసాదరావుగారు. అమ్మా కనకం, కూర్చోండీ బాబూ. మా నీలకంఠం మీతో రాలేదా?—

ప్రసా: వారు సరాసరి ఈ సమయానికి ఇక్కడికి చేరుకుంటా నన్నారు.

రాజ: తగలడ్డాడు కాదు; అమ్మా కనకం!

కన: (ప్రవేశిస్తూ) ఒస్తున్నా....ఏమిటి మా....(కొత్త వ్యక్తిని చూస్తుంది. ఎవరన్నట్టు మామయ్యను చూస్తుంది.)

రాజ: అదే!....మనకు నీలకంఠం చెప్పాడు. ప్రసాదరావుతో ఇది....

ప్రసా: నాకు చెల్లాయి....నీపేరు కనకలక్ష్మి. అవునా....

రాజ: అరె! మీ కెలా తెల్సింది ?

ప్రసా: మరేమనుకున్నారు. అన్ని విషయాలు తెలుసుకొని పెళ్ళికొడుకు దర్జాతో వచ్చాను మరి.

రాజ: అహా! నిలబడే ఉన్నారు. కూర్చోండి!

ప్రసా: (నవ్వుకుంటూ కూర్చొంటాడు.) అమ్మా నాకు ముందు కాసిని మంచినీళ్ళు కావాలి.

రాజ: (ఆత్రంగా) అమ్మా కనకం. పాయసం చేశావుకదా. ఆ వెండిగ్లాసు మరోమారు కడిగి....

ప్రసా: ఏం వద్దు. నాకు మంచినీళ్ళే కావాలి (కనకంతో) మంచినీళ్ళే పట్రా అమ్మా! (కనకం వెళ్ళింది. రాజశేఖరంతో) నా క్కావల సిందే ఇవ్వండి.

రాజ: తప్పకుండాను. ఎంతమాటండీ....

ప్రసా: ఓ ఘడియముందు నేను రాగానే మీ అబ్బాయి స్నేహితుడనుకొని ఎంతో ఆప్యాయంగా పిల్చారు. ఇప్పుడేమో ఒక్కమారుగా ఖంగారు పడిపోయి అండీ గిండీ అంటూ నన్ను చాల దూరం చేస్తున్నారు. అది నా కిష్టంలేదు సుమాండి. క్షమించండి.

రాజ: అయ్యో! అదికాదు....మీరు. మా ఆనందం....

ప్రసా: స్నేహితుడ్ననుకొని "ఏమోయ్" అని ఆప్యాయంగా పిలిచారు. ఇప్పుడు అండీ గిండీ అంటే అతనికి శత్రువునా అనుకుంటున్నాను.

రాజ: అబ్బే. అదేం కాదు.

ప్రసా: నన్ను మీ అబ్బాయిగా భావించి పిలవండి. నేను మీనుండి కోరేది ఆదరం, ఆప్యాయత. ఇవి తప్పక లభిస్తాయనే ఆశతోనే వచ్చాను.

రాజ: ఓ తప్పకుండానూ! ఏం కావాలో చెప్పండి.

కన: (గ్లాసుతో వస్తూ) ఆ అండీలు మానెయ్య మంటున్నారు. మామయ్యా (అంచరూ నవ్వుతారు.) ఇదిగో మీరు కోరిన మంచి నీళ్ళు. ఇది మామయ్య చేయించిన పాయసం.

రాజ: (పెద్దగా నవ్వుతూ) అది! ఆ పాయసం త్రాగేసి తరువాత నీళ్ళు కూడా త్రాగేయండి.

ప్రసా: అదిగో మళ్ళా దూరం చేస్తున్నారు. (గ్లాసు అందుకుంటూ!)

కన : అలాగే మర్యాద చెయ్యనిద్దురూ ! మరీ చనువిస్తే నెత్తినెక్కే వంశం వీళ్ళది !
నీకూ తెచ్చాను మావయ్యా పాయసం. (గ్లాసు రా॥శే॥ ముందు వుంచింది)

ప్రసా: ఇపుడు కిప్పుడే చేసారా పాయసం?

కన: నీలకంఠంగారు చెప్పారు. మీ రివాళ వస్తారని నోరు తీపి చెయ్యాలని మావయ్య పాయసం వండమన్నారు.

ప్రసా: ఈ నీలకంఠంగారితో పెద్ద చిక్కేనండి ఇలా నా కోసమని ప్రత్యేకమైన ఎర్పాట్లేవీ చెయ్య వద్దని మళ్ళీ మళ్ళీ చెప్పానాయనతో.

రాజ: (లక్ష్మిని తీసుకురమ్మన్నట్టుగా కనకానికి సైగచేస్తాడు. కనకం కదలబోతుంది)

ప్రసా: ఆగమ్మా-నే నావిడ్ని చూచాను.

కన: ఆహా చెప్పావుకావేం మరి?

రాజ: అదికాదు....

ప్రసా: ఏదీకాదుగాని - చిన్నమనవి - నేను వయస్సులో, అనుభవంలో అన్నిట్లో మీ కంటె చిన్నవాడిని, మీరు ఆజ్ఞాపించింది చెయ్యవలసిందే, అసలా నిర్ణయంతోనే మీ వద్దకు పసివాడిలాగానే వచ్చాను కాని ఒక్క క్షణంసేపు, మీరు అనుమతిస్తే నా బాధ్యత దృష్ట్యా నాకు నేనే పెద్దను గనుక. పెద్దవాడిలాగా మాట్లాడుతాను-అన్యథా భావించకూడదు. (అతని వినయానికి మురిసిపోతూ కనకంవైపు చూస్తాడు రాజశేఖరం)

కన: ఫరవాలేదు - చెప్పండి—

రాజ: ఒక్క నిమిషం-కనకం మాట-(అని లేచి కుడిపక్కకు పిలుస్తాడు, చెవిలో చెప్తాడు)

కన: (జవాబుగా) ఏం ఫరవాలేదు.

ప్రసా: (అర్థంకాక) ఏవిఁటండీ! మళ్ళా పాయసమా? (లేస్తాడు.)

రాజ: (చిరునవ్వుతో వస్తూ) ఆఁ ఏం లేదునాయనా, నీలకంఠం ఒచ్చాక మాటలు ప్రారంభిస్తేనో?

ప్రసా: మాటలేఁవిటి? ఏం మాటలున్నాయి! ఈ పాటి మాట్టాడ్డానికి ఎవరో ఉండడం, ఎన్నో హంగులుదేనికి!

కన: అవును. మావయ్యా-నీలకంఠం బాబాయి వచ్చేవరకూ ఆగడం దేనికి మనం మాట్లాడుకుందాం.

ప్రసా: పెద్దగా మాట్లాడవలసిన విషయాలు —

రాజ: అలా కాదు బాబు —

ప్రసా: మీ భయం నాకు తెలుసు-కోరికల్తో, సాంప్రదాయల్తో, మిమ్మల్ని కించపరచి—మీకు మళ్ళీ క్షోభను కలిగిస్తానని....

రాజ: అహా! ఎంతమాట! అదికాదు. తండ్రిగా ఇపుడు కొన్ని విషయాలు చెప్పకపోతే ముందు ముందిక లక్ష్మి ఏమి చెప్పలేదు. నాయనా ఆ అమ్మాయి మూగపిల్ల.

ప్రసా: కనుకనే నా బోటి సామాన్యుడికి ఆమెను చేసుకోబోయే అదృష్టం కలుగుతోంది.

రాజ: మూగదేకాని, నా బిడ్డ మంచి నేను చెప్పుకోవడం నా బుగ్గ నేనే పుణకడంలాంటిది—కాని చెప్పకుండ ఉండలేను. లక్ష్మి సుగుణాల రాశి—ప్రేమమూర్తి—ఇంత చిన్నవయస్సులోనే పెద్దపెద్ద కవుల శ్రేణిలోకి పోగలిగిన మంచి కవయిత్రి. దాన్ని వివాహం చేసుకోవడం—

ప్రసా: చేసుకొన్నవాడి అదృష్టం— (కనకంలోనికి వెళుతుంది)

రాజ: నిజం నాయనా ఇలా అన్నందుకు నన్ను క్షమించు—ఆడబిడ్డ తండ్రి కాకుండా—మా లక్ష్మికి తండ్రినైన దర్పంతో అలసత్వంతో

మాట్లాడుతున్నాను. అలాటి లక్ష్మిని నా మాటలమీద నమ్మకంతో చేసుకోగలిగితే చేసుకొండి—లేకపోతే—

ప్రసా: ఛ! ఛ! అదేమన్నమాట—మీ ఆరాటంకొద్ది చెప్పారు. కాని మీ లక్ష్మినిగురించి తెలియనివారు దేశంలో బహుకొద్దిమంది వుంటారు. అలాంటి అభిమానుల్లో నేను ఒకడ్ని — కాని యిప్పుడు నాకు రాబోయే అవకాశంమాత్రం అనేకుల్లో నా ఒక్కడిది. సందేహం లేదు. అయినా....

కన: ఏవిటి సందేహిస్తున్నారు?

ప్రసా: మీ నించి తెలుసుకోవాలనుకున్నది, ఒక్కటి, ఎన్ని గుణగణాలు, అందచందాలువున్నా ఇలాంటి స్వల్పమైన అవిటితనం ఉండడం వల్ల ఆడపిల్లల్ని కన్న హృదయాలు ఎంతగా క్షోభిస్తూంటాయో, మీకు అర్థం అయినట్టుగా మరొకరికి కాదు.

రాజ: నిజం నాయనా! అనుభవించేవాడికి తెలుస్తుందా బాధ. పిల్లలు లేకపోతే బాధలేదు—ఆ వున్నపిల్లలు సుఖజీవనానికి నోచుకోకపోతే, వారి బ్రతుకులు, ఆ ముసలి హృదయాలుకు, తీరని శాపాలు నాయనా -

ప్రసా: మీ వంటి సహృదయులు నాకు ఆత్మీయులు కాబోవడం నా పూర్వజన్మ సుకృతం - మరి నా దొక్కమనవి -

రాజ: (చాలాసంబరంగా) ఆ—ఏవిటి?

కన: ఏవిటో చెప్పండి-సంకోచించకండి.

ప్రసా: మరేం లేదు, నాకో చెల్లెలుంది సంబంధం నిశ్చయమయిన తరువాత ఒకే పందిటికింద జరగాలి రెండు పెళ్ళిళ్ళూ —

కన: అదేనా? (Table దగ్గరకు వెడుతుంది)

రాజ: హోరి నీ యిల్లు బంగారంగానూ - ఇదేనా - మాకుమాత్రం తొంద రేవిటి పెళ్ళికి?

ప్రసా: అలాకాదు. మరి మా చెల్లికి సంబంధం దొరకాలికదా ?

రాజ: దొరకడమేమిటి ? గగనమా ? మా నీలకంఠంకి చెబితే నిముషంలో అరడజను మందిని క్యూలో నిలబెడతాడు.

ప్రసా: అంత సులభమైతే, నా ఖర్మ నా పెళ్ళి జరిగేంతవరకు ఆపుతానా దాని పెళ్లి ?

కన : అంటే ?

ప్రసా: లక్ష్మికి సంబంధాలకోసం మీరు పడ్డ పాట్లకి రెండింతలు పడ్డాను, నా చెల్లి పెళ్ళికోసమని.

రాజ: ఏం - అమ్మాయి....

నీలం: (ప్రవేశిస్తూ) సలక్షణంగా ఉంటుంది. చక్కగా చదువుకుంటికూడ- అయితే ఏం లాభం

రాజ: ఇప్పుడా నువ్వు రావడం ?

నీల: ఏం చెయ్యమంటావయ్యా-అమ్మా కనకం నాకు కాసిని మంచినీళ్ళు- (కనకం వెళ్ళింది - అక్కడ కాళీగావున్న పాయసంగ్లాసు చూచి ఏఁవిటయ్యోయ్ ! అప్పుడే అల్లుడి నోరు తీపిచేసినారల్లేవుందే — (లోపల వున్న కనకంతో) నాకు వో గ్లాసు పాయసం ! (ప్రసాద రావుతో) వుందా — అంతా కాళీ చేశావా ! అయుండదు. కనకం కామధేనువు కదూ - (కనకం వస్తోంది.) అదిగో మాటలోనే వచ్చింది నా తల్లి. (కనకం పాయసం గ్లాసుతో వచ్చింది. నీల కంఠం అందుకొని గడ గడా తాగేడు.) ఆఁ ఏమిటి చెబుతున్నాను. ఆ ! ఏంలేదు రాజశేఖరం - అలా కనకమహాలక్ష్మి దర్శనానికి వెళ్ళాను.

కన : ఎందుకూ.

నీల: ఈ గండం గడిస్తే, అనగా ఈ పెళ్లి కుదిరితే - ఒక్క సాష్టాంగ నమస్కారం చేస్తానని మొక్కుకొచ్చాను తల్లీ.

ప్రసా: అయితే శీఘ్రంగా వెళ్ళి మొక్కుబడి చెల్లించుకరండి. (లేచి వస్తాడు. కనకం వస్తోంది.)

నీల: నిజం? నేను అనుకున్నానోయ్! ప్రసాదం: గుణంలోగాని, వినయంలోగాని ఏదీ, సంస్కారంలోగాని, నీకూ, ఇతరులకూ పోలికా-ఇహమరి తాంబూలాలూ—

ప్రసా: అదేనండీ! మరి మా చెల్లెలు విషయం—

నీల: నీ చెల్లిలి విషయమా? ఏవిటి?

కన: వారి చెల్లెలుకూడా సంబంధం కుదిర్తే రెండు పెళ్ళిళ్లూ ఒకే పందిటికిందే—

నీల: అదా - ఇతని అభ్యంతరం ఇదిగో ప్రసాదరావు నువ్వు అన్యధా అనుకోకు - మీ చెల్లెలికి సంబంధం చూడ్డం సంగతి మాతో మాటాడకు. కులం గోత్రం సక్రమంగావున్న పిల్లలకే సంబంధాలు దొరక్క నానా యాతనగా వుందయ్యా.

ప్రసా: ఇంతవరకూ వొచ్చింది కనక - ఆ కులం, గోత్రం, సంగతికూడ విడమర్చి మాట్లాడండి వారితో—

నీల: వాటి సంగతి మాకు అనవసరమయ్యా.

రాజ: అయినా ఏమిటిది?

నీల: ఆ-ఏమీ లేదయ్యా-వీరి నాన్నగారు కోడూరు చుట్టుపట్ల గొప్ప గౌరవంగా బ్రతికినటువంటి మనిషి. అతని తమ్ముడు - రామయ్య అని-అన్నగారికి పంచప్రాణాలు. నువ్వు, ఈ పురుషోత్తం బ్రతికినట్టుగా బ్రతికారు యిద్దరూ - అతను ఒక కూతురు కలిగిన తరువాత దివంగతుడైనాడు. ఈ కూతురూ-ఆ రామయ్య భార్య ఈ ప్రసాదరావు తండ్రి ప్రాపకంలో వుంటున్నారు - తరువాత....

ప్రసా: నాన్చకండి. దయచేసి చెప్పండి పూర్తిగా—

నీల : తరువాత - రెండు మూడు సంవత్సరాలకు- ఇతని పిన్నల్లి - అంటే యీ పిల్ల తల్లి ప్రవర్తన బాగోలేదని, ఆనోట, ఈనోట విని, ప్రసాదరావు తండ్రి నిప్పులాంటి మనిషి కావడంవల్ల - ఇంట్లోంచి వెళ్ళగొట్టాడు. తరువాత ఆమెక్కడో ప్రాణం తీసుకుంది.

ప్రసా: అప్పటినుంచి మా తండ్రి ఆ పిల్లను నాకంటె ప్రాణాధికంగా పెంచి - దాని బరువు బాధ్యతలు నాకు వప్పచెప్పి చనిపోయారు. అంతకుముందే నేను తల్లి లేనివాడ్ని, అప్పటినుంచి దానికి నేను—నాకు అది సర్వంగా బ్రతికాము. నా ప్రాణంకంటె ఎక్కువగా ప్రేమిస్తున్న నా చెల్లెలు చిన్నప్పటినుంచి నా ఎంగిలి కుడిచి నా గుండెమీద నిద్రబోయిన నా చెల్లెలు, నామీద ఆశలు పెట్టుకొని నేనే దిక్కైన చెల్లెలు - తన తప్పుగాని తప్పుకి పెళ్ళికి నోచుకోనిదై పోయింది.

కన : కడుపున పుట్టినంత మాత్రాన, తల్లి చేసిన పాపాలను, అంటగట్టడం అన్యాయం.

నీల : అన్యాయమేనమ్మా అయితేమాత్రం మనకెందుకా ఘోష. మనకు కావలసినవాడు ఇతను.

ప్రసా: నేనూ మీకు అక్కర్లేని ప్రాణి అన్నను. ఆ ఆంక్ష నామీదెందుకు లేదు—?

రాజ: మాకు లేదు నాయనా అభ్యంతరం కాకపోతే మేం ఈ విషయంలో ఏవిధంగా జోక్యం కలుగచేసుకోగలమా అని.

ప్రసా: నా కష్టాన్ని మీరేం తీర్చగలరు. ఏనాడు నేను మీకు కావాలనుకున్నారో ఆ క్షణంమంచి నాకు తండ్రిలేని లోటు తీరిందనుకున్నాను. నేను మీ యింటివాడ్నయినప్పుడు నా సమస్యలు మీవి-మీ సమస్యలు నావి.

రాజ: తప్పక నాయనా! మీ చెల్లికి సంబంధంచూసి పెళ్ళి జరిపించే పూచి నాది.

నీల: ఇదిగో శేఖరం, పని గడవటానికి సముదాయించటానికీ మాటలు మీరకు - మూగతనం మాత్రమే వున్న నీ కూతురికి సంబంధం కుదరడం గండం అయిపోయింది. ఒక కులట కూతురుకు—

కన : నీలకంఠంగారు—

ప్రసా: ఆయన్ని మందలించే పనిలేదమ్మా - అందరూ నా వెనుక అంటున్నది ఆయన ఎదురుగా అంటున్నారు. అంటున్నారు అని నాకు బాధగాదు కాని - అవిటివాళ్ళకు - అమాయకులకు పెళ్ళిళ్ళు జరిపించి ఇంతపుణ్యాన్ని మూటగట్టుకోవలసిన పెద్దలనోటకూడ సంశయమే వినిపిస్తున్నపుడు మరి దానికి దిక్కెవరు చెప్పండి?

నీల : అంటే - నాకు మీ అమ్మాయి గిట్టదా?

ప్రసా: అదికాదు —

నీల : మరేఁవిటయ్యా ఆ పెళ్లి జరిపిస్తే నాకో నాలుగు డబ్బులు గిడతాయి. గాని మానదుగదా, అయితేమాత్రం ఎవరికో ఒకరికి ముడివేయించేస్తే-వెధవది. ఒక్కనాటితో పొయ్యేదికాదు.చూడు మా వ్యాపారం-ఆ తరువాత? ఉన్న ఈ మూడు వెంట్రుకలూ వుండవు - నా తలకాయమీద -

రాజ: అది సరే - ప్రసాదరావు - ఆ విషయం నువ్వు మరీ అంతగా ఆలోచించకు - నేను తప్పక ప్రయత్నిస్తాను. ఇతడిమాట్లకేం? ఇక మనం తాంబూలాలు.....!

ప్రసా: వేరే ప్రయత్నం అక్కర్లేకుండానే నా కోరికను చెప్పమంటారా?

(అందరూ చెప్పండి అన్నట్టు చూస్తారు)

రాజ: ఏమిటది.....

ప్రసా: మీ అబ్బాయి ఆనందం యింకా పెళ్ళి కాసలసిన వాడు....

నీల: (పిడుగు పడ్డట్టుగా) ఋద్ధ అసంభవం—ఇది చచ్చినా....

కన: బాబాయ్—ఏమిటది? వారిని పూర్తిగా చెప్పనీ

రాజు: (ప్రసాదరావు నుద్దేశించి) ఆనందాన్ని మీ చెల్లెలికా?

ప్రసా: ఇస్తే సతమతమయిపోతున్న మన ఉభయుల మనస్సులు కుదుట బడతాయి. నేనూ యీ వివాహానికి నిరభ్యంతరంగా అంగీకరించ గలను.

నీల: మరి ఆ విషయం నువ్వు....

కన: (నీలకంఠాన్ని కూర్చోపెట్టి) లేకపోతే అంగీకరించలేరా?

ప్రసా: అంగీకరించమని మీరుమాత్రం అనగలరా? మీ లక్ష్మి విషయం ఆలోచించండి. అతన్ని వెనక్కునెట్టి తన అన్నగారు పెళ్ళి కావడం ఊహించండి. మీ యావన్మంది ఎంత కుమిలి పోతారో?

నీల: అందుకని ఇక్కడి విషయాలేవిటో తెలుసుకోకండా-ఓ కులట కూతుర్ని -

ప్రసా: మీరు పదిసార్లు ఆ మాట అనడం బాగాలేదు. అవునూ, కాదు, చెప్పడం బదులు—మీ ఆత్మీయుడు కాబోయే మనిషిని కించ పర చడం న్యాయంకాదు.

కన: అవును బాబాయ్ -

నీల: నేను మాటాడ్ను (లేస్తాడు) కాని ఒక్కమాట-నీ చెల్లెలు పెళ్ళి నీ పెళ్ళితో ముడిపెడితే మాత్రం నువ్వు ఇలా వుండవలసిందే. దాని బ్రతుకు....

ప్రసా: (ఆవేశం వచ్చింది) అయ్యా నీలకఠంగారు! దాని బ్రతుక్కేమండి? నా కంఠంలో ప్రాణముండగా నా చెల్లెలు ఏ వంకనా కష్టపడదు. అన్ని బాధ్యతలు నావి. అందుకే నే నల్లుడినైన యింట నా చెల్లెల్ని కూడ ఇవ్వాలని.

నీల: అంటే నిన్ను అల్లుడిగా చేసుకోవాలంటే—

ప్రసా: నా చెల్లెల్ని కోడలుగా చేసుకోవాలి. ఇది సానుకూల పడేవరకు దానికి అన్నగా మాత్రమే ఉండిపోతాను. (ఈ సంభాషణ మీద కనకం పురుషోత్తం పటం ముందుకు వస్తుంది.)

కన: నిక్షేపంగా మీ ఉభయులూ మాకు కొండి అన్నగారు -

రాజ: అమ్మా కనకం—(నీలకంఠం కోపంగాచూసి చుట్టూ తిరుగుతూ)

నీల: ఈ కొంపలో పెద్ద చచ్చి నాళ్ళంటూ వున్నారనా, లేరనా నీ అభిప్రాయం? (అని కనకం కుడివై పుకు వస్తాడు)

ప్రసా: (లేచి నిలబడుతూ) సరే! మీరీ విషయం చాలా తర్కించుకోవలసి వుంటుంది. నాకు తెలుసు. నిముషాలమీద ఒక నిర్ణయానికి రావడం కష్టమే, పైగా నా సమక్షంలో మాట్లాడుకోవడం ఇబ్బందిగా కూడ వుంటుంది. అన్నీ ఆలోచించుకొనే కబురు చేయండి (వెళ్ళబోతాడు.) వెళ్ళేముందు నా మాటగా ఇండాక మీ రన్నట్టు మీ లక్ష్మిని చేసుకోవడం ఎవరికైన ఎంత అదృష్టమో - నా చెల్లెల్ని చేసుకోవడంకూడ పూర్వజన్మ పుణ్యమే అనాలి. ఒక అవిటి పిల్ల తండ్రిగా, మీ బ్రతుకే శాపంగా, అనుభవిస్తున మీ మనసుకి తను చెయ్యని పాపానికి బలై పోతున్న నా చెల్లెలి బ్రతుకు కోసం నే పడే బాధ తెలియనికాదు. ఆ పైన మీరే నిర్ణయించండి.

నీల: (ప్రసాదరావు వెంటబడి) మా నిర్ణయం అంటావేఁవిటయ్యా-నీ చెల్లెలి బ్రతుకు ఉద్ధరించటం మా పని కాదు.

ప్రసా: అదే! ఆ మాటైనా నేను యిప్పుడు వినిపించుకోను. సాయంత్రమే — శెలవు అయ్యా వెళతానండి — వెళతానమ్మా —

కన: వెళ్ళిరండి-అన్నగారు తాంబూలం పుచ్చుకొనే వెళ్దురుగాని—

ప్రసా: నీ నోటిమాట అలాగే కాని అమ్మా-(నిష్క్రమిస్తాడు)

నీల: (కనకం ప్రక్కకు వెడుతుంది.) కానిస్తుంది కానిస్తుంది-ఏఁవిటీ కనకం నీ అభిప్రాయం?

కన: లక్ష్మిని ఒక యింటిదాన్నిచేసి మావయ్య మనస్సుకి శాంతిని చేకూర్చటమే నా నిర్ణయం, ఏం మావయ్యా ఏం చేద్దాం -

రాజ: ఇదేఁటమ్మా-నన్నడుగుతావేమే? ఘోరం!

కన: అంటే ఇష్టంలేదని కబురు పంపుదామా?

నీల: తప్పకుండాసూ-

కన: అందరి పెళ్ళిళ్ళు జరిపించేసి కొన్నివేలు మూటగట్టుకున్న అదృష్ట వంతులు-మిమ్మల్ని కాదు ఆ ప్రశ్న వేసింది. ఏం మావయ్యా కబురు పంపుదామా-

రాజ: ఆహా! అలా కాదు-కాదు-అలాగే మారోమార్గమేముంది?

నీల: ఏవిటయ్యో! నానుస్తావేఁవిటి? నీ కేమన్నా మతిపోతున్నదా! ఖచ్చితంగా పిల్లేదని ఎందుకు చెప్పలేకపోతున్నావు. ఏవిటి? చిన్నప్పటినుంచి మొగుడు, పెళ్లాలుగా పెరుగుతున్న యీ కనకాన్ని-ఆనందాన్ని విడదీసి ఆ పిల్లం జేసేద్దామనా-నీ కూతురు పెళ్ళెయితే చాలాన్నమాట. పురుషోత్తాన్ని ఒకమారు జ్ఞాపకం చేసుకోవయ్యా (లేచి వెళ్ళడానికి సిద్ధం అవుతున్నాడు.)

రాజ: ఎవరయ్యా యీ సంబంధం చేస్తానన్నది. ఎందుకు చేస్తాను. నాకు తెలీదు. నీకు తెలుసులే. అమ్మా కనకం నాకు కొంచెం మంచి నీళ్ళు పట్రా అమ్మా-చెప్పొచ్చాడు మహా.

కన: (లోపలకు వెడుతూన్నది. వెళ్ళబోయేముందు సిద్ధమౌతున్న నీల కంఠాన్ని ఉద్దేశించి) ఆగు బాబాయ్-వెళ్లొద్దు. (లోపలకు వెడుతుంది)

నీల: (మళ్ళీ కూచుంటూ) తెలిసినవాడివై తే, ఆ అనుమానం ఎందుకయ్యా? నాకు తెలుసునయ్యా. స్నిలాల సత్వానికి కారణం - మూగపిల్ల చెల్లిపోతుంది గదాఅని- నన్నెందుకమ్మా ఉండమన్నావు?

కన: ఎక్కడికెళతావ్ - భోంచేసి పోదువుగాని

నీల: భలేదానివే-ఆసోమిదమ్మకి మాటిచ్చి వచ్చాను.

కన : ఆ కొంపేం మునిగిపోదులే-ఇక్కడ తినెయ్.

ల: ఛ! ఛ! మాటిచ్చిం తరువాత మానేస్తే మర్యాద కాదమ్మా -

కన: మరిక్కడ చేసింది వృధాయేనా? పెళ్ళివారొస్తారు, వండించమని చెప్పావు. అవన్ని ఈ రేషన్ రోజుల్లో తగులబడి పోవలసిందేనా?

నీల: అన్ని దానాల్లో అన్నదానం చాల గొప్పది. ఎవరికో పడేయ్-

కన: మా గొప్పమాట చెప్పావు–నీ కిష్టమని గోంగూర పచ్చడి, మద్రాసు అప్పడాలు ప్రత్యేకంగా చేస్తే–

నీల: (దిగజారతు) ఏమిటో, గోంగూర పచ్చడీ, మద్రాసు అప్పడాలూనా-

కన: పొట్లకాయ పెరుగుపచ్చడి కూడానా

నీల: అదికూడానా....!

కన: ఇంకా కొత్తిమీరవేసి ఆవడాలు-జీడిపప్పుతో పాయసం-

నీల: (గుటకలు మింగుతూ) ఊ ననుకో - మరి సోమిదమ్మ....

కన: నన్ను చేయమన్న దానం ఆవిడే చేస్తుందిలే -

నీల: ఊ. సరే, నీతో యిదో పెద్దచిక్కు. కోతిపిడికిలి! పట్టుపట్టావంటే వడలవు. లేవయ్యా శేఖరం-భోంచేదువుగాని-(చొక్కా విప్పి కుర్చీ వెనక పడేసి, పంచె మరిడుకుల వరకూ ఎత్తి జంజం ముడివేసి-బొడ్డులో దోపుకుంటూ, పంచె కట్టు కొంచెం ఒదులుచేస్తాడు) అమ్మా ఆకులాయి దగ్గర కాళ్ళు కడుక్కుంటాను—

కన: (నీలకంఠం వెడతాడు) వెనకెడుతున్న రా।। శే।।న్ని ఆపి ఏవిటీ మామయ్యా ఆలోచన—

రాజ: నే చచ్చిపోతే బాగుండునమ్మా- (లేసి ముందుకు వెళతాడు)

కన: అదిగో మళ్ళి మొదలు-నే చెప్పేది విను-రాజాలాంటి సంబంధం. ఒదులుకోవటం మంచిదికాదు.

రాజ: కాదమ్మా-నన్ను వాడు క్షమించడు—

కన: ఎవరు? నాన్నా? నా వల్ల యీ సంబంధం కాకుండాపోతే నాన్న నన్ను క్షమించడు.

రాజ: మరి నీ జీవితం ఏం కాను?

కన: (రహస్యం అన్నమాట మరచి) నేనేం నీ కూతురి లాగా అవిటి దాన్ననుకున్నావా? కవిత్వాలు చెయ్యలేనేమోగాని, సంబంధాలు రానంత హీనమైన మనిషినిగాను.

రాజ: అమ్మా?

కన: అవును ఏవిటి చెబుతూ ఉంటేను. నీ పిల్లల పెళ్ళిళ్ళు ఎలాగా అని విచారించక, నా పెళ్ళికి బెంగపెట్టుకుంటావెందుకు? (నీలకంఠం వచ్చాడు) నీలకంఠం బాబాయి తలుచుకుంటే రోజుకో పెళ్ళి చేసికోగలను. కదు బాబాయ్.

నీల: ఆ లక్ష! నువ్వూ చేసుకుంటేను.

కన: ఏం! ఎందుకు చేసుకోను?

నీల: నోర్మూయ్! ఏ నూతిలోనో గోతిలోనో పడి మా కొంపలు ముంచు తావ్! ఇహ మాట్లాడకండి. రాజశేఖరం ఒప్పుకుంటాడేమోకాని, రోజూ నా కడుపు నింపుతూన్న అన్నపూర్ణవి, నీ బ్రతుకును బుగ్గి చెయ్యడం నా చేతకాదు తల్లి.

కన: నా బ్రతుక్కేమి? నేను చేసుకుంటానూ!

రాజ: నా మీద ఒట్టేసి చెప్పమ్మా-నువ్వు నిజంగా చేసుకుంటావా?

నీల: ఇదిగో శేఖరం నువ్వు మాట్లాడకు (వచ్చిన ఆవేశంవల్ల కొంచెం ఆగాడు) ఆ పిల్ల నీమీద ప్రేమతో తన బ్రతుకునే త్యాగం చెయ్యడానికి సిద్ధపడుతూఉంది. నువ్వు నీ కోసం, నీ పిల్లకోసం, ముగ్గుర్ని హత్యచేయడానికి బయలుదేరుతున్నావు.

రాజ: నేనా....

నీల: ఆ....నువ్వే! ఇటు కనకాన్ని, అటు ఆనందాన్ని, ఇంకా రాబోయే పిల్లనుగూడ హత్య చేయడమే ఇది - నీ యిల్లు కళ కళ లాడలంటే, నీ పురుషోత్తం మనసు కించపడకూడదు. ఇదీ నే చెప్పవలసిన మాట.

రాజ: నేనేం చెయ్యనయ్యా! అది ఈ సంబంధం జరగాలి మొర్రో అంటే నేనేం చెయ్యను. (ఏడుపుకు దగ్గరగా ఉంది ఆవేశం)

కన: అయ్యో రామ. నేను నిక్షేపంలా పెళ్ళి చేసుకుంటాను.

నీల: (రా. శే.తో) ఆ! చేసుకుంటుంది! ఇది చేసుకుంటుందా? ఒకవేళ చేసుకున్నా మొక్క-బడికి చేసుకుని ఈ పెళ్ళిళ్ళ కాగానే ఇల వేల్పుగా మిగిలిపోతుందిగాని. ఇల్లాలుగా మాత్రం కాదయ్యా.

రాజ: భగవాన్....(ఏడుస్తూ) ఇప్పుడు నేనేం చెయ్యాలి? చచ్చిపోయిన ప్రాణమిత్రుడు....బ్రతికున్న దేవతలాంటి పసికూన .... నా కన్న కడుపు కలక్క కలక్క కలిగిన ఒక్కగానొక్క ఆడబిడ్డ గుండె కొక గుదెబండై కూచుంది. నన్ను రాతికంటె కఠినంగా, మృగాని కంటె క్రూరంగాచేసి పచ్చి స్వార్థపరున్ని చేసింది....ఔను....దాని పెళ్ళి కావాలంటే దీని ప్రాణాలు తీయాలి....మరి దీని ప్రాణాలు కోసమని దానిబ్రతుకు .... (మరొక్కమారు కన్నీటి తెరలో కడుక్క-పోయి....ఆవేశంలో నిలబడుతూ) పాడుబ్రతుకు .... దాని బ్రతుకు తగలడ....అది పుట్టగానే పురిట్లోనే చస్తే ఒక ఏడుపు ఏడ్చి సరిపెట్టుకొనేవాడిని గదయ్యా (అంటూ బయటికి వెళ్ళిపోబోతాడు)

నీల: శేఖరం (ఆగుతాడు) ఇలాకూర్చో చ! చ! మరీ దిగజారిపోతావేం. ఒక్కమాటడుగుతాను చెప్పు. ఈ సంబంధం తెచ్చినవాడ్ని నేను కదా? కొన్నిగంటలముందు వాళ్ళేవరో నీకు తెలియదుకదా? ఇంత వరకూ జరిగింది జరగలేదనుకో! తెల్లారేటప్పటికి మరో సంబంధం చూస్తాను.

రాజ: మరో సంబందం. మరో సంబంధం, మరో సంబంధం .... ఇలా ఎన్ని సంబంధాలు చ చ!

కన: (ప్రవేశించి చేతులు తుడుచుకుంటూ నిలబడుతుంది)

నీల: అందుకని దిక్కు-లేని పిల్లగ-దాని, దాని బ్రతుకుని నిర్లక్ష్యం చేయడం ఘోరమయ్యా.....(ఆగాడు) ఇన్నాళ్ళూ వాళ్ళ మనసుని ఒకటిగా చేసినవాడవు నువ్వు. ఇప్పుడిలా నీ చేతుల్తోనే....

కన: బాబాయ్! వడనయింది.

నీల: లే లే అసలు వేళదాటింది (వంటింట్లోకి దారితియ్యబోతాడు)

కన: బాబాయ్! ఆ సోమిదమ్మకి నిజంగా మాటిచ్చావా?

నీల: (పంచ సర్దుకుంటూ-ఏదో లాభంగా) ఒట్టు అన్నపూర్ణ సాక్షి.

కన: ఆవిడ మరేమనుకుంటుందో పాపం (తువ్వాలు అందించింది.)

నీల: అనుకోదు మరీ! నువ్వు సామాన్యురాలివా! గొంగూరని, అప్పడాలని, సింగినాదమని....

కన: బాబాయ్! ఇంత చిన్న చాపల్యానికే లొంగిపోయి అటు మనసు ఇటు తిప్పుకున్నావే-కన్న కడుపు తీపితో మామయ్య చలించి పోతుంటే నువ్వా మామయ్య మాట తప్పుతున్నాడని తప్పుబడుతున్నావు?

నీల: (ఏం చెప్పాలో తోచక) ఏమిటీ?

కన: ఏమీలేదుగాని, నా మాట వినండి. నా మనసు మీకు తెలియదు. నే నెప్పుడూ ముందే నిర్ణయాలు చేసుకోను, తప్పని సరిగా బావని చేసుకోవాలని నేను ఏనాడూ అనుకోలేదు. కాని మామయ్యకు మనశ్శాంతి, మావయ్య బ్రతికున్నంత కాలం నా ఒడిలో పసిపిల్లవాడిలా చూచుకోవాలనేది మాత్రము నా తప్పనిసరి నిర్ణయం.

నీల: అవునమ్మా! అందుకని—

కన: ఇహ! వ్యర్థప్రసంగాలతో మామయ్యకు మళ్ళా బ్రతుకుమీద విసుగు పుట్టించకండి. నా కేమీ కానివాళ్ళను నా దగ్గరకుచేర్చి మా నాన్న నాకు వదిలిపోయిన మామయ్యను దూరం చెయ్యకండి. వెళ్ళండి, నీలకంఠంగారు. వెళ్ళి అతన్ని తీసుకురండి.

నీల: నా చేతుల్లో....

కన: మా కుటుంబానికి నిజమైన మిత్రులని మీరు రుజువు పరచు కోవాలనుంటే, వెంటనే వెళ్ళి సంబంధం ఖాయపరచండి.

నీల: మరి నీ మాటమ్మా నీ గతేంకాను.

కన: నా మాటనమ్మండి. నాకో రాజాలాంటి సంబంధం చూసిపెట్టండి. మీ కమీషను వగైరాలు కాకుండా-నిత్యం భోజనం....

నీల: ఊరు కోవమ్మా-ఏడుప్రలోకూడ నవ్వగల శక్తి నీది ఉండు వెళ్ళి అతన్ని తీసుకొస్తాను.

కన: మరి భోజనం.

నీల: ఆ- భోజనంలాగే ఉంది (వెళ్ళిపోతాడు)

కన: నిజంగానే పొట్లకాయ పెరుగుపచ్చడ చేశాను బాబాయ్! కోపంకొద్దీ అతనొక్కడ్ని పంపి నువ్వా సోమిదమ్మగారింట ఆరగించేవు?

నీల: సంతోషించాం.... శేఖరం అతన్ని తీసికొస్తాను.

రాజ: (నిస్సహాయంగా ఇద్దరివైపు చూస్తాడు)

నీల: ఉ! ఇహసరే....(వెళ్ళాడు)

(రాజశేఖరం దీనంగా అతనివైపు చూస్తాడు. కనకం నవ్వుతూ అతనివంక చూస్తుంది. దుఃఖం వస్తుంది. నెమ్మదిగా కనకాన్ని దగ్గరకు తీసికుని తలనిమురుతూ ఉంటాడు. ఆనందం తెల్లకాగితాలతో చాలా హుషారుగా ప్రవేశించి, వీళ్ళ యిద్దర్ని చూస్తాడు. ఆనందాన్ని గమనిస్తారు-ఇద్దరూ విడిపోతారు)

ఆనం: (వెనక్కి తప్పుకుంటునట్లు నటించి) ఓయ్! ఓయ్ ఏమిటి నేను చాలా పొరపాటు సమయంలో వచ్చినట్లున్నాను. (రా. శే. యిద్దర్ని కన్నార్పకుండా చూచి దుఃఖాన్ని దిగమింగుతూ నిష్క్రమిస్తాడు.)

కన: (లేనినవ్వు తెచ్చుకుని) ఎక్కడినుండి రాక ఇటకు బావా?

ఆనం: హస్తినాపురినుండి-ఆకలేస్తోందమ్మాయ్ త్వరగా వడ్డించు.

కన: ఉండు నీ పెళ్ళివాళ్ళు ఒస్తున్నారు. కలసి భోంచేద్దువుగాని

ఆనం: సర్లే, నా పెళ్ళి వారేవిటి, సాక్షత్తు నా పెళ్ళాంగారితోనే కలసి భోంచేస్తాను. తొరగా పదమ్మాయి. (నిష్క్రమించుతూ ఆగి) ఏవిటి నువ్వింకా భోంచెయ్యలేదా?

కన: (కుర్చీలో కూర్చుంటుంది)

ఆన: ఇదిగో కనకం నాకేం వడ్డించుకోవడం చేతకాదనా?

కన : నీ ఆకలి తగలడిందిగాని కూచో బావ, నీకో శుభవార్త చెబుతాను.

ఆనం: ఆకలికాదు. కడుపు తగలడిపోతోంది. దహించుకుపోతోంది — చెప్పు, చెప్పు త్వరగా. (కూర్చుంటాడు.)

కన : (మౌనం)

ఆనం: చెల్లికి సంబంధం కుదిరిందా!

కన : ఔను. నిశ్చయం తాంబూలాలు పుచ్చుకు భోంచెయ్యటానికి ఇపుడొస్తున్నారాయన.

ఆనం: హైతో! అదా సంగతి! మరి నా పెళ్ళి వారంటావేమిటి? బావగారు నా చెల్లెలి మొగుడా! నాకూ మొగుడేనా ఈ కాగితాలు లక్ష్మికిచ్చేస్తా .... (పోబోతూ ఆగి) అది సరే నాన్నేమిటలా గున్నారు.అబ్బబ్బ యీ ముసలాళ్ళతో పెద్దచిక్కు. ఇన్నాళ్ళు పెళ్ళి కాలేదని బాధ ఇపుడు పెళ్ళయి వెళుతుందని....

కన : మరి నీకుమాత్రం బాధ లేదేమిటి?

ఆనం: నాకెందుకూ మా బావగారి చెవి మెలేసి ఇక్కడ ఇల్లరికం వుంటేస్తాను. అది సరేగాని - ఇప్పుడే మన పెళ్ళికూడా!

కన : ఆ— లక్ష్మికి జరిగిన పందిట్లోనే నీకూ పెళ్ళి జరిపించాలని, మామయ్య, నీలకంఠం బాబాయి ఒక నిర్ణయానికి వచ్చారు.

ఆనం: నిజంగానా (అని వత్తిపలికి కొంచెంగా ఎడమకన్ను అదిరినట్లుగా ముద్దు పెట్టుకున్నాడు.)

కన : మగవాళ్ళకు ఎడమకన్ను అదరకూడదు, బావా.

ఆనం: ఓ ! Sorry (అని కుడికన్నుగీటి మళ్లా అలాగే ముట్టుకున్నాడు.)

కన : ఏయ్ ! పెళ్ళికొడుకా నీ అల్లరి నీదేనా ? నా మాట వింటావా లేదా ?

ఆనం: ఆల్‌రైట్ ! నా పెళ్ళికూతురా (అని కూర్చుంటాడు.)

కన Commercial Tax Officer ప్రసాదరావుగారు

ఆనం: ఔనౌను. విన్నాను. కుర్రాడు బుద్ధిమంతుడేనా ? నువు చూశావా ?

కన : అతనికూడా నీకున్నట్లే ఒక చెల్లెలుంది ?

ఆనం: శుభం !

కన : ఆ చెల్లెలికి పెళ్ళి కాలేదు.

ఆనం: శుభం!

కన : సంబంధాలకోసం ఎంత ప్రయత్నించినా - ఒక చిన్న కారణంవల్ల దొరకలేదూ - మీ చెల్లికి లాగానె....

ఆనం: ఆలాగా....శుభం.

కన : ఏమిటి శుభం ? ఆవిడకు పెళ్ళి కాకపోవడం శుభమా ?

ఆనం: శుభంగాదు - అదే శుభం - నువ్వు చెబుతున్నావుగా కనకం అది సరేగాని మన Honey Moon అమరావతికి వేసుకుందామా ?

కన : (సీరియస్‌గా) నువ్వు నామాటలు వినడంలేదు.

ఆనం: అబ్బబ్బ ! సహస్ర అవధానం చేస్తాను. కనకం .... చెప్పు, పెళ్ళి కొడుకు చెల్లెలికి సంబంధాలు దొరకడంలేదు ?

కన : కనక ఆ అమ్మాయిని కోడలుగా చేసుకున్నఇంటినే తనూ అల్లుడౌతాడట.

ఆనం: (నిర్ఘాంతపోయి) ఏమిటీ ?

కన : అందుకని చాలా వాదోప వాదాల తరువాత అంతా తీసుకున్న నిర్ణయం ఏమిటంటే - అతని చెల్లెల్ని నువ్వు చేసుకోవడం.

ఆనం: ఊ (ప్రమాదాన్ని ఊహించాడు) లేస్తాడు.

కన : నీ చెల్లెల్ని అతను చేసుకోవటం ?

ఆనం: కనకం !....మతిపోయిందా ?

కన : ఎవరికి ?

ఆనం: నీకు ? ఏవిటే నువ్వు వాగుతున్నది ? .... అబ్బబ్బ త్వరగా వడ్డించు.

కన : ఉండు నీ పెళ్ళివారు రాని,

ఆనం: నోర్ముయ్.

కన : కూర్చో ! నీ నోరు నాకందదే !

ఆనం: (దీనంగా కనకంవైపు తిరిగి) హాస్యమేకదూ కనకం.

కన : కాదు బావా !

ఆనం: నిజంగానా ! నిజంగా ఇలా జరిగిందా ? నువ్వొప్పుకున్నావా?

కన : నేనే ఒప్పుకున్నాను. ఇంకెవ్వరు ఒప్పుకోలేదు కూడాను.

ఆనం: నువ్వే ?

కన: ఆ! నేనే

ఆనం: నా మీద ఒట్టు?

కన: నీ తోడు.

ఆనం: మీ నాన్నమీద ఒట్టు?

కన: (పురుషోత్తం పటంవైపు చూసి) నా అంతట నేనే అందర్ని ఒప్పించి ఇది సిద్ధపరచాను.

ఆనం: కనకం (చెంప చెళ్ళుమనేట్టు కనకాన్ని కొట్టబోయి ఆగాడు)

కన: ఆగా వెందుకు? కొట్టు నీ కామాత్రం అధికారంలేదా?

ఆనం: ఏమిటి నీ అభిప్రాయం? కనకం....కనకం....(కనకం మొహాన్ని తన చేతుల్లో పట్టుకొని) లేదు, లేదు, నువ్వబద్దం చెబుతున్నావు. నువ్వు హాస్యం ఆడుతున్నావు. నీ మొహమే చెబుతోంది. ఇది నిజమైతే నువ్వింత నిర్విచారంగా ఉండలేవు....కదూ కనకం? అబద్దమని అనేయ్ కనకం. నాకు మతిపోతోంది....నిన్ను చంపినా చంపుతాను. (లక్ష్మి లోపలినుండి ఆదరా బాదరాగా వస్తుంది మధ్య నిలబడుతుంది. ఆనందాన్ని తనవైపుకి తిప్పుకుని మొగంలోనికి చూచి దీనంగా కన్నీరు కారుస్తుంది.)

ఆనం: (లక్ష్మివైపు క్షణం తదేకంగా చూస్తాడు. తరువాత కదిలి కొడుతూ) లక్ష్మి....నువ్వేమైనా నాకేంకాదు. నిన్ను చంపడానికైనా సిద్ధం, ప్రపంచమంతా భగ్గుమన్నా నాకు ఫరవాలేదు. నాకు కనకం కావాలి అంతే.

కన: నువ్వు నాకు సుతరామూ అక్కర్లేదు బావా....

ఆనం: (కొట్లకుక్కలాగా కనకాన్నిచూసి) ఏమిటీ?

కన: ఔను సిగ్గులేదూ, నాయంతట నేనే నీ కోసం సంబంధం చూచాను అంటేనువ్వు నా వెనక పాకులాడ్డానికి.

ఆనం: ఆత్మవంచన! పోజ్! మంచి దానివి కావడానికి తపన హత్యలుచేసి, ఘోరాలు జరిపి గొప్పదానివి కావాలని, లేదు కనకం! ఇలా జరిగిందంటే నిన్ను చంపి తీర్తాను. నీ మనసును తునిమి తునిమి నూరుకు తాగుతాను. చిత్రహింస చేస్తాను....నే నంటే నీ కిష్టంలేదూ?

కనం: లేదు?

ఆనం: అబద్దం! అయితే ఇన్నాళ్లూ నీ ప్రేమ నటన!?

కన: ప్రేమా! ఏం ప్రేమ.

ఆనం: కనకం! ఇది గొప్ప ఘోరం సుమా. నువ్వు నన్ను ప్రేమించనే లేదా?

కన: ఎందుకు ప్రేమించలేదు? నిన్నూ ప్రేమించాను, లక్ష్మిని ప్రేమించాను మన పంజరంలోని చిలుకని ప్రేమించాను.

ఆనం: నన్ను పెళ్ళిచేసుకుందామనుకోలేదూ?

కన: లేదు-

ఆనం: ఏం? ఎందుకని?

కన: నా యిష్టం....ఇదేం ప్రశ్న?

ఆనం: (అణచుకున్న ఆవేశంతో) లక్ష్మి .... నువ్వు లోపలికి వెళ్ళు. (లక్ష్మి వెళ్ళనని తలూపుతూ కనకాన్ని చుట్టుకుంటుంది)

ఆనం: మీ కనకాన్ని నేనేం చంపేయన్లేవే....వెళ్ళు....వెళ్ళు (అని లాగి లక్ష్మిని తోస్తాడు. లక్ష్మి తూలుతూ, ఏడుచుకుంటూ లోపలికి పరుగెత్తుతుంది)

ఆనం: (ఆవేశం కళ్ళలో మాత్రమే కంఠంలో యుండదు.) కూర్చో కనకం ....సరి, నేనూ బాధపడడం మానుకుంటాను. నిర్భయంగాకూర్చో.

కన: (స్వేచ్ఛగా కూర్చుంటూ) అక్కడికి నేనేదో భయపడి పోతున్నట్లు

ఆనం: ఊన్లే-ప్రాణాలు తీసేదానివి. నీకు ప్రాణంమీద భయముండదు (తను మరో కుర్చీలో కూర్చుంటాడు) ఇప్పుడు చెప్పు నిజంగా, కనక మహాలక్ష్మి సాక్షిగా, నిజం చెప్పు. ఇప్పటికి జరిగిన దాంట్లో వీస మెత్తు అబద్ధంలేదు?

కన: నువ్వు, నీ చెల్లెలిపెళ్ళికోసం ఆజన్మాంతం అవివాహితుడుగానైన యుండగలను, అన్న నీ మాట తప్పించి

ఆనం: (దెబ్బతిన్నవాడ్లాగా చూచి) నేనీ పెళ్ళిచేసుకుంటే నువ్వేం చేస్తావు.

కన: ఎంచక్కా నేను పెళ్ళిచేసుకొని నీ కంటె ముందే ఓ కొడుకుని కని నీకు పుట్టిన కూతురికిస్తాను....వరుసలు కొంత మార్చుకోవాలి.... అంతే

ఆనం: ఆహా! (లేచినించున్నాడు క్షణం ఆలోచించి చరచరా తండ్రి గది లోకి వెళ్ళాడు)

కన: (తనూ నిల్చుని, ఆనందం పోయినవైపు రెప్పార్పకుండా చాలా బరువుగా చూసి, పురుషోత్తంవైపు తలెత్తి) నాన్నా! నీ ఆజ్ఞను అక్షరాలా నిర్వహించే మనోబలాన్ని నాకు ప్రసాదించు నాన్నా, (లక్ష్మీ చెయ్యి తనమీద పడింది గిరుక్కున తిరిగింది. అప్రయత్నంగాదు? జాతి శయంతో దగ్గరకు తీసుకుంది. మూగలక్ష్మి మనసులో మెదిలే భావాలు గీతికగా కనకానికి వినవస్తున్నాయి. నువ్వు ఇతరులకు వెలుగునిచ్చి, నిన్ను నువ్వు కాల్చుకునే కొవ్వత్తివి.)

తన తనువును బలిపెడుతూ
కాగే నూనెలో వెలిగే వత్తె
తాను నుసి యౌతూ
లోకాలకు వెలుగిచ్చును.

కన: ఛ! ఛ! నీ తోడు నాకేమైనా బాధలేదు. నువ్వు కంట కనపడితేనే నేను వ్యధపడతాను. వూరుకో.

(లక్ష్మి చెయ్యెత్తి నమస్కరించి—రిప్పున లోనికి వెళుతుంది)

(అటునుంచి రాజశేఖరం, ఆనందం ప్రవేశిస్తారు. ఆనందం ఆగకుండా తన గదిలోకి పోతాడు. రాజశేఖరం కనకం దగ్గర కొచ్చి ఆగుతాడు.)

రాజ: ఈ సంబంధం చేసుకుంటానని వాడంతట వాడే వచ్చి చెప్పాడు. నువ్వేమైనా చెప్పావా? తల్లీ

కన: ఆ—చెప్పాను. అసలు మా యిద్దర్లో ఎవరికీ ఫరవాలేదు మావయ్యా నువ్వు, నీలకఠం బాబాయ్ వూరికే సతమతమయి పోయారు.

రాజ: హు....ముందుకేం జరుగనున్నదో....ఆ నీలకంఠం యింకా రాలేదు.

నీల: (మాటమీద ప్రవేశిస్తూ) ఇదుగో వస్తూంటేనూ. రావయ్యా అల్లుడూ! కూర్చో (కనకం లోపలికివెళ్ళింది)

రాజ: రండి. రండి, దయచేయండి: (నవ్వే ప్రయత్నం చేస్తాడు)

ప్రసా: (నవ్వుకుంటూ వచ్చి కుర్చీలో కూర్చుంటాడు) నీలకంఠంగారు మీ పరిచయభాగ్యం నాకు కల్పించారు. నీలకంఠంగారే ఈ సంబంధం తప్పిపోడానికి కారణమౌతున్నారను కుంటుండగా, తిరిగి నీలకంఠంగారే ఖాయపరుస్తున్నారు. వీరికి నేను కృతజ్ఞుడ్ని.

నీల: (ఏమీ మాట్లాడడు)

రాజ: చివరికి మేము మీ నిబంధనలకు అంగీకరించి.

ప్రసా: నిబంధన అనకండి. నా కోరిక. బాధ్యతాయుతమైన కోరిక అంతే.

నీల: పెట్టావు జటిలమైన కండిషన్లు: దానికి పెద్ద పెద్ద పేర్లు ఎందుకయ్యా (ఛలోక్తిగా అక్కసు వెళ్ళ గ్రక్కుతాడు)

ప్రసా: అలాగాదు. బలవంతాన, అవసరాలకు లొంగిపోయి సంబంధం అంగీకరించడం ఇరుపక్షాలకూ శ్రేయస్కరంకాదు.

రాజ: అబ్బబ్బె అదేంకాదు. కుండమార్పులు అనాచారమేమో అనుకున్నాం తప్పించి మరో అభ్యంతరం మాకు ఎంతమాత్రంలేదు.

ప్రసా: మీ అబ్బాయిగారు లోపలున్నారా?

నీల: అబ్బాయిగారేమిటి? బావగారను.

రాజ: ఉన్నాడు. ఇంతకుముందే వచ్చాడు. వాడితో అంతా చెప్పాను. నా మాట కెదురు తిరిగే వాడు కాదు. (కేకవేస్తాడు)

ప్రసా: మరి మా బావగారు చెల్లెల్ని చూడాలి గదా?

నీల: అలాంటి పట్టింపులేం లేవండి మాకు. మాకు కావలసింది సాంప్రదాయం.

ప్రసా: అయినా అంతలో ఏం పోయింది. ఇప్పుడో, సాయంత్రమో బావ గార్నొకమారు తీసుకువెళ్ళి పరిచయం చేస్తాను. ఆ తరువాతనే తాంబూలాలు....

ఆనం: (పంచె, లాల్చి పెళ్ళిచూపులకు సిద్ధమైన వాడిలాగా తయారై వొచ్చాడు. మనిషి ప్రవర్తనలో ఇకనుంచి కొంచెం ఖ్రుతిమించి నట్టుగా, ఆవేదన్ని కప్పిపుచ్చుకుని లేని సంతోషాన్ని వ్యక్తం చేసు కొనే బోళాతనం కనిపిస్తుంది.)

నీల: ఒకమారు అమ్మాయిని చూసుకుంటావేమిటోయ్?

ఆనం: ఏమిటి? నేనా! ఎందుకు? అక్కర్లేదు బావగారు. మీరు మాకు అల్లుడు కావాలి. అది మా అదృష్టంగా భావిస్తున్నాం. ఇహ ఏ పరిస్థితులలోనూ ఈ అదృష్టాన్ని వొదులుకోలేము.

ప్రసా: ఆ అదృష్టం మీదికాదు, నాది అయినా అమ్మాయి మంచిచెడ్డలు....

ఆనం: ఓహో అవా! వాటిని మీ నోటినుండి వింటే చాలు. ఏం అమ్మాయి చదువుకుందా? Dance చేస్తుందా. వంటలొచ్చా? పేరు వయస్సెంత? — . .... ఆఁ అన్నట్టు ప్రేమిస్తుందా?

(అంతా నవ్వుతారు.)

రాజ: ఒరే బడుద్దాయి! నీ తెలివితేటలకి నీకో పెళ్లాం దొరకడమే అదృష్టంరా!

కన: (కాఫీలతో ప్రవేశిస్తూ) అవునన్నగారు! ఎంత త్వరగా యీ పెళ్ళయి ఆ వొచ్చిన పిల్ల కొరడా చేతపట్టి మా బావని ఒక కొలిక్కి తీసుకు వస్తుందా అని మా అందరికి తొందరగానే ఉంది.

ఆనం: ఆ! అదిమాత్రం నిజం. ఆ సంగతి ఈ కనకానికి తెలిసినట్టు ఈ మొత్తం చతుర్దశ భువన భాండాల్లో మరెవ్వరికి తెలీదు. (సూటిగా కనకం ముఖంలోకి చూసి) నువ్వెందుకు వాగుతావ్ పోయి

నీ పనులు చూసుకో. (అది అక్కసు అన్న సంగతి ఒక్క కనకానికి మాత్రమే తెలుసు.)

కన : అంత ఉడుక్కుంటావేమి బావా ? (అంటూ లోపలికి వెడుతుంది.)

ప్రసా: నేను మొదట్లో ఒక టనుకున్నాను.

ఆనం: మరొక కండీషనా ?

రాజ: ఏమిట్రా అది (మందలింపుగా)

సీల : ఏమిటి నాయనా అది.

ప్రసా: ఏదై తేనేంలెండి. నే ననుకున్న అభ్యంతరం ఉండిఉంటే నా అభ్యర్థనను మన్నించి ఉండేవారేకాదు.

(లక్ష్మితో ప్రవేశస్తుంది కనకం. లక్ష్మిని ఎదురుగా కుర్చీలో కూర్చోబెడుతుంది. కనకం లోపలికి వెడుతుంది. లక్ష్మి ప్రసాదరావుకు నమస్కరిస్తుంది. ప్రసాదరావు ప్రతి నమస్కారం చేస్తాడు.)

ఆనం: ఇందాకా ఏదో అనుమానం సెలవిస్తున్నారు బావగారూ.

ప్రసా: అదా ! ఇంత అన్యోన్యంగా ఉన్నవారు మీరూ, కనకం....

(అందరూ ఏం చెప్పాలో తోచక నిశ్చేష్టులయ్యారు. ఇంతలో కనకం పైన గుడ్డ కప్పిన పళ్లెంతో. ప్రవేశిస్తుంది.)

ఆనం: విన్నావా కనకం! బావగారి సందేహం ? (ఏమిటన్నట్టు చూసింది) మనం ఇద్దరం ఎందుకు భార్యా భర్తలం కాలేదని ?

కన : అదేమిటన్నగారు వరసలకు అలా అయినా మా ఆనందం బావని పెంచిన ఒడిలోనే మామయ్య నన్నూ పెంచారు. చిన్నతనంనుంచి ఒకచోట పెరిగినవాళ్ళం. ఒకే ఆత్మగా భార్యా భర్తలం ఎలా కాగలం. ఏం బావా ?

ఆనం: (నోటి మాటలేదు.)

ప్రసా: నేను దగ్గరవాళ్ళుకదా అనుకున్నాను.

ఆనం: (Burst అయి) దగ్గరా ! ఎంత దగ్గర - వాళ్ళ నాన్నకు మాకూ ఎంత డగ్గరో ఈ పిల్లకీ మాకూ అంతే దగ్గర, అతగాడు పోయి పాపం, మరో లోకంలో ఉన్నాడులెండి. దగ్గర్లో లేడు.

రాజ: వాడి తలకాయ. బాబూ వీళ్ళిద్దరికీ క్షణం పడదు. కొట్లు కుక్కలు. మా కనకంమాకు ప్రాణానికి ప్రాణం. మమ్మల్నందర్నీ ప్రేమతో సాకి....

ఆనం: అవునవును ప్రేమంటే మా కనకానికి తెలిసినట్టుగా మరెవ్వరికి తెలీదు. కనకమే ప్రేమ. ప్రేమే కనకం. తల్లీ కనకం. నువ్వు చెప్పమ్మా ప్రేమంటే ఏమిటో ?

కన : ఏమిటి బావా అది ?

ఆనం: ప్రేమంటే ఏమిటి ?

కన : ఏమో నాకు తెలీదు.

ఆనం: పోనీ ఏది ప్రేమకాదో తెలుసా ?

కన : మనల్ని నమ్ముకున్నవారు ఏమైనా సరే ! మన ప్రేములు, మన ఆనందాలూ, మన ఆశయాలూ పట్టుకుని ఊరేగా లనుకోవడం మాత్రం ప్రేమకాదు, బాబాయ్. ఇక మిగతా కార్యక్రమం సాగించడం మంచిది. ఉండండి (లోపలికి వెడుతుంది.)

నీల : అలాగే ! తాంబూలాలు పుచ్చేసుకుందాం.

ప్రసా: అలాగే ! మీరు అడగవలసినవి ఇంకేమైనా ఉన్నాయా ?

రాజ: మరింకేమిటి ? మీపిల్ల మాకు కానుక.

ప్రసా: సరే మీపిల్ల మాకు కానుక.

ఆనం: కానీ నా దొక్క Condition లాంటి కోరిక.

ప్రసా: ఏమిటి ?

ఆనం: అదే నా చెల్లెల్ని చేసుకోవాలనుకునే పెళ్ళికొడుకు నా యింట్లో ఇల్లరికముండాలి. ఇది నాకు చిరకాలవాంచ. (కొబ్బరికాయలతో కనకం వచ్చింది.) ఈ పిల్ల దూరంకావడం అసలు మా కనకం సహించలేదు.

ప్రసా: ఇది కాస్త ఆలోచించి చెప్పాలి.

ఆనం: Take your own time అప్పుడే తాంబూలాలు పుచ్చుకుందాం: కనకం! లక్ష్మిని లోపలకు తీసుకువెళ్ళు (అందరూ ఆనందం ప్రవర్తనకు విస్తుపోతున్నారు. కనకంకూడా! కొద్ది క్షణాల నిశ్శబ్దం తరువాత)

కన: (ఆనందం ప్రవర్తనని కప్పిపుచ్చుతూ) ఏమిటయ్యా నీ వేళాకోళం! నువ్వూనూ?

ఆనం: అబ్బే! వేళాకోళంకాదు బావగారు. ఇంతమంది పెద్దలుండికూడా తప్పనిసరై నేనే పెద్దవాడిలాగా మాట్లాడుతున్నాను క్షమించండి. నా చెల్లెలు సౌభాగ్యం, సుఖంకోరి మీరు ఇల్లరికం ఉండాలని నేను వాంఛిస్తున్నాను. మీ భాషలో బావగారు ఇది కండిషన్ కూడా!

ప్రసా: నా మాటలధోరణి షరతుల్లాగా ధ్వనిస్తే నన్ను....

ఆనం: అబ్బెబ్బే. అదేంకాదు.

రాజ: సరే! ఇక నోర్ముయ్ (ప్రసాదరావుతో) బాబూ! ఇల్లరికం మనుకోకుండా మీ రిక్కడే ఉంటేమాత్రం ఏం? ఈ ఊర్లోనే ఉద్యోగంకదా! మీ రెక్కడో ఉండటానికి బదులు వయసు మళ్ళినవాడిని నాకూ చేదోడు వాదోడుగా ఉంటావు. మరి మా ఆనందం ముచ్చటా తీరుతుంది మీరు....

ఆనం: అబ్బే నా ముచ్చటేమీకాదు. మా కనకానికి ముచ్చట. భార్యా భర్తల అచ్చట్లు ముచ్చట్లు తీర్చటానికి ఆవిడకు మరింత అవకాశం కలుగుతుంది. మాకు మరొక జత తోడైతే!

కన : అవును. అది నాకూ ఇష్టమే. (అక్కడవున్న గ్లాసులూ వగైరాలు తీసుకుని లోపలకు వెళ్లుతుంది.)

నీల : ఇందులో ఇంత ఆలోచించడాని కేముంది ప్రసాదరావు ఇక్కడే ఉంటే నీకు పెద్దదిక్కులేని లోటు తీరుతుంది. ఊ! అనవయ్యా.

ప్రసా: సరే అలాగే కానీయండి.

ఆనం: అబ్బ ఎంత భారంగా అన్నారు బావగారు!

రాజ: వాడి మాట్లకేం బాబూ.

నీల : పెళ్ళిసందడిలో ఒళ్ళు తెలియకుండా వాగేస్తున్నాడు. ఇక మనం నిశ్చయ తాంబూలం పుచ్చుకుందాం,

ప్రసా: అలాగేనండి ముందు మీ అమ్మాయిని భాయపరచుకుంటాను (జేబులోంచి ఒక పెట్టి తీస్తుంటాడు.)

రాజ: ఏమిటి నాయనా! ఏదో హడావిడి చేస్తున్నావు?

ప్రసా: ఏమీలేదండి. మా అమ్మ మమ్మల్ని విడిచిపెడుతున్నప్పుడు మా ఇంటిని అలంకరించబోయే ఆడపడుచుకి ఇది అలంకరించాలని కోరింది. ఇహ మానాన్న నన్నువిడిచిపెడుతూ...(కంఠం గాద్గదికం అయింది. తరువాతమాట పూర్తి చెయ్యలేకపోతాడు.) మామ గారూ మా అమ్మని ఆ కవిత కోకిలకంఠాన్ని అలంకరించండి. మీ అమ్మాయి తలిదండ్రులులేని మాకు అమ్మ కావాలని కోరు కుంటున్నాను. (అంటూ ఆ నగని రాజశేఖరం చేతిలో ఉంచు తాడు. అప్పుటికే రాజశేఖరం కళ్ళనీరు నిండింది.)

ఆనం: నాన్నా! మరి మనంకూడా నగ పెట్టొద్దూ—

రాజ: తప్పకుండాను. కాని, అనుకోకుండా ఇప్పటికిప్పుడు.

ప్రసా: మీరేమీ తాపత్రయ పడకండి. నే నైనా ఈ నగ పెట్టగలిగేవాడ్నా. మా అమ్మ ధర్మమా అని యీ పని చెయ్యగలిగాను (ఇప్పటికి కనకం నగ పెట్టడం అయింది)

ఆనం: మేంమాత్రం? మా అమ్మ ధర్మమా అని — యీ యింటి కోడలికి సాధికారంగా చెందాలని యిచ్చిన నగనే ఇచ్చుకుంటాం ఏంనాన్నా (కనకం ఇటు తిరిగింది రా॥శే॥ నిశ్చేష్టుడయ్యాడు నీలకంఠంకూడా)

కన : అవును మామయ్యా. పెళ్ళిలో పెడదామనుకున్నాము. ఇదిగో (తన మెడలోది తీస్తూ) ఇప్పుడే తన చేతికిచ్చేస్తే తీరిపోతుంది.

ప్రసా: అబ్బెబ్బే యిది బాగోలేదు. మా చెల్లెలికే స్వయంగా ఇద్దురుగాని.

ఆనం: మీకు తెలీదండి బావగారూ: మాకుకాని కనకం మాదగ్గర ఉండడం మంచిదికాదు.

(రాజశేఖరం అమిత వ్యధపడుతున్నాడు కనకంతో) ఏమమ్మా రానంటోందా. నేను సాయంపట్టనా? (నెక్లెస్ వచ్చేసింది. ఆనందం చెయ్యి చాచాక ఆనందానికి ఇవ్వలేదు. నడచివెళ్ళి మామయ్యకి ఇచ్చింది. రా॥ శే॥ ఇతరులకు అర్థంకాని వేదనతో తీసుకుని ప్రసాదం చేతిలో పెడుతూ.)

రాజ: నాయనా : వాళ్ళ తల్లి ఈ నగనుమించిన గుణంకలది. మాకోడలు మా పిల్లలకు అంతకు మించిన అమ్మ కావాలని భగవంతుడ్ని వేడుకుంటున్నాను. (ప్రసాదరావుకిచ్చాడు.)

ప్రసా: (తీసుకుంటూ) అంత భారమే?

ఆనం: ఇహ భోజనాలకు లేద్దామా : నా గుండెలు I mean నా కడుపు మండి పోతోంది. ఆకలితో....ముందు భోజనం. పదండి. కనకం: పాపం. నీకు కడుపు నిండినట్టుంది....మమ్మల్ని మాడ్చకు త్వరగా వడ్డించు.

నీల : అవునమ్మా అసలువేళ దాటింది (ప్రసాదరావుతో) లేవయ్యా లక్ష్మి వడ్డన నీ చేతిమీదుగా కానీయమ్మా ఈ రోజు (లక్ష్మి వెళ్ళింది. అంతా లేస్తారు. ముందు రా॥ శే॥, ప్రసాదరావు ఆ వెనుక నీల కంఠం వెడతారు.)

11)

ఆనం: (వెళ్ళబోతూ ఆగి) ఏమిటిలా చూస్తావు. ఇప్పుడు నిన్నేంచెయ్యను. ఇంకా ముందుకుంది.

కన : ఇంట్లో అడుగు పెట్టగానే ; ఆకలి, ఆకలి, వడ్డించుకుంటానన్న పెద్దమనిషివి వెనక్కి- యుండిపోయావేమాని చూస్తున్నాను. రా ; వడ్డిస్తాను. (వెళ్లింది. పైనించి సుందరం వచ్చాడు.)

సుం : (వెళ్ళుతున్న ఆనందంతో) ఒరేయ్ ; బావగారు ;

ఆనం: ఎవరు (అంటూ వెనక్కి- తిరిగాడు. సుందరం కనిపించాడు. చేతులో ఏదో కట్టఉంది.)

యేరోయ్ సుంది ; Very Good మిత్రుడు రావలసిన సమయంలోనే వచ్చావు. కూర్చో. యేవిటిరా ఉత్తరం పత్తరం లేకుండానే.

సుం : Surprise visit (అంటూ కూర్చుంటాడు.)

ఆనం: (తనూ కూర్చుంటూ) ఏమిటిరా చేతిలోది ?

సుం : శుభలేఖలు.

ఆనం: ఏం ? నీకూ పెళ్ళేనా,

సుం : అదేమిటీ ? నీకూ పెళ్ళేనా ఏమిటి ?

ఆనం: అవి నిజంగానే శుభలేఖలేనా ? ఏవిట్రా ?

సుం : ఔను, నిజంగానే ? ఏం ?

ఆనం: చచ్చాం. పో. అయితే నా విషాదగాధ ఇప్పుడు వాయిదా వేస్తున్నాను.

సుం : నీకు విషాదమా.

ఆనం: ఆ నాకే విషాదం. ఔనురా ; నాకే విషాదం. ఏరా నేను అందరిలాగా ఏది ఆడవారిని నమ్మి మోసపోయిన జాతికి చెందిన మనిషిని కాదనా నీ అభిప్రాయం.

సుం : ఏమయిందిరా నీకు.

ఆనం: అలా నమ్మిన మన జాతికి ఒకటే శాపంరా బ్రదర్. వంచన, అన్యాయం.

సుం : చెప్పరా నాయనా చెప్పు! ఈమధ్య నేనొక నవల వ్రాస్తున్నాను ఇలాంటి ఘట్టాలు వచ్చేసరికి చేయి కదలటంలేదు. హు. చెప్పు.

ఆనం: ఈ యింటిలో కనకం అనే ఒక ఆడది ఉంది చూశావుగా. చిన్న ప్పటినుంచి మేము భార్యా భర్తలమని అందరూ అనుకున్నారు. కనుక నేనూ అనుకున్నాను. ఇలా అనుకుంటున్న పావుశతాబ్దంలో ఎప్పుడూ అభ్యంతరం చెప్పని ఆ ఆడది నాకు మరో సంబంధం చూచిపెట్టింది.

సుం : అదేం ?

ఆనం: త్యాగంటఃసరేలే ఆ పెళ్ళిపత్రిక చూపించరా (అంటూ కట్ట తీసు కొని విప్పబోతాడు.)

సుం : ఆగాగు. ఏమిటా తొందర. (అని తిరిగి లాక్కుంటాడు.)

ఆనం: ఏం ? పెళ్లికూతురెవరు.

సుం : నీ చెల్లెలు.

ఆనం: ఔను, మరి. నీకంటె పెద్దవాణ్ణి నాకు నీ భార్య చెల్లెలు కాక పోతే అక్క అవుతుందేమిటి. చూపించరా బడాయి.

సుం : మీ నాన్నగారెక్కడ

ఆనం: భోంచేస్తున్నారు. నీవు భోంచేశావా ?

సుం : ఆయన్నికూడా రాని ! వచ్చాక అందరికీ ఒక్కటేమాటే !—

కన : (వస్తూ) బావా ! నీకోసం కాచుకు కూర్చున్నారు. అంతా ! ఒహో! సుందరంగారా ? ఎప్పుడొచ్చారు ?

సుం : మీరు మావాడికేదో ద్రోహం చేశారుట. (చిన్న నవ్వు)

ఆనం: ఏరే సుంది! నీవు నాతరపునేమీ ! వకాలతా పుచ్చుకోనక్కరలేదు.

(నిశ్శబ్దం)

ఆనం: నీవు భోంచేశావా లేదా? నే వెళుతున్నాను.

కన : మీ దగ్గర వాపోతున్నాడా బావా ! (ఆనందం వెళుతున్నవాడు ఆగాడు) నిజమేనండి నాకు యిష్టంలేనిపని నే నెలా చేయగలను.

సుం : అడేమిటండీ : చిన్నప్పటినుండి మీ రొకరికొకరు కావాలనికదా: అందరూ అనుకొంటోంది. ఇంతలోనే అంత అనురాగాన్ని తెంచేసుకోవటం బాధగాఉంటుంది.

ఆనం: (గిరుక్కున తిరిగాడు) ఒరేయ్ : ఎవరికిరా అనురాగం : ఎవరికిరా బాధ : నేను నీతో అన్నానా ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నానని. కాక ఆమె నీతో అందా నన్ను ప్రేమిస్తున్నానని. మే మొకరి కొకరం కాంట్రాక్ట రాసుకున్నామా భార్యాభర్త లవుతామని, ఒకవేళ మనస్సులో అనుకుంటేమాత్రం పత్రాలేవి, అనుకున్నదేది?

సుం : ఒరేయ్ ఆవేశ పడకు కొంచెం నిదానించు. నన్ను మాట్లాడని. కనకంగారు. మీ రలా కూర్చోండి. (కూర్చుంటుంది) ఏం జరిగిందండి. మీరు నిజంగా ఆనందాన్ని ప్రేమించలేదా ?

కన : అయితేమాత్రం. ఒక్క విషయం వినండి. మా లక్ష్మికి ఎన్ని సంబంధాలు కాకుండా పోయాయో మీకు తెలియంది కాదు. అలాంటిది భగవంతుడు దయవల్ల ఒక సహృదయుడు బంగారం లాంటి తన చెల్లెల్ని ఈ యింటి కోడలిగా చేసుకునే షరతు మీద, మా లక్ష్మిని చేసుకుంటానని వస్తే ఇతనేమో తన ప్రేమే వర్ధిల్లాలని, ఇతర జీవితాలు తనకేమీ కావని మొండికెత్తుతాడుట. మందలించినవారు రాక్షసులూ పాషాణాలు.

సుం : ఏవిటి మీ లక్ష్మికి సంబందం ఖాయమైపోయిందా ?

ఆనం: ఆ ఈవిడే పనిగట్టుకొని ఖాయం చేసింది.

సుం : ఏవండి ఎందుకలా చేశారు ?

ఆనం: ఆ ప్రశ్నే నేను వేస్తే ?

కన : నా కిష్టంలే దన్నాను.

ఆనం: (సుందరంతో) విన్నావా ? (కనకంతో) నీ కిష్టంలేకపోతే నన్ను చేసుకోను పొమ్మను. అంతే. మధ్య నా పెళ్ళి సంబంధం మరొకరితో నిశ్చయంచేసే చొరవ నీ కెవరిచ్చారు. నీకు నచ్చకపోతే పో. పెళ్ళి బంగాళాఖాతంలో గెంతెయ్యి. కాని నా తరపున

మాటాడే అధికారం నీ కెవ్వడిచ్చాడు, ఆ ధైర్యమేమిటి ?
(సుందరంతో) ఏరా ?

కన : నీకు నీ సుఖమే కావల్సింది. నాకలాకాదు. నాకు కొన్ని బాధ్యత లున్నాయి. ఈ సంబంధం కాకపోతే నీ తండ్రి ఏమౌతాడో నీకు తెలియదా ?

ఆనం: నువ్వెవర్తివే ? ఈ ఇంటి వ్యవహారాల్తో నీకు జోక్యమేమిటి, మా పంచన జేరిన దిక్కులేని ఒక పక్షివి. — మా కుటుంబ విషయాల్లో జోక్యం చేసుకుంటావా ?

సుం: నువ్వాగు ఆనందం. ఇంతకూ ఈ సంబంధాలు నిశ్చయమైపోయి నట్టేనా ?

ఆనం: నిక్షేపంగా ! పెళ్ళికుమారుడు లోపల భోంచేస్తున్నాడు. ఉండు చూదువుగాని.

(నెమ్మదిగా, అప్రయత్నంగా, టేబిలుమీద శుభలేఖలుతీసి జేబులో పెట్టుకోబోతాడు.)

ఆనం: అదేమిటి ? దాచేసుకుంటున్నావు ? చూపించరా ?

సుం: ఏంలేదు ఏంలేదు. (త త్తరపడుతూ)

ఆనం: ఇలాగియ్యరా ! (విసురుగా లాక్కుంటాడు.)

సుం: చూడకు—Please !

ఆనం: సిగ్గుమాలినవాళ్ళదగ్గర ఎందుకురా అంతసిగ్గు (అప్పటికి విప్పాడు) (చదివాడు మొఖం వివర్ణమైంది. మళ్ళీ చదివాడు) ఏఁవిటిది ?

సుం: పొరపాటయ్యింది. ఇక్కడ లక్ష్మికి సంబంధం ఇంత త్వరలో స్థిరపడి పోతుందనుకోలేదు.

ఆనం: కనకం. శుభలేఖ.... (చూపిస్తాడు. ఆమె చదువుతుంది.) కొన్ని గంటలు ఓపికపట్టిఉంటే నువ్వు నా భార్యవి. లక్ష్మి మా సుంద రానికి భార్య. కాని మీ ఇద్దరికీ ఆ అదృష్టంలేదు.

కన : ఇదేమటండీ. ఇక్కడ మా మామయ్యతో సంప్రదించకుండానే.

సుం: పొరపాటేనండి. రాజశేఖరంగారి తాపత్రయం విని మా నాన్నగారు ఇక్కడివారిని ఆనందంతో ఆశ్చర్యపరచడానికి ఏకంగా శుభలేఖలు వేయించుకు వెళ్ళమన్నారు. అందుకని....

ఆనం: ఏం. కనకం ? కొంచెం నువ్వు లెంపలు వేసుకో. అంతా సర్దుకుంటుంది. ఈ శుభలేఖలు చూపించి, ప్రసావరావుని అతని త్రోవన అతన్ని పొమ్మందాం....

కన : అంత నీతిలేని మాటలు మాట్లాడకు. తాంబూలాలు పుచ్చుకుని మాట తప్పటమా ?

ఆనం: తాంబూలాలు పుచ్చుకోకముందై తేమాత్రం? నువ్వు నా పాదాలునె త్తిన పెట్టుకుని ప్రార్థించినా నిన్ను చేసుకుంటానా Iam very sorry

సుం: సరే దానికేం ? ఎలాగో అంతా సవ్యంగా జరిగిపోతేచాలు. కాని కనకంగారు, మీరు చాలా సహృదయంతో చేసిన త్యాగం ఎలా పరిణమి సుందో నా కనుమానమే !

కన : (మౌనం)

ఆనం: (విసురుగా లోపలకు వెళ్ళిపోతాడు.)

సుం: (లేస్తూ) వారి భోజనా లయ్యేలోగా నేను వెళ్ళిపోవడం మంచిది. వారిని కలుసుకుంటే బోలెడంత అబద్ధాలతో ప్రసంగాలు జరుప వలసి వస్తుంది. పెళ్లికొడుకు సమక్షంలో (లోపలనుంచి "అమ్మా కనకం" అన్నకేక వినిపిస్తుంది.)

కన : (లేచి) ఔను మీరిప్పుడు వెళ్ళిపోవడమే మంచిది. మరోలా అనుకోకండి.

సుం: ఫరవాలేదులెండి.

కన : అన్నిటికన్నా మీతో సంబంధం తప్పిపోయినందుకు కించపడు తున్నాను.

సుం: పెళ్ళి జరిగితేనే సంబంధం అయినట్టా ? నా విచారమల్లా మీ గురించి ("అమ్మా కనకం" అని కేక లోనుండి మళ్ళీ వినిపిస్తుంది.)

అరె : వాళ్ళు వస్తున్నట్టున్నారు. మరి నేను వెడతానండి.
(గుమ్మంవరకూ వెళ్ళి)

సుం: మరి వస్తానండి. (కనకం ఏం చేస్తున్నావమ్మా : రావమ్మా అని మరో పిలుపు.) సుందరం ఆ ఖంగారులో శుభలేఖలు వదిలి వెళ్ళి పోతాడు.)

కన : వస్తున్నా. (వెళ్ళబోయి శుభలేఖల్ని గమనించింది. వెళ్ళిపోయిన సుందరాన్ని పిలవడానికి వెళ్ళబోయింది. మళ్లా ఎందు కనుకుంది. శుభలేఖలతోనే లోపలకు వెళ్లింది.)

—: తెర :—

మూడవ రంగం

(కనకం సోఫాలో దిగులుగా కూర్చుంది. మూగలక్ష్మి ఏడుస్తూ వచ్చి కనకం వడిలో వాలిపోయింది)

కన : (ముఖం జేవురించింది) కొట్టాడా అన్నయ్య ?

లక్ష్మి: (జవాబుగా ఏడ్చింది) (ఎడమచెంపపై కి వచ్చేలా పడింది.)

కన : (కంటినీరుతో) మూగ మనసును కొట్టాడా ? మా నాన్న గారాబాల పట్టిని కొట్టాడా ! మనిషా ? పశువా ? (ముఖం వికృతం అయింది) (ఏదో నిశ్చయంతో లేచి వెళ్ళబోయింది.)

లక్ష్మి: (కనకం చెయ్యి తీసుకుని ఏదో వ్రాస్తుంది.) (లక్ష్మిని కూచోబెట్టి లేచింది.)

కన : (చదివి) అడిగితే.

లక్ష్మి: (మళ్ళీ వ్రాసింది.)

కన : (వ్రాస్తుండగా చదివింది.) "నోటితో చెబితే నీకు తెలియదు" మీ అన్న పార్వతిని హాస్పటల్‌లో ఇలా ఆదరించాడు అని చెంప ఛెళ్ళుమనిపించాడా. (ముఖంలో అసహ్యం జుగుప్స ఆవరించింది.) సరే నువెళ్ళమ్మా. దీనికంతకి కారణం నేను (లక్ష్మి బేలగా చూస్తుంది) ఛ! నేనేం చేసుకోనమ్మా! చివరికి మీ నాన్నలాగ ఏడవడంకూడా చేతకాదే ! నువ్వు లోపలకు వెళ్ళు. ఒంటరిగా కూర్చుని ఏడుస్తాను అంతే.

(లోపలికి దిగబెట్టింది.)

(ఆనందం బయటనుంచి లోపలకు వచ్చాడు.)

కన : బావా !

ఆనం: ఇప్పుడు భోజనం చెయ్యను (1, 2 అడుగులు వెయ్యగానే.)

కన : ఇక్కడ తినడం మానేసి చాలా రోజులయిందిలే ! ఆ విషయం కాదు, మీ బావ లక్ష్మిని కొట్టాడు. (సోఫావెనక ఆగింది.)

ఆనం: సంతోషం. (మళ్లా ఒక అడుగు వేశాడు.)

కన : నామీద పగతీర్చుకొనేందుకేనా యీ కొట్టుకోడాలు ?

ఆనం: తల్లీ తండ్రీలేక, దిక్కు-మాలినదానివి; తిండికి మా పంచన చేరినదానివి, నీమీద నాకంత గౌరవంలేదు.

కన: ఈ ఇంట్లో నే నెవర్తినో నాకు తెలుసులే. చదువుకున్నవాడివి, నీకు నేను చెప్పవలసినదాన్ని కాదు. నీ నిర్లక్ష్యంతో పార్వతి Hospital పాలైంది. అది చాలక దానిమీద చెయ్యి చేసుకుంటావే? నీకేమైనా మతిపోయిందా?

ఆనం: కనకం ! (అరచి) నోర్ముయ్ ! నీ అర్హతలు దాటి మాట్లాడకు చెబుతున్నాను. నాకు మతిపోవడమేకాదు. నాలో పశుత్వంకూడా ఆవహించిందని హెచ్చరిస్తున్నాను.

కన : బావా !

ఆనం: అవును. ఈ పిరికిదేశంలో ప్రాణాలు తియ్యడం ఒక నేరం అయింది. కాని రక్తంరాని రంపపు కోతలకు శిక్షలేదు.

కన : ఎందుకులేదు బావా ! నన్ను కొట్టు, చంపు, చిత్రహింస చెయ్యి. కాని ఆ అమాయకురాలు—

ఆనం: నిన్నా ! కొట్టడమా ? ఎవర్తివి నువ్వు ? నాకేం కావలని నిన్ను శిక్షించాలి ? నిన్ను శిక్షించినా దాన్ని చేసుకోనా ? నన్ను ప్రేమించని దానివి, దిక్కు-లేక మా పంచన చేరినదానివి, పరాయిదానివి - నిన్ను శిక్షిస్తే ఊరుకుంటావా ? అది—ఇప్పుడు కొట్టానే అది నా భార్య - చావగొట్టినా నోరు మూసుకు పడుండేది. అది అనవలసిన

మాటలు నీ నోట రాకూడదు. ఆ అర్హతలు నువ్వు పుచ్చుకుంటే అది మానసిక వ్యభిచారమే అవుతుంది. జాగ్రత్త.

(వెళ్ళబోతాడు)

కన : ఆగు। నే చెప్పేది విను. ఈ మాటలు నీ మనసు పలుకుతున్నవి కావు. నాకు తెలుసు. నామీద కక్షతో యిలా ప్రవర్తిస్తున్నావు. కాని యీ శిక్ష నాకేకాదు. యీ ఇంటి నంతటినీ దహించివేస్తుంది. ఇది నీకు న్యాయంకాదు. (ముందుకొచ్చి చేతులు రెండు పట్టుకొని ఏడ్చింది. కాళ్ళమీద వాలింది.)

ఆనం: (చాలా నిశ్చలంగా) లే

కన : (లేచింది.)

ఆనం: ఏడుపు మానెయ్యి.

కన : (ఇంకా ఏడుస్తుంది.)

ఆనం: (గదమాయించాడు.) హూ!

కన : (మానింది.)

ఆనం: అలా కూర్చో.

కన : (కూర్చుంది.)

ఆనం: నే చెప్పేది విను. వ్యర్థప్రసంగాలు చేయకు.

కన : (మౌనం)

ఆనం: మన బ్రతుకులు మరోవిధంగా జరిగాయనుకో. అంటే నువ్వుచేసిన యీ ఘనమైన త్యాగం నేను చేశాననుకో. అర్థంకాలే? ఒక జీవి తాన్ని ఉద్ధరించడానికి నీ మనోభీష్టాన్ని ఇనపముళ్ళ రంపంతో రక్తాలు చిమ్మినట్లు చెరపి — నిన్ను ఒకరి చేతుల్లోపెట్టి పెళ్ళి జరిపించి త్యాగం పేరిట ఒక ప్రాణాన్ని ఉద్ధరించాననుకో ఇప్పుడు నువ్వు చేసినట్లు— Rear లో అడుగు పెట్టబోయి తిరిగి—

కన : (మాట్లాడబోయింది.)

ఆనం: మాట్లాడకు. నా ఆవేశానికి, ఉధృతమైన ఆవేదనకు అడ్డురాకు. ఇందాక చెప్పాను. నేను పశువుని మనిషినికాదు.

(రాజశేఖరం ఒకవైపు, లక్ష్మి ఒకవైపు వచ్చారు. ఆనందం కనకం చూడలేదు.)

అలా జీవితాన్ని దగ్ధం చేసుకున్నాననుకో నువ్వుచేసుకున్నట్టు అలా మాడి మ్రోడైన నన్ను కళ్ళముందు పెట్టుకుని నీవు నీ భర్తతో నువ్వు కులగ్గలవే? ఎంత హీనంగా ప్రేమించినా—అంటే ఒక ప్పుడు నువ్వన్నావే—పంజరంలో చిలకలాగా, కాలినున్న చెప్పు లాగా ప్రేమించినా—యీ నా జీవితం చిగురించాలని అనుకోవూ. అలాగ అనుకోకపోతే నువ్వు హృదయంగల మనిషి వనిపించు కుంటావా? నీలాంటి హృదయంగల ఏ మనిషి నీ లాంటి మోడుని కళ్ళ ముందుంచుకుని తన జీవితాన్ని సంతోషంగా సాగించగలడు?

కన : అయితే!

ఆనం: నేను చెప్పవలసింది పూర్తికాలేదు. నీకు పెళ్ళక్కర్లేదూ నాకు సంసారాలు కావాలి. నిన్ను నువ్వు దహించుకుంటావు. నిన్ను కాలుస్తున్న ఆ సెగలమాటున మే మంతా చలి కాచుకుంటామూ, నువ్వు చరిత్రలో చరితార్థంగా నిలచిపోతావూ, మేమంతా కసాయి వాళ్లల్లాగా, పశుప్రాయులుగా నిందల పాలయిపోతాము. అంతే నేను చెప్పవలసింది.

కన : అయితే ఈ పాపానికంతటికి నేనే కారణమంటావ్.

ఆనం: పెళ్ళు — నేను వినవలసిందేమీలేదు. నీలో మార్పు రాకపోతే నాలోనూ మార్పు రాదు. నన్ను నేను దహించుకుంటాను. అడ్డం వచ్చినవారి నందర్నీ దహిస్తాను.

కన : ఛీ! (ఏడుస్తూ వెళ్ళిపోయింది.)

(ఆనందం నిజానికి ఈ మాటలు అనాలని అనలేదు. కష్ట కొద్దీ ఈ మాటలన్నీ విసిరాడు. ఇంకో విధంగా మాట్లాడలేక పోయాడు. ఇప్పుడు ఒక్కడైనాడు బావురుమని ఏడ్చి కుర్చీలో కూర్చున్నాడు. (లక్ష్మి అన్నను సమీపించింది, చేతుల్తో ముఖం కప్పుకున్న అన్నను తాకింది. తలెత్తాడు. ఒక చెంప ఎర్రబారిన చెల్లెలు కనిపించింది.)

ఆనం: ఆ కొట్టింది అతనుకాదమ్మా! నేను. నీపట్ల, నాన్నపట్ల, అందరి పట్ల ఎందుకిలా ఐపోతున్నానో అర్థంకాదు. నేను కిరాతకుడ్ని, నాకు చావురాదు. (కళ్ళు మూసుకున్నాడు.)

లక్ష్మి: (ఏదో వ్రాసి అందించింది.)

ఆనం: (చదివి) నిజమే. ఆ అమాయకురాల్ని నా ఆవేదనకు బలి చెయ్యడం తప్పే. కాని—కాని—కాని ఎలా! మనం ప్రతి క్షణం ఆ కుటుంబానికి ఋణపడి ఉన్నాం. చిన్నతనంనుంచి నాలో పెంచుకున్న అభిమానాన్ని నిర్లక్ష్యంచేసి ఆనందాన్ని దూరం చేసుకున్న కనకంముందు మరో స్త్రీని ఆదరించడం నా వశంకాదు, అది ఒక ఇంటిది కావాలి. దానిసుఖం ఈ కళ్ళతో చూడాలి. అప్పుడు కాని నేను మనిషిని కాలేను. (లేచి లోపలకు వెళ్ళబోతున్నాడు.)

లక్ష్మి: (లేవబోతున్న అన్న చేతిమీద ఏదో వ్రాసింది. ఆనందం ఏదో చెప్పబోతాడు. అంతలో కనకం వచ్చింది. చటుక్కున భావం మార్చుకుని)

ఆనం: హు! కనకంమీద ఒట్టు వేస్తే ప్రాణాలుకూడా తీసుకోవడానికి సిద్ధపడే ఆ ఆనందం చచ్చిపోయాడమ్మా! నువ్వు తినమంటే తింటాను.

(లేచి ఇద్దరూ లోపలకు వెళ్లారు.)

(కనకం పురుషోత్తం పఠంముందు నిల్చుంది. రాజశేఖరం వచ్చాడు.)

కన : పెళ్ళి, పెళ్ళి, పెళ్ళి. ఎవరినోటవిన్నా పెళ్ళే. ఈ ముసలాయన్ను ఈనరకంలో వదలి ఎలా వెళ్లమంటావు నాన్నా. ఇన్ని చిక్కులు నా నెత్తిన పడుతుంటే ఏం పట్టనట్టు చూస్తూ ఊరుకుంటావు ?

రాజ: అతగాడు ఏం తొందరలో ఉన్నాడో ఏమో నీ సంగతే పట్టించుకోలేదు. నే నొక్కమారు పైకెళ్ళి నీ మాట గుర్తుచేస్తానమ్మా.

కన: మామయ్య!

రాజ: ఔనమ్మా! నా బ్రతుకే నీకు ఆటంకమైతే, నేనే నీ పెళ్ళికి అభ్యంతరమైతే ఈ క్షణాన్న తొలగిపోతానమ్మా. క్షణంలోనో, సగంలోనో రాలిపోవాల్సిన పండుని, నిజంగా నేనే నీకు అడ్డమైతే.... నిజంగా నేనే.....

కన: నువ్వేమో నా విషయమే ఆలోచించకుండా చస్తాన్, చస్తానంటావ్ నేనేమో ఈ సుడిగుండంలో చిక్కుకున్న నీ కోసం కేవలం నీ కోసమే బ్రతికున్నానిన్నాళ్ళు.

రాజ: లోకమంతా వ్యాపించిన వెలుగునిచూసి ఆనందిస్తాం. ఆ వెలుగులో లోకాన్నంతటినీ చూడగలుగుతాం. కాని కిరణాలు వాడిగా కన్నుల్లో గుచ్చుకుంటున్నప్పుడు తప్పని సరిగా కళ్ళు మూసుకుంటాం. అలాగే ఉధృతమైన నీ త్యాగ విద్యుత్తుకి తట్టుకోలేక కన్ను మూస్తానంటున్నాను.

కన: పోనీ ఈ దీపాన్ని ఆరిపేసుకో మామయ్యా!

రాజ: అమ్మా కనకం! అంతమాటనకమ్మా

కన: అవును! నే నంత దుర్భరమనిపిస్తే మరో గత్యంతరం ఏముంది?

(ఆనందం వంటింటినుంచి తన గదిలోకి వెడుతున్నాడు.)

రాజ: అమృతాన్ని కురిపించే పలుకులూ ముక్కలు ముక్కలుగా తెగ్గోసే ములుకులూ వస్తాయి నీ నోటినుంచి. నీతోమాట్లాడ్డం నా తరం కాదు వెళ్ళమ్మా.

ఆనం: (ఆగి) వెళ్ళమ్మా వెళ్ళు (వెక్కిరించినట్లు) - మాటల్తో బెదర గొట్టి నిమ్మ దూరం చేమకుంటే మా యింట్లో చాకిరీచేసే గొడ్డుం డొద్దూ!

రాజ: ఆనందం. (అరిచేడు)

ఆనం: ఏం! ఆగారేం? అరవండి. కేకలెయ్యండి! మేం దూరమైతే మీకు నష్టమేమిటి? కాని ఆ చాకిరీచేసేది, దూరమైతే మీకు దక్షత కరువై పోతుండే!

కన: ఇదిగో బావా! నువ్వు నోరుమూసుకుని దయచేసి Hospital కు వెళ్ళవయ్యా బాబూ!

ఆనం: (కనకంతో) ఛ నువ్వు నాతో మాట్లాడకు.

కన: మాట్లాడకపోతే ఎట్లా? ఇవాళ నా కింట్లో బోలెడుపనుంది. నీ పెళ్ళా నికి కేరియరు ఎవరు తీసుకు వెడతారు?

ఆనం: పెళ్ళాం పెళ్ళాం అని పదిమార్లంటే పరుగుచ్చుకు వెడతానను కుంటున్నావా!

రాజ: ఏం పెళ్ళాన్ని పెళ్ళాం అనర్రా!

ఆనం: పెళ్ళిళ్లూ, పెళ్ళాల మాటసలు మీరు మాట్లాడకండి నాన్నా, ఇతరులు దాశ్యంమీద జీవితాన్ని గడుపుకునే మీకు ఆ అర్హతలేదు! క్షమిం చండి!

(లక్ష్మి వెడుతుంటుంది.)

ఆనం: (ఆపి) నిన్ను! రేడియోవాళ్లు ఒకమారు తీసుకురమ్మనమన్నారే నాకు తీరికలేదు.

లక్ష్మి: (మౌనంతో ఆగి లోపలకు వెళ్ళిపోయింది.)

కన: డాని మెగుడు దాన్ని ఎక్కడకు వెళ్ళద్దన్నాడు.

ఆనం: ఆహా! నాకు పాఠం నేర్పాలని కాబోలు.

రాజ: ఆ ఊరికి ఈ ఊరెంతదూరమో ఈ ఊరికావూరూ అంతేదూరం ప్రసాదానికి ఎక్కడ కీ యిస్తే యంత్రం సరిగ్గా నడుస్తుందో తెలుసు.

ఆనం: ఆహా: అయితే ఆ కీ ఏదో మీకేవ్వవలసింది. ఈ భీభత్సానికంతకూ మీరుకదూ కారణం.

కన: మధ్యలో మామయ్యమీద పడతావెందుకూ! నీ భార్యను సరిగ్గా చూసుకోవడం చేతకాదుగాని—

ఆనం: నా విలాసాలు తీరితే చాలను కోవడానికి నేనేం నాన్నను కాదు!

కన: బావా!

ఆనం: పురుషోత్తాన్ని ముప్పొద్దులూ పూజిస్తారు కాని, పురుషోత్తం కూతురుకి బ్రతుకక్కరలేదు. యీయన పిల్లల బ్రతుకులు పుచ్చ పువ్వులుకావాలి.

రాజ: (ఉద్రేకంతో నిండిన ఏడుపుతో) చంపరా! నన్ను చంపు! ఎందుకురాఅంతలేసి మాటలంటావు.

ఆనం: నే నెందుకు చంపడం రక్తంరాని రంపపు కోతల్తో ప్రాణాలుతీసే రంపరాకాసి మనింట్లో ఉండగా దానికి తాళంవేసే మీరు!

రాజ: అదికాదునాయనా! చెప్పి చెప్పి నా నోరు పడిపోయింది. కాని అది నా మాటవినకుండా ఉంది నేనేం చెయ్యను?

ఆనం: మాట్లాడకుండా ఊరుకుంటారు అందుకని. మీ కూతురే పెళ్ళొద్దని మొరాయింస్తుదనుకోండి. ఏం జేస్తారు? దండించరూ? బలవంతాన ముడి వేయించరూ!

రాజ: (Silence)

ఆనం: ఆ బాధ్యత కనకంపట్లకూడా నిర్వర్తించాలనుకొంటే ప్రతి ఉదయం మీ స్నేహితుడి మూర్తిముందు శ్రద్ధాంజలి నిర్భయంగా ఘటించా

లనుకొంటే ఆ Guilty concious తో దగ్ధం కాకూడదను కుంటే మీ ఏర్పాట్లు మీరు కానివ్వండి. నేను దాన్ని పెళ్ళి పందిట్లోకి తీసుకొస్తాను.

కన: (తలెత్తి చూసింది)

ఆనం: రానంటే యీడ్చుకొస్తాను.

రాజ: ఆనందం!

ఆనం: జుట్టుపట్టి ఈడ్చుకొస్తాను.

రాజ: (మౌనం)

ఆనం: ఏమంటారు (Gap) ఆ! ఎలా చేస్తారు. ఈ భాధ్యతలకంటే ముఖ్యమైన అవసర మొకటుంది. ఇంత వయస్సు వచ్చినా మీకు నీళ్ళు పోసి, తలదువ్వి, బువ్వపెట్టి నిద్రపుచ్చే ఓపికలు మా కుండవుగా!

కన: సంతోషించాంగాని. ఇహ ఊరుకో! నా ఏర్పాట్లు నే చేసుకోగలను. లక్ష్మి నీ ధర్మమా అని తన మొగుడు చెయ్యి చేసుకున్నందుకు కుమిలిపోతుంది. ఇహ నీ వాగ్ధాటిగూడ తోడైతే మీ ఆవిడ పక్కకే చేర్చాలి దాన్నికూడా!

ఆనం: నీ శ్లేషలు నాకు తెలుసు కనకం. పార్వతి పక్కన దాన్ని చేరుస్తారా? అతగాడు పిల్లని అంటగట్టే అవసరంకోసం బ్రతిమాలి చేసుకున్న మన లక్ష్మిని గతిమాలి కొంపచేరినదాన్ని ఒకప్రక్కన ఎలా చేరుస్తారు?

(ప్రసాదం వచ్చాడు. అంతా నిశ్శబ్దం అయ్యింది. ప్రసాదరావు మౌనంగానే ఉన్నాడు. కాని వాదాన్ని ఇతరులనుంచి ఎదురు చూస్తున్నాడు. ఎవరు మాట్లాడతారు-ఇక కనకం పట్టలేక)

కన: Hospital నుంచా అన్నయ్యా? ఇదిగో నేను బయల్దేరదామనుకుంటున్నాను కేరియర్‌తో!

ప్రసా: ఆహా! ఆ విషయాలేమిటి మాట్లాడుకుంటున్నారు, గంభీరంగా (రాజశేఖరంతో) ఏమండీ!

రాజ: ఆ: ఆ! అవున్నాయనా! (మాటమార్చి) ఆ! చూడు ఆనందం! నువ్వెళ్ళి ఆ పని చూడు.

ప్రసా: ఏ పని! తన భార్యను ఈడ్చికొట్టడమా?

కన: నువ్వులే అన్నయ్యా! వడ్డించేస్తాను.

ప్రసా: ఒడ్డించే అమ్మా! గొప్ప ఆకలేస్తోంది. (వంటింట్లోకి వెళ్ళ బోయాడు)

ఆనం: మీరు మాత్రం ఊరుకున్నారా! మీ ఆవిడ్ని మాత్రం చచ్చేటట్టు కోట్టలేమా!

ప్రసా: ఏమిటీ! కొడితేనే చచ్చిపోతుందా! మీ చెల్లెలు. అంతమాత్రాన చస్తుందా! Hospital ward లో పడేసిన మా చెల్లేలే కొడితే చచ్చిపోలేదే. ఇంట్లో Dunlop spring cot మీద శయనిస్తున్న మీ చెల్లెలు అంతమాత్రన చస్తుందా!

కన: నువ్వు పదన్నయ్యా! అతనేదో హాస్యాని కన్నాడులే.

ప్రసా: (నవ్వుతూ) నేను నిజంగానే అంటున్నానమ్మా. అంతమాత్రానికే చస్తుందా! నువ్వు పదమ్మా (కనకం బయల్దేరింది. వెనకే ఒక అడుగువేసి ఆగి) ఆ! బావగారూ! ఇందాక ఏదో మతి గితి అంటు న్నారు. (కనకం ఆగింది ప్రసాదాన్ని అక్కడ్నుంచి తొలిగించడం కోసం)

కన: ఇకనువ్వురావా ఏమిటన్నయ్యా? నీకు మతిపోతోందా ఏమిటి?

ప్రసా: (కనకంతో) ఆ గదిలో తువ్వాలుంది తీసికురా అమ్మా!

(కనకం ప్రక్కగదిలోకి వెళ్తుంది)

ప్రసా: నిప్పులాంటి అశాంతిని గుట్టుగా గుప్పెట్లో దాచే ప్రయత్నం చెయ్యకండి. నిర్భయంగా ప్రవర్తించండి. నా చెల్లెలు మీకిష్టం లేదు. అదేదో చెప్పండి. ఉన్నపాశాన పుస్తె ముక్కలుచేసి బొట్టు

కడిగేసి చచ్చాడు, పదిరోజు లేదవమని తరువాత దాని బ్రతుకు నేను నడిపిస్తాను. (భయంతో లక్ష్మి దగ్గరయ్యింది. లక్ష్మితో అభినయంతో) కనకాన్ని తువ్వాలు తెమ్మను. (కదలడాని కిష్టం లేకపోయినా కదిలి వెళ్ళింది.) నా చెల్లెల్ని ధర్మానికి కట్టుకున్నట్లు ప్రవర్తించకండి. ఇన్నాళ్ళూ నే ననలేదు. ఇప్పుడు చెబుతున్నాను. అవిటిపిల్లని ఆదర్శంగా కట్టుకున్నది నేను. అవసరానికి చేసుకుని చిత్రహింస చేస్తున్నది మీరు. (తువ్వాలుతో కనకం వెనక లక్ష్మి ప్రవేశిస్తారు.) కొత్త అణకువగా మెలగండి. (ఆడవాళ్ళతో) దాన్ని నీళ్ళ తొట్టెదగ్గ రుంచమ్మా వస్తున్నాను. (కనకం లక్ష్మిని వెళ్ళమని సైగ చేస్తుంది. కాని కదలదు. కనకం సైగతో గదమాయించి లక్ష్మిని పంపుతుంది.) (లక్ష్మి Towelతో లోప లకు వెళుతుంది బయటనుంచి నీలకంఠం వచ్చాడు.) మర్యాదగా నా చెల్లెలి కోడరికాన్ని గౌరవించడం నేర్చుకోండి. లేకపోతే ఎలాంటి దుష్పలితాలకైనా మీరు సిద్ధం కావాలి. నేను ఇల్లరికపు టల్లుడ్ని కాను. (విసుగుగా నిష్క్రమించాడు.) విషయం అర్థం కాక నీలకంఠం ప్రశ్న చూపుల్ని చూస్తున్నాడు. రాజశేఖరం దుఃఖాన్ని గరళకంఠుడిలాగా గొంతులో ఇరికించుకూర్చున్నాడు. ఆనందం ఆలోచనల్లో బాగా Down Stageలో ఉన్నాడు. కనకం కూడా అక్కడే ఉంది. మొత్తంమీద వాతావరణం తిమిరావృత మైన గుహాంతర్భాగంలో నిశ్శబ్దవ్రస్తత భయంకరంగా ఉంది.)

నీల : ఏమిటయ్యా! శేఖరం ఆ మాట్లాడేది ప్రసాదరావేనా!

రాజ: ఇస్! ఇప్పుడేం మాట్లాడకు (దుఃఖం ఆగటంలేదు.) అతను వస్తాడు. (అంతా నిశ్శబ్దం) (ఈ మూరు అందరిచూపులు అతని రాకను నిరీక్షిస్తున్నాయి.) (ప్రసాదరావు వచ్చాడు. అంతకు పూర్వం ఏమీ జరగనట్లున్నాడు. అతని వెనకే లక్ష్మికూడా ఉంది. సరాసరి తన గదిలోనికి వెళ్ళాడు. లక్ష్మి కనకంతో ప్రసాదరావు భోజనం చెయ్యలేదని సొంజ్ఞ చేసింది. కోటు వేసుకొని తన గదిలోనుంచి బయటకు వచ్చాడు.)

ప్రసా: కనకం! కేరియర్ సిద్ధం అయ్యింది కాబోలు, ఇలాఇవ్వు Hospitalలో ఇచ్చి అటు ఆఫీసుకు వెడతాను.

కన : ఎందుకు నే వెడుతున్నాలే. నువ్వు భోజనం చెయ్యలేదేం అన్నయ్యా ?

ప్రసా: Time లేదమ్మా పది నిమిషాల్లో Officeకో వాలాలి.

కన : ఎన్నాళ్ళయిందన్నయ్యా నువ్విక్కడ భోజనంచేసి ?

ప్రసా: ఏదమ్మా వారం రోజులాయె కాంపులో ఉన్నానా ?

కన : అన్నయ్యా! మాట! (కళ్ళనీరు తిరుగుతోంది.) ఇక్కడ నేను దిక్కులేనిదాన్ని. నువ్వు అల్లుడివి కావడం ఇక్కడివాళ్ళకు ఏమీ కాకపోవచ్చు. కాని నాకుమాత్రం నువ్వు వరప్రసాదానివి. కాని - కాని (మాటలు రావడంలేదు.) నీలోకూడ మంచితనాన్ని భగవంతుడు తొలగించదలచుకుంటే అది నాదురదృష్టం అన్నయ్యా.)

ప్రసా: ఏడుస్తున్నావా ! (తన జేబు రుమాలుతో తుడిచాడు.) చూడమ్మా ! ఒకప్పుడు సంస్కారం, సభ్యతలతో, సుఖశాంతులతో పెన్నెల్లా విరిసిపోయిన మనసుల్తో కళకళలాడిన ఈ ఇల్లు యిప్పుడు కటిక చీకటితో నిండిపోయింది. కారణం ఏమిటో నాకు తెలియదు. ఈ కూపంలో నాలాంటి పరాయివాడికి కాస్త దారితెన్ను దొరకాలంటే అదినువ్వు ప్రసరిస్తున్న వెలుగేనమ్మా. యీ ఇంట్లో నువ్వే లేకుంటే నేనూ మానవత్వాన్ని విసర్జించి వీళ్ళలో ఒకడ్నై పోయేవాడ్ని. వస్తానమ్మా. (వెళ్ళాడు.)

(లక్ష్మి తన గదిలోకి వెళ్ళింది. కనకం కళ్ళనీళ్ళు తుడుచుకొని వంటింట్లోకి వెళ్ళింది.)

ఆనం: ఏమిటతని ఉద్దేశ్యం ?

కన : అతను మాట్లాడింది తెలుగే (వెళ్ళబోయింది.)

ఆనం: ఆహా ! ఆ విషయం తెలుసు. కాని అతనికి గోచరించని విషయాలు ధృవతారవు నువ్వు తెలియజేయవల్సింది.

కన : ఏమిటి ?

ఆనం: మమ్మల్ని మించిన పశువులు మీరిద్దరూ అని.

నీల : ఏమిటా మాటలు, ఆనందం ?

ఆనం: లేకపోతే. ఎవరండీ ఇక్కడ మానవత్వాన్ని విసర్జించిన వారు ? పెంచుకున్న మనసుల్ని కుమ్మి చిందర వందరచేసిన ఆవిడ్నే మనాలి ? తన్ను ఎరగా పెట్టుకుని ఇక్కడ అనురాగాన్ని మటు మాయంచేసిన తన్నే మనాలి ? ఎవరి బ్రతుకులు వాళ్ళని బ్రతక నివ్వకుండా పెళ్ళిపెటాకులు లేకుండా పెనుభూతంలా అడ్డం నిలచిన ఈ ఆడదాన్నేమనాలి ? వీరంతా మనుషులా ! మనిషైతే ఒకమాట చాలండీ.

నీల : ఏమిటా మాటలు ఆనందం ?

ఆనం: నేను మాట్లాడిందీ తెనుగేనండీ ! (విసురుగా బయటకు వెళ్లాడు. ఒక్క క్షణం ఆగి కనకం లోనికి వెళ్ళింది. రాజశేఖరం ఏడుపు పర్యంతం వ్యధ ననుభవిస్తున్నాడు. నీలకంఠం దూరంగా ఉన్న కుర్చీలోంచి రాజశేఖరానికి దగ్గరగా ఉన్న కుర్చీలోకి మారాడు.)

నీల : ఏమొచ్చిందయ్యా వీళ్ళందరికీ ! ఇలా అయిపోయారేం.

రాజ: నా ఖర్మ. పురుషోత్తం ఉసురు పోసుకున్న పాపానికే యీ ఇల్లంతా దహించుకు పోతున్నదయ్యా !

నీల : సరేలే ! ఇప్పు డనుకొని ఏం లాభం ? ఆనాడు నామాట చెవిని పెట్టావూ !

రాజ: కనకాని కేదైనా సంబంధంచూడు నీలకంఠం !

నీల : ఏం ! ఏమిటి ! అల్లుడేమైనా అనుమానం !

రాజ: ఛ ! ఛ ! అదేంకాదయ్యా! ఇది ఒక ఇంటిదైతేనేగాని ఆనందం కుదురుగా సంసారం సాగించేటట్టులేదు. పైగా అందరిమీద చెయ్యి చేసుకుంటున్నాడు.

నీల : అదేమిటీ !

రాజ: ఆ — Hospitalకి వెళ్లి వాడి పెళ్లాన్ని కొట్టాడట. అది తెలిసి ప్రసావం....

నీల : లక్ష్మినిగాని కొట్టాడా ! అయ్యో అయ్యో !

రాజ: నేనెందుకు బ్రతికున్నానా అనిపిస్తుంది !

నీల : అఘోరించినట్లే ఉంది నీ ఆలోచన - నీకు పుణ్యం ఉంటుంది. గాని మరో అఘాయిత్యానికి పూనుకోకుబాబూ !

(కనకం కేరియర్‌తో బయటకు వచ్చింది.)

కన : (దుస్తులు సవరించుకుంటూ) మామయ్య మళ్ళీ చచ్చిపోతున్నా నంటున్నాడేమిటి బాబాయ్ !

నీల : ఆ! ఇప్పుడు బ్రతికున్నాడు కనకనా మరోమారు చచ్చిపోడానికి !

కన : సరే ! నేను వెడుతున్నాను. మీకోసం భోజనం సిద్ధంచేశా. ఈసారి నా పంక్తిని కూర్చుని భోజనం చెయ్యకపోతే మీ జట్టుండను.

నీల : ఇదిగో కనకం. మాట మార్చకు. నీగురించే ఇంటిల్లిపాదీ ఎంత సతమత మైపోతున్నామో నీకు తెలియడంలేదు.

కన : సరే వెదకండి సంబంధాన్ని చేసుకుంటాను. — అయితే.

రాజ: (గట్టిగా అరుస్తూ) ఆ వచ్చిన దౌర్భాగ్యుడు నన్నుకూడా కట్టుకోవాలి. లేకపోతే ఇది యిలా నా కళ్ళముందు నా గుండెల్లో మంటలాగా నన్ను కాలుస్తూ తను కాల్చుకుని మాడి మసై పోతుంది. (ఏడుపే)

నీల : ఇదిగో శేఖరం !

రాజ: మరేమిటయ్యా! ఆనాడు అదన్నమాటేమిటి? — ఇప్పుడు — ఇప్పుడు చేస్తున్నదేమిటి! ఈ పనులు నన్నుద్ధరించడానికేనా! ఛ! ఛా! వాడు ఎంతలేసి మాటలన్నాడో తెలుసా! అన్నం తినిపించుకోవడానికి, తలదువ్వించుకోవడానికి! సేవలు చేయించుకోవడానికీ దీని జీవితం బలిచేస్తున్నానన్నాడు. ఆ మాటలు వినికూడా అభిమానం చంపుకుని బ్రతికే ఉన్నాను. (బాగా పసివానిలా ఏడుపు)

కన: (చేతిలోని కేరియర్ క్రింద ఉంచింది. శేఖరాన్ని పసివాడిలాగా దగ్గరకు తీసుకుంది. తన పమిటచెంగుతో కన్నీళ్ళు తుడిచింది) ఛ! ఏడుస్తున్నావా! నిన్ను ఏడి పించడానికా నే బ్రతికి ఉన్నాను! ఊరుకో ఊరుకోమరి ఇదుగో నామాట విను! నీ మీద ఒట్టు. మీ స్నేహితుడిమీద ఒట్టు. నేను ఏమైనాసరే పెళ్ళిచేసుకుంటాను. ఏదిఏమైనా నిన్ను ఒంటరిగా ఒదిలేస్తాను. నిన్ను ఎవరు చంపినా, చిత్రహింస చేసినా నేనేమీ పట్టించుకోను. సరా! ఊరుకో! (తను బావురుమని ఏడ్చింది. చకచకా కేరియర్ తీసుకుని వెళ్ళిపోయింది. పేక్షకులు భరించలేనంతసేపు Violin విషాదాన్ని పలుకుతూంటుంది.)

నీల: (తేరుకొని) ఇదిగో శేఖరం. ఈ అవకాశాన్ని పోనివ్వకూడదు తప్పక కనకాన్ని ఒక ఇంటిదాన్నిచేసే బాధ్యత నాది.

(ప్రసాదరావు వచ్చాడు. అందరి ముఖాలు వివర్ణంగా ఉండడం గమనించినా ఏం పట్టించుకోలేదు. అలవాటైపోయిందతనికి.)

ప్రసా: (వస్తూనే నీలకంఠంతో యధాలాపంగా) ఓహో ఇంకా ఇక్కడే ఉన్నారే! (అంటూ తన గదిలోకి వెళ్ళబోతుంటే లక్ష్మి ఎదురొచ్చింది.) చూడు లక్ష్మి నేను camp కి వెడుతూ నీచేతికి నీలం రంగుగుడ్డలో కట్టిన office కాగితాలు ఇచ్చాను. (అర్థం అయినట్లు తలూపింది) అది పట్రా (సరేనని లోపలికి వెళ్ళింది. తను మిగి

లిన ఇద్దరి సరసన కూర్చుని) కనకం కారియర్ తీసుకుని వెళ్ళిందా మామయ్యా!

రాజ: ఆ! ఆఁ.

ప్రసా: (నీలకంఠంతో) శూన్యమాసం కదూ- యీ నెలంతా మీకు సెలవు లాంటిదే అనుకుంటాను. (నవ్వుతూ)

నీల : (నవ్వి) అలాగే మరి! అమ్మాయి కెలాఉంది?

ప్రసా: ఫరవాలేదు! (లక్ష్మి వచ్చింది. కనబడలేదని వ్యక్తం చేసింది.) అదేమిటి లక్ష్మి నీ చేతికిచ్చింది కనబడకుండా ఎలా ఉంటుంది! (అంటూ తనూ లక్ష్మిని తీసుకొని లోపలకు వెళ్లాడు.)

నీల : (రా॥శే॥తో) మీరూమీరూ చేసికొన్న అవకతవకలకి ఆ పిల్లను ఉసురుపెట్టడం ఏమీ బాగోలేదయ్యా ఈ ఆనందానికి — — (లోపల్నుంచి కేకలు) ఏం కొట్టానా! చంపానా! ఎందుకు కేకలు ఊరికే ఏడుస్తావు? మాట్లాడితే ఇదొక ఆయుధం నీకు - ఏడుపు. ఆఫీసు కాగితాలు జాగ్రత్త చేయమనిస్తే భద్రం సంగ తటుంచి అసలెక్కడ పెట్టావో జ్ఞాపకం లేకపోయింది.

నీల : (ప్రసాదరావు గదివరకూ వెళ్లి, తిరిగివస్తూ రహస్యం అన్నట్టు) కాగితాలేవో కనబడనట్లున్నాయి. (వెనకనే ప్రసాదరావు లక్ష్మి కూడా వచ్చారు.)

రాజ: ఏమిటి నాయనా! ఆఫీసు కాగితాలా!

ప్రసా: అవునండీ కేంపుకి వెడుతూ జాగ్రత్త చెయ్యమనిచ్చాను.

నీల : అయినా ఆఫీసు కాగితాలు ఇంట్లో దేనికి మరీను.

ప్రసా: ఇంట్లో ప్రతివాళ్ళకూ మతులుపోయి తిరుగుతున్నారని నాకు తెలీదుకదండీ!

లక్ష్మి: (వాటిని మంచంక్రింద జాగ్రత్తగానే ఉంచాను అని అభినయంతో చెబుతుంది.)

నీల : ఏమిటమ్మా (తెలీక అడిగాడు.)

ప్రసా: ఏమిటో మూగసొద. ఇదొక తలనొప్పి.

రాజ: (కొంచెం బాధపడి) ఉండు నాయనా ! దాన్ని ఖంగారుపెట్టకు నే నడుగుతాను. నువ్వలా కూచో (లక్ష్మితో బాగా జ్ఞాపకం చేసుకో తల్లీ. అలాంటి కాగితాలు జాగ్రత్తగా ఉంచుకోకపోతే ఎట్లా ?

నీల: ఇంకే గదిలోనైనా పెట్టావేమో చూడమ్మా!

రాజ: మరో గంటలోనే వెదికి ఉంచుతాను. నువ్వు స్థిమితంగా వెళ్ళు నాయనా!

ప్రసా: వెళ్ళి ఏం చేయను. ఆ Office అనే మాటలు సేవిస్తూ కూచోవాలి.

రాజ: ఆ! అన్నట్టు - అమ్మా లక్ష్మీ! ఆ D. D. T. వాళ్లొచ్చినప్పుడు సామాన్లు మార్చారుకదా - ఆ తొక్కిడిలో నా గదిలో కేమైనా చేరుకుందేమో.

నీల: వెళ్ళిచూడమ్మా.

రాజ: నువ్వుకూడా వెళ్ళుప్రసాద్.

ప్రసా: ఎందుకు లక్ష్మి వెదికి తెస్తుందిలెండి.

నీల: మూగ సొదకదూ! నువ్వుకూడా వెళ్ళి చూడవయ్యా!

రాజ: నీలకంఠం

రాజ: నీకు పుణ్యం ఉంటుంది కాస్త జాగ్రత్తగా మాట్లడవయ్యా బాబూ!

నీల: లేకపోతే ఏమిటయ్యా! మూగసొద అని మొదట తెలీదూ?

రాజ: సరేలే! మరో విషయం ఏదో మాట్లాడు నాకు గుండె దడగాఉంది.

నీల: ఆ అన్నట్టు జేబులోంచి పేర్ల List తీసి పేర్లువారీ గొణుగుతూ చదువుతూ తపీమని ఆగి) ఆ! ఇతను చూడు ఇతగాడికి పెళ్ళయ్యిందా!

రాజ: (ప్రసాదరావు పనేమయ్యిందోనని వెనక గదిలోకి ధ్యాసఉంచుకొని మామూలుగా) ఎవరికి?

నీల: కులగోత్రాలు నోటుచేసుకున్నానుగాని పేరు వ్రాసుకోవడం మరచి పోయినాను. ఇందాక నాక్కనిపించాడయ్యా. అతగాడే పలకరించాడు. పేరు ఏదో చెప్పాడు. పేరు పేరు (జ్ఞాపకంరాక) మనింటి విషయాలన్నీ అడిగాడు. పేరు ఆనందం—కాదు ఆనందం మనవాడుకదూ—ఊ—బర్మా కిరసనాయిలు కంపెనీలో interview కూక్కడా వచ్చాడట-మనకు బాగా పరిచయమయ్యా! (పేరు జ్ఞాపకంరాక కోపంకూడావచ్చింది.) ఏమిటయ్యా! అతడు మనవాడి స్నేహితుడు. ఏడ్నార్డంక్రితం వచ్చాడు. (ప్రసాదం చేతిలో ఒకచిన్న Packet తో విప్పిన శుభలేఖలు త్రాళ్ళతోకూడ అతని చేతిలో ఉన్నాయి. - నీలంగుడ్డచుట్టి ఆఫీసు కాయితాలు లక్ష్మిచేతిలో ఉన్నాయి. ఇద్దరు వచ్చారు లక్ష్మి ఆనందంగానే ఉంది)

రాజ: అతనా సుందరమా! (నీలకంఠంతో)

ప్రసా: ఎవరా సుందరం?

రాజ: ఆఁ ఆఁ ఎవరూ లేదునాయనా - (లక్ష్మిచేతిలో కట్టను గమనించి) దొరికాయా! బ్రతికించావు.

నీల: ఎంత హడావిడై పోయింది (అని నవ్వాడు)

(కాని ప్రసాదరావు ఇంకా గంభీరంగా ఉండడాన్ని గమనించాడు. ఇదీకారణం అనుకొని) అయినా లక్ష్మి ఆతను అన్నాడని కాదు. గాని ఇలాంటి అర్జంటు కాయితాల విషయంలో చాలా జాగ్రత్తగా కంటికి రెప్పలా చూచుకోవాలి. మరుపుకూడదు. (లక్ష్మి నవ్వి స్వేచ్ఛగా files ప్రసాదం చేతికిచ్చింది. ప్రసాదం అందుకుని ముందున్న సోఫామీదకు కోపంగా విసిరాడు. అందరూ విస్తుబోయారు.)

ప్రసా: అసలీ సుందర మెవరు? (గద్దించాడు మొగంకూడా తెలియని సుందరంపట్ల ప్రసాదం ఆసక్తికి ఆశ్చర్యపోయి రాజశేఖరం, 14)

నీలకంఠం ఒకరి మొఖాలు ఒకరు చూచుకున్నారు. లక్ష్మి తను అక్కడ ఉండడం బాగుండదని నిష్క్రమణకు కదిలింది. చెయ్యి పుచ్చుకుని ఆపి) నువ్వూ ఉండు. (రా॥శే॥ నీలకంఠంతో) ఏమండీ.

నీల: ఏఁవిటీ.

ప్రసా: ఏమిటేమిటి? ఎవరా సుందరం అని అడుగుతున్నాను. దాటేయిస్తారే ఆ విషయం.

రాజ: (ఆయోమయంగా) ఇందులో దాటెయ్యి వలసిందేముంది నాయనా? సుందరం అంటే మన సుందరం మన ఆనంద్‌కి స్నేహితుడు.

ప్రసా: అంతేనా?

రాజ: (ఏమిటో అర్థంకానట్టు నీలకంఠాన్ని చూస్తాడు)

నీల: అంతేగాక మరేమిటయ్యా!

ప్రసా: మరేమీకాదు (Silence)లక్ష్మికి కావలసిన మగడుకదూ!

రాజ,నీల: ఏమిటి?

ప్రసా: ఇదేమిటి? (నీలకంఠంచేతికి శుభలేఖలిస్తాడు నీలకంఠం చదువుతూ ఉంటాడు. రాజశేఖరంకూడా చదువుతూంటాడు వెనకనించి లక్ష్మి కూడా చదువుతుంది. భయంకరమైన భయం ఆమెను ఆవహిస్తుంది.)

నీల: ఈ శుభలేఖ లెక్కడ్నుంచి ఊడిపడ్డాయి?

ప్రసా: అంటే వీటిని ఇప్పటికిప్పుడు నేను సృష్టించానంటారా?

నీల: అహా! అదికాదు.

ప్రసా: ఇహ ఈ నాటకం చాలించండి (లక్ష్మితో) నీకూ తెలీదా!

లక్ష్మి: (ఒట్టు నాకేం తెలీదు అని అభినయంతో ప్రమాణం చేస్తుంది)

ప్రసా: ఛస్! నోర్ముయ్.

రాజ: ప్రసాదరావు! నా మాటవిను. భగవంతుడి సాక్షిగా చెబుతున్నాను.

ప్రసా: మీకేమీ తెలియదంటారు. అంతేనా! ఇంకేదైన చెబుతారా!

రాజ: నిజం! నిజం! నాయనా!

ప్రసా: అచ్చయిన శుభలేఖలు యింట్లో దాచుకుని ఎప్పుడు ఎలా అచ్చయ్యాయో తెలీదా! యెందుకండీ యీ బుకాయింపు?

నీల: బుకాయింపా! బుకాయించవలసిన అవుసరం ఏమిటయ్యా?

ప్రసా: ఏమో నాకేం తెలుసు? ఏ తప్పును కప్పుకోడానికి అవసరమై బుకాయిస్తున్నారో తప్పుచేసిన వాళ్ళకు తెలియాలి.

రాజ: అయ్యో శర్మమా! దీన్ని చూడ్డం నా కిదే మొదటిసారి నాయనా మాకు అల్లుడివై మా కళ్ళల్లో దీపం వెలిగించావు. నీ దగ్గిర తప్పు కప్పుకోవలసిన అవసరం యేమిటి.

ప్రసా: ఆ శుభలేఖల్లో ఉన్న రాజశేఖరంగారు మీరు కారా? ఆ లక్ష్మి యీ లక్ష్మి కాదా? ఒక కట్టడు శుభలేఖలు మీ గదిలో నాకు దొరికితే (విసిరికొట్టాడు) మీకు తెలీదా! మీకూ తెలీదా!

నీల: అదే విడ్డూరంగా ఉంది! శుభలేఖలేమిటి? నాకు తెలియక పోవడం ఏమిటీ అని.

ప్రసా: శుద్ధ అబద్ధం మీరు సంసారాలతో చెలగాటాలాడుతున్నారు. మంచి పనికాదని చెబుతున్నాను. నవంబరు నెలలో వాతో పెళ్ళికి ప్రదానం అయ్యిందీ డిశంబరు 3వ తేదీన మరొక వరుడితో పెళ్ళంటూ శుభలేఖలు అచ్చువేయడం జరిగిందా! ఆ శుభలేఖలు ఒకకట్ట మీ గదిలో నాకుదొరికితే మీకుమాత్రంతెలీదూ!ఎవరై నానమ్మాలా?(ఎవరూఏమీ మాట్లాడలేక పోయారు) (లక్ష్మితో) నీకూ తెలీదూ (కాదని తలూపింది) మరెందుకేడుస్తావు.... నీలకంఠంగారూ ఈ శుభలేఖల సంగతి ఉన్నదున్నట్టు నాకు సాధ్యమైనంత వేగంగా తెలియాలి.

మా వివాహాలు అయిన మరుక్షణంనుంచి ఏదో జరకూ్కడనిది జరిగిపోయినట్టు ప్రతిఒక్కరూ బాధపడుతూండడం నేను గమనిస్తున్నాను. లక్ష్మిని పెళ్ళాడటమే ఆ జరగకూడని దనిపిస్తూఉంది అది నిజమనికాని అబద్దమనికాని ఋజువుకావాలి. లేకపోతే....

రాజ: (లేకపోతే ఏమిటన్నట్టు దిగులుగా చూస్తాడు)

ప్రసా: లేకపోతే లక్ష్మిని నేను విడిచి పెట్టవలసి వస్తుంది.

నీల: విషయం ఏమిటో తేలకుండా ఆ అమాయకురాలిని అనుమానించడం అన్యాయమయ్యా.

ప్రసా: లక్ష్మి అమాయకత్వాన్ని ఆసరా తీసుకోకండి. అన్ని తెలిసిన పెద్దలు-మీకు తెలిసిన విషయాలు బయటపెట్టి నిజానిజాలు తేల్చండి. అంతవరకు ఇప్పట్నించి మీతో నాకే విధమైన సంబంధమూలేదు. (office కాయతాలు తీసికుని చట్టున వెళ్ళబోయాడు)

నీల: ఇది చాలా అన్యాయమయ్యా:

ప్రసా: (ఆగి) ఏమిటండీ అన్యాయం: రత్నంలాంటి నా చెల్లెల్ని మీ ఇంటి కోడలుగా చేసుకోమన్నాను. అందుకు ప్రత్యుపకారంగా ఈ మూగ దాన్ని నా భార్యగా చేసుకున్నాను. అప్పట్నించి ప్రతి యెక్కరూ వ్యధల్తో క్రుంగిపోతున్నారు. సంగతేమిటంటే చెప్పరు. ఏదో పరాయి వాడిలాగా నా దగ్గర ప్రతి విషయం దాస్తారు. ఇంత ఘోరమైన విషయం వీటి సంగతేమిటంటే చెప్పరు. మీదా: నాదా: అన్యాయం? (విసురుగా నిష్క్రమించాడు)

రాజ: (వెనకనే) ప్రసాదం—నాయనా ప్రసాదం—(నీలకంఠం లేచి నిశ్చేష్టుడై నిల్చున్నాడు. లక్ష్మి మతి తప్పి తూలుతుంది)

రాజ : నీలకంఠం: (నీలకంఠంతో ఏదో చెప్పడానికి ఇటు తిరిగేసరికి క్రిందకు జరుగుతున్న లక్ష్మి కనిపించింది. ఒక్క ఉదుటన వెళ్ళి పట్టుకున్నాడు.)

నీల : అమ్మా ! లక్ష్మీ !

రాజ : (లక్ష్మిని తన చేతులలోనికి తీసుకున్నాడు.) లక్ష్మీ లక్ష్మీ !

నీల : ముందు దీన్ని లోపలికి తీసుకుపద.

(ముగ్గురూ లోపలికి వెళ్లారు. కొద్దిక్షణాలు నిశ్శబ్దం విషాదం)

(నీలకంఠం, రాజశేఖరం ప్రవేశిస్తూ)

రాజ : నీలకంఠం ! నువ్వు త్వరగావెళ్ళి కనకాన్ని తీసుకురా ! నేను లక్ష్మిని చూస్తూ ఉంటాను.

నీల : సరే ! సరే. (రా॥ శే॥ వంటయింట్లోకి వెళ్లాడు. నీలకంఠం బయలుదేరబోయి ఆగి చటుక్కున ఏదో జ్ఞాపకంవచ్చి తనూ వంటింట్లోకి వెళ్ళాడు. రా॥శే॥ గ్లాసు నీళ్ళతో, నీలకంఠం ప్రవేశిస్తారు.)

రాజ : (ఏడుపు మిళితమైన కోపంతో) నేను ఛావన్లేవయ్యా నువ్వెళ్ళు ముందు—

నీల : ఆ అదీ సంగతి. మరేం ఫరవాలేదు. అంతా చక్కబడుతుంది.

రాజ : సరేలే ! నువ్వు బయలుదేరు, (అంటూ లక్ష్మీ గదిలోకి నిష్క్రమించాడు.)

నీల : (బయల్దేరబోయి వెనక్కు వెళ్లి మళ్ళీ శుభలేఖల్నిపరిశీలిస్తున్నాడు. రా॥శే॥ వెనకనే ప్రవేశించి తన గదిలోకి వెడుతూ నీలకంఠాన్ని గమనించి.)

రాజ : ఇంకా నువ్వికక్కడే ఉన్నావా ? త్వరగాపోయి కనకాన్ని తీసుకు రావయ్యా బాబూ (అంటూ తన గదిలోకి పోతాడు.)

నీల : ఇదిగో ఇదిగో ఈ శుభలేఖలూ (అందులో విషయాలను అర్థం కానట్టు చదువుతూ ఉంటాడు.)

రాజ : (పై కండువా వేసుకుంటూ) ఇదిగో చూడు.

నీల : ఇదిగో బయల్దేరుతున్నాను.

రాజ : నువ్వికక్కడే ఉండు. లక్ష్మి ఒంటరిగా ఉంటుంది.

నీల : నువ్వెక్కడికి ?

రాజ : నేనా ! ప్రసాదాన్ని తీసుకురావడానికి. లక్ష్మి అతన్ని చూడాలంటోంది.

నీల : ఆమాత్రందానికి నువ్వెందుకు ? నే నెలాగు వెడుతున్నానుగా నేను తీసుకొస్తాను.

రాజ : (ఏడుపు ఆపుకుంటూ) కాదు నీలకంఠం ! ఆతడు నాకు అల్లుడు అతని కాళ్ళు పుచ్చుకునే గౌరవం నా కొక్కడికే ఉంది.

నీల : సరే లేవయ్యా ! ఈ పదవిని నే నిప్పటికి ఆరుసార్లు పుచ్చుకున్నాను.

రాజ : నీలకంఠం ! నే చేసిన పాపానికి నా పిల్లలెవరూ సుఖపడలేకపోతున్నారు ! ఆ వుసురే నన్ను కన్ను కొడుతోంది. (ఇహ మాట్లాడలేకపోయాడు. వెడుతున్నాడు.)

నీల : ఇదిగో ఆ ఆరోడ్లమీద జాగ్రత్తగా చూసుకుని మరీ నడు.

రాజ : అయ్యో ! అంత అదృష్టమా (అంటూ నిష్క్రమిస్తాడు.) (నీలకంఠం క్రిందకుపడ్డ శుభలేఖల్ని సర్ది Tea poy మీద పెట్టాడు. లక్ష్మి గదిలోకి వెళ్ళాడు. కనకం ఈసురోమంటు వచ్చింది.) (అలసటతో సోఫాలో కూర్చుంది. ముఖాన చెమట తుడుచుకుంది. శుభలేఖలు కనబడ్డాయి.)

నీల : వచ్చేవా ! రక్షించావు తల్లీ నీకోసమే చూస్తున్నాను.

కన : ఈ శుభలేఖలు బయట కెలా వచ్చాయి ?

నీల : అవి శుభలేఖలా ! శతఘ్నుల్లాగా పేలాయి ! ప్రసాదరావుకి దొరికాయి.

నీల: శుభలేఖల సంగతి ఏమిటో తేలకపోతే (ఏం చెప్పాలో తోచక) ఇహ అంతే నన్నాడు.

కన: అంటే?

నీల: అంటే ఏమిటి! విడిచిపెట్టేస్తానన్నాడు.

కన: అయ్యో!

నీల: అసలివి ఎలా వచ్చాయట? ఏదయ్యమైనా!

కన: దయ్యమూలేదు. దేవతాలేదు. వీటిని తెచ్చినవాడూ మనిషేనండీ!

నీల: (దూరంగా ఉన్నవాడు దగ్గరగా కూర్చొని) ఏమిటేమిటీ నీకు తెలుసన్నమాట!

కన: ఆఁ ఆ సుందరంగారు లేరూ? ఆయన వేయించుకొచ్చాడు.

నీల: అదేం పోయేకాలం! వాడికి, మతిగాని పోయిందా!

కన: అలాగే మరి.

కన: (లక్ష్మితో) ఆ సుందరంగారు లేరూ! యిక్కడ మనం సంబంధాల కోసం పడుతున్న అవస్థచూసి వెళ్ళి వారి తండ్రిగారితో సంప్రదించిన మీదట 'అభ్యంతరం' లేదన్నారట. అందుకని మనందర్నీ ఆనందంతో ఆశ్చర్యంలో ముంచెయ్యడానికి....

నీల: ఏకంగా శుభలేఖలు అచ్చు వేయించుకొచ్చాడు - వోరి వీడ్ని అంటించా.

నీల: ఇహ చిక్కులేదు! అతడు ఇప్పుడిక్కడికి వస్తా నన్నాడు. వస్తే అతన్ని సాక్ష్యంపెట్టి ప్రసాదరావు ఎదురుగా అన్ని విషయాలు తేలుద్దాం.

కన : అంత సులభంకాదు బాబాయ్. ఇదంతా మనమే కల్పించి చేయించాం అనుకుంటే ప్రమాదం.

(లక్ష్మి సైగచేసి మరేం చేద్దాం? అని కనకాన్ని అడుగుతుంది)

కన: నువ్వేం బాధపడకమ్మా మేం ఏదో ఆలోచించి చేస్తాంగా నువ్వు లోపలకి వెళ్ళి విశ్రాంతి తీసుకో—

నీల : మరేమిటి గతి ?

కన : ఒకపని చెయ్యండి. అతను వస్తాడో రాడో, మీరే వెళ్ళి అతన్ని తీసుకురండి అతన్తో ఆలోచించి ఏదో చేద్దాం.

నీల : సరే (లేచి వెళ్ళబోతాడు. వీధిలోంచి సుందరం ఎదురొస్తాడు) ఆడబోయిన తీర్థం ఎదురయ్యింది. శుభలేఖల Hero వస్తున్నాడు

సుం : నమస్కారమండీ !

నీల : కళ్యాణమస్తు !

కన : (తను లోపలికి వెళ్లింది. సుందరం కూర్చుంటాడు. నీలకంఠంతో మాట్లాడబోతుంటే శుభలేఖలు కంటబడ్డాయి.)

సుం: వీటిని ఇంకా ఉంచారు దేనికి ?

నీల : మీరు ఎవర్నీ సంప్రదించకుండా అచ్చు వేయించారు దేనికి !

సుం: అదేదో పొరపాటై పోయిందండి.

నీల : ఎంత ముచ్చటగా అన్నావయ్యా పొరపాటయ్యిందని.

సుం : అసలిప్పుడేం జరిగిందండి !

కన : పెళ్ళయిన ఏడాదికి తన భార్య పెళ్ళికూతురుగా - మరొక వరుడుగా అచ్చయిన శుభలేఖలు భర్తగారికి కనబడితే ఏం జరగాలో అదే జరిగింది.

సుం : అంటే అల్లుడుగారు వీటిల్ని చూశారా !

నీల: చూశారా ఏమిటయ్యా ఇంటిల్లపాదినీ ఒక్క- దులుపు దులిపి లాయర్ను సంప్రదించడానికి తయారుగా ఉన్నాడు.

సుం : లాయర్నా ఎందుకు ?—

నీల : ఎందుకా ! విడాకులకి !

సుం : అయ్యో (కాఫీ తీసుకుంటున్నవాడల్లా కప్పు క్రిందపెట్టి పెళ్ళి పోతున్నాడు.)

నీల : ఏమిటది ? ఎక్కడికి ?

సుం : అల్లుడుగారికి అన్నివిషయాలు తెలియజేయడానికి.

నీల : మరి ఆ విషయం మాకు చెప్పి ఏడవ్వేం ? నాకు నోరు తిన్నగా రాదు. ఇలారా ముందు. (గదమాయించాడు సుందరం వచ్చి కూర్చున్నాడు.) ఇదుగో ఈ క్షణంనుంచి నువ్వు చెయ్యబోయేది చెప్పి మరీ పుణ్యం కట్టుకో ! నువ్వు ఎవరినీ సంప్రదించకుండా చేసిన నిర్వాకంవల్ల కొన్ని ప్రాణాలకు ప్రాణాలు కొట్టుకు పోవడానికి సిద్ధంగా ఉన్నాయి.

కన : మీ రేది చెప్పినా నమ్మేస్థితిలో లేడు అన్నయ్య !

నీల : అసలే ఇక్కడివాళ్ళ పిచ్చిచేష్టలకు ఉడికిపోతున్నాడు. సరిగ్గా ఈ సమయానికి శుభలేఖలు కూడాను.

సుం : ఇక్కడివాళ్ళ చిలిపిచేష్టలూ అంటే.

నీల : అదే నీ కిందాక చెప్పాను కదయ్యా ! మన ఆనందం !

సుం : మీ మాటకు అడ్డొచ్చాను. కనకంగారూ ! మీకూ ఆనందంచేష్టలు పిచ్చిగా, అకారణంగా కనిపిస్తున్నాయాండీ !

నీల : కాక !

సుం : దయచేసి మీరు నిశ్శబ్దంగా ఉండండీ ! ఏమండీ కనకంగారూ !

కన : ఎప్పుడూ నిప్పులు కురిపిస్తుంటాడండీ. మా అందరిపట్ల అతని ప్రవర్త నెలాగున్నా పరవాలేదు. అల్లుడైన వాడెలా సహించ గలడు.

సుం : ఆనందం నిప్పులు కురవడ మొక్కటే మీకు కనిపిస్తుంది. కాని నిప్పులమీద వేగిపోతూ ఎంతటి ఆవేదనను అణుచుకొని అలమ

టించి పోతున్నాడో మీ రెరుగరు. నీలకంఠంగారు ఆనందం ప్రవర్తనను గురించి ఉదయం నాతో ప్రస్తావించినమీదట అతన్ని మందలిద్దామని అతన్ని కలుసుకున్నాను. అతను మీ జీవితాన్ని గురించి ఎంత కుమిలిపోతున్నాడో మీరు వింటే మీరు ఒక మనసుగల మనిషైతే .... ఇంత అన్యాయం చేసివుండరు. ఒక సంగతి మీకు తెలుసా! ఇప్పుడు ఎప్పుడూకూడా ఆనందానికి బహిర్భాగం మీరు. వాడు సుఖపడటంకాదు వాడిక్కావల్సింది మీరు సుఖపడటం, అందుకు మీరెన్నో అడ్డంకులు చెబుతున్నారట. వాడ్ని సుఖంగా ఉండమంటారుట. పెళ్లాన్నేలుకోమని వేధిస్తారట. ఎలా సాధ్యం అండీ!

(ఆనందం వచ్చాడు నిశ్శబ్దంగా నిల్చున్నాడు.)

నీల : అవును ఆదీ ఆలోచించవలసిన విషయమే.

సుం : నేను ఆనాడే అన్నాను. మీకు గుర్తుందో లేదో! మీ త్యాగంవల్ల మీరు అనుకున్న ఫలితాన్ని సాధించలేరని.

కన : అదేం న్యాయం అండీ! నావల్ల ఎవరికైనా ద్రోహం జరిగితే నన్ను శిక్షించాలి. అంతేగాని.

సుం : అంటే మీవల్ల మోసగించబడ్డవాడు తన ప్రతీకారం తీర్చుకునే పద్ధతికూడ మీ ఉద్దేశానుసారం ఉండాలంటారు.

నీల : అదేంమాట! మనం ఒకర్ని మాటల్తో నొప్పిస్తే అవతలి వాడూ అదే చెయ్యాలనెక్కడుందీ! వాడు పళ్లూడగొట్టుచ్చు.

కన : అలాంటి నిర్ణయాలు ఏమయినా ఉంటే అన్నీ ఒదులుకుంటున్నాను. కాని....కాని....ఈ అమాయకుణ్ణి ఒంటరిగా వదలి వెళ్ళిన మరు క్షణంలో (కంఠం రుద్ధమయ్యింది. మాటాడలేక ఊరుకుంది.)

ఆనం: ఇహ ఆ విషయానికి నువ్వు బాధపడ నవసరములేదు. ఇప్పుడు నువ్వన్న మాటలమీద నిలబడాలేగాని మా నాన్ననికూడా నీ సంరక్షణలో ఉంచగలిగే సంబంధాన్ని తీసుకొచ్చాను.

సీల : అదేమిటోయ్ ! నాకు Compitation వస్తున్నావు నేనూ ఓ సంబంధం అనుకుంటున్నానే.

ఆనం: మీ Candidateకీ నా Candidate కీ పోలిక లుండవు. మీరు మీ Commission దృష్ట్యా !

సీల : ఆమాటనకు చెబుతున్నాను. కనకం విషయంలో Commission ఏమిటయ్యా ! పైగా మావాడుకాని కట్నం పుచ్చుకోడు.

ఆనం: మావాడు కట్నం పుచ్చుకోకపోవడమే కాదండీ ! పెళ్ళి ఖర్చులు కూడా లేకుండా పెళ్లాన్ని తీసుకుపోతాడు.

సీల : మావాడు సాక్షాత్తూ మన క్కావలసినవాడయ్యా !

ఆనం: మావాడు సాక్షాత్తూ మనవాడే !

సుం : మరింకేమిటి అభ్యంతరం ! ఏమండీ కనకంగారూ ! మీరు ఊ అనండి ఇంటిల్లిపాదీ సుఖపడతారు.

కన : మీ రనుకున్నంత సులభంగా నాలాంటిదాన్ని భార్యగా స్వీకరించడానికి సామాన్యంగా ఒప్పుకోరు. నన్ను చేసుకోవాలనుకుంటే. ఒక కొడుకునికని వైధవ్యం ప్రాప్తించిన స్త్రీని చేసుకున్నంతా సహృదయతతో చేసుకోవాలికదా !

ఆనం: వెదవ్వేషాలు వెయ్యకు, అలాంటివాడే వస్తే చేసుకుంటావా !

కన : అప్పుడు నాకు అభ్యంతరం లేదు.

సీల : మళ్ళీ ఏవో సాకులు చెప్పకూడదు.

కన : చెప్పను. ఎవరో చెప్పండి.

ఆనం: అత నెవరైనా అభ్యంతరం చెప్పకూడదు.

సుం : ఏడ్చావు - ఎవరో చెప్పారా ? ఆమెకు నచ్చచెప్పే బాధ్యత నాది.

ఆనం: నువ్వు పూనుకుంటే అంతకంటేనా ! విను కనకం ! మాసుందరం.

సుం : నేనా ! (పిడుగుపడ్డట్టు) అసంభవం !

నీల : అన్యాయం.

ఆనం: ఏమిటండి ! అన్యాయం.

నీల : ఇతనే నా Candidate అయ్యా !

సుం : ఆనందం - ఆపు. చాలా ఘోరమైన విషయం. నావల్లకాదు.

ఆనం: అది మరి అసంభవం ! మాట తప్పకు ! ఇంతకు ముందే ఆమెను ఒప్పించే పూచీ నాదన్నావు ?

సుం : అదికాదానందం. నా కళ్ళ ఎదుట మీ రుభయులు....

ఆనం: ఆ అభ్యంతరం నీ కుంటుందని తెలుసు. కాని అంతగా కావాలని కోరుకున్న ! ఆవిడ ఇప్పుడు నాకు కాగలదా ! అస లలాంటి ఊహనుకూడా ప్రోత్సహించడం మంచిదంటావా ! (సుందరం మౌనం) మాటాడవేరా ! ఒకనాడు నీ జాప్యంవల్ల ఈ సంసారం తీన్నార్తారు అయింది. ఆనాడే నీ కోరికను వెల్లడించిఉంటే యిన్ని ఇబ్బందులు వచ్చేవికావు. ఒకప్పుడు నా ప్రాణానికి ప్రాణం. మా కుటుంబంకోసం తన జీవితాన్ని మోడు చేసుకున్న ఈ కనకం ఈనాడు నా తోబుట్టువు. దానికి జీవితాన్ని ప్రసాదించు మా కుటుంబాన్ని ఉద్ధరించు. (పాదాలమీదపడి వేడుకున్నాడు.)

నీల : అవును నాయనా !

సుం : (కాళ్ళమీదున్న ఆనందం తలను గుండెలకు చేర్చుకొని ఆమోదంగా కన్నీరు కార్చాడు.) అది సరే ! ఆమె సమ్మతికూడా కావాలికదా !

ఆనం: అందుకు నువ్వు పూచీ పడ్డావుకదరా !

నీల : ఇహ అతన్ని అడగడం, బాగుండదులే అది నా పూచీ అమ్మా కనకం. (ఆవిడ లేదు. అంతకుముందే వెళ్ళిపోయింది.) అయ్యో

లోపలికి వెళ్ళిపోయిందే: (లోపలకు వెళ్ళబోయి శుభలేఖలు కంట పడగానే ఆగి శుభలేఖలు చూపిస్తూ) అన్నట్టు ఈ శుభ లేఖల గందరగోళం మాటేమిటీ?

ఆనం: అవును శుభలేఖలు (ఆలోచించి) ఉండండి వస్తాను. (వీధిలోకి వెళ్ళబోయాడు.)

నీల : (ముందుకు అడుగువేసి) ఎక్కడికి?

ఆనం (ఆగి) బావగారి దగ్గరకు.

నీల : ఎందుకు?

ఆనం: ఈ శుభలేఖల సంగతి—

నీల : ప్రసాదరావుతో చెప్పడానికా?

ఆనం: ఆఁ

నీల : మరి ఆ విషయం మాకు చెప్పి ఏడవ్వేం? నాకు నోరు తిన్నగా రాదు. రా ఇలారా - కూర్చో (ఆనందంవచ్చి కూర్చుంటాడు.)

ఆనం: (కూర్చుని) ఏవండీ?

నీల : చెబితే ఇదంతా మనం ఆడుతున్న నాటకమంటే? ఏంవయ్యా సుందరం?

సుం : (తెప్పరిల్లి) అవునండి. ఆ ప్రమాదం కూడా ఉంది.

ఆనం: ఆహా (ఆలోచన్లో పడ్డాడు, యాదాలాపంగా శుభలేఖల్ని పేకముక్కల్లాగ కలుపుతూ - చటాన ఆలోచన తట్టింది. ఏవండి నీలకంఠం గారూ మాట. (నీలకంఠం ముందుకొచ్చాడు ఆనందంతోపాటు. సుందరం వింటున్నాడు.) నాటకం అంటే ఆలోచన తట్టిందీ - ఏదో నాటకం ఆడి, ఈ శుభలేఖలు కనకం సుందరాలవని బావ గారి చెవిని వేస్తే?

నీల: బాగానే ఉంటుంది. కాని నాటకాలు, బూటకాలు నమ్మడానికి నీ అంత.

ఆనం: అదే చూద్దురుగాని (తన గదిలోకి నిష్క్రమించాడు)

నీల: అదిగో మళ్ళా—

ఆనం: చెప్పేడుస్తాను మీ రుండండీ (వెళ్ళాడు)

నీల: ఆ! అది (కూచున్నాడు. సుందరంతో) ఇదిగో అబ్బాయి! నీ పేరే మిటి ఆ సుందరం చూడు నువ్వాలాఉంటే లాభంలేదు నాయనా.

సుంద: (లేచి ముందుకు నడుస్తూ) అబ్బే! అదేం లేదండీ. వాళ్ళను గమనిస్తుంటే, ఆశ్చర్యం వేస్తుంది. ఇతరుల సుఖంకోసం సర్వం త్యాగం చేయడానికి సిద్ధపడే సహృదయాలు.

నీల: నువ్వు మాత్రం! నీ సహాయం సామాన్యమైందా?

సుంద: సరే! నా విషయమే చెప్పేరు! కాని నీలకంఠంగారు! ఈ మా వివాహంవల్ల కొత్త చిక్కులు కొనితెచ్చుకుంటున్నావేమా.

నీల: ఎంతమాత్రంకాదు. నాయనా ఈ నీ సహాయంవల్ల ఇంటిల్లపాది ముఖ్యంగా ఆనందం మనసు కుదుట బడుతుంది. ఆనందం ఆవేదనంతా కనకం సుఖాన్ని కాంక్షించి తన కుటుంబ కారణంగా జీవితాన్నే బలి చేసుకున్న కనకం, ఒక యింటిది కావాలని (అప్పటి కనకం, లక్ష్మికోసమని వెళుతూంటుంది) కదమ్మా కనకం!

కన: అది సరే—అసలు ప్రమాదాన్ని గురించి పట్టించుకొవడంలేదు మీ రెవ్వరూ (అంటూ మళ్ళా కదిలింది. ఆనందం గదిలోంచి ఒక చేతిలో అరటావు కాగితం ఏదో వ్రాసాడు, మరొక చేతిలో తెరచిన కలంతో ప్రవేశిస్తాడు)

ఆనం: ఇదిగో ఇదిగో ఆ ప్రమాదంగూర్చే (వాసింది మళ్లా తనలో చదువుకుంటుంటాడు)

నీల: ఏమిటిది? (లక్ష్మి గదిలోకి వెళ్ళబోయిన కనకం ఆగింది)

ఆనం: (రాసింది సరిచూచుకుంటూ మధ్యలో) సుందరమొక Pool.

నీల: (ఆనందం వెనగ్గాచేరి ఆనందం వ్రాసుకొచ్చిన కాగితాన్ని చదువు తూంటాడు. క్రమేపి అతని ఉత్సాహం ఇనుమడిస్తూ ఉంటుంది)

ఆనం: (మరికొంత సరిచూచుకుని) తండ్రిపేరు....

నీల: (తనూ తనలో చదువుతూ) కనకలక్ష్మి సాక్షాత్తు మహాలక్ష్మి

ఆనం: .....స్వతంత్రంగా సుందరం.....

నీల: (మరికొంత చదివి)".....పెద్దకూతురు లాంటిది" (ఆనందం తెలివి తేటలకు ముచ్చట పడిపోతూ నెత్తిమీద మెట్టుతాడు)

ఆనం: (మరికొంత సవరించి)....వాకబు....

నీల: ....నీలకంఠం మధ్యవర్తిత్వం (సంతోషం పట్టలేక అరుస్తాడు) హార్నీ....ఈ తెలివితేటలు నీ సొంతానివే?

ఆనం: సుందరం త్రిల్లు....

(ఈ హంగామా అంతటినీ కనకం, సుందరం అర్థంకాని ఆశక్తితో గమనిస్తూ ఉంటారు.)

నీల: (ఆనందంచేతిలో కాగితాన్ని లాక్కొని సుందరం దగ్గరవాలి) ఆమోఘమైన నాటకం - చదువుకో.

(సుందరం చదువుతూ ఉంటాడు. అర్థంకాక తెల్లబోయి నిలుచున్న కనకాన్ని సమీపించి నీలకంఠం)

నీల: నీకే అంతుబట్టలేదుకదూ. ఇలారా చెప్తాను (చెవిలో చెబుతూ ఉంటాడు)

సుం: (చదివి) బాగుంది. ఇంతకీ ఈనేరం నా మీదకు నెడతారన్నమాట.

ఆనం: మెత్తగా ఉన్నవాళ్ళను చూస్తే మొత్తబుద్ధి వెయ్యదుమరి.

కన: (నీలకంఠతో) అంత సులభంగా నమ్ముతాడంటారా (అంటూ సుందరం చేతిలోని కాగితంకోసం చెయ్యిచాపుతుంది) యాదాలాపంగా కాగితాన్ని కనకం చేతికందిస్తాడు సుందరం.)

ఆనం: నమ్మించే పూచీ మీ ఇద్దరిలోనూ ఉంది. మీ మొహాలిలాగే ఉంటే నమ్మడు.

సుంద: మరి....తండ్రి పేరు?

ఆనం: నువ్వు ఈ అంతర్నాటకంలో ఒక Pool వైతే అదొక సమస్య టరా? అది నీ Half Knowledge వల్ల....ఏరా నటించలేనని భయపడు తున్నావా?

నీల: ఆ ఆ....నీతో ఐదేళ్ళు ఏకశెయ్యా శయనం, ఏకపాత్రా భోజనం కదా! ఆ పాటిబుద్ధి మాంద్యాన్ని నటించే శక్తినే సంపాదించ లేక పోతే నీ సహవాస బలమేమిటోయ్!

కన : (అప్పటికి చదవడం పూర్తిచేసి) బావా!

ఆనం: (కనకాన్ని సమీపిస్తాడు, నీలకంఠం, సుందరంలు పథకాన్ని గురించి మాటలు అభినయిస్తూ ఉంటారు.)

కనం: దీన్ని ఇలా మారుస్తే బాగుంటుందేమో.

ఆనం: ఏమిటి ఇదే అక్షరాల జరగాలని లేదు కనకం! ఇవి సూచనలు మాత్రమే! ఆ తరువాత ఆ శుకవిత్వమే.

నీల: మరి మన మొకమారు చూసుకోవద్దూ.

ఆనం: ఇలాంటి నాటకాలకి రిహార్సిల్సు పెడితే, అశ్వంకాక, గుట్టంగాక గుశ్యమైపోయే ప్రమాదంఉంది.

సుం: అవును. సమయస్ఫూర్తితో అప్పటికప్పుడు సంభాషణలు సృష్టించు కోవాలి మరి.

ఆనం: ఆహా! వీడికీ అందుకుంది. నీలకంఠం బాబాయ్. ఏం కనకం ఇంకా ఏమయినా అనుమానాలు?

నీల: మరే అనుమానాల్లేవుగాని....కార్యోన్ముఖులం కావలసిందే. ఏవయ్యా డైరెక్టరూ. నేం చెయ్యవలసిన పనేవిటి?

ఆనం: ద్వారపాలకవృత్తి: బావగారొస్తున్న జాడ తెలియగానే గుప్ చిప్‌గా వొచ్చి చెప్పండి ప్రారంభిద్దాం.

నీల: సరే (కండువా దులిపి, భుజాన వేసుకుని ద్వారం వైపు వెడుతూ ఆగి) అన్నట్టు ప్రసాదరావుకంటే ముందు రాజశేఖరమే విజయం చేస్తేనో?

కన: అప్పుడాయనకూడా ఇందులో ఒక పాత్ర ధరిస్తారు.

సుం: ఆహా ఈవిడకీ అందుకుందిప్పుడు (అంతా నవ్వుకున్నారు కనకంకూడ నవ్వుకుంటూ వెళ్ళిపోయింది. లక్ష్మి గదిలోకి నీలకంఠం బైటకు వెళతారు)

(ఆనందం సుందరాలు మాట్లాడుకుంటూ ఉంటారు)

నీల: (పరుగున ప్రవేశించి) ఒస్తున్నాడొస్తున్నాడు. అమ్మా కనకం (కనకం లోపలనుంచి వచ్చింది)

ఆనం: (నీలకంఠంవైపువస్తూ) ఎవరు నాన్నా?

నీల: ఆ నాన్నే....అహా కాదుకాదు. నా మతిమండ రాజశేఖరం కాదు. ప్రసాదమే వొస్తున్నాడు. ఛ....చ....అదికాదు. ఉభయులూ వస్తున్నారు.

ఆనం: ఏంవిటండి (వీధిలోకి ఒక అడుగువేసి....లోపలకొచ్చి) అవును ఇద్దరూ వస్తున్నారు.

నీల: (కండువా చేత్తో పుచ్చుకొని. బాగా రంగస్థలం ముందుకొచ్చి నిల్చున్నాడు, ఆనందం సుందరాన్ని రంగస్థలానికి మధ్యగా లాగాడు, తనూ ఎడమ క్రిందగా నిల్చున్నాడు. కనకం సోఫానానుకుని నిలబడింది, అందరూ దాదాపు ప్రేక్షక ముఖంగానే నిల్చున్నారు.)

నీల: ఏమయ్యా డైరెక్టరూ! నేను Sitting గా Standing గా

ఆనం: standing (అనగానే నీలకంఠం తన వెనకనే ఉన్న Stool మీద కూర్చుంటాడు)

నీల: (సౌంజ్ఞలతో) ప్రారంభించవయ్యా బాబు! నాకేం తోచడంలేదు.

ఆనం: (నీలకంఠంతో) బావగారు లోపలకు రాగానే సైగ చెయ్యండి ప్రారంభిద్దాం.

నీల: సరే అలాగే (రా॥శే॥ ప్రసాదరావులు లోపల అడుగు పెట్టడం గమనించి) రడీ స్టార్టూ!

ఆనం: వెధవ స్వతంత్రాలు మీరూనూ. ఎవడి జీవితంమీద వాడికే అధికారంలేదు ఈ కొంపలో.

సుం: ఇప్పుడు నా వల్ల పొరపాటేమిటి?

(ప్రసాదరావు ప్రవేశించాడు క్షణం ఆగి తిరిగి తన గదివైపు కదిలాడు, రాజశేఖరం కూడ వచ్చాడు)

నీల: నీకు నువ్వయి శుభలేఖలు వేయించేంత స్వతంత్ర మెలా తీసుకున్నావని.

(ప్రసాదరావు శుభలేఖల ప్రస్తావన రాగానే ఆగాడు. నిలుచుని వింటున్నాడు. రాజశేఖరంకూడా వింటున్నాడు)

ఆనం: (కనకంతో) ఇక్కడెవ్వరి మాటా లేకుండా ఈ సంబంధానికి సమ్మతించే అధికారం నీ కెవ్వరిచ్చారు.

కన: నా మాట నమ్మవేం? నేను సమ్మతించలేదు మొర్రో అంటే.

ఆనం: ఆ! సమ్మతించలేదు! ఏమీ జరక్కుండానే ఇంతవరకూ వచ్చింది ఈ వ్యవహారం.

నీల: నిజమేనమ్మా! ఇప్పుడెంత ప్రళయం జరిగిందో గమనించావా?

ఆనం: దీనికంతకూ కారణం మీరు.

నీల: (నాటకంలో బాగమో కాదో తెలియక) నేనా?

ఆనం: ఆ....అతను సంబంధాల ప్రస్తావన తెచ్చేసరికి మామాట లేకుండా మా తరుపున మీరు మాట్లాడ్డం ఏమిటి?

నీల: ఏఁమయ్యా (సుందరంతో) నేనా?

ఆనం: అవును మీరే! వీరంచరి సమ్మతి తీసుకొని మరీ వొచ్చానని చెప్పారు కదండీ. గొప్ప మర్యాదస్తులు, (గాడ్డిదికంగా) నాకై దిక్కులేక, మా తండ్రి వ్యద్దులు కావడంవల్ల మీ మధ్య వర్తిత్వానికి అంగీకరించవలసి వచ్చింది.

నీల: ఇదేఁవిటయ్యా?

ఆనం: ఇహచాలు commission కక్కుర్తికి ఇలాంటి పనులా? పైగా చిరకాలంనుంచి మా ఇంటతిని మాలో ఒకరుగా మసలిన మీరు ఆయనతో చెప్పిందేమిటి?

నీల: ఏం చెప్పాను?

ఆనం: దీనిపేరు మహలక్ష్మి?

నీల: ఏఁవయ్యా? నే నలా చెప్పానా? అసలు నేను చెప్పింది నీకు గుర్తుందా?

సుం: ప్రతి అక్షరం గుర్తుందండి పైగా ఎంత వర్ణన! మమ్మల్ని మాట్లాడనిచ్చారూ? ఆ మహలక్ష్మి సాక్షాత్తూ కనకమహాలక్ష్మినని.... గుణంలో.

నీల: ఆగాగు. మహలక్ష్మి .... కనకమహలక్ష్మినా? నీ మతి మండీనట్టే ఉంది. నే నన్నది ఈ కనకలక్ష్మి సాక్షత్తు మహలక్ష్మిని!

సుం: మీ రలాగే అన్నట్టు గుర్తండి!

నీల: (కనకం ఆనందంవైపు తిరిగి) అదిగో దిగాడు! వొచ్చాడు గుర్తు దగ్గరకు!

సుం: ఏఁవిటోనండి కొంచెం పేర్లు తకరాలయాయి క్షమించండి.

కన: మరి తండ్రిపేరుకూడ ఎలా మారిపోయిందండీ ?

నీల: ఈ బుద్ధిమంతుడు ఏదిమార్చిన మార్చేయగలడు.

సుం: మరీ అన్యాయంగా మాట్లాడకండీ!

ఆనం: లేకపోతే తండ్రిపేరు రాజశేఖరం ఎమిట్రా?

నీల: అవునదేమిటయ్యా?

సుం: అదేమిటయ్యాని నన్నడుగుతారేమిటి? ఆ శుభలేఖలో ఉండే ప్రతి ముక్కా మీరు చెప్పిందేనండి. ఒక పెద్దమనిషిని ఇలా నిలదీసి అవమానించడం బాగాలేదు. రాజశేఖరంగారి పెద్దకూతురు ఈ ఇంటినంతటిని ఎంతో తెలివితేటల్తో చక్కదిద్దుతుంది. ఇంకా ఇంకా.

నీల: అదా నే నన్నది? బాగుంది. బహు బాగుంది. ఇదిగో బాబూ దీని మాటకేమిగాని మాట (సుందరం దగ్గరకొచ్చాడు) ఈమధ్య కొంత కాలం విశాఖపట్నంలోగాని మకాం వేయవలసి వచ్చిందేమిటి మనం.

సుం: (చిరుకోపంతో) ఏమిటండీ?

నీల: రాజశేఖరానికి ప్రాణానికి ప్రాణం - పెద్దకూతురు లాంటిది అని నే నంటే అలాంటిది కాస్త పీకిపారేసి "పుత్రికారత్నం" అంటూ శుభలేఖలు వెలగబెట్టావు?

కన: అది సరేనండీ మీరూ మీరూ ప్రాణస్నేహితులు కదామరి. మీరు చేసుకోవాలనుకున్న అమ్మాయి (అనందాన్ని చూపించి) ఇతనికి చెల్లెలు అవునో కాదోకూడా తెలియదా?

సుం: సరి! సరి! ఈ (నీలకంఠంతో) మీ పేరేమిటి?

నీల: పేరు నీలకంఠశాస్త్రి ఏమీ?

సుం: ఆ! ఈ శాస్త్రిగారి మధ్య వర్తిత్వంలో సాగుతున్న ఈ సంబంధం మా ఆనందానికి కావలసిన వాళ్ళని నాకు తెలియనే తెలియదు.

ఆనం: మంచి తెలియక పోవడమే! ఛ! ఛ! ఏంవిట్రా యీ పనులు. శుభ లేఖలు సీయంతట నువ్వే అచ్చువేయించడమేమిటి? ఆ పిల్ల చిక్కలేందను కున్నావా?

సుం: ఆవిడకు దిక్కులేక పోవడమేం! నేనే దిక్కులేనివాడ్ని, మా తండ్రిగారు వృద్ధులు, అనారోగ్యులు కావడంవల్ల, నా వివాహం త్వరలోనే జరగాలని పట్టుబట్టారు వీరు (నీలకంఠం) మా తండ్రి గారి మాటల సందర్భంలో "మా అభ్యంతరం లేకపోతే మీ అభ్యంతరంకూడా ఉండబోదని, నిరభ్యంతరంగా శుభలేఖలు కూడా.

నీల: కూడా అచ్చువేయించుకోవచ్చని, మాటవరసకన్నాను. కనుక విషయాలు తేల్చుకోకుండా నిర్ణయాలు జరకుండా ఈ తప్పుల తడక. ఈ శుభలేఖలు అచ్చువేయించు కొస్తావన్నమాట!

సుం: మేం సమ్మతించిన తరువాత పిల్లతండ్రికూడా

నీల: తండ్రి అంటే ఈ రాజశేఖరం.

సుం: ఆ రాజశేఖరం.

నీల: (ఆనందంతో) చూసావయ్యా ఇతని తెలివితేటలు. ఇందాకిందాక చెప్పానా! మళ్ళీ రాజశేఖరం తండ్రట బాబూ-ఏవిటి బొబ్బిల్లోగాని పుట్టావేమిటి?

ఆనం: అది సరే ఏదో జరిగింది. మరీ శుభలేఖలు మా ఇంట్లో కెలా వచ్చాయి. ఎవరికిచ్చావు నువ్వు?

సుం: (మాట్లాడడు)

ఆనం: ఏరా?

సుం: (కనకాన్ని చూస్తాడు)

ఆనం: (కనకంతో) ఆహా అయితే ఈ నాటకంలో నీకూ భాగమున్న దన్నమాట.

కన : (సుందరంతో) ఏం జరిగిందో వయచేసి చెప్పండి.

సుం: నాకు జరిగిన అవమానంకూడా నేనే చెప్పుకోవాలంటే?

నీల : అవమానమేమిటి?

కన : ఈయన ఒకనాడు నీలకంఠంగారు అంటూ వచ్చాడు.

ఆనం: నీలకంఠంగారికోసం ఇక్కడి కెందుకు?

నీల : ఇదేకదయ్యా నా Postal address.

ఆనం: సరె సరె. ఆ! వచ్చి.

కన : ఈ శుభలేఖలుకట్ట నాకిచ్చి డిశెంబరు 31వ తారీఖున ముహూర్తం అని చెప్పండి అన్నారు. మరి కాసేపట్లో నీలకంఠంగారు వస్తారు కూర్చోమన్నాను. కాఫీతెచ్చి ఇచ్చాను. అదేపనిగా నన్ను చూస్తున్నారు.

నీల : ఊ!

కన : అబ్బ! నాకు చెప్పడం చేతకాదు. (సిగ్గు అభినయిస్తూ)

ఆనం: ఊహూ! అవకతవక పనులు చేయడం చేతనొచ్చు!

నీల : నువ్వు ఉండు ఆనండం. పోనీ నువ్వు చెప్పవయ్య సుందరం.

సుం: మీరేనా. మహలక్ష్మిగారిని అడిగాను; ఏమిటి సంగతన్నారావిడ.

ఆనం: అంతవరకూ ఆవిడ్ని చూడ్డంకూడా జరగలేదన్నమాట. మా గొప్పగా ఉందయ్యా!

సుం: నా పరిస్థితి అలాంటిది. అసలు పెళ్ళే ఇష్టంలేని నాకు ఎలాగైనా పెళ్ళయి కోడల్ని చూడాలని ఆ వృద్ధుడి ఆత్రుత. అనుకోని ప్రమాదం సంభవించకుండా ఆయన కోరిక నెరవేర్చాలని నాతపన. ఈ కారణంవల్ల సర్వం వీరయిన వీరి పేరేమిటి?

నీల : పేరు నీలకంఠంశాస్త్రి ఏమి?

సుం: ఆ యీ శాస్త్రిగారిమీద వేశాం.

ఆనం: సరే; కానియ్యవోయ్ త్వరగా; సొద.

నీల : తర్వాత ఏముంది? మీరే పెళ్ళికూతురని సెలవిచ్చివుంటారు. ముసి ముసి నవ్వులమధ్య అవునా అమ్మా; అవును ఎవర్ని సంప్రదించి చేశారని గద్దించాను. వేళాకోళం అనుకొని ఏదో హాశ్యంచేస్తూ జవాబిచ్చాడు. దాన్తో నాకు వళ్ళుమండి నానా దుర్భాషలాడి వెళ్ళమన్నాను.

నీల : ఓరి నీ యిల్లు బంగారంగాను. (రాజశేఖరం లక్ష్మి గదిలోకి వెళ్ళాడు. ప్రసాదరావు అక్కడే ఉన్నాడు.)

సుం : మీ ప్రమేయం బొత్తిగా లేనట్లు మాట్లాడకండి.

ఆనం: ఆగండి ! తర్వాత !

సుం : మాట్లాడకుండా నేను వెళ్ళిపోయాను.

ఆనం: మరి శుభలేఖల్ని మరిక్కడెందుకు తగలెట్టావ్ ? నీతోనే తీసుకు పోలేక పొయ్యావూ ?

సుం : ఆవిడే వద్దన్నారు. పైగా రెండోఫాటికి తెలీకూడదన్నారు.

ఆనం: బాగుంది. నీమానాన నువ్వు వెళ్లావు. ఇక్కడ మహా ప్రళయం జరిగింది. ఇంతకీ నీకు నీపెళ్ళయి పోయిందా ?

(రాజశేఖరంవచ్చి ప్రసాదరావును లోపలకు తీసుకొని వెళ్లాడు.)

సుం: నా పెళ్లికోసం, నా సుఖంకోసం ఏ ముసలి హృదయం తపించి పోయేదో ఆ నా తండ్రి యిహ బాధపడడు.

ఆనం: ఏమి ?

సుం: ఆయన శాశ్వతంగా దూరమైపోయారు. (కళ్ళనీళ్ళు రాజశేఖరం ప్రసాదరావు లేరన్న సంగతి గమనించిన నీలకంఠం హడావిడిగా వచ్చి)

నీల : స్టాపు ! ప్రేక్షకులు లేరు. లోపలకు వెళ్లారు.

ఆనం: వోరి బడుద్దాయ్! బావగారిని నమ్మించడానికి నాలుగబద్ధాలు మాట్లాడరా అంటే అనవసరమైన అబద్ధాలు దేనికిరా రాస్కెల్.

సుం: కాదానందం అదిమాత్రం నిజం. నాకు తండ్రిలేడు, ప్రపంచం లేదు.

నీల : (వస్తూ) Ready వొస్తున్నారు.

(కాని ఎవ్వరూ మాట్లాడలేకపోయారు. రాజశేఖరం ప్రసాదరావు ప్రవేశం. ప్రసాదరావు చేతిలో ఒక తెల్లకాగితం ఉంది. వస్తూ మడతపెట్టి జేబులో పెట్టుకుంటున్నాడు. (లక్ష్మికూడ వెంట వచ్చింది.)

ప్రసా: (గొప్ప ఆనందంగా ఉన్నాడు) అయితే సుందరంగారూ !
(అందరూ ఉలిక్కిపడి ప్రసాదరావు ఉండడాన్ని గమనించ
నట్లు నటించారు.) నాపేరు ప్రసాదరావు. ఈమె....
సుం: శ్రీమతి లక్ష్మి గ్రహించాను.
లక్ష్మి: (నాకు తెలుసే అని అభినయించింది. మీకు వ్రాసి ఇచ్చిన
కాగితంలో సుందరంగారు యీయనే అనికూడ చెప్పింది సొంజ్ఞల్తో
కాని ఎవ్వరికీ అర్థంకాలేదు, ప్రసాదరావుకు తప్ప)
ప్రసా: అది సరే - (శుభలేఖ తీసికొని) ఈ శుభలేఖలో యీపేరు నీది
కాదుట.
లక్ష్మి: (అదేమిటని కనకాన్ని చూసింది.)
ప్రసా: (సుందరాన్ని చూపిస్తూ) ఈయన (నీలకంఠంని చూపిస్తూ) ఈ
యన్ను మధ్యవర్తిగా ఉంచి....
నీల : నా ఖర్మకాలి....
ప్రసా: (కనకాన్ని చూపిస్తూ) ఈమెను పెళ్లికూతురుగా నిర్ణయించుకుని
మతిమరుపువల్ల కనకలక్ష్మికి బదులు మహలక్ష్మి పేరుతో (రాజ
శేఖరాన్ని చూపిస్తూ) యీయన్ను తండ్రిగా శుభలేఖలు అచ్చు
వేయించుకొచ్చారుట.
లక్ష్మి: (కనకం దగ్గరకు వెళ్ళి అవునా అన్నట్లు చూస్తుంది.)
కన : (జవాబుగా నీలకంఠాన్ని చూస్తుంది.)
లక్ష్మి: (నీలకంఠం దగ్గరికి వెళ్ళి అవునా అని పలకరించింది.)
(కనకం, నీలకంఠం, ఆనందం ముగ్గురూ నిజమేనని తల
లూపారు.)
లక్ష్మి: (లక్ష్మి ప్రసాదరావు వద్దకు వచ్చి వెల వెల బోయింది. అయ్యో
అంటూ నోరు నొక్కుకుంది. నమస్కరిస్తూ సగం నవ్వుతో
బ్రతిమాలుకుంటూంది. ఏదో అవాంతరం జరిగిందని అందరి
ముఖాలు వెలవెల బోతున్నాయి.)
ప్రసా: (లక్ష్మితో) ఏం : అలా వెలవెలా బోతున్నావు ? నువ్విచ్చిన
కాగితం వాళ్ళకు చూపించొద్దూ. చూపించకపోతే ఎలా ?

ఆనం: ఏమిటి ? ఆ ఏమీలేదు బావగారూ ! మీ రిహార్సిల్స్‌లో లక్ష్మిని చేర్చుకోడం మరిచిపోయారా ?

అందరు: (అనుకోకుండా) అయ్యో !

ప్రసా: అమ్మా కనకం ! ఇక్కడ మీ ప్రయత్నం తెలియక లక్ష్మి అసలు శుభలేఖల విషయాల్ని తెలియజేస్తూ ఇప్పుడే నా కిచ్చిన యీ కాగితం చదువమ్మా.

(అందరూ నిర్ఘాంతపోయారు.)

కన : (చదివి) (ఇహ నిల్చోలేక పరుగున వెళ్ళింది వంటింట్లోకి)

ఆనం: (ఆనందం క్రిందపడ్డ కాగితాన్ని తీసి చదివి సిగ్గుపడి .కాగితాన్ని నీలకంఠం చేతిలో ఒదిలి పరుగులాంటి నడకతో బయటకు వెళ్లిపోతున్నాడు.)

ప్రసా: ఎక్కడకు బావగారు? మాట.

ఆనం: (ఆగకుండా) Hospitalకి మా ఆవిడకు వొంట్లో బాగాలేదు: (వెళ్లాడు.)

ప్రసా: (నవ్వి) ఆహా మీ రోగం కుదిరిందన్నమాట. (నవ్వి చదువుకున్న నీలకంఠంతో) ఏఁవండీ ?

నీల : (కాగితాన్ని రాజశేఖరం చేతులో ఒదిలి లక్ష్మికి ఎదురుగా నిల్చుని) దీన్నా ! దీన్ని చంపినా పాపంలేదు. వాళ్ళువాళ్ళు వొహటయ్యా ! (వెళ్ళిపోతున్నాడు.)

ప్రసా: (బాగా నవ్వి) ఎక్కడకండీ ? మీతో పనుంది.

నీల : ఆ పనిమీదే వెళుతున్నాను. ముహూర్తం పెట్టించుకొస్తాను. (వెళతాడు)

రాజ: (ఉత్తరం చదువుతున్నాడు.)

ప్రసా: ఏం మామగారు ఈ ఇంట్లో ఒక ఔత్సాహిక నాటక సమాజం వుందే ?

రాజ: ఏఁవోయ్ సుందరం? ఇలా అయిపోయిందే వ్యవహారం (సుందరం మాట్లాడడు)

ఆనం: (సుందరంతో) ఏం బావగారు, తమరు రచయితలుట! ఈ విషా దాంతానికి మీరే కర్తలా?

సుం: ఇది నా ఉద్దేశం కాదండీ!

ప్రసా: ఎవరిదైనా ఇంత ప్రయత్నం దేనికంటారు?

సుం: (మాట్లాడడు)

ప్రసా: అసలు విషయం చెపితే నేను నమ్మనేమో నని భయం అవునా.

సుం: అవును.

ప్రసా: నన్నుమించిన మంచివారు మీ అందరూ అని (Silance) మీరు మంచివారు అని మీరే అనుకున్నంత వరకూ ఫరవాలేదు. అది మీ హక్కు-కాని ఎదుటివారు సత్యానికి, ధర్మానికి విలువ నివ్వలేని దుర్మార్గులూ అనుకునే హక్కు-మాత్రం మీకులేదు.

సుం: చూశారా చూశారా అందరూ జారుకుని నన్ను ఒంటివాడ్ని చేశారు నన్ను క్షమించండి.

ప్రసా: అలా ఒదిలి పెడితే ఎలా మీకు తగిన శిక్ష కావలసించే అలా కూర్చోండి. కళ్ళుమూసుకుని కూర్చోండి మాట్లాడకుండా కూర్చోండి. మేం చెబుతాం అప్పుడు తెరవండి (బలవంతాన కూర్చోబెట్టాడు. కళ్ళుమూసుకునే వరకూ వూరుకోలేదు. పాపం అలానే కూర్చున్నాడు. సైగతో రాజశేఖరాన్ని లోపలకు వెళ్ళ మన్నాడు. కనకాన్ని తీసికుని తీసికొచ్చి కళ్ళుమూసుకున్న సుందరం ఎదురుగా నిలబెట్టి వాళ్ళూ జారుకున్నారు. విసిగెత్తి కళ్ళు తెరచిచూచే సరికి ఎదురుగా కనకాన్ని చూస్తాడు. మంద హాసంతో పలకరించాడు.)

కన: మీ తండ్రిగారు పోయినందుకు చాలా విచారిస్తున్నాను.

సుం: అందుకే భగవంతుడు మనల్నిద్దర్ని ఒకచోట చేర్చాడు (నిశ్శబ్దంగా పురుషోత్తం పటంముందు నిల్చున్నాడు. వెనుకనుంచి రాజశేఖరం లక్ష్మీ ప్రసాదంలు ఆనందం, నీలకంఠంలు ఆనందంతో యీ దృశ్యం చూస్తుండగా మంగళ వాయిద్యాల మధ్య

—తెర—

Blank page

కనకపుష్యరాగం
రా ఘ వ

రు. 2-50

రాజశేఖరంగా వాసుదేవరావు ఆ పాత్రలోని అంతఃసంఘర్షణను చక్కగా ఒప్పించగా ఆనందం పాత్రను శ్రీ కబీరుదాసు హుందాగా నిర్వహించారు. కనకంగా శ్రీ మతి పి. నవీనలక్ష్మి తన పాత్రకు జీవం పోసింది. మూగపిల్లగా నటించిన అమ్మాయి ఆ పాత్రకు ముమ్మూర్తులా ఒప్పింది. సుందరంగా శ్రీ కె. లక్ష్మణరావు నటన ఆకర్షణీయంగా వుంటే నీలకంఠంగా హాస్యనటుడు సండూరి వెంకటేశ్వరరావు నటన నవ్వులు కురిపించింది. చక్కని నాటకాన్ని రాసిన శ్రీ రాఘవ దాన్ని నీట్‌గా ప్రదర్శించిన ర. స. న. సమాఖ్యవారు అభినందనీయులు.

ఆంధ్రజ్యోతి దిన పత్రిక 22-11-67

శ్రీ రాఘవ వ్రాసిన 'కనకపుష్యరాగం' నాటకాన్ని ర. స. న. సమాఖ్యవారు ప్రదర్శించినపుడు ఆబాలగోపాలంగా గల ఆడియన్స్‌ను రచన - నటీనటుల నటన రెండూ కూడా రంజింప జేశాయి. నాటకంలో యితివృత్తం కన్నా ముఖ్యమైనది సన్నివేశాన్ని పెంచి పరిపోషించటం - రచయిత రాఘవ సన్నివేశ కల్పన చక్కని డ్రామాను రూపొందించ గలిగింది.

ఆంధ్రపత్రిక దిన పత్రిక 12-11-67

అరుణా పబ్లిషింగ్ హౌస్

నాగేశ్వరరావుపంతులు రోడ్డు,

గాంధీనగరం :: విజయవాడ-3.
